## ప్రజా గెరిల్లా సైన్యం అవతరణను కీర్తించండి!


# ప్రభాత్

పిజిఏ యోధులకు
కేంద్ర కమిటీ సందేశం!


పేజీ 5లో...


భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)[పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార పత్రిక

సంపుటి - 14 | సంచిక : 1 | నవంబర్ 2000 - జనవరి 2001 | వెల : పదిరూపాయలు


# *ప్రజాగెరిల్లా సైన్య* అవతరణ
# భారత దేశ ప్రజా యుద్ధ నిర్వహణా క్రమంలో ఒక చారిత్రాత్మక ముందడుగు!!

కొయ్యూరు అమరుల ప్రథమ వర్ధంతిదినమైన డిసెంబర్ 2 నాడు దేశంలోని మన గెరిల్లా జోన్లంటిలోనూ **ప్రజాగెరిల్లా సైన్యా**న్ని ఏర్పాటు చేయమని మన కేంద్రకమిటి ఇచ్చిన పిలుపుకు కార్యరూపం ఇస్తూ, డిసెంబర్ 2 నాడు దండకారణ్య స్పెషల్ జోన్‌లో **ప్రజాగెరిల్లా సైన్యం** అవతరించింది. ఇది, ప్రజాసైన్య ఏర్పాటు దిశలో, భారత విప్లవం వేసిన ఒక చారిత్రిక ముందంజే!

"*ప్రజాసైన్యం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు*" అని కామ్రేడ్ మావో సుమారు 70ఏళ్ల క్రితమే చెప్పడమేకాక, చైనా విప్లవోద్యమ క్రమంలో స్వయంగా ప్రజాసైన్యాన్ని నిర్మించి, నాయకత్వం వహించి, ఆ విప్లవోద్యమాన్ని విజయపథంలో నడిపించారు. విజయవంతమైన ఆ విప్లవానుభవం ద్వారా రుజువు చేయబడిన పై బోధన, ప్రపంచంలోని ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలోని విప్లవోద్యమాలకు మార్గదర్శకంగా నిలిచే విశ్వజనీన సూత్రంగా నిగ్గుదేలింది.

మన పార్టీ, అది అవిభక్త కమ్యూనిస్టు పార్టీగా ఉన్న కాలంలో ప్రజాసైన్య ఏర్పాటు ప్రాధాన్యతను గుర్తించలేకపోయింది. 40వ దశకం చివర్లో చెలరేగిన మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట కాలంలో చైనా పంథాను నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించబూనుకున్న రోజులలో కూడా, పార్టీ ప్రజాసైన్య ఏర్పాటు విషయంలో సరైన స్పష్టతను సంతరించుకోలేక పోయింది. అంతేకాదు, నక్సల్బరి, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటాలు ఉవ్వెత్తున విజృంభించిన తరుణంలో, ప్రజాసైన్య నిర్మాణాన్ని విప్లవ విజయానికి ఒక షరతుగానే మనం స్వీకరించి వున్నప్పటికీ, దాని నిర్మాణ క్రమం విషయంలో సరియైన అవగాహన కొరవడినందువల్లా, దెబ్బయిల తొలిరోజుల్లోని అతివాద ఎత్తుగడలవల్లా సైన్య నిర్మాణం కార్యరూపం తీసుకోలేదు. సాయుధ దళాలను ఒక నిర్మాణ రూపంగా ఉనికిలోకి తెచ్చి, శత్రువుపై పలుదాడులు చేసినప్పటికీ, ఈ గెరిల్లా దళాలను ప్రజాసైన్యంగా పరివర్తన చెందించే క్రమంపైన ఒక స్పష్టతలేని కారణంగానూ, రాజకీయ పంథాలోని దుందుడుకు వాదం కారణంగానూ ప్రజాసైన్య ఏర్పాటుకు అప్పుడుగల అవకాశాన్ని మనం కోల్పోయాం.

విప్లవోద్యమాన్ని నిర్మించే క్రమంలో వ్యూహం సరిగానే నిర్వచింపబడినా, ఆ వ్యూహాన్ని జయప్రదం గావించుటకు అక్కడి విప్లవ పార్టీ సరైన ఎత్తుగడలు రూపొందించి అమలుజరప జాలనప్పుడు తాత్కాలిక వెనుకంజ, ఓటమి తప్పదని ప్రపంచ విప్లవ చరిత్ర, ప్రత్యేకించి మన దేశంలో మన పార్టీ యొక్క సుమారు 75 యేళ్ల చరిత్ర మనకు గుణపాఠాలు నేర్పుతున్నాయి. నేడు మన పార్టీ నాయకత్వంలో ఎన్‌టి, డికె, ఏపి, బీహార్‌లలో కొనసాగుతున్న సాయుధ పోరాటాల ద్వారా ఆయా ప్రాంతాలలో గెరిల్లాజోన్స్‌ను నిర్మించి గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం చేయడమూ కొన్ని ప్రాంతాలను విముక్తి ప్రాంతాలుగా ఏర్పాటు చేయడమూ అనే లక్ష్యం మన ముందు వుంది. అలాగే మరో నాలుగు రాష్ట్రాలలో

**ప్రజా గెరిల్లా సైన్యంలో వందల, వేల సంఖ్యలో చేరండి!**
**భూస్వామ్య విధానాన్నీ, సామ్రాజ్యవాదాన్ని అంతమొందించండి!!**

## ప్రజా గెరిల్లా సైన్యంగా రూపొందిన ఉత్తర తెలంగాణా ప్రజాసాయుధ బలగాలు

భారత విప్లవోద్యమంలో సాయుధ పోరాటాన్ని ఆరంభించి అప్రతిహతంగా పురోగమింపజేస్తూ, రాజీ లేకుండా కొనసాగించిన చరిత్ర కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో 1969లో ఏర్పడిన సిపిఐ(ఎం-ఎల్)దే. సిపిఐ(ఎం-ఎల్) ఏర్పడిన నాటి నుండి మరీ ముఖ్యంగా 1980లో సిపిఐ (ఎం-ఎల్)(పీపుల్స్‌వార్) ఏర్పడిన నాటి నుండి ఒకేసారి ముగ్గురు కేంద్రకమిటీ నాయకులను కోల్పోవడం భారత విప్లవోద్యమం చరిత్రలో మొట్టమొదటిసారి.

1999 డిసెంబర్ 2న బెంగుళూరులో అరెస్టు చేయబడిన ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులైన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను కరీంనగర్ జిల్లా కొయ్యూరు అడవుల్లో కాల్చి చంపి ఇక పార్టీకి నాయకత్వం లేకుండా చేశామని పాలకులు వారి కావలికుక్కలైన పోలీసులు చంకలు గుద్దుకున్నారు.

విప్లవోద్యమాన్ని నూతన దశకు పురోగమింపజేస్తూన్న క్రమంలో అనేక నిర్బంధాలు, ఉద్యమంలో వస్తున్న ఆటుపోట్లు, పార్టీని చీల్చుడానికి జరిగే కుట్రలు విద్రోహాలను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ పార్టీ నేతృత్వంలో ఉద్యమం గెరిల్లా జోన్ల స్థాయికి ఎదిగింది. ఆ గెరిల్లా జోన్లను మరింత బలోపేతం చేస్తూ విముక్తి ప్రాంతాలుగా మార్చే దిశలో సాగుతున్న ప్రయత్నాల్లో అమరులైన ఆ ముగ్గురు కేంద్రకమిటీ నాయకుల త్యాగాన్ని సంస్మరించుకుంటూ వారు అమరులైన రోజున **ప్రజా గెరిల్లా సైన్యాన్ని** ఏర్పర్చడం జరిగింది.

దేశవ్యాప్తంగా పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వాన ఏర్పర్చబడిన **ప్రజా గెరిల్లా సైన్యం** లో భాగంగానే ఉత్తర తెలంగాణాలో **పిజిఎ** ఆవిర్భవించింది. కొన్ని అనివార్య కారణాల వల్ల నెలరోజులు ఆలస్యంగా **ప్రజా గెరిల్లా సైన్యం** సంస్థాపక ఉత్సవం ఉత్తర తెలంగాణాలోని ఒక అటవీ ప్రాంతంలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణం మధ్య జరిగింది.

ప్రజా సైన్యపు మొలకల రూపంలో పని చేస్తున్న ఉత్తర తెలంగాణా సాయుధ బలగాల అన్ని జిల్లాల ప్లటూన్లు ఒక దగ్గర చేరి ఈ ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నాయి. ప్రభుత్వ నిర్బంధాన్ని సమన్వయంతో తిప్పికొట్టడానికి కదంతొక్కాయి.

ఆ రోజు జనవరి 2 ఉదయం 9 గంటల సమయం......

గెరిల్లాలంతా మిలిటరీ గ్రౌండ్‌లో **పిజిఎ** యొక్క ఎర్రజండాను చేబూని మొదటగా మార్చింగ్‌ను నిర్వహించారు. 1970లోనే బెంగాల్‌లో మాగుర్జాన్ పోలీస్ క్యాంపుపై దాడి చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్న సంఘటనతో **ప్రజాగెరిల్లా సైన్యం** బీజప్రాయంలో ఏర్పడిందని కామ్రేడ్ చారుమజుందార్ కన్న కలలను నిజం చేస్తూ ఆ కవాతు సాగిపోయింది.

కేంద్ర కమిటీ కార్యదర్శి కా. గణపతి మరో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు, యావత్తు ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఉత్తర తెలంగాణా గెరిల్లాలు **పిజిఎ** సంస్థాపక దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు.

జిల్లాలన్నింటి నుండి హాజరైన గెరిల్లాలు, జెఎన్‌ఎం కళాకారులు మొత్తంగా పాడిన పాటలు ఇచ్చిన నినాదాలతో అత్యంత ఉత్సాహభరితంగా **ప్రజా గెరిల్లా సైన్య**పు సంస్థాపక దినోత్సవ కార్యక్రమం ముగిసింది. ఎంతో ఉద్వేగభరితంగా విప్లవోత్తేజంతో జరిగిన **పిజిఎ** సంస్థాపక ఉత్సవం గెరిల్లాలందరిలో నూతనోత్తేజాన్ని, విప్లవస్ఫూర్తిని కలుగజేసింది. విముక్తి ప్రాంతాలు నిర్మిస్తామంటూ అందుకోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమేనంటూ గెరిల్లాలు దృఢ సంకల్పంతో ప్రతిజ్ఞ చేశారు. **పిజిఎ** ఏర్పాటు సందేశాన్ని గ్రామ గ్రామానికి తీసుకుపోయి పెద్ద ఎత్తున యువతరాన్ని పిజిఎలోకి చేర్చుకోవడానికి పయనమయ్యారు. ఉత్తర తెలంగాణాలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ ఫాసిస్టు పదఘట్టనల క్రింద నలిగిపోతున్న పీడిత ప్రజానీకానికి **పిజిఎ** ఏర్పాటు వార్త గొప్ప ఉత్సాహాన్ని కలుగజేస్తుంది.

సాయుధ దళాల నిర్మాణం ఏదో ఒక స్థాయిలో చేపట్టి అక్కడ వర్గపోరాటాన్ని పెంపొందిస్తున్నాం. ఈ క్రమంలో గడచిన 20 యేళ్లలో గెరిల్లా దళాలు, స్థానిక గెరిల్లా దళాలు (ఎల్‌జిఎస్), ప్లటూన్స్, ప్రత్యేక గెరిల్లా దళాలు (ఎస్‌జిఎస్) గ్రామ రక్షణ దళాలు(జిఆర్‌డి) ఏరియా రక్షణ దళాలు (ఏఆర్‌డి), ప్రత్యేక ఆక్షన్ టీంలు, తాత్కాలిక దళాలు ఇలా పలు పేర్లతో వేరు వేరు అవసరాలకోసం సాయుధ ఫార్మేషన్స్‌ను ఏర్పర్చినాం. ఈ రూపాలన్నీ ఎర్రసైన్య నిర్మాణంలో భాగమే అనే అవగాహన మనకు వున్నా వీటిని బలమైన సైన్య విభాగాలుగా తీర్చిదిద్ది, ఏకీకృత కమాండ్ క్రింద సమీకరించి, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడంలో ఒకింత ఆలస్యం జరిగింది. శత్రు దాడిని సరిగా అర్థం చేసుకొని, చొరవ మన చేతిలో నుండి జారవిడవకుండా వుండటంలోనూ కొన్ని లోపాలు జరిగాయి.

ఈ పరిమితులను గుర్తించి భారత విప్లవోద్యమ విజయాన్ని గ్యారంటీ చేయుటకు అవసరమైన మంత్రదండాలలో ఒకటైన ప్రజావిముక్తి సైన్యాన్ని నిర్మించడానికై అందులో భాగంగా నేటి ఉద్యమ స్థాయికి తగినట్లుగా **ప్రజాగెరిల్లా సైన్యా**న్ని ముందుగా తీర్చిదిద్దుటకు పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ కర్తవ్యాల నిర్వహణకై ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలుగా మొత్తం **పిజిఎ**ను వర్గీకరించింది. ఇంతే కాకుండా మిలిటరీ అంశాలలో స్పష్టత, ప్రత్యేకత సాధించి నాయకత్వం వహించేలా మిలిటరీ కమిషన్లను కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ఏర్పరచుకున్నది. ఈ నిర్మాణాల అమలుకు వివిధ స్థాయిల్లో ఆపరేషనల్ కమాండ్స్‌ను ఏర్పర్చి **పిజిఎ**ను ప్రజాయుద్ధ నిర్వహణకు ఒక శక్తివంతమైన సైనిక శక్తిగా సిద్ధం

## ఆంధ్రాలో ప్రజా గెరిల్లా సైన్య అవతరణ

*మన కేంద్ర కమిటీ పిలుపుకు కార్యరూపం ఇస్తూ, మహత్తర శ్రీకాకుళ రైతాంగ పోరాట యోధులు కన్న నెత్తుటి కలలను సఫలం చేస్తూ,* ***'కొయ్యూరు అమరుల'*** *ప్రథమ వర్థంతి దినమైన డిసెంబర్ 2 నాడు, ఆంధ్ర రాష్ట్రంలోని ఒకానొక అటవీ ప్రాంతంలో పీడిత ప్రజల స్వంత బలగమైన* **ప్రజాగెరిల్లా సైన్యం** *ఆవిర్భవించింది.*

*మన కేంద్ర కమిటీ సభ్యులు, ఆంధ్ర రాష్ట్ర కమిటీ సభ్యులు, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ-హర్యానా రాష్ట్రాల కమిటీల ప్రతినిధులు, ఇతర గెరిల్లాల సమక్షంలో, వందలాది ప్రజా గెరిల్లా సైనికులు, విప్లవోత్సాహం వెల్లివిరిసిన వాతావరణంలో, పీడిత ప్రజల సేవకై అంకితమైన తమ దృఢ దీక్షను ప్రదర్శిస్తూ* **ప్రజాగెరిల్లా సైన్య** *అవతరణోత్సవాన్ని జరుపుకున్నారు.*

*ఎర్రజండా, పిజిఎ జండాల ముందు బారులు తీరి నిల్చిన* **ప్రజాగెరిల్లా** *సైనికులు బిగించిన పిడికిళ్లతో, అమరుల ఆశయాన్ని కొనసాగిస్తామని, ప్రజా సైన్యాన్ని నిర్మిస్తామని, భా.క.పా.(మా-లె) (పీపుల్స్‌వార్) నాయకత్వం కింద నడుస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ఎంతటి త్యాగానికైనా వెనుదీయబోమని శపథం చేశారు.*

చేయ 2000 డిసెంబర్ 2న దాన్ని వ్యవస్థాపించ నిర్ణయించి జయప్రదంగా దానికి కార్యరూపం ఇవ్వగల్గాం. డికె ఎన్‌టి, బీహార్ ఆంధ్రాలలో **పిజిఎ** ఏర్పాటుకు డిసెంబర్ 2న స్థాపన సమారోహాలను నిర్వహించి **పిజిఎ** ఏర్పడినట్లు దేశ ప్రజలకు ఒక సందేశం ద్వారా మన పార్టీ కేంద్రకమిటీ తెలియపరచింది.

1999 డిసెంబర్ 2న బెంగుళూరు నగరంలో మన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ముగ్గురిని - కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను - పట్టుకొని కాల్చి చంపి, భారత విప్లవోద్యమానికి ఎనలేని నష్టం కలిగించానని మన పార్టీ నడుము విరచగలిగానని శత్రువు విర్రవీగాడు. కాని మనం పట్టుదలగా పోరాడుతూ ఎన్ని నష్టాలు జరిగినా లక్ష్యంపై దృష్టి సడలకుండా పార్టీని, ప్రజలను పార్టీ రాజకీయ పంథా చుట్టూ సమీకరిస్తున్నాం. ఆ క్రమంలోనే శత్రువు అంచనాను వమ్ము చేస్తూ, మన లోపాలను సవరించు కొనడంలో భాగంగా మన ఎత్తుగడలలోనూ, రాజకీయ అవగాహనలోనూ గల లోపాలను సరిదిద్దుకొని, ప్రజా యుద్ధాన్ని మరింతగా తీవ్రతరం చేస్తూ ప్రజా రాజకీయాధికార అంగాలను బలోపేతం చేస్తూ విముక్తి ప్రాంతాలను ఏర్పర్చి వ్యవసాయ విప్లవం జయప్రదం గావించుటకు శత్రువుపైన ప్రతిఘటన పెంపొందించడానికి **ప్రజాగెరిల్లా సైన్య** నిర్మాణం అవసరాన్ని గుర్తించాం. ఇందుకు గానూ, డిసెంబర్ 2 నాడు **పిజిఎ**ను వ్యవస్థాపించాలనీ నిర్ణయించుకున్నాం. డిసెంబర్ 2 మన ముగ్గురు కేంద్రకమిటీ నాయకులు అమరులైన రోజు కూడా.

దండకారణ్యంలో **పిజిఎ** వ్యవస్థాపన కోసం ఒక ప్రాంతాన్ని ఎంచుకొని అక్కడ సన్నాహాలు చురుగ్గా కొనసాగించారు. డిసెంబర్ 2కు ముందే, డికెలోని ప్లటూన్‌లు సమావేశ స్థలం దగ్గరచేరి ఆ ప్రాంతాన్నంతా విప్లవోత్తేజం ఉట్టిపడేలా అలంకరించి ఎరుపు మయం చేశాయి. కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల పేరిట సిద్ధం చేసిన గ్రౌండ్‌లో మొత్తం కార్యక్రమాలు నిర్వహించారు. యావత్తు గ్రౌండ్, పరిసరాలు అరుణారుణం అయ్యాయి. కామ్రేడ్ మావో రూపొందించిన యుద్ధ సూత్రాలు, ఇతర మార్క్సిస్టు మహోపాధ్యాయులు యుద్ధ నిర్వహణకు రూపొందించిన సూత్రాలు, మార్క్సిస్టు బోధనలను పెద్ద ఎత్తున గోండీ, తెలుగు, హిందీ, బంగ్లా, ఇంగ్లీష్ భాషలలో రాసి గ్రౌండ్‌ను, పరిసరాలను భావ స్ఫూరకంగా అలంకరించారు **పిజిఎ** సభ్యులు.

**పిజిఎ** స్థాపన వేడుకలలో కొందరు సిసిఎంలు, యావత్తు దండకారణ్య ఎస్‌జడ్‌సి సభ్యులు, ప్లటూన్‌లు, కొన్ని ఎల్‌జిఎస్‌లు, మరికొందరు కామ్రేడ్స్ పాలుపంచుకున్నారు. డిసెంబర్ 2న ఉదయం 10-30 గంటలకు ఊరేగింపుతో కార్యక్రమాలు ప్రారంభమైనాయి. ఊరేగింపు అగ్రభాగాన ప్లటూన్ - 2 కమాండర్ అర్జున్ **పిజిఎ** జండా - ఎర్రజండాపైన తెలుపులో హత్తిన తుపాకి ఆపైన సుత్తికొడవలి - ను చేబూని ముందుకు నడిచాడు. **పిజిఎ** సభ్యులంతా ఊరేగింపుగా వెంటనడిచారు. నినాదాలు, పాటలు మిన్ను ముట్టగా 20 నిముషాలు సాగిన ఊరేగింపు గ్రౌండ్ చేరింది. **పిజిఎ** బ్యాడ్జీలను ధరించి కదిలిన ఎర్ర సైనికులు రాబోయే

## ఝార్ఖండ్-బీహార్‌లలో జయప్రదమైన పిజిఏ స్థాపనోత్సవం

*కేంద్రకమిటీ నిర్ణయం ప్రకారం మన ప్రియతమ నేతలైన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల ప్రథమ వర్ధంతి - డిసెంబర్ 2, 2000న వారి అమరత్వాన్ని ఎత్తిపడుతూ* **పిజిఎ** *(పీపుల్స్ గెరిల్లా ఆర్మీ) స్థాపన జరిగింది. ఝార్ఖండ్ రాష్ట్రం కోయల్-కైమూర్ రీజియన్‌నందలి భభువా ప్రాంతపు కరమ్‌చట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల విశ్రామ్‌పూర్, పాంకీ, మహువా డ్యామ్‌లలోనూ, గఢ్వరంక పోలీస్ స్టేషన్ పరిధిలోని సిగ్‌సిగా ప్రాంతంలోనూ పిజిఏ స్థాపకోత్సవం జరిగింది. అన్నిచోట్లా ముందుగా అమరుల స్మృతిలో మౌనం పాటించారు. తర్వాత వారి స్మృతిలో విప్లవగీతా లాలపించి, దిక్కులు పిక్కటిల్లేలా విప్లవ నినాదాలు ఇచ్చారు. కేంద్ర కమిటీ పంపిన సందేశం చదివి వినిపించి, అక్కడ హాజరయిన పార్టీ నాయకులు పిజిఏ యోధులకు పిజిఏ ప్రాముఖ్యతను వివరించారు. అన్నిచోట్ల 50 నుండి 400 సంఖ్యలో గెరిల్లాలు పాల్గొని మార్చింగ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడానికి విప్లవ ప్రజానీకం కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అదే విధంగా, బీహార్‌లోని బగడియా, బాంకాలలోనూ* **పిజిఎ** *స్థాపన జరిగింది. ఏరియా కమిటీల నాయకులు ప్రజానీకానికీ, గెరిల్లా యోధులకూ భారత విప్లవోద్యమంలో* **పిజిఎ** *ఏర్పాటుగల ప్రాముఖ్యతను వివరించి వాళ్లలో ఉత్సాహాన్ని ఇనుమడింపజేశారు.*

ఎర్రసైన్య కవాతుకు ప్రతిరూపమా అన్నట్లు సాగిపోయారు.

ఒక గళం పాట ఎత్తింది....

*"పీపుల్స్‌వార్ లాల్‌ఫౌజ్ - లాల్‌ఫౌజ్ మా లాల్‌ఫౌజ్ లక్ష్య మావ దేశ్ సబ్బె ముక్తి కీయన మంతయో........."* ఊరేగింపులో సాగే గొంతుకలన్నీ కోరస్‌గా గొంతు కలిపాయి. మరో దృశ్యం; అమరులకు పేరు పేరున జోహర్లు చెప్తుతూ వుంటే వందకంఠాలు బదులు పలికాయి. డికె ను స్థావర ప్రాంతముగా నిర్మిద్దాం అని ఒక గెరిల్లా నినదిస్తే యావత్తు ఊరేగింపు ప్రతిగా గొంతుకలిపితే అడవిలోని కొండవాగులు, కొండకోనలు, కొమ్మ కొమ్మ బదులుగా జవాబిచ్చాయి. అడవిని ఆకాశాన్ని ఎర్రబరుస్తూ ఊరేగింపు సభాస్థలి చేరింది.

గ్రౌండ్ చేరిన పిమ్మట **పిజిఎ** సభ్యులు కవాతును ప్రారంభించగా జండా వద్ద నిలిచిన సిసి-ఎంలు, ఎస్‌జడ్‌సి-ఎంలు గౌరవ వందనం స్వీకరించారు. పిమ్మట బారులు తీరి నిలిచిన **పిజిఎ** సైనికులు ఓవైపు ఎదురుగా నాయకత్వ కామ్రేడ్స్ మధ్యభాగాన నిలిచి కమాండింగ్ కాషన్స్ ఇచ్చే పిఎల్-2 కమాండర్ గాలిలోకి కాల్పులు జరుపుతూవుండగా సిసిఎం కామ్రేడ్ సాయన్న **పిజిఎ** జండాను ఎగురవేశాడు. వెనువెంటనే **పిజిఎ** జండాపాటను పాడారు .......

*"ఎగురుతుంది ఎగురుతుంది*
*ప్రజాసేన పతాకం*
*మన పిజిపి పతాకం....."*

అనంతరం సిసి-ఎం కామ్రేడ్ సాయన్న **పిజిఎ** నుద్దేశించి ఉపన్య శించాడు. స్వయంగా 20 ఏళ్లుగా దండకారణ్యంలోని గెరిల్లా బలగాలకు నాయకత్వం వహించి, 80లలో, మొదటి దళాలలో ఒకదానికి నేరుగా కమాండర్‌గా నాయకత్వం వహించిన నాటి నుండి నేటి వరకు గల పరిస్థితిని సంక్షిప్తంగా వివరించాడు. అలాగే అద్భుతంగానున్న విప్లవ పరిస్థితిని సరిగా వినియోగించుకొని నూతన ప్రజాస్వామ్యం స్థాపించుటకు ఎర్రసైన్య నిర్మాణం అనివార్యం అని చెప్పాడు.

అటుపిమ్మట **పిజిఎ** గెరిల్లాలు అమరుల సంస్మరణార్థం నిర్మించిన స్థూపం వద్ద వరుసలలో నిలిచారు. కామ్రేడ్ వెంకటేశ్ స్థూపావిష్కరణ చేసి, అమరుల ఆశయాలను తుదకంటా కొనసాగించ ధైర్యంగా, పట్టుదలతో పోరాడాలని చెప్పాడు. పిమ్మట అమరులను స్మరిస్తూ 2 నిముషాలు మౌనం పాటించారు.

తదుపరి డికెఎస్‌జడ్‌సి కార్యదర్శి కామ్రేడ్ భూపతి **పిజిఎ** యోధులను వుద్దేశించి సిసి పంపిన సందేశం చదివి వినిపించారు.

సాయంత్రం 4 గంటలకు రెండవ సెషన్ ప్రారంభమైంది. 1980లలో దళాలు దండకారణ్యంలో ప్రవేశించిననాడు దళసభ్యులుగా వుండి ఇప్పుడు ఎస్‌జడ్‌సిఎంలుగానున్న కామ్రేడ్స్ గౌతం, గోపన్నలు తాము ప్రవేశించిన నాటి పరిస్థితులను వివరించారు, ఇప్పటి అభివృద్ధిని ఉదహరించారు. తదుపరి మొదటి పిఎల్ కమాండర్‌గా పనిచేసిన ఎస్‌జడ్‌సి-ఎం కామ్రేడ్ దేవ్‌జీ ప్లటూన్ ప్రారంభించిననాటి పరిస్థితిని అనుభవాలను నేటి కర్తవ్యాలను వివరించాడు. ఆ తదుపరి నేషనల్ పార్క్ కమాండర్ కామ్రేడ్ నిర్మల, ప్లటూన్ డిప్యూటీ కమాండర్ దేవక్కలు మాట్లాడారు. దీంతో రెండవ సెషన్ ముగిసింది.

రాత్రి 7 నుండి 9 గంటలవరకు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించబడినాయి. పాటలు, గ్రూపు డాన్సులు, ఢాకలు ప్రదర్శించారు.

ఇక డిసెంబర్ 3 నాటికి ఉదయం 8-30లకు మూడవ సెషన్ ప్రారంభమైంది. సిసి-ఎం కామ్రేడ్ రాంజీ మన పార్టీ మిలిటరీ రంగంలో గడించిన విజయాలను, పొందిన అపజయాలను వివరిస్తూ ఒకప్పుడు తమ తమ దేశాలలో విప్లవాలు విజయవంతం చేసి పోరాడిన చైనా కమ్యూనిస్టు పార్టీ, వియత్నాం కమ్యూనిస్టు పార్టీలు అప్పటి యుద్ధాలల్లో ఎలా క్రియాశీలంగా నాయకత్వం వహించి యుద్ధాల్ని కొనసాగించాయో చెప్పారు. అలాగే ఇప్పుడు ప్రజాయుద్ధం నిర్వహిస్తున్న నేపాల్, ఫిలిప్పైన్స్‌ల అనుభవాలను యుద్ధ నిర్వహణలో వారు ప్రదర్శించే సృజనాత్మకతను స్థూలంగావివరించారు. ఆయా పార్టీలు పలుమార్లు అతివాద, మితవాదాలను ఎలా ఎదుర్కొని పోరాడినాయో వివరిస్తూ ఈనాటి కర్తవ్యాన్ని గుర్తు చేశారు. పిమ్మట గ్రౌండ్ చేరిన గెరిల్లాలు అంతర్జాతీయ గీతాన్ని ముక్తకంఠంతో ఆలాపించి **పిజిఎ** వ్యవస్థాపనా వేడుకలను జయప్రదం చేశారు.

\# *దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతం చేసే లక్ష్యంతో పోరాడుదాం!*

\# ***పిజిఎ*** *కోసం విస్తృతంగా రిక్రూటింగ్ చేపడదాం!*

\# ***పిఎల్ఎ****ను నిర్మించడం లక్ష్యంగా* ***పిజిఎ****ను బలోపేతం చేద్దాం!*

\# *శత్రుదాడిని ఓడిద్దాం! సాహసంగా పోరాడుదాం!!*

పై నినాదాలు మిన్నుముట్టగా నూతన కర్తవ్య నిర్వహణకు **పిజిఎ** గెరిల్లాలు కదిలిపోయారు. e

---

*(7వ పేజీ తరువాయి)*

చేయడంలో, వారికి నిజమైన నివాళి. ఇది పెరుగుతున్న విప్లవోద్యమానికే నిదర్శనం. మన దేశంలో ప్రజాయుద్ధపు తిరుగులేని పురోగమనానికి ఇది ప్రతీక. పాలకవర్గాలు బెంబేలు పడని! **పిజిఎ** అంచెలంచెలుగా బలం పుంజుకొని, ప్రజావిముక్తి సైన్యంగా పెంపొంది, మన పార్టీ నాయకత్వంలో మూడు పర్వతాలైన భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారి విధానాల నుండి ప్రజలను విముక్తి చేసి సోషలిజానికి, కమ్యూనిజానికి మార్గం సుగమం చేసి తీరుతుంది!

e **ప్రజావిముక్తి సైన్యం (పిఎల్ఏ)** *ఏర్పరచే లక్ష్యంతో పీపుల్స్ గెరిల్లా ఆర్మీ* **(పిజిఎ)***ని బలోపేతం చేయండి !*

e *భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు) (పీపుల్స్‌వార్) వర్ధిల్లాలి !*

e **పిజిఎ***లోకి అనేక మంది యోధులను రిక్రూట్ చేసుకోండి !*

e *శత్రువు ఆయుధాలతో* **పిజిఎ***ను సాయుధం చేయండి !*

e *స్థావర ప్రాంతాలను నెలకొల్పడానికై యుద్ధాన్ని తీవ్రతరం చేయండి!*

*విప్లవాభివందనాలతో*

***కేంద్ర కమిటీ (ప్రొవిజనల్)***

***సిపిఐ(ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]***

సిసి సందేశం

# ప్రజాసైన్యం లేనిదే ప్రజలకుండేదేమీ లేదు!!

**ప్రజా గెరిల్లా సైన్య** *వీరయోధులకు!*

భారత భూతలంపై ఒక కేంద్ర కమాండ్ కింద గుణాత్మకంగా నూతన పోరాటశక్తిగా **పిజిఎ** ను ఏర్పర్చుకుంటున్నందుకు మన యువ గెరిల్లా యోధులందరికీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) కేంద్ర కమిటీ తన అరుణాభివందనాలను అందజేస్తోంది. ఈ రోజు భారత దేశ చరిత్రలో..... ఒక శుభ దినం. భారత విప్లవంలో ఒక మలుపు, కొనసాగుతున్న ప్రజా యుద్ధంలో ఒక చారిత్రక మైలురాయి.

భారత దేశ గ్రామీణ ప్రాంతంలోని విశాల మైదానాలు, అటవీ ప్రాంతాలంతటా ఎర్రసైన్యం పదఘట్టనలు చేస్తున్నది. దాని లక్ష్యం రైతాంగ ప్రజానీకాన్ని భూస్వామ్య అణచివేత సంకెళ్ల నుండి విముక్తి చేయడం, పేద భూమిలేని రైతాంగం నుండి వేనవేలుగా యోధులను యిముడ్చుకొని మునుపెన్నటికన్నా బలోపేతం కావడం, భారతదేశ గ్రామీణ ప్రాంతమంతటా స్థావరాలను నెలకొల్పి, అంతిమంగా నగరాలను స్వాధీనం చేసుకొని దేశవ్యాప్త విజయం సాధించడం. ఎర్రసైన్య నిర్మాణం, మన ప్రియతమ నాయకుడు, పార్టీ నిర్మాత కామ్రేడ్ చారుమజుందార్ కాలం నుండి కమ్యూనిస్టు విప్లవకారుల కలల్ని, ఊహలను ప్రజ్వలింపచేసింది. 1967నాటి మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు నుండి, భారత దేశంలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే కర్తవ్యంలో అసంఖ్యాకమైన వీరయోధులు నేలకొరిగారు. భారత దేశంలో ఎర్రసైన్యం నిర్మించే లక్ష్యాన్ని వాస్తవం చేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి.1970 అక్టోబర్ 27న మగూర్‌జాన్ క్యాంపుపై భూమిలేని, నిరుపేద రైతాంగయోధులు సాయుధ గెరిల్లా దాడి జరిపి పోలీసుల నుండి రైఫిళ్లు స్వాధీనం చేసుకోవడం భారత దేశంలో ప్రజాసైన్యం నిర్మించే ప్రక్రియకు నాందిగా చెప్పవచ్చు.

మగూర్‌జాన్ ఉత్తేజాన్ని నింపుకొని మరింత పరిణతి చెందిన దృష్టితో ఏర్పడుతున్న **పిజిఎ** ప్రస్తుత విప్లవ దశలో భారత కార్మికవర్గ పార్టీ ఆధ్వర్యంలో మొదటిసారిగా ప్రజాసైన్యం స్థాపించబడిందన్న వార్త, పార్టీ శ్రేణులను, విప్లవ ప్రజాసంగాలను, భారత విప్లవాభిమానులను, భారత పీడిత ప్రజానీకాన్ని ఎంతగానో ఉత్తేజ పరుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వున్న కార్మికవర్గ విప్లవశక్తులను, ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి, దాని కావలికుక్కలకు వ్యతిరేకంగా తెగించి పోరాడుతున్న పీడితజాతులను, ప్రజలను సైతం ఇది ఎంతగానో ఉత్తేజపరుస్తుంది. వాస్తవానికి యిది భారత విప్లవానికి ప్రపంచ విప్లవానికి కూడా ఒక గొప్ప చారిత్రక ప్రాముఖ్యత గల ఘటనే.

## *పిజిఎ* ఏర్పాటు ఎందువల్ల చారిత్రక ప్రాముఖ్యత గల ఘటన?

మొదటగా చెప్పాలంటే, భారత భూతలంపై కార్మికవర్గ పార్టీ నాయకత్వాన ఏర్పడిన మొదటి రెగ్యులర్ ప్రజా గెరిల్లా సైన్యం కావడంలోనే దాని ప్రాముఖ్యత యిమిడి వుంది. భారత దేశ చరిత్ర శతాబ్దాలుగా బ్రిటీష్ వలసవాదం, దాని ఫ్యూడల్ తొత్తులకు వ్యతిరేకంగా జరిగిన అనేక మహత్తర రైతాంగ పోరాటాలను, ఆదివాసీ ప్రజల గెరిల్లా యుద్ధాలను, సాయుధ తిరుగుబాట్లను చవిచూసింది. కానీ అవన్నీ కార్మికవర్గ నాయకత్వంలేని కారణంగా విఫలమయ్యాయి. 1946-51 మధ్య జరిగిన మహత్తర తెలంగాణా సాయుధపోరాటంలో పరిస్థితులు అనుకూలంగా వున్నప్పటికీ అప్పటి పార్టీ నాయకత్వం విద్రోహం వల్ల ప్రజాసైన్యాన్ని నిర్మించుకోలేక పోయాం. నక్సల్బరీ ప్రేరణతో మగూర్‌జాన్‌లో జరిపిన మొదటి దాడి ప్రయత్నంలో ఆయుధాలు స్వాధీనమైనా, శ్రీకాకుళం ఒక ఏనాన్ అనుకొన్నా ఆ ఉద్యమంలో ప్రధానంగా రెగ్యులర్ ప్రజా సైన్యాన్ని ఏర్పరచు కోవడంలో విఫలమైనందున ఉద్యమం స్థావర ప్రాంతాలను నెలకొల్పి ఉన్నత స్థాయికి ఎదగలేక పోయింది.

రెండవది, పార్లమెంటరీ పంథా ద్వారా శాంతియుతంగా అధికారం చేపట్టాలనే రివిజనిస్టు సిద్ధాంతాన్ని తిప్పికొట్టడంలో **పిజిఎ** ఏర్పాటు ప్రాముఖ్యత ఇమిడి వుంది. సరిగా చెప్పాలంటే **పిజిఎ** ఏర్పాటు అన్నది దీర్ఘకాల ప్రజాయుద్ధపంథాకు, విశాల గ్రామీణ ప్రాంతాల్లో విముక్తి ప్రాంతాలు నెలకొల్పడంద్వారా పట్టణాలను చుట్టుముట్టి దేశవ్యాప్త విజయం సాధించాలనే, అర్థవలస - అర్థభూస్వామ్య దేశాలకు అన్వయించే పంథాకు పునరుద్ఘాటనే.

మూడవది, సామ్రాజ్యవాదం గొంతులోతుకు సంక్షోభంలో మునిగి, ఆ సంక్షోభభారాన్ని భారత పాలక వర్గాలు గ్లోబలైజేషన్, సరళీకరణ, ప్రైవేటీకరణ పేరుతో భారత ప్రజలపై మోపి, సామూహిక దాడికి పాల్పడుతున్న ఫలితంగా ప్రజలు పోరాట వెల్లువలోకి దిగుతున్న క్లిష్ట తరుణంలో,పాలక వర్గ పార్టీలన్నీ పూర్తిగా విలువ కోల్పోయి ప్రజలు నిజమైన ప్రత్యామ్నాయాన్ని కాంక్షిస్తున్న చారిత్రక సమయంలోనే **పిజిఎ** రూపొందుతున్నదన్న వాస్తవంలోనే దాని ప్రాముఖ్యత ఇమిడి వుంది.

నాలుగవది, ఉజ్వలమైన నక్సల్బరీ తిరుగుబాటు తదనంతరం భారత దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న వర్గపోరాటాల ఫలితంగా ఉద్భవించినది కావడమే పిజిఎకు గల మరో ప్రాముఖ్యత. 1940 చివరలోని మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం, తెభాగా పున్నప్రా-వాయిలార్ పోరాటాలు; 60వ దశాబ్ది చివర, 70వ దశాబ్ది ప్రారంభంలోని నక్సల్బరీ, శ్రీకాకుళం, భీర్‌భూమ్, ముషాహరి, గోబీ వల్లభపూర్ పోరాటాల వారసత్వంలో, 80, 90 దశకాలలో నిలకడగా కొనసాగుతున్న ఎన్‌టి, డికె, ఏపి, బీహార్‌ల్లోని విప్లవ పోరాటాలకు అత్యున్నత రూపం ఈనాటి మన **పిజిఎ** ఏర్పాటు. ఆ పోరాటాల నుండి తీసిన గుణపాఠాల నిర్దిష్టీకరణే కాకుండా, భారత దేశంలో వర్గ యుద్ధాన్ని గుణాత్మకంగా పురోగమింపజేసేందుకు **పిజిఎ** నాందిగా నిలుస్తుంది.

భారత దేశ పరిస్థితులలో ప్రజాసైన్యాన్ని నిర్మించే ప్రక్రియ

నిస్సందేహంగా క్లిష్టమైనదే. విప్లవ ప్రారంభ సంవత్సరాలలోనే ప్రజా విముక్తి సైన్యం పుట్టి, సాయుధ ప్రతిఘాత విప్లవాన్ని సాయుధ విప్లవంతో ఎదుర్కొన్న చైనా విప్లవంలాకాక, మన దేశంలో ఏమీలేని స్థితి నుండి సైన్యాన్ని నిర్మిస్తున్నాం. ఎన్‌టి, డికెలలో వర్గ పోరాటం తీవ్రమైన క్రమంలో సాయుధ దళాలు ఆవిర్భవించి, 1980ల మలి భాగంలో సాధారణ రూపం తీసుకొన్నాయి. అయితే డికెలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు) (పీపుల్స్‌వార్) ఏర్పడిన 1980 సంవత్సరం ప్రారంభం నుండీ సాయుధ నిర్మాణ రూపం వుంది. శత్రు సాయుధ బలగాలకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం కొనసాగిస్తున్న క్రమంలోనే, మన దళాలు మరింత బలోపేతమై సంఖ్యరీత్యా పెరిగి కాల్పుల శక్తిని పోరాట సమర్థతలను మెరుగుపర్చుకున్నాయి. క్రమంగా శత్రు బలగాలతో గెరిల్లా యుద్ధం మరింత తీవ్రం కావడంతో, గెరిల్లా దళాల మొత్తం పనిలో మిలిటరీ కర్తవ్యాలు ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నాయి. నిర్మాణ కర్తవ్యాలు, మిలిటరీ కర్తవ్యాలు వేరు పరుస్తూ, 1995లో డికెలో రెగ్యులర్ ఆర్మీకి బీజరూపమైన ఒక ప్లటూన్ ఏర్పడింది. తర్వాత మరో ప్లటూన్ ఏర్పడింది. గత సంవత్సరకాలంలో మరిన్ని ప్లటూన్‌లు, స్పెషల్ గెరిల్లా దళాలు ఉనికిలోకి వచ్చి పనిచేస్తున్నాయి.

కొంత ఆలస్యం జరిగినప్పటికీ, వివిధ గెరిల్లా బలగాలన్నింటిని ఒక కేంద్ర కమాండు క్రిందికి తేవడం, **పిజిఎ** ఏర్పాటు భారత దేశంలో సాయుధ పోరాట అభివృద్ధి సహజ పరిణామమే. మీరందరూ ప్రభుత్వం సాయుధ బలగాలతో భూస్వామ్య శక్తులతో అనేక ఘర్షణల దీర్ఘ చరిత్ర కలిగిన సాయుధ గెరిల్లా దళ సభ్యులు. ఇప్పుడు **పిజిఎ** ఏర్పాటుతో మీరంతా కేంద్ర కమాండు క్రిందికి వస్తున్నారు. ఎన్‌టి, డికె, ఏపిలలో తూర్పు రీజియన్, దక్షిణ తెలంగాణ, నల్లమల ప్రాంతంలో, బీహార్‌లోని మగధ, కోయిల్-కైమూర్ ప్రాంతాలలో మీ వల్లనే పార్టీకి ప్రజలలో అమోఘమైన ప్రతిష్ట కలిగింది. మీ నిరంతరమైన పోరాటం, ప్రజలలో బలమైన పట్టు, వారి విముక్తికై దృఢంగా అంకితమై వుండడం, శత్రు బలగాలకు మీ వీరోచిత సాయుధ ప్రతిఘటన దాడులు ప్రజలకు విప్లవ లక్ష్యంపై దృఢమైన విశ్వాసాన్ని కలిగించి, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేశాయి. దోపిడీ రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసి, పాలకవర్గాలను కూలదోసి, సోషలిజం, కమ్యూనిజం నెలకొల్పడానికి మొదటి అడుగుగా భారత దేశంలో నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి రాజకీయంగా ప్రజలను సంసిద్ధం చేశాయి.

విప్లవం కేంద్ర కర్తవ్యం సాయుధ బలంతో రాజ్యాధికారాన్ని స్వాధీనపర్చుకోవడమే. భారత దేశం దానికి మినహాయింపు కాదు. కేవలం బలమైన ప్రజాసైన్యం సహాయంతోనే పీడిత ప్రజలు తమ రాజ్యాధికారాన్ని పొందగలుగుతారు. ప్రజల నిర్మాణయుత సాయుధ శక్తికి నిర్దిష్ట ప్రతీకయే ప్రజాసైన్యం.

ప్రజల ఈ సంఘటిత సాయుధ శక్తియే ప్రజల ప్రజాస్వామిక అధికార అంగాలను నెలకొల్పడాన్ని ఎన్‌టి, డికెలలోని విశాల ప్రాంతాలలో ప్రజా గెరిల్లా బలగాలు శత్రు దాడులను ప్రతిఘటించి నిలబడ్డ ప్రతిచోటా ప్రజలు తమ రాజ్యాధికారాన్ని నడుపుకోడాన్ని గ్యారంటీ చేస్తుంది. **పిజిఎ** ఏర్పాటు నిస్సందేహంగా ప్రజలు తమ రాజ్యాధికార అంగాలను నెలకొల్పుకోవడానికి, బలోపేతం కావడానికి సహాయపడి, పరిస్థితిలో ఒక గుణాత్మక మార్పును తీసుకొచ్చింది.

మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం, పోరాట బలగాలలో మూడో వంతు మహిళలే కావడం **పిజిఎ**కు అత్యంత బలమైన అంశాలలో ఒకటి. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో గతంలో ఎన్నడూ మహిళలు ఇంత పెద్ద సంఖ్యలో సాయుధ కార్యకలాపాలలో పాల్గొనలేదు. భారత సమాజంలో అత్యంత నిర్లక్ష్యం చేయబడిన, శతాబ్దాలుగా సామ్రాజ్యవాద, భూస్వామ్య అణచివేతకు గురైన ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో **పిజిఎ**లో పాల్గొనడం మరో ప్రాముఖ్యత కలిగిన అంశం. **పిజిఎ** గెరిల్లాలలో అతి పెద్ద సంఖ్యలోనివారు పేదలలోకెల్లా పేదలు, నిరుపేద రైతాంగం, కూలీల నుండి వచ్చిన వాళ్లు, ప్రత్యేకించి సామాజికంగా అణచివేయబడిన దళితులు. అందువల్ల **పిజిఎ** భారత సమాజంలో అత్యంతంగా అణచివేతకు గురవుతున్న సెక్షన్ల ప్రజల సైన్యం, పేదల సైన్యం. అందులోనే దీని బలం వుంది. విప్లవం అత్యంత అవసరమైన ఈ సెక్షన్ల ప్రజానీకం చురుకుగా పాల్గొనడం, మద్దత్తు నివ్వడంద్వారా అది జీవం పోసుకుంటుంది.

ఈ రోజు **పిజిఎ** నిజంగానే సంఖ్యరీత్యా చిన్న శక్తే కాని దాని రాజకీయ ప్రాముఖ్యత అమోఘమైనది. ఇది సరికొత్త తరహా సైన్యం. రెండు దశాబ్దాలుగా చిన్న గెరిల్లా దళాలుగా వుంటూ శత్రు బలగాలతో జరిపిన నిరంతర యుద్ధం నుండి ఉద్భవించిన సైన్యం. సాయుధ వ్యవసాయ విప్లవం నుండి పుట్టి, ప్రజాపంథాకు కట్టుబడి, విశాల ప్రజారాశుల మద్దత్తు కలిగిన సైన్యం.

మీరు ఈ రోజున చిన్న శక్తిగానే వున్నా అనేక కర్తవ్యాలు మీ ముందున్నాయి. స్వీయాత్మక శక్తులను కాపాడుకోవడానికి జాగ్రత్త వహిస్తూనే, శత్రు బలాన్ని నిరంతర ఎత్తుగడల రీత్యా జరిపే దాడుల ద్వారా దెబ్బతీయడం, శత్రు దాడుల నుండి తమ్ము తాము రక్షించుకోవడానికై ప్రజలకు శిక్షణ యివ్వడం, సాయుధం చేయడం, విశాల ప్రజారాశుల విప్లవ రాజకీయాధికారాన్ని నెలకొల్పడం, సంరక్షించడం, విశాల ప్రజలలో విశిష్టమైన విప్లవ ప్రచారం గావించడం, రైతు యువజనుల్ని **పిజిఎ**లోకి రిక్రూట్ చేసుకోవడం, విశిష్టమైన ప్రజా మిలీషియాను నిర్మించడం, ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనడం, ప్రజల జీవనస్థాయి మెరుగుపడడానికి వారికి సాయం చేయడం, ఇంకా అన్నింటికంటే ముఖ్యంగా స్థానిక స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పెంపొందించడం వంటి కర్తవ్యాలను మీరు నిర్వర్తించాల్సి వుంటుంది.

ఈ లక్ష్యాలను సమర్థవంతంగా అమలుచేసే క్రమంలో మనం ఎన్‌టి, డికెలలోని గెరిల్లా జోన్లను సంఘటితపర్చుకోవడం, వర్గపోరాటం తీవ్రంగా కొనసాగుతున్న యితర ప్రాంతాలలో గెరిల్లా జోన్లను నెలకొల్పడం, వ్యూహాత్మక ప్రాంతమైన డికెను మొదట స్థావర ప్రాంతంగా రూపుదిద్దుతూ ఆ క్రమంలో దేశవ్యాప్తంగా గల యితర వ్యూహాత్మక ప్రాంతాలలో, ఎన్‌టి మరియు ఈస్టు తదితర ప్రాంతాలలో స్థావర ప్రాంతాలు నెలకొల్పే దిశగా పురోగమించాలి.

ఈ కర్తవ్యాల నిర్వహణలో **పిజిఎ** ప్రధాన బలగాలైన ప్లటూన్లు, కంపెనీలు సెకండరీ బలగాలైన స్పెషల్ గెరిల్లా దళాలు, గ్రామరక్షక దళాలకు, పునాది (బేస్) బలగాలైన ప్రజామిలీషియాకు, తప్పని

సరిగా సహాయపడాలి. ఈ కష్టతరమైన లక్ష్యాన్ని కూడ శత్రువు నలువైపుల నుండి జరుపుతున్న దాడుల మధ్యనే నెరవేర్చాలి. **పిజిఎ** ఏర్పాటులో జరిగిన ఆలస్యం వల్ల, శత్రువు వివిధ రాష్ట్రాలను మెరుగ్గా సమన్వయం చేసుకొని, కేంద్రం ఆధ్వర్యంలో ఏపి, ఎంపి, ఎంఆర్, బీహార్, ఒరిస్సారాష్ట్రాలు ఐదింటిని కలిపి జెటిసిని ఏర్పాటు చేసి గత ఫిబ్రవరి నుండి సమన్వయంతో దేశ వ్యాప్తంగా మొదటి అణచివేత దాడి ప్రారంభించి ఇప్పటికే పైచేయి సాధించాడు. అప్పటి నుండి శత్రు బలగాల దాడులు చెప్పుకోదగ్గంతగా పెరిగాయి. శత్రు బలగాల శిక్షణ, కాల్పుల శక్తి, సమాచార సేకరణలో సమన్వయం, వేగం, ఆపరేషన్ల నిర్వహణలో సామర్థ్యం మొదలైనవన్నీ మెరుగయ్యాయి. వీలైనంత తక్కువ సమయంలో చొరవను తిరిగి చేజిక్కించుకోవడానికి మనం కూడా ఈ రంగాలన్నింటిలో మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఇది ఈ రోజు మనం ఎదుర్కొంటున్న సవాలు, అత్యంత ముఖ్య కర్తవ్యం కూడా. **పిజిఎ** క్రియాశీల పాత్రద్వారా ఈ క్లిష్టమైన సవాలును ఎదుర్కొనగలమని కేంద్ర కమిటి పూర్తి విశ్వాసంతో వుంది.

ఆత్మ రక్షణ ఎత్తుగడలతో మన బలగాలను కాపాడుకుంటూనే గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసి శత్రువుపై తీవ్ర ప్రభావం చూపే దాడులు నిర్వహించాలని కేంద్ర కమిటీ పిలుపునిస్తోంది. శత్రు దాడులను ఎదిరించడానికి సాయుధ ప్రజానీకాన్ని సమీకరించడం ద్వారా, సమన్వయపూరిత దాడులతో శత్రువు నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడం ద్వారా మీరు ఘన విజయాలు సాధించగలుగుతారు.

**పిజిఎ** వీర యోధులైన మీరు, సామ్రాజ్యవాద, భూస్వామ్య ప్రతీఘాతుక శక్తులకు వ్యతిరేకంగా జరుపుతున్న న్యాయమైన పోరాటంలో ఒంటరిగాలేరు. ప్రపంచ కార్మిక వర్గానికి చెందిన అనేక సాయుధ విభాగాలలో మీరు ఒకరుగా, ప్రపంచ కార్మికవర్గ సైన్యంలో భారత దేశ విభాగంగా వుంటారు. మీ సోదరులైన ఎన్‌పిఏ గెరిల్లాలు ఫిలిప్పైన్ నేలపై, మీ కామ్రేడ్స్ అయిన **పిజిఎ** పెరూలో, ఇంకా నేపాల్, టర్కీలలో, అనేక యితర దేశాలలోని సాయుధ విభాగాలకు చెందిన కామ్రేడ్స్ వారి స్వంత గడ్డపైన శత్రువులకు గోరికట్టుతున్నట్లుగనే, మీరు భారత గడ్డపై సామ్రాజ్యవాదం, ఇతర అన్ని దోపిడీ మూకలకు గోరీ కట్టి తీరుతారు.

చియుపాస్, పాలస్తీనా, చెచెన్యా, కుర్ధుభూమి, తమిళ ఈలం (శ్రీలంక), కాశ్మీరు, అస్సాం , నాగాలాండ్, మణిపూర్, బోడోలాండ్ తదితర పోరాటకారులతో ప్రపంచవ్యాప్తంగా వున్న కార్మికవర్గ పోరాట యోధులతో చేయి చేయి కలిపి సామ్రాజ్యవాదం భారతదేశంలోని దాని కావలికుక్కలకు వ్యతిరేకంగా మీరు యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు.

**పిజిఎ**ను స్థాపించిన ఈ చారిత్రాత్మక ఘటన మనం గత కొన్ని సంవత్సరాలలో పొందిన అనేక నష్టాల వలన ప్రత్యేకించి గత సంవత్సరం మన ప్రియమైన ముగ్గురు కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల అమరత్వం వలన పొందిన తీవ్రనష్టం తర్వాత, మన పార్టీ, విప్లవోద్యమం బలహీనపడ్డాయని శత్రువు చేస్తున్న ప్రచార భ్రమలను పటాపంచలు చేస్తుంది. డిసెంబర్ 2న **పిజిఎ** ఏర్పాటు, ఈ అమరుల ఉజ్వలమైన కలల్ని పరిపూర్తి

(*కొరవ 4వ పేజీలో .....*)

(*46 పేజీ తరువాయి..... *)

డిమాండ్‌కు మద్దత్తుగా కొందరు సర్పంచులు, బ్లాక్ అధ్యక్షుడు కూడా కలిసి వచ్చారు.

సాగుమెట్ట, కుట్రు, వెదిరే, కరికెలి, మోర్మిల్, తోయనారు పంచాయితీలకు చెందిన 4000 మంది ప్రజలు బీజాపూర్ పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఇందులో భైరంగఢ్ ఏరియా ప్రజలు కూడా పాల్గొన్నారు. జనపద్ అధ్యక్షురాలు పాండ్రిబాయి కూడా ఈ డిమాండ్‌కు మద్దత్తును తెలియజేస్తూ ర్యాలీలో పాల్గొన్నది. దోపిడీ పాలక వర్గాలు ప్రజలను భయభ్రాంతులను చేయడానికి వందలాది ప్రత్యేక బలగాలను దించారు. జిల్లా ఎస్‌పి స్వయంగా బీజాపూర్‌లో మకాం వేశాడు. పోరాడే ప్రజలను ఏ శక్తి అడ్డుకోలేదనే సత్యాన్ని ఈ ర్యాలీ మరోసారి నిరూపించింది.

అక్టోబర్ 25న ప్రజలు కుంటలో ర్యాలీ, చక్కాజాం నిర్వహించారు. ప్రజలు ఈ ర్యాలీని, 'బస్తర్ సంఘర్ష్ సమితి' నాయకత్వంలో నిర్వహించారు. ఈ ర్యాలీలో కనీసం 15-20 వేల మంది ప్రజలు పాల్గొన్నారనీ, కుంటకు సంబంధించి ఇది అపూర్వమైన ర్యాలీ అని బూర్జువా వార్తా పత్రికలే అభివర్ణించాయి. 1984లో మాజీ ప్రధానీ రాజీవ్ గాంధీ ఇక్కడికి వచ్చినప్పుడు కూడా ఇంత పెద్ద ప్రజా సమూహాన్ని తాము చూడలేదని పురప్రముఖులు కొందరు వ్యాఖ్యానించారు.

పోలీసులు పెద్ద ఎత్తున దిగ్బంధన ఏర్పాట్లు చేసి ప్రజలను ర్యాలీకి రాకుండా అడ్డుకోజూశారు. పోలీస్ స్టేషన్ రోడ్డును ఒకరోజు ముందుగానే సీల్‌చేశారు. వాహనాలనుగానీ, మనుషులనుగానీ అటుగా వెళ్లనివ్వలేదు. జిల్లా ఎస్‌పి హిమాంశు గుప్త స్వయంగా పోలీస్ బలగాలకు నాయకత్వం వహించాడు. ప్రజలు ఈ పటాటోపాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా జయప్రదంగా ర్యాలీని నిర్వహించారు. ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్‌ను సాధించుకునేదాకా పోరాటం ఆపేది లేదని ముక్తకంఠంతో నినదించారు.

తిరిగి డిసెంబర్ 16న మరో తడవ ప్రజార్యాలీలు జరిగాయి. ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్ రాష్ట్ర డిమాండ్‌తోపాటుగా, పలు ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా డిమాండ్ చేస్తూ ఆవపెల్లిలో ర్యాలీ జరిగింది. బాసగూడెం, ఆవపెల్లి ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ ర్యాలీని జయప్రదం చేశారు. ఈ ర్యాలీలో పాల్గొనడానికి ప్రజలు పదుల కిలోమీటర్ల దూరం నుండి కాలినడకన చేరారు. బాసగూడెం దగ్గర్లోని ముర్తుండలో బయలుదేరిన ఈ ప్రజార్యాలీ 15 కిలోమీటర్లు సాగి ఆవపెల్లి చేరింది. ర్యాలీని భగ్నం చేయడానికి పోలీస్ ఉన్నతాధికారులు ముందునుండే ఇక్కడ తిష్టవేసి ప్రజలను బెదిరించబూనుకున్నారు. అయినప్పటికీ ప్రజలు బెదరకుండా ర్యాలీని జయప్రదం చేశారు.

e w e

శ్రద్ధాంజలి

## ఉత్తర తెలంగాణ - దండకారణ్య ఉద్యమ చరిత్ర పుటలతో పెనవేసుకొని పెరిగిన

# కామ్రేడ్ జగదీష్ (పసుల రాంరెడ్డి) అమర్ రహే!

పశ్చిమ కరీంనగర్ జిల్లా కాన్ఫరెన్స్ కొనసాగుతున్న క్రమంలో సెప్టెంబర్ 23న శత్రు బలగాలు పెద్ద ఎత్తున దాడిచేసి ఐదుగురు కామ్రేడ్స్‌ను కాల్చి చంపాయి. ఇందులో ఒకరు కామ్రేడ్ వినోద్. గత 25 యేళ్లుగా కామ్రేడ్ వినోద్ విప్లవోద్యమంతో పెనవేసుకపోయి ఉద్యమ ఆటుపోట్ల అన్నింటిలో నిండుకుండలా తొణకకుండా నిలిచి ప్రజల పక్షాన విరామమెరుగక పోరాడిన పార్టీనేత. ఉత్తర తెలంగాణ, దండకారణ్యం మహారాష్ట్రలలో ఉద్యమపెరుగుదలలోని ప్రతి మలుపులోనూ ఉద్యమంతోపాటుగా ఎదిగిన కామ్రేడ్ వినోద్ అమరత్వం భారత విప్లవోద్యమానికి ప్రత్యేకించి ఎన్‌టి, డికె ఉద్యమాలకు ఎనలేని నష్టం. అమరుల అమరత్వాన్ని ఎత్తిపడుతూ నష్టాలమధ్యే ఉద్యమాన్ని ఉన్నత స్థాయికి తీసుకుపోవాలని చేస్తున్న కృషిలోనే కామ్రేడ్ వినోద్ అమరత్వానికి డికెఎస్‌జడ్‌సి విప్లవాంజలి ఘటిస్తోంది. అమరుల ఆశయ సాధనకు భారత పీడిత ప్రజలు మరింత దృఢంగా పోరాడతారని భావిస్తోంది.

### నష్టాలను విజయాలుగా మార్చే అడుగుల్లో అడుగువేసి నడచిన కామ్రేడ్ పశుల రాంరెడ్డి

నక్సల్బరీ, శ్రీకాకుళం తదితర ఉద్యమాలు 1972 నాటికి పూర్తిగా వెనుకడుగేశాయి. దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ పునర్నిర్మాణ కృషి ప్రారంభమైంది. ఈ కృషిలో భాగమైంది ఏపి రాష్ట్రకమిటీ. ఉద్యమం తాత్కాలిక ఓటమికి గురైనా అది అందించిన రాజకీయాల ప్రభావం నవతరంపైన ప్రగాఢంగా నిలిచి వుంది. సాయుధ పోరాటం మినహా మరో మార్గం లేదనే వర్గ రాజకీయాలను బలంగా ప్రజల ముందుంచింది. ఆ నేపథ్యంలో దేశంలోనూ కరీంనగర్ జిల్లాలోని అనేక ప్రాంతాలలోనూ యువత విప్లవోద్యమంలో క్రియాశీలంగా పాల్గొనేవైపు మరలారు. అందులో భాగంగానే కోరుట్ల యువత ముందుకు వచ్చింది. మెట్‌పల్లి, జగిత్యాల ప్రాంతాలలోనూ ఇటు సిరిసిల్లా, ఆర్మూర్ తదితర ప్రాంతాలలోనూ భూస్వామ్య ఇనుప పాదాల క్రింత తరతరాలుగా అణిగిపోయివున్న పీడిత రైతుల విముక్తికి సాయుధ పోరాటం మినహా మరో మార్గం లేదని నమ్మి అందుకు సిద్ధమై ఇల్లు వాకిలి వదిలి ప్రజల మధ్యకు ఉద్యమ నిర్మాణానికి యువత సాగిపోయిన కాలంలో కామ్రేడ్ రాంరెడ్డి తన యిల్లు వదిలి పార్టీ అప్పగించిన ప్రాంతంలో ప్రజలను సంఘటితపరచ కదలివెళ్లాడు.

అవి 'అత్యవసర పరిస్థితి' రోజులు. నియంత ఇందిర తన పదవిని కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగానే ప్రజల హక్కులు హరించి వేసిన కాలంలో, తిరుగుబాటు స్వరం ఏరూపంలోనున్నా అణచివేసే మార్గంగా రాజ్యాంగ యంత్రాన్ని తయారుచేసుకున్న రోజులలో ప్రజలను బహిరంగంగా సమీకరించే అవకాశం మృగ్యమైన 1975-77 మధ్య కాలంలో పార్టీ అందించిన గైడెన్స్‌లో ఏదో ఒక కవర్‌లో ప్రజల మధ్యన నిలదొక్కుకొని ఉద్యమ నిర్మాణానికి కృషి చేయాలని పార్టీ ప్రారంభించిన తొలి ప్రయత్నాలను సఫలం చేయుటకు చొరవతో కృషి చేసిన యువకులలో కామ్రేడ్ వినోద్ ఒకరు.

నిజానికి అప్పటికింకా పార్టీలో వర్గ శత్రువు నిర్మూలనే ఏకైక మార్గం అనే పంథా ఆధిక్యతలో వున్న కాలం. యావత్ పార్టీ గతానికి సంబంధించిన సమీక్షపైన ఏకాభిప్రాయానికి రానందున ఏపి రాష్ట్రకమిటీ తనకు తానుగానే చొరవ చేస్తూ వృత్తి విప్లవకారులుగా ముందుకు వచ్చిన వారిని ప్రజల మధ్యకు డ్రైవ్ చేస్తూ గత తప్పులను సరిదిద్దుకొని ఎత్తుగడలలో అవసరమైన మార్పులు చేసుకోవడం ద్వారానే తిరిగి ఉద్యమాన్ని నిర్మించగలమని నమ్మడమేకాదు. అలా నమ్మి కొత్తగా ఉద్యమ బాధ్యతలు చేపట్ట ముందుకు వచ్చిన వారిని తర్ఫీదు చేయడం తన కర్తవ్యంగా స్వీకరించింది. ఆ కర్తవ్య నిర్వహణను సరిగా చేపట్టడం ద్వారానే ఏపి రాష్ట్ర కమిటీ గడచిన 27 యేళ్లకు పైగా సరికొత్త అనుభవాలతో భారత విప్లవంలో కొత్త చరిత్రను లిఖించింది. ఆ చరిత్ర రచనలో 25 ఏళ్లుగా భాగస్వామ్యం వహించాడు కామ్రేడ్ వినోద్ (రాంరెడ్డి).

ఇంకా రెండు పదులు నిండలేదు రాంరెడ్డికి. అప్పటికే కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున కామ్రేడ్ రాంరెడ్డి చదువు వదలాడు. వివాహం అయింది. ప్రైమరీ స్కూల్‌లో ప్యూన్‌గా ఉద్యోగంలో చేరాడు. అయినప్పటికీ తన బస్తీలో ప్రవేశించిన విప్లవ రాజకీయాలచే సహజంగానే ఆకర్షించబడి అన్నీ వదిలి 1974లోనే వృత్తి విప్లవకారుడుగా సిద్ధమైన కామ్రేడ్ రాంరెడ్డి క్రమంగా తన రాజకీయ అవగాహనను మెరుగు పరుచుకుంటూ నిత్య విద్యార్థిగా వర్గపోరాటంలో అనుభవాలు గడిస్తూ ప్రజాయుద్ధం పతాకను దిశదిశలా రెపరెపలాడించాడు.

ఆనాటి చీకటి రోజుల్లో బహిరంగంగా ప్రజల మధ్య పనిచేసే అవకాశమేలేదు. ఉద్యమ పాజిటివ్, నెగటివ్ పార్శ్వాలను సరిగా అంచనా వేయడం. వర్గ శత్రు నిర్మూలన ఒక పోరాట రూపంగా అవసరమేగానీ అది ఏకైక మార్గం కాదని, ప్రజలను ప్రజాసంఘాలలో సమీకరించాలనే మూడు విషయాలపై అప్పటికే ఏపి పార్టీ శ్రేణులకు స్పష్టత లభించింది. అంతేకాదు, ఆనాడు విప్లవ క్యాంపులో గల అనేక ప్రశ్నలు, గందరగోళాలు ఒక రకంగా చెప్పాలంటే ఏపి పార్టీలో ఆనాడు అంతగాలేవు. ఫలితంగా కొత్తగా వచ్చిన స్వీయాత్మక శక్తుల ద్వారా తిరిగి ఉద్యమ నిర్మాణానికి అవకాశం లభించింది. ఈ కొత్త ఆచరణలో మొదటి నుండి కామ్రేడ్ పశుల రాంరెడ్డి భాగం అయ్యాడు.

కరీంనగర్-ఆదిలాబాద్ జిల్లాల్లో అనేక మంది ఆర్గనైజర్లు వేరు వేరు వృత్తులపేర ప్రజల మధ్యకు వెళ్లి సంబంధాలు

నెలకొల్పుకున్నారు. కామ్రేడ్ రాంరెడ్డి భూస్వామ్యానికి పట్టుగొమ్మ అయిన జగిత్యాలలోని బీర్‌పూర్, తొంతాపూర్ గ్రామ సమీపంలో ఇస్త్రీ బట్టల దుకాణం తెరిచాడు. వెలమ భూస్వాములకు ఆ ప్రాంతమంతా పెద్ద కేంద్రము. అక్కడ దొరల కళ్లు కప్పి నిలబడాలి. అంతకు ముందే 1969-70లలో సారంగపూర్ ప్రాంతంలో ఒక దళం సాయుధంగా వెళ్లి కొద్దిరోజులలోనే మొత్తంగా అరెస్టు అయింది. కొత్తవారు వచ్చారంటేనే దొరలకు అనుమానం. ఆ స్థితిలో కామ్రేడ్ రాంరెడ్డి తన బస్తీ నుండి మరో యువకుడిని వెంటతీసుకొని బీర్‌పూర్ ఆ చుట్టుగల యువకులను సంఘటితపరచ ప్రారంభించాడు. రహస్య నిర్మాణాలకై రాజకీయ ప్రచార కృషిని సలిపాడు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో జరిగిన గెరిల్లా దాడులలో ప్రజలు గెరిల్లాలకు పలురకాలుగా సహకరించే సన్నాహాలు చేశాడు. ఎమర్జన్సీ చీకటి రోజుల్లో (1976) భూస్వామ్య క్రూరత్వానికి మారుపేరైన కమలాపూర్ భూస్వాములను శిక్షించాలని నిర్ణయించి ప్రత్యేక గెరిల్లా దళంను పార్టీ ఏర్పాటు చేసినప్పుడు కామ్రేడ్ జగదీష్ ఆ దళంలో సభ్యుడుగా వుండి తనవంతు కర్తవ్యాన్ని ధైర్యంగా నిర్వర్తించాడు. కరీంనగర్-నిజామాబాద్ ఉద్యమాలతో పెనవేసుకొని పెరిగిన నాయకుడు ఆయన.

1977లో జరిగిన తెలంగాణ రీజనల్ మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నాడు. మహాసభకు ముందు క్లాసులలో పాల్గొనడం ద్వారానూ, సభలలో డాక్యుమెంట్ల పైన చర్చలలో పాల్గొని తన రాజకీయ చైతన్యాన్ని మెరుగుపరుచుకున్నాడు. తన సందేహాలను అడిగి తెలుసుకోవడం, తన భావాలను స్పష్టంగా చెప్పడం కామ్రేడ్ వినోద్ లక్షణం. మహాసభల నినాదాలలో ఒకటైన ***"వర్గపోరాటాన్ని పెంపొందించడం, సాయుధ పోరాటం తీవ్రతరం చేయడం"*** పైన కేంద్రీకరించాడు. ఇందుకుగానూ సిరిసిల్లా కామారెడ్డి సరిహద్దులలో ఆర్గనైజర్‌గా స్థిరపడినాడు. నిజామాబాద్ జిల్లాలో ఉద్యమ నిర్మాణానికి తొలి ప్రయత్నాలు చేసిన కామ్రేడ్స్‌లలో కామ్రేడ్ రాంరెడ్డి ఒక ముఖ్య భూమికను నిర్వహించాడు. ఈ క్రమంలో అక్కడ జరిగిన దాడులలో చురుగ్గా పాల్గొన్నాడు. కరీంనగర్-ఆదిలాబాద్ జిల్లాలలో ప్రజలలో నిలదొక్కుకునే కృషిలో చాలా మంది పార్టీ ఆర్గనైజర్లు నిలదొక్కుకొని ఉద్యమం నిర్మించారు. అప్పటికింకా నిజామాబాద్‌లో నిలదొక్కుకునే ప్రయత్నాలే కొనసాగుతున్నాయి. 1979 నుండి ఆ ప్రాంతంలో సాయుధ దళాల నిర్మాణానికి కృషి జరిగి దళం ఏర్పడింది. దళం నిలదొక్కుకునే ప్రయత్నంలో కామ్రేడ్ రాంరెడ్డి తన శక్తి కొలది పాల్గొని సహకరించాడు. ఈ క్రమంలో 1981లో అరెస్టు అయ్యాడు. జైలులో దాదాపు ఒక సంవత్సరంపైగా వుండి తిరిగి 1983లో ప్రజాఉద్యమ నిర్మాణంలో భాగమైనాడు.

అప్పటికి నిజామాబాద్‌లో స్వీయాత్మక శక్తులు నిలదొక్కుకున్నాయి. జిల్లా కమిటీని ఏర్పరచే కృషితోపాటుగా జిల్లా కాన్ఫరెన్స్‌ను పార్టీ నిర్వహించింది. రాంరెడ్డి జిల్లా కమిటీలోకి సభ్యుడిగా ఎంపికయ్యాడు. మహాసభలు ముగిసిన కొద్ది కాలానికే శత్రువు నిర్బంధము తీవ్రంగావించాడు. అంతేకాదు, ఆనాడు (1985) ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో వున్న ఎన్‌టిరామారావు ప్రభుత్వం పార్టీపైన అప్రకటిత యుద్ధం ప్రారంభించింది. ఆ యుద్ధాన్ని ఎదుర్కోవడం, ఉద్యమాన్ని సంఘటితపరుస్తూ విస్తృతపరచడం, స్వీయాత్మక శక్తులను కాపాడుకోవడం అనే పాలసీలో భాగంగా ఏపి రాష్ట్రకమిటీ కామ్రేడ్ రాంరెడ్డిని దండకారణ్యానికి మార్చింది.

## దండకారణ్య గెరిల్లాజోన్‌ను బలంగా నిర్మించే కృషికి నేతృత్వం వహించిన కామ్రేడ్ జగదీష్

దండకారణ్యంలోకి అడుగిడిన కామ్రేడ్ రాంరెడ్డి ఆ ఉద్యమంలో జగదీష్‌గా పరిచయమయ్యాడు. జిల్లా కమిటీ సభ్యుడిగా మహారాష్ట్రలోని గడ్‌చిరోలి డివిజన్‌లో ఉద్యమ బాధ్యతలు చేపట్టాడు. పెరిమిలి దళానికి కమాండర్‌గా మొదలెట్టి తదుపరి పెరిమిలి, ఏటపల్లి దళాలను గైడ్ చేశాడు. 1988లో విస్తరణలో భాగంగా గడ్‌చిరోలి జిల్లాలో టిప్రాగడ్ ప్రాంతంలో దళం ప్రారంభించ బడినప్పుడు ఆ దళానికి కమాండర్ బాధ్యతలు చేపట్టాడు. దీపక్‌గా, మడావిగా ప్రజల ప్రేమాభిమానాలను చూరగొన్నాడు. అనతి కాలంలోనే అక్కడ ఉద్యమాన్ని నిర్మించడంలో కృతకృత్యుడయ్యాడు. ప్రజా పునాదిని పెంచడమే కాకుండా చిన్న పెద్ద పలురకాల పోరాటాలతో ప్రజలను స్వయంగా కదిలించాడు. ఆ ప్రాంతపు జనాలకు అనతి కాలంలోనే ప్రీతిపాత్రమైన కామ్రేడ్‌గా ఎదిగాడు. ఆదివాసీ ప్రజల ఆచార వ్యవహారాలపై, భాషలపై పట్టు సంపాదించడమే కాదు ప్రజల పాత్ర ఉద్యమంలో మొదటి నుండి పెంచి ప్రజా సంఘాలను నిర్మించి, ఎప్పటికప్పుడు అవసరమైన రాజకీయ చైతన్యం అందించి స్థానిక యువతీ యువకులు గమనించదగ్గ సంఖ్యలో దళాల్లోకి రిక్రూట్ గావడానికి విశేషమైన కృషి చేసిన ఆదర్శ ప్రజానాయకుడు కామ్రేడ్ జగదీష్.

తునికాకు కూలీలను అధికరేట్ల కొరకు సమీకరించినపుడు తాను నాయకత్వం వహించిన ప్రాంతంలో కమాండర్/ డివిసియంగా కూలీల రాజకీయ చైతన్యం పెంచే కృషి చేశాడు. పార్టీ నిధులు సమీకరణకు వర్క్‌డేలతో ప్రారంభించాక వెదురు కూపులలో స్వయంగా నాయకత్వం వహించి వేలాదిగా ప్రజలను కదిలించి పెద్ద ఎత్తున పార్టీ నిధులు సమీకరించాడు. గడ్‌చిరోలిలో శత్రు నిర్బంధం ప్రారంభమైన పిమ్మట శత్రువును ప్రతిఘటించి దెబ్బతీయాలని డివిసి చేసిన నిర్ణయం అమలుకై జరిపిన అంబుష్‌లను జయప్రదం చేయడంలో చొరవగా పాల్గొన్నాడు. గడ్‌చిరోలి, బండారా జిల్లాలలో ఉద్యమాన్ని అణచివేసి పైచేయి సాధించుటకు శత్రువు అనేక కొత్త ఎత్తుగడలను 1990ల తదనంతరం నుండి కేంద్రీకరించి అమలు జరిపాడు. 1986-87ల నుండే దీర్ఘకాలిక మరియు తాత్కాలిక పథకాలను ప్రారంభించి పోలీసు బలగాల మోహరింపు, తరలింపు తర్ఫీదులే కాకుండా ఆధునీకరణ ప్రారంభించాడు. ఈ విధానాలను ఎదిరించుటకు ప్రజలను సిద్ధం చేయడంతోపాటుగా గెరిల్లాలు, అంబుష్‌లు, రెయిడ్స్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగానే బండారా జిల్లా మసేలిలో 1991లో కామ్రేడ్ మడావి నాయకత్వంలో గెరిల్లాలు జిల్లా పోలీస్ పోస్టుపై దాడి చేసి తుపాకులు స్వాధీనపరచుకొన్నారు. 1992లో కొసపూంఢి అంబుష్ పార్టీ డిప్యూటీ కమాండర్‌గానూ ఆయుధాల సీజింగ్ పార్టీకి కమాండర్‌గానూ వున్నాడు. మొదటిసారిగా అధికసంఖ్యలో ఆయుధాలను స్వాధీనపరచుకొని పోలీసులను చంపిన అంబుష్‌లో మరో డివిసి-ఎంతో కలిసి కామ్రేడ్ జగదీష్ నాయకత్వం వహించడమే కాకుండా ఆయుధాల స్వాధీనానికి

మంచి చొరవ చూపాడు. గడ్‌చిరోలి - భండారా రెండు జిల్లాలలో ఈ చివర నుండి ఆ చివర వరకు వివిధ సమయాలలో నేరుగా నాయకత్వం వహించిన కామ్రేడ్ జగదీష్, ఆ ఉద్యమాన్ని పురోగమింప జేశారు.

1985 - 95ల మధ్య ఒక దశాబ్దం కాలం మహారాష్ట్రలోని గడ్‌చిరోలి - బండారా జిల్లాల ఉద్యమానికి నాయకత్వం వహించిన టీంలో కామ్రేడ్ జగదీష్ ఒకరు. దండకారణ్య ఉద్యమంలో ఈ ప్రాంతం 91లో నిర్బంధం ఎదుర్కొనే వరకు ఉద్యమానిదే పైచేయిగా కొనసాగిన కాలం. 1991 తర్వాత నుండి మహారాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ హయాంలోనూ, తదుపరి శివసేన-బిజెపి కూటమి నాయకత్వంలోనూ తిరిగి కాంగ్రెస్ హయాంలోనూ ఉద్యమ అణచివేతకు నిరంతరంగా ఒకే పాలసీని అమలు జరిపింది. ఒకరిని మించి మరొకరు నిర్బంధాన్ని పెంచారు. ఈ పరిస్థితిలో కామ్రేడ్ జగదీష్ పార్టీ గెరిల్లా దళాలను, ప్రజాసంగాలను నిర్బంధం మధ్య నిలబెట్టుటకు డివిసి చేసిన కృషిలో భాగస్వామి అయ్యాడు.

ఉత్తర తెలంగాణా నుండి ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో భాగంగా జరిగిన కృషి ఫలితంగా దండకారణ్యం ఒక ప్రత్యేక గెరిల్లాజోన్‌గా ఎదిగి రావడం, దండకారణ్య ఉద్యమాన్ని బలోపేతం చేయడం దక్షిణ భారతం నుండి మధ్య, ఉత్తర భారతంలోకి ఉద్యమ విస్తరణలో భాగంగా బండారా(మహారాష్ట్ర) బాలాఘాట్, మాండ్ల (మధ్యప్రదేశ్) వైపుగా విస్తరణకు ప్లాన్‌లను పార్టీ సిద్ధంచేసినప్పుడు టిప్రాగడ్ దళం నాయకుడిగా ఆ ప్రాంతమంతా కలియతిరిగిన కామ్రేడ్ మడావి దాదా భండారా ప్రాంత సర్వేలోనూ ఆ దళాన్ని నిలబెట్టడంలోనూ ప్రత్యేక కృషి చేశాడు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లనూ ప్రత్యేకించి బండారా-బాలాఘాట్ జిల్లాలను బాగ్ నది వేరు పరుస్తున్నది. అప్పటికే బాగ్ నదివైపు మహారాష్ట్రలోని దర్రెకస్స వైపు పరిచయాలు ఏర్పడి టెర్రయిన్ అర్థం చేసుకొన్న కామ్రేడ్ జగదీష్ మడావి 1989 చివర బాలాఘాట్ దళాన్ని వెంటబెట్టుకొని టిప్రాగఢ్ బండారా మీదుగా వెళ్లి బాగ్ నదిని దాటించి అద్దరి, యిద్దరి పరిచయాలను ఆధారం చేసుకొని దళం నిలదొక్కుకునేలా నడిపించి పార్టీ ప్లాన్‌ను అమలు జరిపించి మధ్య భారత విస్తరణ మలుపులో తన తొలి అడుగు ముద్రలను పరిచాడు.

1993 తదనంతరం నుండి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ నిరంతరం ఉద్యమప్రాంతంలోనే నిలిచాడు. ఎండ, వాన, చలి మూడు కాలాలూ గెరిల్లాల జీవితంలో విడదీయరాని భాగమే. అడపాదడపా వచ్చే మలేరియా తప్ప అప్పటికి ఆరోగ్య సమస్యలు లేవు. మొదటిసారిగా 1992 నుండి ఎండసోకితే శరీరం భరించలేని పరిస్థితిని ఎదుర్కొన్నాడు. అయినప్పటికీ 1995 వరకు ఫీల్డ్ వదలి బయటకుపోలేదు. ఎంత కష్టమైన పరిస్థితినైనా సహనంతో ఎదుర్కొన్నాడు. తోటి కామ్రేడ్స్ సహకారంతో ఉదయం, సాయంకాలంలో సహితం అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ అడవిలో గెరిల్లా జీవితాన్ని కొనసాగించాడు. పట్టుదల వుంటే లక్ష్యసాధనకు ఏ ఆటంకాన్నైనా ఎదిరించవచ్చుననే కామ్రేడ్ జగదీష్ ఆచరణను విప్లవకారులు ఆదర్శంగా స్వీకరించాలి.

గడ్‌చిరోలి నిర్బంధాన్ని ఎదుర్కొనే ప్రయత్నంలో పలుమార్లు శత్రు దాడిని ఎదుర్కోవలసి వచ్చింది. జిల్లా అంతా విస్తరించిన శత్రు ఇన్ఫార్మర్ నెట్‌వర్క్ వల్ల ఎప్పుడు శత్రువు కాపుకాచేది తెలియని పరిస్థితి, ఈ స్థితిని అధిగమించుటకు పలువురు ఇన్‌ఫార్మర్లను శిక్షించడం, హెచ్చరించడంతోపాటు పలురూపాల శిక్షలు అమలు జరిపి ప్రజల సహకారంతో వారిని కంట్రోల్ చేసుటకు కామ్రేడ్ జగదీష్ నిరంతరం కృషి చేశాడు. ఇంతటి తీవ్ర నిర్బంధ పరిస్థితి మధ్యనే 1995లో జరిగిన డివిజన్ మూడవ కాన్ఫరెన్స్‌లో డివిసిలోకి తిరిగి ఎన్నికవడమే కాక ఆ కమిటీ కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యాడు.

1995లో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని మరింత పెంచింది. అప్పటికి కామ్రేడ్ జగదీష్ ఆరోగ్యం మరింతగా సమస్యాత్మకంగా కావడంతో డికెఎస్‌జడ్‌సి ఆ కామ్రేడ్‌ను అడవిలో కాకుండా ఆయన ఆరోగ్యానికి అనుగుణమైన పని బాధ్యతలలో కొనసాగేలా పంపాలని నిర్ణయించి అమలు జరిపింది. ఈ నిర్ణయం వల్ల కామ్రేడ్ జగదీష్ గడ్‌చిరోలి అడవుల నుండి బొంబే మహానగరానికి తరలివెళ్లాడు.

మహారాష్ట్రలో మైదానం, పట్టణ పనిలో బొంబే మహానగరం బాధ్యత అప్పగించబడింది. ఆదివాసీ ప్రాంతంలో పనిచేస్తూ వచ్చినా, మహానగరం పనిలో సైతం త్వరితంగానే ఇమిడిపోయి చిత్తశుద్ధితో ప్రజల మధ్య జీవించాడు. పార్టీని గైడ్ చేశాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర కమిటీలోకి ఎన్నికయ్యాడు. ఈ కాలంలోనే తిరిగి ఆరోగ్యం పూర్తిగా కోలుకున్నాడు. దీనితో పట్టణాల్లో పని కాకుండా తనకు గ్రామాల్లో పనిచేయుటకు అందులోనూ తెలంగాణాలో పనిచేయుటకు అవకాశం యివ్వాలని రాష్ట్ర, కేంద్రకమిటీల ముందు ప్రతిపాదించాడు కామ్రేడ్ జగదీష్. ఈ ప్రతిపాదనకు అంగీకరించి కేంద్రకమిటీ 1999లో కామ్రేడ్‌ను ఉత్తర తెలంగాణాకు పంపించింది. 1996-98 మధ్య మూడేళ్ల కాలం పట్టణోద్యమంలోని మెలకువలు అర్థం చేసుకోవడంలో కామ్రేడ్ జగదీష్ కృషిచేశాడు.

## ప్రజల పోరాట, ఆరాటాలకు బాణీ కట్టిన ప్రజాగాయకుడు, కవి – 'ప్రత్యూష'

దండకారణ్యం చేరకముందే కామ్రేడ్ జగదీష్ సాహిత్యం కళలపై అభిరుచి కలిగివున్నాడు. పాటలు రాయడమేకాకుండా పాడడం కూడా చేసేవాడు. దండకారణ్య ఉద్యమంలో విప్లవ సాహిత్యాన్ని సృష్టించవలసిన అవసరం ఎంతగానో ముందుకు వచ్చింది. అప్పటికే గ్రామసీమలలో వున్న జానపదబాణీలపై ఆ కామ్రేడ్‌కు విశేషమైన అభినివేశం, పట్టు వుండింది. ఈ పట్టు అడవిలో ఆదివాసీ భాష నేర్చుకోవడానికి, వారితో గజ్జకట్టి ఆడి, గొంతెత్తి పాడుటకు, సామూహిక గానంలో తాను భాగం కావడానికి అవకాశం

యిచ్చింది. ఉద్యమం పెంపొందిన కొలది, ప్రజలను అందుకు తగినట్లుగా చైతన్యపరచుటకు అవసరమైన విప్లవకర పాట, నాటిక, యితర కళారూపాల అవసరం ఎంతగానో వుండింది. ఇవి అప్పటికి లేకపోవడంతో తెలుగు పాటలను అనువదించడంతో ప్రారంభించి అనేక కొత్త గోండీ పాటలను కామ్రేడ్ జగదీష్ రాశాడు. పలు సందర్భాలలో క్లాసులకు వచ్చిన విద్యార్థులకు నాటికలు వేయడం నేర్పించాడు. ఆదివాసీ ప్రజలలో బహుళ ప్రచారంలో గల పాటలన్నింటిని సేకరిస్తూ వాటి ఆధారంగా అవసరమైన విప్లవ సాహిత్యాన్ని సృష్టించాడు. అంతర్జాతీయగీతం, జండాగానం మొదలు ఎన్నో గేయాలను గోండీలోకి అనువదించాడు. నేటికి దండకారణ్యాం అంతా ఆ పాటలు గెరిల్లాలకు ఇష్టమైన పాటలుగా నిలిచాయి.

ఎక్కడ జండా ఎత్తినా తెలుగులో పాడే పాట ***"సుత్తీ కొడవలి గురుతుగ వున్న ఎర్రనిజండా ఎగురుతున్నది"*** దీనిని హిందీలోకి అనువదించి, అనువాదం చేశారనే భావన కలగకుండా బాణీ కట్టాడు. ***"నీలిగగనమే హనియా హతోడా"*** అనే గీతం ఎర్రజండా ఎగిరినంత కాలం విప్లవ ప్రజలు పాడుకొంటూ కామ్రేడ్ జగదీశ్‌ను స్మరిస్తూనే వుంటారు. అలాగే మరోపాట అంతర్జాతీయ గీతం. మన ఉద్యమ ప్రాంతాల్లో దీన్ని ఎక్కడైనా తెలుగులోనే పాడేవారు. అందుకని ప్రజలకోసం దానిని గోండిలోకి అనువదించారు. అదే పాట ***"జాగోరే గరీబ్‌లోకుర్- జాగోరే నలుబాసల్"***. 1990 చివర సురసుండి (గడ్‌చిరోలి) గ్రామంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో కామ్రేడ్ దయారాం అమరుడైనాడు. ఆ అమరుడిపై మరోపాట కట్టాడు. అది గడ్‌చిరోలియేకాదు దండకారణ్యా వ్యాప్తంగా ప్రచారం పొందిన పాట. 1991లో నిర్బంధం ప్రారంభమైంది. నిర్బందాన్ని బహిర్గతపరుస్తూ కామ్రేడ్ ప్రత్యూష ప్రజల చైతన్యం జాగరూకత పెరిగేలా మరో పాట ***"బోన మోటాడదు బదు మోటాడదు-కార్యల్ మోటాడదు ....."*** రాశాడు. 1994 ఢిల్లీలో రాజ్యం చేస్తున్న కాంగ్రెస్, దాని నేత పివి నరసింహారావు ప్రంపచీకరణ, సరళీకరణ పథకాలతోనూ డబ్ల్యూటిఓపై ఆమోదం తెలిపి దేశాన్ని తాకట్టుపెడితే దానిని బహిర్గతపరుస్తూ మరోపాట ***"నల్లమొగపోడు ఢిల్లీ సర్కారోడు - వద్దంటే వినకుండా అంగోట ఇచ్చినాడు"*** అని రాశాడు. పోరాట ప్రాంతాలన్నింటా కామ్రేడ్స్ అమరులవుతున్నారు. అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ మరోపాట ***"ఓ మేరీ షహీద్ సాథీ...."*** అంటూ వారి జ్ఞాపకాలకు అక్షర రూపం ఇచ్చాడు.

ఇలా తెలుగు, హిందీ, గోండీ మూడు భాషల్లో, ఒక భాషలో కొత్తగా ప్రాచుర్యం పొందిన పాటను మరో భాషలోకి అనువదించి బాణీ కట్టి ప్రజలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎప్పటికప్పుడు చైతన్యపరచి యుద్ధానికి సిద్ధం చేసేలా గుండెకు హత్తుకునే బాణీలలో అనేక గేయాలు రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కామ్రేడ్ ప్రత్యూష (జగదీష్).

కేవలం గోండీ భాషపైనే కాదు హిందీ భాషపైననూ అనతికాలంలోనే కామ్రేడ్ జగదీష్ మంచి పట్టు సంపాదించాడు. హిందీలో నేరుగా పాట రాయడంతోపాటు తెలుగు నుండి సహితం అనువదించాడు. పాటను ఆయుధంగా మలచి ప్రజల మధ్యన పాడటమే కాదు వారిని ఆయుధం పట్టి యుద్ధానికి సిద్ధం చేస్తూ ఊరూరా కలియతిరిగి కొండ కోనలపై తేలియాడే గానం అయ్యాడు. జనం పోరాటవేడికి వాడి అయిన బాణీ కట్టి దరువు అందించిన ప్రజాగాయకుడు కామ్రేడ్ ప్రత్యూష

## దళిత ఉద్యమం వ్యవసాయ విప్లవంలో భాగం కావాలని ఆశించిన కమ్యూనిస్టు నాయకుడు

భూస్వామ్య సంబంధాలు బలంగా వున్నచోటనే కాకుండా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో సైతం కులం ఆధిక్యత బలంగానే నాడు నేడు కొనసాగుతున్నది. వ్యక్తిపేరులోనే కుల సంకేతం మిళితం అయి వచ్చేలా భూస్వామ్యం కట్టడిని అమలు జరిపింది. అందుకే 1930-40ల ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిస్టు నాయకులలో కొందరు తమ పేర్లలో గల కులం ప్రతిరూపాన్ని విసర్జించారు. కాని చాల ప్రాంతాల్లో భూస్వామ్య కట్టడిపై తిరుగుబాటుగా దళిత యువకులు, యితర అణగారిన కులాల యువకులు తమ తిరుగుబాటు భావాలను ప్రదర్శించుటకు పేరులో అగ్రకుల సంకేతాలను చేర్చడం ప్రారంభమైంది. కామ్రేడ్ రాంరెడ్డి పేరులోని రెడ్డి ఈ తిరుగుబాటు భావానికి సంకేతంగా విప్లవ రాజకీయాలలోకి రాకముందే తల్లితండ్రులు పెట్టుకొన్నది. కోరుట్ల దళిత బస్తీలో ఎందరో యువకుల పేర్లు అలా పెట్టబడినవి. ఇందుకు చారిత్రక కారణాల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రచారం ప్రధానం, భూస్వామ్య అణచివేత భరించలేక వందలు, వేల మంది దళితులు బాంబే నగరం వెళ్ళి జౌళి (టెక్స్‌టైల్స్) మిల్లుల్లో స్థిరపడి అక్కడ ఏఐటియుసి కార్మిక సంఘాల ద్వారా కమ్యూనిస్టులయ్యారు. అంతేకాకుండా కోరుట్ల తదితర పట్టణాలలో బీడీ కార్ఖానాలలో గల వందలాది స్త్రీపురుషులు అవిభక్త కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో కమ్యూనిస్టు రాజకీయాలలోకి ఆకర్షితులై దొరతనాన్ని ఎదిరించేవారు. 1970లలో అంబేద్కర్ సంగాలు యువకులను చేరదీసి దళిత చైతన్యాన్ని పెంచే ప్రయత్నాన్ని చేశాయి.

వర్గపోరాటం పెంపొంది ఆ క్రమంలో సామాజిక చైతన్యం పెరిగి ఆంధ్రప్రదేశ్‌లో అనేక కుల సంఘాలు ముందుకు వచ్చాయి. దేశవ్యాప్తంగా బిఎస్‌పి ఆవిర్భావం ఒక రకంగా చెప్పాలంటే ప్రారంభంలో దళిత ప్రజలలో భ్రమలను పెంచింది. ఆ భ్రమలపై పోరాడవలసిన అవసరం గురించి పలుసందర్భాలలో పార్టీ కమిటీలలో కామ్రేడ్ జగదీశ్ వాదించాడు. విప్లవోద్యమం పెరిగిన దళిత చైతన్యానికి తగిన పోరాట నిర్మాణ రూపాలను అందించి ఆ ఉద్యమ అవకాశవాద నాయకత్వాలను ఎండగడుతూ వాటిని వ్యవసాయ విప్లవంలో భాగస్వామ్యం చేయాలని కామ్రేడ్ జగదీష్ భావించాడు. ఇందుకు పార్టీ సమాయత్తం కావాలని కోరాడు. భారతదేశంలో కులం సమస్యపైన పార్టీ రూపొందించిన డాక్యుమెంట్‌ను ఆమోదించి, సమకాలీన రాష్ట్ర, దేశ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని దళిత ఉద్యమంపై పార్టీ కేంద్రీకరించాలని భావించడమే కాదు తన అభిప్రాయాలను స్పష్టంగా పార్టీ ముందుంచడానికి ప్రతి సందర్భంలోనూ పాజిటివ్‌గా ప్రతిపాదించే వాడు కామ్రేడ్ జగదీష్.

ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమంపేర ముందుకు వచ్చిన దళిత చైతన్యం వ్యవసాయ విప్లవంలో భాగంగా కాకుండా పక్కదారి పడుతుందని గమనించిన వాడు కామ్రేడ్ జగదీష్. అలా జరగకుండా

చూడడానికై మన శక్తులను ఆయా ప్రాంతాలలో మోహరించి పార్టీ నాయకత్వం వహించితే ఆయా ప్రాంతాలన్నింటా అవకాశవాదులను ఒంటరిచేసి దళిత ఉద్యమం వ్యవసాయ విప్లవంలో భాగంగా ప్రజాయుద్ధంలో భాగంగా కొనసాగుతుందని ఆశించిన మంచి కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ రాంరెడ్డి.

## ప్రజాసైన్య నిర్మాణం దిశగా ముందడుగు వేయాలని, ప్రజలను ప్రజాయుద్ధానికి సిద్ధం చేయాలన్న ప్రజాసేనాని

21వ శతాబ్దిని ఆహ్వానిస్తూ ప్రపంచ నలుమూలలా రకరకాల వేడుకలయ్యాయి. ప్రపంచ శ్రామికవర్గం గడచిన 100 యేళ్లుగా సాధించిన విజయాల వెలుగులో సామ్రాజ్యవాదంపై దెబ్బపైన దెబ్బ వేసి మరింతగా ఓడించాలని ప్రపంచ శ్రామికవర్గం ప్రతినబూనింది. రెండున్నర దశాబ్దాల పోరాట అనుభవాన్ని, ఆటుపోట్లను మదించిన కామ్రేడ్ జగదీష్ పార్టీ ముందున్న కర్తవ్యాలలో జనసేన నిర్మాణంవైపు కదలిపోవడం అందుకు అవసరమైన నిర్మాణాలు చేపట్టడమేనని భావించాడు. తన కమిటీకీ, కేంద్రకమిటీకి ఈ విషయమై వివరమైన ప్రతిపాదనను పంపాడు.

1975-85 కాలం ఉత్తర తెలంగాణలోనూ 1985-95 కాలం దండకారణ్యంలోనూ నవ యవ్వనాన్ని ధారపోసి ఆ రెండు ఉద్యమాలను ఉన్నతస్థాయి గెరిల్లా జోన్స్‌గా పెంపొందించుటకు జరిగిన రెండు దశాబ్దాల కృషిలో భాగమ్యయారు. ఎప్పుడైనా, ఎక్కడైనా పునాది వర్గాల ప్రజలతో మమేకమయి ప్రత్యక్షంగా వారికి నాయకత్వం వహించి నడిపి విశేష వర్గపోరాటాను భవం గడించారు. ఈ అనుభవం వెలుగులో పట్టణోద్యమం నుండి నేర్చుకోవడం పట్టణం - గ్రామం - మైదానాలు - అడవులు అనుభవం మధ్య వారధి నిర్మించడానికి 1995-98, 1999 - 2000 కాలంలో బొంబే మహానగరంలోనూ, తిరిగి ఉత్తర తెలంగాణాలోనూ కామ్రేడ్ జగదీష్ విశేషమైన కృషి చేశాడు.

1999లో ఉత్తర తెలంగాణాలో పనిచేయుటకు మహారాష్ట్ర నుండి వెళ్లిన కామ్రేడ్ జగదీష్‌ను, ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడుగా కోఆప్ట్ చేసుకొన్నారు. నిజామాబాద్ జిల్లా ఉద్యమానికి నాయకత్వం అందించే బాధ్యత అప్పగించబడింది. సుమారు 15 యేళ్లు ప్రత్యక్షంగా పాల్గొనని ఉద్యమాన్ని దగ్గరగా అర్థం చేసుకోవడానికి విశేషమైన కృషి చేశాడు కామ్రేడ్ జగదీష్. ఈసారి ఉత్తర తెలంగాణాలో కామ్రేడ్ వినోద్‌గా జనం మధ్యకు వెళ్లాడు. తెలంగాణాలో వర్గపోరాటంలోనూ పార్టీ గెరిల్లా సైన్య నిర్మాణంలోనూ, సామాజిక జీవనంపైన ఉద్యమప్రభావంవల్లా వచ్చిన మార్పులను దగ్గరగా గమనించాడు, విశ్లేషించాడు. ఆ విశ్లేషణ ఫలితంగా ఇక ముందు ప్రజాసైన్య నిర్మాణ అవసరం పార్టీ ముందుకు వచ్చిందని భావించి పాలసీరూప కల్పనకు తన ప్రతిస్పందనను పార్టీ ముందు వుంచాడు. కామ్రేడ్ వినోద్ తను కలలు గన్న ప్రజాసైన్య నిర్మాణం జరుగుతున్న క్రమంలోనే సెప్టెంబర్ 23న శత్రువుతో జరిగిన పోరాటంలో నేలకొరిగాడు నేల తల్లి పుత్రుడు. వర్గ పోరాటంలో పార్టీ గడించిన అనుభవం, ప్రజాయుద్ధ నిర్మాణానికి చేపట్టిన కర్తవ్యాలను గురించి చర్చిస్తున్న మహాసభ ప్రాంగణంలోనే కామ్రేడ్ వినోద్ మరో నలుగురు కామ్రేడ్స్ (వివరాలు అందాల్సి వుంది) అమరులైనారు. ఆ అమరులకు వినమ్రంగా మరోసారి విప్లవాంజలి ఘటిద్దాం.

నేడు చంద్రబాబు నాయుడు ఫాసిస్టు పాలనలో ఉత్తర తెలంగాణా పల్లెలు పోలీసుల ఉక్కు పాదాల క్రింద అల్లాడి పోతున్నాయి. దండకారణ్యా ఉద్యమాన్ని సర్వనాశనం చేస్తామని పాలకవర్గాలు కంకణం కట్టుకున్నాయి. కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్‌లో భాగంగా అనుసరించే లో ఇంటెన్సిటీ కాన్ఫ్లిక్ట్ పథకాల్లో భాగంగా పాలకవర్గాలు అనుసరించే కౌన్సిలింగ్, సరెండర్లు, గ్రేహౌండ్స్, హాక్స్ కమెండో, హంతక దళాల వేట, పోలీసులమైత్రీ మరియు తదితర సంఘాల నడుమ శత్రువు కోవర్ట్ వలల నడుమ నేడు ఉత్తర తెలంగాణా, దండకారణ్యం ఉద్యమాలను నడపడం విప్లవకారులకు ఒక సవాలే అని చెప్పవచ్చు. ఈ ఉద్యమాలను మొక్కవోని దీక్షతో ప్రజల, క్యాడర్ల మనోబలాన్ని నిలబెడుతూ, గత అనుభవాల నుండి పాఠాలు తీసి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే క్రమంలో జరుగుతుండిన పశ్చిమ కరీంనగర్ మొదటి మహాసభలపై శత్రువు జరిపిన దాడుల్లో అమరుడైన కామ్రేడ్ వినోద్ మన ఎర్రజండాను మరింత ఎరుపెక్కించాడు.

* *కామ్రేడ్ రాంరెడ్డి కలలుగన్న ప్రజాసైన్యాన్ని బలంగా నిర్మిద్దాం!*

* *అంతిమ విజయ సాధనకు అవిరళంగా కృషి చేద్దాం!*

* *శత్రు కలలను ధ్వంసం చేద్దాం!*

## అనారోగ్యంతో కన్నుమూసిన కెఎంఎస్ రేంజి కమిటీ సభ్యురాలు కామ్రేడ్ దుర్గి

భోపాలపట్నం బ్లాక్ కెర్పె రేంజ్‌లో కుంగిలేరు గ్రామానికి చెందిన కామ్రేడ్ దుర్గి, తన చిన్ననాటి నుండి దళంతో పరిచయాలతో వుండి సంఘకార్యకలాపాలను దగ్గరుండి చూసేది. సంగం ఎవరికి న్యాయం చేస్తుందో కూడా అర్థం చేసుకుంది. తనకు యుక్తవయస్సు వచ్చిన తర్వాత తన తల్లిదండ్రులు తనకు ఇష్టంలేని పెళ్లి చేయడానికి నిశ్చయించడంతో వారిని ఎదిరించే ధైర్యంలేక తన సమస్య పరిష్కారానికి ఒంటరిగా చిన్న గొడ్డలి భుజాన వేసుకొని వేరే గ్రామంలోని సంఘసభ్యుడికి పిర్యాదు చేసి, ఇష్టంలేని పెళ్లినుండి బయటపడింది. అలా క్రమంగా కెఎంఎస్ రేంజ్ కమిటీ సభ్యురాలైంది. సంఘ కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొనేది. దళం గ్రామానికిపోతే ఎన్ని పనులున్నా పక్కనపెట్టి వచ్చేది. గ్రామంలోని పెద్దలు సంఘంపై ఆజమాయిషీ చేసే విషయాన్ని సహించేదికాదు, మహిళలను దళం వద్దకు రాకుండా చేసేవారిని వ్యతిరేకించేది. ఎక్కడ మీటింగ్‌లకు పిలిచినా ధైర్యంగా వచ్చేది. గ్రామంలోని డిఎకెఎంఎస్ సభ్యులు ఊగిసలాటకు గురైనా తను మాత్రం గట్టిగా నిలిచింది. క్యాండిడేట్ సభ్యురాలైంది. తనకు పిల్లలు పుట్టలేదనే నెపంతో భర్త రెండవ పెళ్లి చేసుకుంటాననగా గట్టిగా వ్యతిరేకించింది. ఆగస్టులో ఒక బాబుకు జన్మనిచ్చి అక్టోబర్‌లో అనారోగ్యం కారణంగా కన్నుమూసింది.

కామ్రేడ్ దుర్గిలాంటి కార్యకర్తను కోల్పోవడం ఆ రేంజ్

కెఎఎంఎస్‌కు చాలా లోటు. కామ్రేడ్ దుర్గి సంఘసభ్యులకు ఏరియాలోని మహిళలందరికీ ఆదర్శం. ఏరియాలోని గ్రామ గ్రామ కెఎఎంఎస్, డివికెఎంఎస్ సభ్యులు, దళం కామ్రేడ్స్, కామ్రేడ్ దుర్గికి నివాళులర్పించారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకుపోతామని శపథం చేశారు.

## కామ్రేడ్ కలం ఉయికే అమర్ రహే!

రాజ్‌నంద్‌గాంవ్ జిల్లాలో పార్టీ అడుగిడినప్పటి నుండి పార్టీ అంటే పేదప్రజల కోసం పాటుపడుతుంది అని తెలిసిన నాటి నుండి తాను అమరుడైన నాటిదాకా కూడా పార్టీపై మొక్కవోని విశ్వాసంతో ఎప్పుడూ పార్టీని అంటిపెట్టుకొని వుండి కష్టకాలంలో కూడా పార్టీని ఆదుకున్నవారిలో కామ్రేడ్ కలందాదా ఒకడు. పార్టీ ఇక్కడికి వచ్చిన మొదట్లో "అటవీశాఖవారి దోపిడీ, దౌర్జన్యం అధికం" కావున దీనిని అరికట్టి తమ శ్రమకు తగిన కూలీ కావాలని డిమాండ్ చేసేవాళ్లలో ముందుండేవాడు. స్త్రీలపై ఫారెస్టు అధికారుల లైంగిక అత్యాచారాలను సహించకపోయేవాడు. పార్టీయే, తమ బ్రతుకులు మార్చగలదని భావించి, గ్రామంలో సంగం యొక్క ఆవశ్యకతను గ్రామస్థులకు వివరించి సంగం పెట్టుకొనుటకు ప్రోత్సహించేవాడు. అలా తాను సంగంలో ముందు పీఠిన నిలిచి పార్టీ ఇచ్చే ప్రతి పోరాట పిలుపుకు స్పందించి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించేవాడు.

అలాగే పార్టీ ఏ పని అప్పగించినా కాదు అని ఏనాడు తిరస్కరించలేదు. తనతో కాని పని వుంటే మొహమాటం లేకుండా నాతో అయ్యేపనికాదు అని చెప్పేవాడు. అలా ఇతరులను కూడా పార్టీకి పరిచయం చేసేవాడు.

తాను వెదురు కూపుల్లో (మున్షి-చౌకీదార్) పనిచేసిన రోజుల్లో కూడా అధికారులకు మడుగులొత్తుడు కాకుండా, పార్టీ సంఘం నిర్ణయాలకు కట్టుబడి పనిచేసేవాడు. ఎవరైనా మున్షీలు, ఈ నిర్ణయాన్ని ఉల్లంఘిస్తే మందలించి మరి బుద్ధి చెప్పేవాడు. ఇలా తనకు తెలిసిన మేరకు ప్రజల కోసం ఆలోచించే కలం దాదా నిర్బంధంలో కూడా పోలీసుల బారీనుండి పార్టీ, దళం సామాన్లను దాచి సురక్షితంగా పార్టీకి అప్పగించాడు.

అడవిపై ఆదివాసులకు అధికారం కావాలని, దున్నేవారికి భూమి కావాలని పోరాటంలో బంద్‌ల సందర్భంగా, ర్యాలీల సందర్భంగా కూడా తాను ఇతరులను కూడగట్టినాడు.

కామ్రేడ్ కలం ఉయికే రాజ్‌నంద్‌గాంవ్ జిల్లా ఛుయిఖదాన్ తహసీల్ టాండా దళం ఏరియాలోని లామ్రా గ్రామంలో తన ఇంట్లోనే పడుకొని వున్నప్పుడు 23-8-2000నాటి రాత్రి "కాలనాగు కాటుకు గురై మరణించాడు" ఈ మారుమూల ప్రాంతంలో ఎలాంటి వైద్య సదుపాయాలు లేక ఎంతోమంది అకాలమరణాలు పొందుతున్నారు. కామ్రేడ్ కలం ఏ మందులు అందుబాటులోలేక మరణించాడు. ఆ లోటును తీర్చాలంటే కామ్రేడ్ కలం నడిచిన బాటలో గ్రామస్థులు ప్రతి ఒక్కరూ నడవాలి. అప్పుడే కామ్రేడ్ కలంకు సరైన నివాళి అర్పించిన వారమవుతాం.

* *కామ్రేడ్ కలం అమర్ హై !*
* *దండకారణ్యా ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంగటన్ జిందాబాద్!*
* *నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి !*

## నిత్య నిర్బంధంలో సైతం ఉద్యమాన్ని అంటిపెట్టుకున్న కామ్రేడ్ గిలా మడావి

దండకారణ్య విప్లవోద్యమం నిర్బంధాన్ని వమ్ము చేస్తూ నిలదొక్కుకునే క్రమంలో ముఖ్యంగా గడ్‌చిరోలి డివిజన్‌లో, ప్రజారాశులపాత్ర అందునా కామ్రేడ్ గిలా మడావివంటి కామ్రేడ్స్ పాత్ర ఎంతో వుంది.

కామ్రేడ్ మడావి బాండే రేంజి నయనార్ గ్రామస్థుడు. 1991లోనే సంగంలో పనిచేస్తూండేవాడు. మహారాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చు చేస్తూ 1993 నాటికే గడ్‌చిరోలి డివిజన్‌లో నిర్బంధాన్ని తీవ్రంగావించింది. పోలీసులు గాలింపులు, ఇన్‌ఫార్మర్ల బెడద, కమాండోల దాడులతో ప్రజలు దళం వద్దకు రావాలంటే వెనకాముందు అయ్యేవారు. అలాంటి సమయాల్లో కూడా ప్రజలకు ధైర్యాన్ని నూరిపోస్తూ దళం వద్దకు తీసుకువచ్చేవాడు. దళంకు తిండి, నీళ్లు అందివ్వడంలో ముందుండేవాడు. అవసరమైతే 1,2 రోజులు దళంతో సహజీవనం సాగించేవాడు. కరపత్రాల, పోస్టర్లు ప్రజల్లోకి వెళ్లడంలో ప్రముఖ పాత్ర వహించేవాడు. అలా క్రియాశీల పాత్ర పోషించాడు. ఆ కామ్రేడ్ అనారోగ్యంతో జనవరి 1వ తేదీన అమరుడయ్యాడు. కామ్రేడ్ గిలా మడావికి విప్లవజోహార్లర్పిద్దాం!

## పాముకాటుతో అకాలమరణం పొందిన నైతాం మైనా

కామ్రేడ్ నైతాం మైనా అహిరి దళ ఏరియా జిమ్మలగట్ట రేంజి రేగులవాయి గ్రామస్థురాలు. సంగంలో చేరి పనిచేస్తూ గ్రామ కెఎఎంఎస్ అధ్యక్షురాలిగా ఎదిగింది. పాముకాటుకు గురై అమరురాలైంది.

కామ్రేడ్ మైనా ఆ డివిజన్‌లో చురుగ్గా సాగుతున్న సంఘకార్యకలాపాలకు స్పందించి 1990లో విప్లవోద్యమం యెడల ఆకర్షితురాలైంది. నిర్బంధం తీవ్రమై 1993లో సంఘ కార్యకలాపాలు తగ్గు ముఖం పట్టగా 1997-98 కాలంలో తిరిగి వాటి కార్యకలాపాలు పెరిగాయి. ఆ కాలంలో కామ్రేడ్ మైనా గ్రామంలోని యువతులందర్నీ ఐక్యం చేసి వారందరినీ దళం వద్దకు తీసుకువస్తుండేది. ఆ క్రమంలోనే సంఘనాయకురాలిగా ఎదిగింది. మహిళలపై సాగే జులుం, అత్యాచారాల నెదిరిస్తూ వారిని సంఘటితపరచేది, పోరాటంలో ముందుపీఠిన నిలిచేది.

ఆ రోజు సంఘసమావేశం ముగిసి ఇంటికిపోయి నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రివేళ పాముకరిచి, మందు లభించకపోవడంతో మృత్యువాత పడింది. గ్రామ సంగం వారంతా అమరురాలయిన కామ్రేడ్ నైతాం మైనా శవంపై ఎర్రజండా కూడా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. p

# యుద్ధరంగంలో శ్రద్ధాంజలి!

*[విప్లవోద్యమం అంటేనే యుద్ధంతో కూడుకున్నది. వర్గపోరాటాన్ని తీవ్రపరచి దోపిడీ వర్గాలను మట్టిగరిపించి అధికారాన్ని చేజిక్కించుకోవడమంటే త్యాగాలతో కూడిన బాటను నడవాల్సి వుంటుంది. అలాంటి బాటలో నడుస్తూ పార్టీ అత్యున్నత కమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలు చిందించిన రక్తం, త్యాగం దేశవ్యాపితంగా విప్లవకారుల ఉడుకు రక్తాన్ని మరింతగా రగిలించి వారి పోరుదీక్షను మరింత ఉధృతం చేసింది. డికె వివిధ డివిజన్‌లలో జరిగిన జులై 28 అమరుల సంస్మరణ వారం రిపోర్టులు కొన్నిటిని ప్రభాత్ గత సంచికలో ఇచ్చాం, మిగిలినవి ఇప్పుడు ఇస్తున్నాం - సం||లు]*

## దక్షిణ బస్తర్ డివిజన్

భూపాలపట్నం ఎల్‌జిఎస్ ఏరియా మిలిటెంట్లు, ముగ్గురు ముగ్గురితో కూడిన రెండు క్యాంపెయిన్ దళాలుగా ఏర్పడి అమరుల సప్తాహం ప్రచారాన్ని కొనసాగించారు. భూపాలపట్నంలో రెడీమేడ్ స్థూపం, బ్యానర్లు, పోస్టర్ల ద్వారా అమరుల ఆశయాలను, త్యాగాలను ప్రజల్లోకి తీసుకువెళ్లారు. 9, 10 గ్రామాల ప్రజలతో పెద్ద సభను నిర్వహించారు. దానిలో 300 మంది పాల్గొని అమరులైన వారందరికీ శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్‌సి సభ్యుడు కామ్రేడ్ గోపాల్ జండా ఆవిష్కరించాడు. కామ్రేడ్ మోహన్ ప్రసంగించాడు.

శబరి ఏరియా, కుంట ఎల్‌జిఎస్ పరిధిలోని రెండు సెంటర్లలో పెద్ద పెద్ద సభలు జరిగి అమరవీరులకు అరుణాంజలి సమర్పించారు. రెండుచోట్ల ఆర్‌సిల వారు నిర్వహణా కమిటీలు ఏర్పర్చి సభలను జయప్రదం గావించారు. స్త్రీలు, పిల్లలతో మొత్తంగా కుంట రేంజిలో జరిగిన సభలో 350 మంది, బెజ్జి రేంజిలో జరిగిన సభలో 1,725 మంది పాల్గొని అమరులకు విప్లవజోహార్లర్పించి వారి ఆశయాన్ని కొనసాగిస్తామని శపథంబూనారు.

బైరంగఢ్ దళం ఏరియా డివికెఎంఎస్, కెఎఎంఎస్ ప్రజా సంఘాలవారు క్యాంపెయిన్ దళాలుగా ఏర్పడి పోస్టర్లు, బ్యానర్లు పంచడంతోపాటు 'జులై28' ప్రాముఖ్యతను వివరిస్తూ 'అమరవీరుల వారం' గురించి ప్రచారం చేశారు.

గంగలూరు రేంజిలో 10 క్యాంపెయిన్ దళాలు, బీజాపూర్ రేంజిలో 8 క్యాంపెయిన్ దళాలు, బైరంగఢ్ రేంజిలో 9 క్యాంపెయిన్ దళాలు ఏరియా అంతటా ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించాయి. సిఎన్ఎమ్ టీములు, తమ ఆటలు, పాటల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాయి. బైరంగఢ్ దళం రేంజిలో ఏరియా కేంద్రాలు 5 చోట్ల బహిరంగ సభలు జరిగాయి. ఈసుల్‌నార్ గ్రామం (బీజాపూర్ రేంజి)లో సభలో 25 గ్రామాల నుండి 1,623 మంది పాల్గొనగా, కంక గ్రామంలో జరిగిన సభకు 13 గ్రామాలవారు 1,000 మంది హాజరైనారు. బైరంగఢ్ రేంజిలో 12 గ్రామాలకు చెందిన వెయ్యి మందితో పుల్‌గట్ట వద్ద సభ జరగ్గా, 16 గ్రామాల నుండి 2000 మందితో పుల్లుం వద్ద అమరుల సంస్మరణ సభలు జరిగాయి. గంగలూరు రేంజి ఆవునార్‌లో 4 గ్రామాలకు చెందిన 500 మంది పాల్గొనగా విప్లవ శ్రద్ధాంజలి ఘటించారు. ఇలా దళ ఏరియా 90 గ్రామాల్లోనూ అమరులు స్మరించుకుంటూ వారి ఆశయసాధనకై పోరాట శపథం చేబూనారు. ఆయా గ్రామాల్లో జరిగిన వాటిలో ఆర్‌సి నాయకులు, స్థానిక సంఘనాయకులు ప్రసంగించగా ప్రతిచోట 50 నుండి 500 మంది ప్రజలు పాల్గొన్నారు.

నేషనల్ పార్క్ దళం ఏరియాలోని ప్రజలు రేంజి కమిటీలు నాయకత్వంలో పెద్ద ఎత్తున కదిలి అమరుల సప్తాహ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకున్నారు. ఈ సప్తాహంలో, మొత్తం 68 గ్రామాలలో స్థూపాలను నిర్మించుకొని శ్రద్ధాంజలి ఘటించారు.

సెంద్ర రేంజిలో మార్పడ వద్ద ఒకటి, ఎడపల్లి వద్ద మరొకటి, రెండు పెద్ద బహిరంగ సభలు జరిగాయి,

కుట్రు రేంజిలో కూడా గుమ్మనేరులోనూ, అబలలోనూ పెద్ద సభలు జరిగాయి.

ఈ సప్తాహ కార్యక్రమం కోసం ఏరియా మొత్తంలో రెండు మహిళా బృందాలు, 7 పురుషుల బృందాలు విస్తృత ప్రచారాన్ని నిర్వహించాయి. పర్సగడ, కుట్రు, కర్కిల్, వెదిరె, తోయనార్, బీజాపూర్‌లలో 200 పోస్టర్లు వేశారు. 15 బ్యానర్లు కట్టారు.

10 మంది మిలీషియా సభ్యులు రెండు బర్మార్లతో వెళ్లి, వెదిరె పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో ఒక రెడీమేడ్ స్థూపాన్ని నెలకొల్పి వచ్చారు. ఉదయం కాలకృత్యాలకోసం వచ్చిన పోలీసులు హఠాత్తుగా కళ్ల ముందర కనబడుతోన్న స్థూపాన్ని చూసి భయపడి స్టేషన్‌లోకి పరిగెత్తారు. తరువాత ఉదయం 7 గంటలకు, కొంత ధైర్యాన్ని పుంజుకొని మొత్తం గుంపుగా బయటకు వచ్చి, భయం భయంగా దాన్ని చెక్ చేసి తొలగించారు.

## గడ్‌చిరోలి డివిజన్

గడ్‌చిరోలి డివిజన్ ప్రజానీకం కమాండో బలగాల దాడులు, గాలింపుల మధ్యనే ప్రజాగెరిల్లాలతో కలిసి లేదా తమకు తాముగానే అమరులను స్మరించుకోవడం, వారి ఆశయ సాధనకై శపథం బూనడంలో చైతన్యవంతంగా కదులుతున్నారు. జిమ్మలగట్టరేంజిలో 5చోట్ల జరిగిన సంస్మరణ సభల్లో, బాస్పాపూర్‌లో 120 మంది, తిమరయ్‌లో 90 మంది, మొత్కపల్లిలో 85 మంది, రేగల్‌వాయిలో 168 మంది పాల్గొని అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఏరియా అంతటా గ్రామ గ్రామాన రాళ్లను నిలబెట్టి, జండాలనెగురవేసి అమరవీరుల ఆశయాలను ప్రచారం చేశారు. ఉమానూర్, ఆకపిలి, గుండేరోడ్‌ల వద్ద స్మారక స్థూపాలు నిలబెట్టి, బ్యానర్‌లు కట్టి పోస్టర్-కరపత్రాలు అంటించడం ద్వారా విస్తృత ప్రచారం గావించారు.

రేంగల్ వాయి సభలో 168 మంది పాల్గొనగా అందులో 70 మంది మహిళలు పిల్లలే. లక్ష్మణ్ నైతాం, లింగన్ పొర్తేటి

స్మృతిలో సభ జరిగింది. కొయ్య స్థూపం నెలకొల్పి కామ్రేడ్ ఎర్రన్న ఆవిష్కరించగా, కామ్రేడ్ బిచ్చు జండాపాట పాడి మాట్లాడాడు. కేంద్ర కమిటీ సభ్యులు అమరులు కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళిలతోపాటు కామ్రేడ్స్ అఖిల నైతాం, కామ్రేడ్ సుజాత ఇలా పేరు పేరున అమరులందరికీ విప్లవ జోహార్లు అర్పించారు.

టిప్రాగడ్ కమలాపూర్ రేంజి 3 గ్రామాల ప్రజలు కలిసి అమరవీరుల సంస్మరణ సభ జరుపుకున్నారు. ఆర్‌సి సభ్యుడు కామ్రేడ్ భగవత్ నేతృత్వంలో సభ జరిగింది. కుర్‌బేడ్ రేంజిలో ఒక చోట సంస్మరణ సభ జరిగింది. కోర్చి తాలూకా బెడ్‌గాల్ రేంజి 4 గ్రామాల వారు 100 మంది, టిప్రాగడ్‌లో 4 గ్రామాల నుండి 150 మంది పాల్గొన్నారు. ఇక్కడే 3 అడుగుల సిమెంట్ స్థూపాన్ని నిర్మించారు కూడా.

### బాలాఘాట్ - గోండియా డివిజన్

మన ప్రియతమ కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల అమరత్వాన్ని కీర్తిస్తూ, పాలకుల క్రూర హత్యా రాజకీయాలను నిరసిస్తూ ఆ అమరుల త్యాగపూరిత విప్లవ సాంప్రదాయాలను కొనసాగిస్తామని శపథంచేస్తూ బాలాఘాట్-గోండియా డివిజన్ వ్యాప్తంగా విప్లవ ప్రజానీకం 2000 ఫిబ్రవరి నుండి ఆగస్టు 3 దాకా సంస్మరణ సభలు జరుపుకున్నారు.

టాండా దళం ఏరియాలో మే 3నాడు సాహెర్‌లోను 4 నాడు సముంద్ పానిలోనూ ప్రారంభమైన అమరవీరుల సంస్మరణ సభలు ఆగస్టు 3దాకా కొనసాగుతూ వచ్చాయి.

మే13నాడు మర్కటోలా, బలరాంపూర్ గ్రామ ప్రజలు తునికాకు కూలీలు, మొత్తం 150 మంది అమరవీరుల సంస్మరణ సభ జరుపుకున్నారు.

జులై 24 నాడు, గేరుఖదాన్ గ్రామ పంచాయితీలోని గేరు ఖదాన్, గోద, మరుం, పాండ్రిపాణి గ్రామాలకు చెందిన దాదాపు 225 మంది స్త్రీ పురుషులు (స్త్రీలు 75) ఆ గ్రామంలో ఒక స్థూపాన్ని నిర్మించుకొన్నారు. ఊరేగింపుగా వెళ్లి స్థూపావిష్కరణ చేసి, కొయ్యూరు అమరులకు నివాళిలర్పించారు.

జులై 28న, బోధ్‌లి పంచాయితీలోని, బోధ్‌లి, భంజాలి, డూటఘుడ్, కొరువ గ్రామాలకు చెందిన గ్రామ ప్రజలు, ఒక తాత్కాలిక స్థూపాన్ని నిర్మించుకొని, ఊరేగింపుగా దాని వద్దకు వెళ్లి, ఆవిష్కరించి, అమరులకు అరుణారుణ నివాళులర్పించారు. ఈ సభలో మొత్తం 150 మంది పాల్గొన్నారు.

జులై 28 నుండి ఆగస్టు 3 దాకా పలు గ్రామాలలోని ప్రజలు, పనులు బంద్ పెట్టి, స్వయంగా కదిలి, సంగనాయకత్వం ఆధ్వర్యంలోన అమరుల స్మారక సప్తాహాన్ని జరుపుకొన్నారు. కొన్నిచోట్ల కొత్తగా స్థూపాలను నిర్మించుకొని శ్రద్ధాంజలి ఘటించారు.

# ప్రజా సంఘాలను నిషేధించే కొత్త నల్ల చట్టాన్ని తుంగలో తొక్కండి!

## మధ్యప్రదేశ్ ప్రత్యేక ప్రాంత రక్షణ బిల్లు, పోరాడే ప్రజలకు వ్యతిరేకంగా దోపిడీ పాలకుల కుట్ర!

నవంబర్ 27, 2000న మధ్యప్రదేశ్ విధానసభ ఎలాంటి చర్చా లేకుండానే మధ్యప్రదేశ్ ప్రత్యేక ప్రాంత బిల్లును ఆమోదించింది. ఇది మధ్యప్రదేశ్‌లోని సామాన్య ప్రజానీకపు మౌలిక హక్కులపై జరిగిన పెద్ద దాడి. ఇది ప్రజా ఉద్యమాలను నడిపే గ్రూపులపైనా లేదా వాటిని సమర్థించే వ్యక్తులపైనా కఠినచర్యలు తీసుకోవడానికి వీలు కల్పించే చట్టం. దిగ్విజయ్ సింగ్ బయటకు ఎలా కన్పించినా, ఇది మాత్రం అతడు పీడిత ప్రజలపై రాక్షస కోరలు చాపడమే తప్ప మరేమీ కాదు.

### నక్సలైటు ఉద్యమాన్ని అణచడం కోసం

మా పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) (పీపుల్స్‌వార్) నాయకత్వంలో సాగుతోన్న ప్రజాఉద్యమాన్ని అణచడం కోసమే ఈ చట్టం తయారయింది. గడిచిన కొద్ది సంవత్సరాలుగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం మా పార్టీని నిషేధించే యోచనలో ఉన్నట్టు పలుమార్లు ప్రకటిస్తూ వస్తోంది. విధానసభలోనూ, ఈ బిల్లుకు కారణాలుగా చెప్పిన విషయాల్లో ఈ విషయం కూడా చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మా పార్టీని, పార్టీకి చెందిన పలు ప్రజాసంఘాలను నిషేధించినట్టుగానే మధ్యప్రదేశ్‌లో కూడా ఈ చట్టం ద్వారా నిషేధించ బూనుకుంటున్నారు. మా ఉద్యమ ప్రాంతంలోని చాలా భాగం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కిందకు వచ్చినందున, ఛత్తీస్‌గఢ్‌లో కూడా ఇలాంటి చట్టం చేసే సూచనలున్నాయి. తమ జీవితాల్లో మౌలిక మార్పు కోసమై పోరాడుతోన్న పీడిత ప్రజానీకంపై ఇది మరో పెద్ద దాడి. నిజానికి ఈ చట్టం లేకుండానే మా పార్టీపైన అప్రకటిత నిషేధం అమలవుతూనే వుంది. డికెఎంఎస్, కెఎఎంఎస్ లాంటి ప్రజాసంఘాలపైన అప్రకటిత నిషేధం అమలవుతోంది. ఆదివాసులను దంతెవాడ, కాంకేర్, నారాయణ్‌పూర్ వంటి పట్టణాల్లో బలవంతంగా జమచేసి సంగం నుండి నాటకీయంగా రాజీనామా యిప్పించడం దేన్ని సూచిస్తోంది? పోలీసులు, ఇన్‌ఫార్మర్లు సంగ నాయకులను హత్య చేయడం దేన్ని సూచిస్తోంది? నక్సలైట్లను ఉగ్రవాదులుగా పేర్కొంటూ బదనాం చేయడానికి ప్రభుత్వం విఫల ప్రయత్నం చేస్తోంది. మా పార్టీ కుట్రలకూ, కుహకాలకూ పాల్పడే లేదా దౌర్జన్యపూరితంగా డిమాండ్లను నెరవేర్చుకోజూసే ముఠా కాదన్న విషయం మా ప్రజానీకానికి స్పష్టంగానే తెలుసు. అవినీతిపరులూ, దోపిడీదొంగలైన బడా పెట్టుబడిదార్లు, బడా భూస్వాములు,

సామ్రాజ్యవాద సేవకుల అధికారాన్ని కూలదోసి నిజమైన ప్రజాస్వామిక రాజ్యాన్ని నెలకొల్పడానికై గడచిన రెండు దశాబ్దాలుగా మా పార్టీ ప్రజల్లో పనిచేస్తూ వారిని సంఘటితం చేస్తోంది. కోటానుకోట్ల పీడితుల, అభాగ్యుల ఆకాంక్షలకు పీపుల్స్‌వార్ ఒక చిహ్నంగా నిలిచింది. లక్షలాది ప్రజల పోరాటానికి అది ఒక సంఘటితమైన ప్రతిరూపంగా ఎదిగింది. ఈ చట్టం విప్లవాన్ని కోరుకోవడాన్ని నేరంగా పరిగణిస్తుంది. కాని ప్రభుత్వం అమలుచేస్తున్న తీవ్రమైన నిర్బంధంలో రాటుదేలిన పీడిత ప్రజలు ఈ ఎత్తుగడను తప్పక విఫలం చేస్తారు.

## ఒక్క దెబ్బతో రెండు పిట్టలను చంపే పథకం

నిజానికి, ఈ చట్టం ప్రకారం, సంఘం అంటే "శాంతిభద్రతలకు ప్రమాదకరంగా, విఘాతంగా వుండే వ్యక్తుల సమూహం లేదా గ్రూపు - అది ఏ పేరుతోనైనా అందరికి తెలిసే విధంగా ఉండొచ్చు లేదా ఎవరికీ తెలియని విధంగా కూడా ఉండొచ్చు, రిజిస్టర్ అయి వుండొచ్చు లేదా కాకపోయి ఉండొచ్చు - శిక్షార్హమైనదిగా పరిగణించబడుతుంది. అంటే రాస్తారోకో వంటి పోరాటాలు చేపట్టే కరువు పీడితులైన రైతులు, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా జరిపే గ్రామీణులు శిక్షార్హులవుతారన్నమాట! పై "చట్టవ్యతిరేక కార్యకలాపాల"కు మద్దతునివ్వడం లేదా సహాయాన్నందించడం నేరమవుతుంది. ఈ చట్టం పరిధిని ఎంతగా విస్తరించారంటే, ప్రభుత్వం రాజకీయంగా తనకు విరోధులైన లేదా ప్రజావుద్యమాలను నడిపే ఏ గ్రూపునైనా, సంఘాన్నైనా, చివరకు సాంస్కృతిక సంఘాన్నయినా నిషేధించగలుగుతుంది. నిషేధించబడిన సంఘం సభ్యులకు లేదా దాని మద్దతుదారులకు మూడు సంవత్సరాల జైలుశిక్ష విధించగలుగుతుంది. ఆ సంఘం లేదా వ్యక్తికి చెందిన కార్యాలయాన్ని, ఆస్తులను జప్తు చేసే అధికారం జిల్లా మెజిస్ట్రేట్‌కు ఇవ్వబడుతుంది. ఇది పోలీసు యంత్రాంగానికి విచ్చలవిడి అధికారాలను దఖలు పరుస్తుంది. ఆస్తులను జప్తుచేయడం ఎంతటి తీవ్రమైన యిబ్బందులు కలుగజేస్తుందో 'కుర్కీ జప్తీ'ని ఎరిగిన రైతులకు బాగా తెలుసు. "ఉగ్రవాదాని"కి వ్యతిరేకంగా గతంలో టాడా చట్టాన్ని రూపొందించిన సంగతీ, అది అమలయిన తీరూ అందరికీ తెలిసిందే. అప్పటి ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రత్యర్థులకు, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు, రైతాంగ నాయకులకు వ్యతిరేకంగా ఈ చట్టాన్ని విచ్చలవిడిగా ప్రయోగించాయి. కల్లోలిత ప్రాంత చట్టం ద్వారా ఈశాన్య భారతంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక పోలీసులు, సైన్యం ఎంతటి భీభత్సాన్ని సృష్టించాయో పలు పౌరహక్కుల సంఘాలు చాలా వివరంగా ప్రకటించాయి. గమనించాల్సిన విషయమేమిటంటే టాడా వంటి నిరంకుశ చట్టం కింద అరెస్టయిన వేలాది మందిలో కేవలం 1 శాతం మందినే కోర్టులు నేరస్థులని పేర్కొన్నాయి. తక్కిన 99 శాతం నిరపరాధులు ఎలాంటి జమానతు లేకుండా జైలులోని చీకటిగదుల్లో ఏళ్ల తరబడి అక్రమ నిర్బంధానికి గురయ్యారు. ఇలాంటి నల్లచట్టాల ద్వారా నియంతృత్వం మరింతగా పెరుగుతుందని చరిత్ర తెలియజేస్తోంది.

## ప్రభుత్వానికి ఈ చట్టం తేవాల్సిన అవసరమేమిటి?

గడచిన దశాబ్ద కాలంగా ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఆర్థిక విధానాల దుష్పరిణామాలను అనుభవిస్తున్న ప్రజలు పోరాటాల్లోకి ముందుకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాదుల బ్యాంకులకు, ఫైనాన్స్ సంస్థలకు, కంపనీలకు దేశాన్ని విచ్చలవిడిగా దోచుకునే అధికారాన్ని అప్పజెప్పింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇక్కడి విలువైన ప్రకృతి సంపదలను దోచుకునేందుకై బహిరంగంగా పై వాటికి స్వాగతం పలికింది. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వంటి సామ్రాజ్యవాద సంస్థల నుండి భారత ప్రభుత్వం ఎంతగా అప్పులు తెచ్చిందంటే వాటి ఆదేశాలను అది శిరసావహించక తప్పని పరిస్థితిలో వుంది. ప్రపంచీకరణ, ప్రైవేటైజేషన్ వంటి విధానాలు ఈ సామ్రాజ్యవాద సంస్థల ఆదేశాల ప్రకారమే అమలవుతున్నాయి. రుణభారంతో కుంగిపోతున్న ప్రభుత్వాలు ఖర్చులు తగ్గించే నెపంతో ప్రజలపైన ఖర్చుల్లో కోత విధిస్తున్నాయి. నిత్యావసర వస్తువుల, సేవల ధరల్లో పెంపుదల, ఉద్యోగాల నుండి ఉద్వాసన, రిట్రెంచ్‌మెంట్లు, కంపెనీల లాకౌట్లు, విదేశీ కంపెనీలు పర్యావరణానికి కలుగజేస్తున్న ముప్పు - వీటన్నింటి దుష్ఫలితాల్ని సామాన్య ప్రజలే భరించాల్సి వస్తోంది. పెరుగుతోన్న నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలతో ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. సామ్రాజ్యవాదుల, వారి భారతీయ బంట్ల అధికారాన్ని కూలదోయడానికై మా పార్టీ నేతృత్వంలో కొనసాగుతోన్న, విస్తరిస్తోన్న ఆదివాసీ ప్రజాపోరాటాలు నేడు ఈ అభివృద్ధినిరోధకులకు పెను సవాలుగా నిలిచాయి. ఈ సవాలును తొలగించుకోవడమే వాళ్ల ప్రయత్నం. అంతే కాకుండా, వీటన్నింటికి వ్యతిరేకంగా వివిధ జిల్లాల్లో పోరాటాలు బద్దలవుతున్నాయి - సోయాబీన్, పత్తి పంటలకు గిట్టుబాటు ధరల కోసం రైతులు, దినసరి వేతన ఉద్యోగులను పనిలోంచి తొలగించడానికి వ్యతిరేకంగా, నర్మదా నదిపై నిర్మించ తలపెట్టిన ఆనకట్టకు వ్యతిరేకంగా పోరాటాలు, పోస్టల్, బ్యాంకు, విద్యుత్ శాఖల ఉద్యోగుల పోరాటాలు, సమ్మెలు కొనసాగుతున్నాయి. ఈ పోరాటాలను, ఉద్యమాలను అణిచివేసి మధ్యప్రదేశ్‌ను సామ్రాజ్యవాదుల విచ్చలవిడి దోపిడీకి అనువుగా మల్చడం కోసమే ప్రభుత్వం ఈ చట్టాన్ని తెస్తోంది.

## అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతినాపలేరు!

కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో మధ్యప్రదేశ్ రూపొందించిన ఈ వ్యూహాన్ని ప్రజలు తప్పక తిప్పికొడతారు. దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, అల్పసంఖ్యాకులు ఏ విధంగానైతే `మీసా'ను తిప్పికొట్టారో, ఆ తర్వాత `టాడాను' తుంగలో తొక్కారో, అదే విధంగా ఈ నల్లచట్టాన్ని కూడా తప్పక బురదలో తొక్కివేస్తారు. ప్రజాస్వామ్య ప్రియులైన ప్రజలు, సంఘాలు ఈ చట్టానికి వ్యతిరేకంగా విశాల ఉద్యమాన్ని నడిపి, దృఢంగా ఎదిరించి నిలబడితే ఈ బిల్లు చట్టంగా మారక ముందే పెంటకుప్ప మీదకు విసిరివేయబడక తప్పదు. e

# పురోగమిస్తున్న విప్లవోద్యమంలో నిర్బంధ తీవ్రత - ధిక్కరిస్తున్న ప్రజాశక్తి

దండకారణ్యంలో విప్లవోద్యమపు ప్రజాపునాది శత్రువుకు తెలియనిది కాదు. అందుకే ఆ ప్రజాపునాదిని దెబ్బతీసి విప్లవోద్యమాన్ని తుడిచి పెట్టడానికి కేంద్రం వత్తాసుతో మహారాష్ట్ర-మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు చేయని ప్రయత్నం లేదు. సంస్కరణలు మొదలుకొని అభివృద్ధి కార్యక్రమాల వరకు అనేక రూపాలతో ఆయా ప్రభుత్వాలు నేరుగా ఉద్యమ ప్రాంతాల్లో తమ ఉనికిని చాటుకోవాలనే ప్రయత్నం ఒకపక్క సాగిస్తూ మరోపక్క తమ పాశవిక నిర్బంధకాండను నానాటికి ఉధృతం చేస్తున్నాయి. ఇన్ఫార్మర్లను తయారుచేసుకోవడం, సమాచారం అందగానే దళాలను-నాయకత్వాన్ని తుడిచిపెట్టే ప్రయత్నాలు చేయడం, పోలీసులే అంబుష్‌లకు కూర్చోవడం, కమాండోలు లేదా స్పెషల్ బలగాలతో గాలింపులు సాగించడం, అన్నింటికంటె ముఖ్యంగా అడవి బాటలు, నీటి తావులు, డంపులు, పాత డేరా స్థలాలను (దాడులు, గాలింపులకు వీలుగా) ఆరాలు తీయడం వంటివి చేస్తూ, ఈ మొత్తం ఆపరేషన్స్‌కు కీలకంగా వుండేట్లు ప్రత్యేక తర్ఫీదునిచ్చి సిఐడిలను (మహిళలను సైతం) పలువేషాలలో ఏరియాలకు పంపడం అన్నది పెద్ద ఎత్తున సాగిస్తున్నాయి.

పై దానిలో భాగంగా చేపలను పట్టడానికై నీటిని తోడి చేసేవిధంగా ఇన్ఫార్మర్లతో సంతలలో మాటుగాయించి సంగనాయకులను, సభ్యులను. సానుభూతిపరులను అరెస్టు చేయిస్తున్నారు. అనేక చిత్రహింసలు పెట్టి వారిని లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సమాచారం దొరకగానే దాడులు, అరెస్టులు సాగిస్తున్నారు.

బైరంఘుడ్ ఏరియా పరాల్‌నార్ నివాసి కోవసి భీమాల్, దుగ్గల్ గ్రామ రైతు వేలసి. ఈ ఇద్దరు కలిసి బైలడిల్లా సంతకు వెళ్లగా ఇన్‌ఫార్మర్ల సమాచారంతో పోలీసులు వారిని అరెస్టుచేశారు. వారిని చిత్రహింసలకు గురిచేసి రాబట్టిన సమాచారంతో దుగ్గల్ గ్రామంపై రాత్రిపూట దాడిచేసి నిద్రిస్తున్న నలుగురిని అరెస్టు చేసి దంతెవాడ తీసుకుపోయారు. అలాగే కరక, అఱ్ర, ముద్దుకాండి మొదలగు 5 ఆదివాసీ గ్రామాల ఆదివాసీ రైతాంగాన్ని సంతకు వెళ్తుండగా అరెస్టు చేసి వారిలో 14 మందిని నెలరోజులపాటు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి అనేక చిత్రహింసలకు గురిచేశారు. 30 మంది పోలీసులు గొంగ్లా గ్రామంలో అర్ధరాత్రివేళ నిద్రిస్తున్న మురయ్యా అనే రైతుని (అప్పటికే 4 గ్రామాలపై వారి దాడి విఫలం కావడంతో) అరెస్టుచేసి ఎలాంటి సమాచారం లేకుండా పట్టుకు పోయారు. ఇన్‌ఫార్మర్ల సమాచారంపై ఆధారపడి అక్టోబర్‌లో పల్లవాయ గ్రామంపై దాడిచేసి యువకుడు మడావి లక్ష్మణ్‌ను సంఘసభ్యుడనే నెపంతో పట్టుకుపోయారు. అదే పద్ధతిలో పొందుం గ్రామానికి చెందిన మాజీ రేంజి కమిటీ సభ్యుడు భద్రుని అరెస్టు చేశారు. దంతెవాడ, చాస్నా. కిరుందుల్, గీదుం, బైరంగడ్, గంగులూరు, బీజాపూర్, పోలీస్‌స్టేషన్‌లకు చెందిన 25 నుండి 70 మంది పోలీసులు మే నెలలో 3 రోజులపాటు గ్రామాలు, గ్రామాల పరిసరాల్లోని పొరకలను దళం ఆచూకీకై గాలించారు. ఆగస్టు 15న జులై 28న అలాగే ప్రత్యేక బస్తర్‌ను డిమాండ్ చేస్తూ ప్రజలు పాటించిన బస్తర్ బంద్ ముందు పోలీసులు 40 మంది, సుమారు 8 గ్రామాలు గాలించారు. పరాల్‌నార్ నందు ముగ్గురిని అరెస్టు చేయగా వారు తప్పించుకొని పారిపోయారు.

గడ్‌చిరోలి టిప్రాగడ్ ఏరియాలో పోలీసులు మూడంచెలుగా ఒక సుదీర్ఘ అభియాన్‌ను నడిపించారు. మొదటిది ఏప్రిల్ 1 నుండి 29 వరకు సాగింది. ఈ సమయంలో పోలీసులు 25 మందిని అరెస్టు చేసి బాగా కొట్టడమేకాక నవర్ గ్రామ నివాసులు ఐదుగురిపై బూటకపు కేసు బనాయించి జైలుపాల్జేశారు. రెండవ అంచెలో కమాండో బలగాలు 3 నుండి 7 మంది చొప్పున మూడు బ్యాచ్‌లుగా విడిపోయి తమకు తామే నక్సలైట్లమని చెప్పుకుంటూ మురుంగాల్ రేంజి ఖైండే రేంజి, కుర్‌బేడ్ రేంజిలో, తిరిగారు. రాత్రింబవళ్లు గెరిల్లా దళాల్లా తిరుగుతూ, మన దళం కోసం గాలిస్తూ ప్రజలను నమ్మించాలని విశ్వప్రయత్నం చేశారు. వాస్తవానికి ప్రజలకు గెరిల్లా దళంతో చిరపరిచయాలుండడంతో కమాండోల ప్రయత్నాలు అన్నీ వమ్మయిపోయాయి. మూడవ అంచెలో పోలీసులు నేరుగా గ్రామాల్లోని సంఘనాయకుల ఇళ్లపై దాడులు ప్రారంభించారు. నక్సలైట్ల సామాను, బందూకులు, పుస్తకాలు వున్నాయంటూ వారి ఇళ్లలోని సామానంతా చిందర వందర గావించారు. ఆగస్టు 3 నుండి 28వరకు ఈ దాడుల్ని సాగించారు. అంబాఝురి గ్రామస్థుడు ఒకరిని, కౌడిక గ్రామస్థులు ఇరువురిని, వాళ్ల ఇళ్లల్లోని సామానును చిందరవందర చేసి, మాలెవాడ పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయి తీవ్రంగా కొట్టడం జరిగింది. ఇలాగే కుర్‌బేడ, అంబాఝురి గ్రామాలకు పెళ్లి వర్తమానం అందించేందుకు వెళుతున్న ఇద్దరు వ్యక్తుల్ని పట్టుకొని తీవ్రంగా కొట్టారు.

మురుంగావ్ ఠాణేదార్ ఇతను (టేకు కలప దొంగిలించిన వ్యవహారంలో సంబంధంగల వాడు) సవర్‌గావ్‌కు చెందిన ఒక చిన్న హోటల్ యజమానిని ఎంత తీవ్రంగా కొట్టాడంటె దాన్ని భరించలేక అతడు ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశాడు.

కోడ్‌గుల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒక పోలీస్‌ని తన ట్రక్కులో తీసుకుపోయి కోడ్‌గుల్‌లో విడిచిపెట్టడానికి నిరాకరించాడనే కోపంతో ఆ ట్రక్ డ్రైవర్‌నేకాక దానిలోగల ఏడుగురు కూలీలను కూడా పోలీసులు చితకబాదారన్నది పోలీసుల ప్రజావ్యతిరేక దౌర్జన్య మనస్తత్వానికి మరో నిదర్శనం.

ఇలా ఏప్రిల్-ఆగస్టుల మధ్య పోలీసుల పైశాచికత్వానికి 13 గ్రామాల నుండి మొత్తంగా 36 మంది బలైపోయి శిక్షించబడ్డారు. వీరిలో ఒక టీచర్, ఒక డ్రైవర్, మరో 7 మంది కూలీలు కూడా వున్నారు.

## తుతేకనార్ ఫైరింగ్

టిప్రాగడ్ దళం మార్చి 20 సాయంత్రం తుతేకనార్ (కోర్చి

తహశీల్, భేడ్‌గావ్ రేంజి) చేరుకుంది. గ్రామం బయటనే డేరా వేసింది. ఆ రోజు హోలీ పండుగ. జనం త్రాగి వున్నారు. దళం వెళుతూ వెళుతూనే చక్కెర చాయ్‌పత్తి వంటి కొన్ని సరుకులు వంటసామాను తెమ్మని డబ్బులిచ్చి ఒక గ్రామస్థున్ని బయటకు పంపింది. అయితే అతడు బయటకు వెళుతుండగా లఖన్ హరామి ఎదురై 'సామాను తెచ్చి పెడతాను' అంటూ చీటి, డబ్బు తీసుకునిపోయాడు.

దళం అన్నం తిని మీటింగ్ చేయడం, దళ కామ్రేడ్స్ ఇద్దరు రాత్రి 10-30 సమయంలో పెట్రోలింగ్‌కు వెళ్లిరావడం జరిగింది కాని లఖన్ హరామి మాత్రం రాలేదు. కమాండర్ ఇళ్లకు పోతున్న గ్రామస్థులతో సామాను ఎందుకు రాలేదో చూసి కబురు చేయమని చెప్పి పంపాడు. అటు గ్రామస్థులు వెళ్లగానే ఇక్కడ దళంపై ఫైరింగ్ ప్రారంభమైంది. పోలీసులు లైట్ బాంబులు, ఎల్ఎమ్‌జి, ఎస్ఎల్ఆర్, ఏకె-47 వంటి అత్యాధునిక ఆయుధాలతో దళంపై దాడిచేసి కాల్పులు ప్రారంభించారు. దళం జవాబుగా ఫైరింగ్ ప్రారంభించింది. ఫైరింగ్ చేస్తూనే సురక్షితంగా తప్పుకోగల్గింది.

కోర్చి స్కూల్‌లో చదువుకున్న లఖన్ హరామికు పోలీసు ఉద్యోగం ఆశచూపి ఇన్‌ఫార్మర్‌గా మార్చుకున్నారు. దళంకోసం సామాను తెస్తానని పోయి పోలీసులను తెచ్చి దాడిచేయించాడు. అయితే గెరిల్లాలు చొరవ, ప్రజల మద్దత్తు కారణంగా ఎటువంటి ప్రాణహాని జరగలేదు. కానీ, ఒక 12 బోర్ తుపాకీ, 4 కిట్లు, కొంత సాహిత్యాన్ని కోల్పోవడం జరిగింది.

## ప్రజా ధిక్కరణ

విప్లవ చైతన్యం పెరుగుతుండంతో పై నిర్బంధాన్ని ఎదిరిస్తూ ప్రజలు తమకు వీలయిన పద్ధతిలో ప్రతిఘటనా చర్యలు సాగిస్తున్నారు.

అహిరి దళం కమలాపూర్ రేంజి లింగంపల్లి గ్రామంలో పోలీసులు సంగనాయకులు ఇరువురిని అరెస్టు చేసి రేషన్‌పల్లి పోలీసు క్యాంపుకు తీసుకుపోతుండగా చూసిన కెఎఎంఎస్ సభ్యులు వెంటనే గ్రామ మహిళలందరినీ కదలించి పోతున్న పోలీసులను అడ్డగించారు. వాద ప్రతివాదనల తర్వాత వారిని విడిచిపెట్టడానికి పోలీసులు నిరాకరించడంతో సంఘటితంగా మహిళలు ఆ నాయకుల ఇరువురి చేతులు పట్టుకొని విడిపించుకుపోయారు. అప్పటికి జారుకున్న పోలీసులు మర్నాడు నక్సలైట్లమంటూ నకిలీ వేషంలో గ్రామానికి వచ్చి 'దాదాలం, గుర్తుపట్టలేదా? ఇదివరకు కూడా వచ్చాం' అంటూ తిండి పెట్టమని అడుగసాగారు. వాళ్లకు ఆ గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళలే ముందుండి 'మీరు పోలీసులు, మమ్మల్ని ఇరికించాలని చూడకండి. నక్సలైట్లంటే గనుక మిమ్మల్ని మోసెయ్యాల్సి వస్తుంద'ని హెచ్చరించడంతో పలాయనం చిత్తగించారు. ఆ గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళలు నిర్బంధాన్ని ఎదిరించి నిలవడంలో చైతన్యవంతు లవుతున్నదానికి ఇది నిదర్శనం.

గడ్‌చిరోలి కమాండోల పైశాచిక దమనకాండ నెదిరించడంలో మే నెలలో జరిగిన బుకమరకా గ్రామ సంఘటన ఒక కలికితురాయి. ఈ గ్రామం మహారాష్ట్ర మధ్యప్రదేశ్ సరిహద్దుల్లోనిది. మహారాష్ట్ర కమాండో బలగాలు దానిపై 3సార్లు దాడిచేసి ముగ్గురిని విపరీతంగా బాదారు. దీనికి వ్యతిరేకంగా గ్రామంలోని స్త్రీ-పురుషులంతా కోపోద్రిక్తులై కమాండోలు 25 మందిని లాఠీ/కర్రలతో కొట్టి కొట్టి తరిమారు. ఆ కమాండోలు తర్వాత వచ్చి 'ఈ ఘటన ఎవరికీ చెప్పవద్ద'నీ బ్రతిమాలుకునిపోయారు.

మంగ్‌దండ్ గ్రామానికి చెందిన సుక్లు కడియామిని పోలీసులు కారణం చెప్పకుండా అరెస్టు చేసి తీసుకుపోతుండగా ఇరుగుపొరుగు 5 గ్రామాల ప్రజలు (వారిలో తగినంతమంది మహిళలున్నారు) దారినడ్డగించి పోలీసు వాహనాన్ని దిగ్బంధనం చేసి సుక్లు కడియామిని విడిపించుకున్నారు. ఇది జూన్ నాటి ఘటన.

ఆగస్టు 3 రాత్రి 8-30 గంటలకు కమాండో బలగాలు గురెకసా గ్రామంపై కన్నెర్రజేశారు. ఆ రోజు నాగపంచమి కావడంతో మైకులు పెట్టుకొని ప్రజలు భజన తతంగంలో మునిగిపోయారు. అయితే మూత్రానికి పోయిన 17, 18 ఏళ్ల యువకుడు పోలీసుల చేతికి చిక్కాడు. ఆ ఊరినుండి దళంలో భర్తీ అయిన అతని ఇల్లు చూపమని అడిగి జవాబు వచ్చినా చేయెత్తి కొట్టబోయేసరికి ఆ పోలీసు చేతిని పట్టుకున్నాడు ఆ యువకుడు. దానితో ఆగ్రహించిన వాడు మిగిలిన వారిని పిలిచి యువకుడిని కొట్టసాగాడు. అతని అరుపులు విన్న గ్రామస్థులంతా కర్రలు పట్టుకొని రాసాగారు. అది చూసిన కమెండోలు పలాయనం చిత్తగించారు. చెప్పులు గిప్పులు జారిపోతున్నా అలానే పారిపోయారు. తర్వాత గ్రామ ప్రతినిధులు ఓ 40 మంది గడ్‌చిరోలి కలెక్టరుకు ఆ సంఘటనపై విజ్ఞాపన పత్రాన్ని ఇవ్వడంతో చర్య తీసుకుంటానని వాగ్దానం చేశాడు. ఒక ఇన్‌స్పెక్టర్ 40 మంది పోలీసులతో వచ్చి క్షమాపణ కోరి వెళ్లిపోయాడు. అయితే కలప (సాగూన్) దొంగతనం సంబంధమున్న మురుంగావ్ ఇన్‌స్పెక్టర్ 20 మంది బలగంతో వచ్చి ఇద్దరు మహిళలతో సహా 11 మందిపై కేసుపెట్టి వెళ్లాడు. దానితో గురెకసా గ్రామస్థులు మురుంగావ్ ఠానాకు పోయి 'ఎందుకలా వేధిస్తున్నా'రని ప్రశ్నించారు. పోలీసులు సాగిస్తున్న ఈ చట్ట విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా 12 గ్రామాలకు చెందిన 60 మంది మహిళలతో సహా 200 మంది సమావేశమై మురుంగావ్ రేంజి గ్రామాలన్నింటినీ కదిలించి ఒక పెద్ద మీటింగ్ పెట్టి ర్యాలీ తీయాలనీ అలాగే కేసుమోపబడిన ఆ 11 మంది కోర్టును బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. ధనోరాలోని స్థానీయ పాత్రికేయునికి (రిపోర్టర్) ప్రచురించమని ఈ రిపోర్టు ఇస్తే, పోలీసులతో సంబంధాలుండి అతడాపని చేయలేదు. దానితో మొత్తం రిపోర్ట్ నాగపూర్ కార్యాలయానికి గ్రామస్థులే పంపించడం జరిగింది. ఇలా చైతన్యవంతమైన ప్రజాశక్తి సంఘటితంగా నిర్బంధాన్ని ఎదిరిస్తూ ఉనికిని విస్తరించుకొంటోంది.

కలిమెల బ్లాకు బెజ్జంగి వాడ పంచాయితీ కోసలవాడ గ్రామం వద్ద ప్రజలు ఎన్నికల ప్రచారానికి వచ్చిన వాహనం ఒక దాన్ని తగులబెట్టారు. దాన్ని సాకుగా తీసుకొని చుట్టుపక్కల గ్రామాల వారందరినీ పోలీసులు భయపెట్టసాగారు. అలాగే కోసులకొండ గ్రామానికి 30 మంది పోలీసులు మధ్యాహ్నంవేళ వచ్చి, మగవాళ్లెవరూ లేనప్పుడు, చెట్టు కింద బుట్ట అల్లుకుంటున్న ఒక రైతుని కొట్టుకుంటూ

లాక్కుపోసాగారు. దానితో దగ్గర్లో వున్న మహిళలు పోగై దాదాపు 40 మంది పోలీసులకు అడ్డం తిరిగి 'మా వాడిని వదలాలి, వాడేం తప్పు చేశాడు' అని నిలదీయడంతో వారతన్ని విడిచిపెట్టి తోకముడిచారు.

అలాగే కాంగుర్ కొండ పంచాయితీనందలి గుమ్కు గ్రామ సంగం వారిని అరెస్టు చేయాలని గతంలో కూడా పోలీసులు ప్రయత్నించారు. మందపాడు గ్రామంలో బిజెపి జీపు (ఎన్నికల ప్రచారం కోసం వచ్చినది)ను తగులబెట్టిన ఘటనలో పొరుగు గ్రామాల వారిని అరెస్టు చేయాలని చూశారు. ఒకరోజు సాయంత్రం కిలోమీటరు దూరంలో జీపు విడిచి రహస్యంగా గుమ్కు గ్రామంలోకి చొరబడ్డారు. యువత కొందరిని పట్టుకొని తీసుకుపోబోయారు. ఊరి చివరకి వచ్చేసరికి దాదాపు 40, 50 మంది మహిళలు వారికి అడ్డం తిరిగారు. ఎన్నో రకాలుగా తిట్టారు. 'మా వాళ్లను విడిస్తేనే పోతాం. లేకుంటే మిమ్మల్ని పోనియ్యం' అని మొండికేశారు. అలా చాలాసేపు వాగ్యుద్ధం జరిగిన తర్వాత చివరకు తలొగ్గిన పోలీసులు అందర్నీ విడిచిపెట్టారు. ఇది మొత్తం పంచాయితీ ప్రాంతాన్నే ఉత్తేజ పరచిన ఘటనగా నిలిచిపోయింది.

## ఊసెవాడ గ్రామంపై మహారాష్ట్ర కమెండోల పాశవిక దాడి - మహిళల వీరోచిత ప్రతిఘటన

మధ్యప్రదేశ్ కిందకు వచ్చే మాడ్ డివిజన్‌లోని ఊసెవాడ గ్రామంపై మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లా పోలీస్ కమెండోలు 18 మంది ఆగస్టు 20వ తేదీన దాడి చేశారు. మొత్తం 20 పూరిగుడిసెలైనా లేని ఈ చిన్న పల్లెలో పోలీసు ముష్కరులు 4, 5 గంటలదాకా విలయ తాండవం చేశారు. మాడ్ డివిజన్‌లోని విప్లవోద్యమపు ప్రజాపునాది రోజు రోజుకూ పెరుగుతుండగా, పాలక వర్గాలు ఈ వ్యూహాత్మక ప్రాంతంలో అణచివేతను ఎట్లా కొనసాగించాలా అని పకడ్బందీగా పథకాలు తయారు చేస్తున్నాయి. అందులో భాగంగానే యిటీవలనే కేంద్ర ప్రభుత్వం నాయకత్వంలో ఏర్పడిన సంయుక్త ఆపరేషనల్ కమాండ్ ఈ ప్రాంతంలోని విప్లవోద్యమాన్ని అణచి వెయ్యడానికి ప్రత్యేకంగానే ప్రయత్నిస్తోంది. గడచిన మే నెలలో గడ్‌చిరోలి కమెండోలు లొంగిపోయిన ఇద్దరు దళ సభ్యుల సహాయంతో ఈకోనార్ గ్రామంలో దాడిచేసి, అదే సమయంలో అటుగా వచ్చిన ఇద్దరు గెరిల్లాల టీముపై విచ్చలవిడిగా కాల్పులు జరిపింద్రు. ప్రజలను తీవ్రంగా కొట్టి కప్పుకునే కంబళ్లతో సహా ఎన్నో నిత్యావసర వస్తువుల్ని సైతం దోపిడీ దొంగల్లా దోచుకుపోయింద్రు.

ఆ తర్వాత ఊసెవాడపై జరిగింది మహారాష్ట్ర పోలీసుల రెండవదాడి. ఊళ్లోకి రావడమే ఒక సైనిక స్థావరాన్ని ఆక్రమించుకోవడానికి కదలిన తీరులో నలువైపుల్నుండి తుపాకు లెక్కుపెట్టి వచ్చారు. తర్వాత, నాలుగైదు ఇళ్లల్లో దూరి సామానంతా చిందరవందర చేసి నక్సలైట్ల సామానులేమైనా వున్నాయేమోనని సోదా చేసింద్రు. అయితే రెండో పూట తిండి దొరుకుడే కష్టంగా బతికే ఆ గ్రామ ప్రజల దగ్గర బోళ్లు - బొంతలు తప్ప మరేమీ దొరకలేదు. ఇంతలో గ్రామ శివార్లలో రాళ్లతో నిర్మించిన అమరుల స్మారక స్థూపంపై పోలీసుల కన్నుపడింది. మూడు నాలుగేళ్ల క్రింద కట్టిన ఈ స్థూపం దగ్గర గ్రామప్రజలంతా ప్రతిఏడూ జులై 28 నాడు సమావేశమై పోరులో నేలకొరిగిన అమరులను గుర్తు చేసుకోవడం దాదాపు ఒక కొత్త రివాజుగానే ముందుకొచ్చింది. కానీ, ఎట్లాగైనా ఆ స్థూపాన్ని కూలదోయాలని కంకణం కట్టుకున్న పోలీసులకు ముందుగా అందులో బాంబులున్నాయేమోనన్న భయం పీడించింది. అందుకే ప్రజల చేతులతోనే కూలగొట్టించాలని ప్రజలను జమ చేసింద్రు. కానీ, దాదాపు గ్రామంలోని యువకులందరూ అప్పటికే పనులపై అడవికీ, పొలాల్లోకి పోయారు. మిగిలింది మహిళలు, కొంతమంది వృద్ధులు. మహిళలు మేం దాన్ని కూలగొట్టమని మొండికేయడంతో పోలీసులు కొద్దిమంది వృద్ధులపై వత్తిడి తెచ్చింద్రు. వాళ్లు కూడా లొంగకపోయేసరికి వారి వయస్సును సైతం చూడకుండా విపరీతంగా కొట్టింద్రు. ఇక దాంతో తప్పనిసరై వాళ్లు తాము ప్రేమతో నిర్మించుకున్న స్థూపాన్ని కూలగొట్టింద్రు.

ఆ తర్వాత ఊరి పక్కనే ఒక గుట్టమీదినుండి కొందరు పశువులుగాసే పిల్లలు వింతగా ఈ దృశ్యాన్ని చూడసాగింద్రు. కరడుగట్టిన క్రూరత్వానికి పేరుగాంచిన మహారాష్ట్ర కమెండోలు వారిపై ఎలాంటి హెచ్చరిక లేకుండానే, వాళ్లు నిరాయుధులైన పిల్లలని స్పష్టంగా కనబడుతున్నప్పటికీ దాదాపు 20 రౌండ్లు కాల్పులు జరిపారు. పశువులుగాసే ఆ పిల్లలు చెట్టుకొకరు పుట్టకొకరుగా పారిపోయారు.

చివరగా, తమ పాశవిక దమనకాండకు పరాకాష్టగా గోగ ఊసెండి, ఎడ్మ పొదటి అనే ఇద్దరు వృద్ధ రైతుల్ని అరెస్టు చేసుకొని తీసుకెళ్లారు. అయితే ఈలోగా గ్రామ మహిళలు కొంతమంది ఎలాగైనా వాళ్లను విడిపించుకోవాలని, పోలీసులను ఎదిరించాలని నిర్ణయించుకున్నారు. గోగ భార్య లక్ష్మి దొరికిన పాత చెప్పులందుకొని ఆవేశంతో పోలీసులను వెంబడించింది. పోలీసులు దాదాపు 4,5 కిమీ దూరం వెళ్లేలోగా ఆమె వాళ్లను అందుకోగల్గింది. పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు ఎదురుగా వెళ్లి "వాళ్లను విడుస్తావా? చెప్పులతో కొట్టమంటావా?" అని సవాలు చేసింది. ఈ హఠాత్పరిణామంతో పోలీసులకేమీ పాలుపోలేదు. ఈ కుగ్రామంలో వుండే ఒక సామాన్యమైన ఆదివాసీ మహిళ యింతకు తెగించగలదని కలలోనైనా ఊహించలేకపోయింద్రు. పైగా ఈవిడ యింతకు తెగించిందంటే వెనకాల మహిళల దండు వుండనే వుంటుందని భయం పట్టుకుంది. జరుగబోయే పరిణామాలను గురించి భయపడ్డ పోలీసులు అరెస్టుచేసిన వాళ్లను వదిలేసి పోయింద్రు.

పోలీసులు విచ్చలవిడిగా దాడిచేసి, భయోత్పాతం సృష్టించడానికై కాల్పులు జరిపినప్పటికీ ప్రజలు వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా ప్రతిఘటించి తమ బలం ఏమిటో శత్రువుకు తెలియజెప్పింద్రు. c

## ఉపాధ్యాయ హోదానడ్డుపెట్టుకొని స్త్రీలపై అత్యాచారాలు జరుపుతోన్న చీడపురుగుపై ప్రజలు విధించిన వినూత్న శిక్ష!

మాడ్ డివిజన్ కోహకమెట్ట దళం ఏరియాలోని కాడ్‌నార్ రేంజి ఈక్‌పాడ్ గ్రామంలో హాస్టలు వసతిగల ఒక ప్రాథమిక పాఠశాల వుంది. ఇక్కడ 5వ తరగతి వరకు వుంది. ఇది ఏకోపాధ్యాయ పాఠశాల. ఆర్.కె. గావ్డే అనేవాడు ఇక్కడి గురువుగా వీడు ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెచ్చే చీడపురుగు, పరమ స్త్రీలోలుడు. వీడికి ముగ్గురు భార్యలున్నారు. గతంలో కూడా యిద్దరు స్త్రీలను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించి వదిలివేశాడు. అమాయక ఆదివాసీ గ్రామ ప్రజానీకంలో గురువు పొందే గౌరవ మర్యాదలను, ప్రేమాభిమానాలను దుర్వినియోగపరుస్తూ వీడు చేయని ఆకృత్యమంటూలేదు. కల్లుతాగి తందనాలాడేవాడు. హాస్టలును బడిని గాలికి వదిలేశాడు. తాగిన మైకంలో హాస్టల్లో చదువుకుంటున్న ఐదవ తరగతి చదివే ఇద్దరు బాలికలపై అత్యాచారం జరిపాడు. గ్రామంలోని యువతులను కూడా హాస్టలు పనులపేరుతో పిలిపించి, అక్కడే పడుకోమని చెప్పి, రాత్రిపూట ఎత్తుకుపోయేవాడు. ఇలా పడుకున్న రోంగా బత్తి అనే అమ్మాయిపై అత్యాచారం జరిపాడు. గ్రామంలో రాత్రిపూట గోటుల్ వద్ద నృత్యాలు చేస్తున్న యువతుల వెంటబడే యత్నాలు కూడా చేశాడు. గురువులంటే వున్న భయం కొద్దీ ఆ అమాయక ఆదివాసీ ప్రజలు వీడి ఆకృత్యాలకు మనసులోనే రోధిస్తూ మౌనంగా భరించారు.

అయితే విప్లవోద్యమం బలపడుతూ, ఈ ప్రాంతమంతటా డికెఎంఎస్, కెఎంఎస్ సంఘాలు వెల్లి విరియడంతో, ఈ గ్రామంలో కూడా ఆ సంఘాలు ఏర్పడి కార్యకలాపాలు నిర్వహించసాగాయి. దాంతో వీడి ఆకృత్యాల విషయం స్థానిక సంఘం దృష్టికి, దళం దృష్టికి వచ్చింది. దాంతో సంఘం నేండ్‌నార్ రేంజి కమిటీ ఆధ్వర్యంలో వీడిపై ప్రజాపంచాయితీని నిర్వహించింది. ఇందులో చుట్టుపక్కల 7 గ్రామాల నుండి వచ్చిన సుమారు వందమంది ప్రజలు పాల్గొన్నారు. వీడు మొదట పంచాయితీలో తలాయించి తన నేరాలను ఒప్పుకోలేదు. దాంతో గ్రామస్థులు ముందుకు వచ్చి వీడి అకృత్యాలనన్నింటిని ఒక్కటొక్కటిగా సభ ముందు పెట్టారు. దాంతో గతంలోలా తన పదవిని అడ్డుపెట్టుకొని బుఖాయించి తిరగలేనని, సంఘటిత ప్రజా బలం ముందు తన పప్పులుడకవని గ్రహించిన వీడు. తన తప్పుల్ని వొప్పుకున్నాడు. సభ డిమాండ్ మేరకు గ్రామ యువతి రోంగాబత్తిని హాస్టల్ విద్యార్థినులు ఇరువుర్నీ బలాత్కారం చేయడం, ఇతర యువతుల్ని వేధించడం, కల్లు తాగి తందనాలాడడం వంటి తన తప్పులను క్షమించాలని, సభ ఏ శిక్ష విధించినా స్వీకరిస్తానని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడు.

ఇక సభ మొత్తం విషయాలను మరోసారి సమీక్షించి, ఉపాధ్యాయ వృత్తికి ఇటువంటి వాడు అనర్హుడని తీర్పు చెప్పింది. **సభలో పాల్గొన్న మహిళలందరి కాళ్లు మొక్కించి, ఆ తర్వాత ''*హాస్టల్ బాలికలను, గ్రామ యువతుల్ని బలాత్కరించి నందుకే ఈ శిక్ష*'' అని రాసి వున్న బోర్డు వాడి మెడకు తగిలించి మూడు గ్రామాల గుండా మూడు కిలోమీటర్ల దూరం వాడిని ఊరేగించి సంకుల్ కేంద్రంలోని అధికారులకు వాడిని అప్పగించి, వాడిని పదవి నుండి తక్షణమే తొలగించి వాడి స్థానంలో ఇద్దరు ఉపాధ్యాయుల్ని పంపాలని ప్రజలు డిమాండ్ చేశారు.**

ఈ పంచాయితీలో టీచర్‌ను ప్రజలు శిక్షించడంతో పాఠశాలల్లో గ్రామాల్లో అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తించే, తాగుబోతు టీచర్లకు, ఉద్యోగస్థులకు పెద్ద హెచ్చరిక అయింది.

లోతట్టు గ్రామాలకు వచ్చే ఉపాధ్యాయులు కొందరు తమ ఇష్టారాజ్యం నడుస్తుందనే ఆలోచనతో ఊళ్లోకి వచ్చి పిల్లలకు చదువు చెప్పక ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులను పై అధికారులతో కలిసి పంపకాలు చేసుకొని దిగమింగుతూ హాయిగా కాలం వెళ్లదీస్తుండడం అనేక సంవత్సరాలుగా సాగుతున్నదే. ఈ ఈక్‌పాడ్‌లోనే గావుడేకన్నా ముందున్న వార్డెన్ కూడా ఇలాంటి అవినీతిపరుడే కావడంతో ప్రజలు వీడిని తన్ని తరిమారు. ఇప్పుడు గావుడే పరిస్థితి ఇది. విప్లవోద్యమంతో ప్రజలు చైతన్యమవుతున్నారు. విద్యార్థులు కూడా తన సమస్యల గూర్చి ఆలోచిస్తున్నారు. ఇలాంటి స్థితిలో ఉపాధ్యాయులు గతంలోలాగా 'ఆడిందే ఆట-పాడిందే పాట' అంటే మాడ్ ప్రాంతాల్లో సాగదని ఈక్‌పాడ్ ఘటన హెచ్చరిస్తున్నది. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనది. బాధ్యతాయుతమైనది.. జీతపు రాళ్లతో, అవినీతితో పొద్దుబుచ్చడం ఏ ఉపాధ్యాయుడికి తగనిది.

ఈక్‌పాడ్ ఘటన నారాయణపూర్ తాలూకా వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. పై అధికారి బరిహ వద్దకు సంకుల్ కేంద్ర అధికారి వై.ఎస్. శుక్లా ఈ సమస్యను తీసుకెళ్లగా విద్యాశాఖలో పిడుగు పడిన చందమై గావుడేను ఆఘమేఘాల మీద బదిలీ చేసినప్పటికీ, అత్యాచారాలకు, అవినీతికి పుట్టినిల్లయిన ఈ వ్యవస్థను మార్చే బాధ్యత అంతిమంగా ప్రజలపైనే వుంది.

## కోహక మెట్ట, సోన్‌పూర్ రేంజిల్లో కల్లు (సారాయి) వ్యతిరేక పోరాటం

కోహకమెట్ట, సోన్‌పూర్ రేంజిల్లో సోన్‌పూర్, కోహకమెట్ట, కుతుల్, కుస్తూర్ మెట్ట..... ఇలా నిర్దిష్ట కేంద్రాలలో ఆటుం (సంత)లు జరుగుతూ వుంటాయి.

గత 5 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఆటుంలలో కల్లు అమ్మకం బంద్ పెట్టాలని పోరాడుతున్నారు. ముఖ్యంగా మంగళవారం నాడు సోన్‌పూర్ గ్రామంలో జరిగే ఆటుంలో నవంబర్

7న 12 గ్రామాల నుండి 150 మంది ప్రజలు ఊరేగింపు తీసి కల్లు అమ్మేవారికి నచ్చ చెప్పి `బంద్' చేయించాలని చూశారు. అలా విననివారివద్ద గల కల్లు నేలపాలు చేశారు. (ముఖ్యంగా ఈ కల్లు అమ్మకం బయట నుండి వచ్చి స్థిరపడినవారు చేయడం జరుగుతోంది) రెండు రేంజిల్లోని ప్రజలకు ఇది మంచి ఉత్సాహాన్నిచ్చింది. కుస్తురిమెట్ట, కుతుల్ సంతల్లో కూడా ఇలా ప్రచారం సాగించి, బంద్ పెట్టించాలని నిర్ణయం తీసుకున్నారు.

మరోపక్క ప్రజల్ని పక్కదారి పట్టించే ఉద్దేశంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం కల్లు అమ్మడానికి వ్యతిరేకంగా, గ్రామాలలో మహిళా సంఘాలు పెట్టించి, పంచాయితీ ఆధ్వర్యంలో వాటితో ఊరేగింపులు తీయించింది. అమ్మేవారిని కొట్టడం వంటి చర్యలు కూడా సాగించింది. నిజానికి పెద్ద పెద్ద వ్యాపారస్థుల్ని ముఖ్యంగా వైన్ షాపుల వారిని, బ్రాంది తయారీ కంపెనీలను మరో పక్క లోతట్టు ప్రాంతాలలోకి ఆహ్వానిస్తోంది. అయితే ప్రభుత్వం పేద ప్రజల ఈ పోరాటాన్నైనా కొనసాగించిందా అంటే ఏడాదికే వెనక్కి పోయింది. అందుకే ఇది ఎన్నికల సమయంలో ఓట్లకోసం ఆడే నాటకం తప్ప సమాజంలో శ్రామికవర్గం శ్రేయస్సుకోసం మాత్రం కాదు.

ఈ పోరాటం సామాజిక రుగ్మతల్లోని దానిపైన గనుక ఈ పోరాటం నిరంతరం సాగించాల్సిందేనని సంగాల నాయకత్వం గుర్తించి పోరాటానికి సంసిద్ధమవుతోంది. ప్రజలు కూడా పోరాట చైతన్యాన్ని పెంచుకుంటున్నారు.

## గంజాయి పంటల ధ్వంసం - ప్రధాన దోషుల ఆస్థుల జప్తు - గ్రామాల నుండి బహిష్కరణ!

మాడ్ డివిజన్‌లో విప్లవోద్యమంలో సంఘటితమవుతున్న ప్రజానీకం, ఇపుడు, ఈ ప్రాంతమంతటా ఒక మహమ్మారిగా వ్యాపిస్తోన్న గంజాయి సాగుకు వ్యతిరేకంగా సమరశంఖం ఊదారు. సంఘాల నాయకత్వంలో కదిలి, గంజాయి సాగుచేస్తోన్న తావులకు వెళ్లి పంటల్ని ధ్వంసం చేస్తున్నారు. సాగుదార్లలోని పేద రైతాంగానికి, ఈ పంట వల్ల వొనగూడే చెడుగుల్ని వివరించి నచ్చచెబుతున్నారు, మరోవైపున పెద్ద దోషులకు ఆస్తుల జప్తు, గ్రామ బహిష్కరణ వంటి శిక్షలను విధిస్తున్నారు.

రాణిబేడ అనేది కోహకమెట్ట దళ ఏరియాలోని ఒక గ్రామం. దుగ్గా అనేవాడు 20 ఏళ్ల క్రితం తన స్వంత గ్రామమైన కుడల్‌ను వదిలి, మాడ్‌కు వచ్చి, పైగ్రామాన్ని పొందుపరచాడు. ఈ ప్రాంతంలో గంజాయి దొంగ వ్యాపారంలో ప్రథమ స్థానం వీడిదే. వీడు గంజాయి పంట పండించడమేగాక, విత్తనాలు కూడా అమ్ముతూ ఈ ప్రాంతమంతటా ఇది విస్తరించడానికి తీవ్ర కృషి చేస్తున్నాడు. వీడి ప్రధాన ఆదాయం ఇదే. వీడి చరిత్ర మొత్తం నేరస్త చరిత్రే. నరబలులు ఇవ్వడంలో పేరుమోసిన వాడు. ఇప్పటి వరకు మొత్తం 8 మందిని నరబలి ఇచ్చాడు. కన్నబిడ్డను (కవలలు పుట్టగా అందులో ఒకర్ని) కూడా నరబలి ఇచ్చిన పరమక్రూరుడు వీడు. తన వద్ద జీతానికి పనిచేస్తున్న యువకుడిని కొట్టి చంపాడు. **ఇన్ని క్రూర నేరాలు చేస్తున్నా, గంజాయి సాగుచేస్తున్నా, వీడిని నారాయణపూర్ పోలీసులు అంటుకోరు. గంజాయి వ్యాపారం ద్వారా వీడినుండి ముడుతోన్న వేల వేల రూపాయల ముడుపుల వల్ల, అక్కడి పోలీసు అధికారులకు వీడు విశ్వసనీయ నేస్తం.** పలుసార్లు నామమాత్రపు కేసులు పెట్టి విడుదల చేశారు. వీడిని ప్రజా ఉద్యమానికి వ్యతిరేకంగా వాడుకుంటున్నారు.

వీడు స్త్రీ లోలుడు కూడా. మహిళలపై లైంగిక అత్యాచారాలకు పాల్పడడం వీడికి మామూలే. ఇద్దరు భార్యలుండగా, కుర్సనార్ గ్రామంలో ఒక దండామి మహిళపై అత్యాచారం జరిపాడు. ఇలాంటి మరో ఘటనలో అంతకు ముందే ప్రజలచే శిక్షింపబడ్డాడు కూడా.

ఇలా పలు సందర్భాలలో, పలు నేరాలకై వీడిపై ఆరుసార్లు పంచాయితిలు జరిగి శిక్షించడం జరిగింది. గతంలో రెండుసార్లు వీడి వద్దనున్న గంజాయిని ధ్వంసం చేయడం జరిగింది. అయినా వీడు నారాయణపూర్‌లోని పోలీస్ అధికారుల దన్నుతో తన నేరాలను కొనసాగిస్తూనే వచ్చాడు.

దీంతో, నవంబర్ 22 నాడు స్థానిక డివికెఎంఎస్, కెఎఎంఎస్ ఆధ్వర్యంలో చుట్టుపక్కల 15 గ్రామాలనుండి కదిలి వచ్చిన సుమారు 550 మంది ప్రజలు, వీడిని లాక్కొచ్చి పంచాయితీ జరిపారు. వీడు అక్రమ మార్గాల ద్వారా పోగుచేసుకొని వున్న ఆస్థులను స్వాధీనం చేసుకోవాలనీ, వీడిని గ్రామం నుండి బహిష్కరించాలని, గంజాయి పంటను ధ్వంసం చేయాలని, వీడి 17 ఎకరాల పొలంలోని పంట నుండి లభించిన 35 బస్తాల ధాన్యాన్ని ప్రజలకు పంచాలని ఆ పంచాయతి తీర్పు ఇచ్చింది. అవి అమలైనాయి. అలానే వీడి దగ్గరున్న ఒక బర్మార్ (డబల్ బ్యారెల్) కూడా స్వాధీనపర్చుకోవడం జరిగింది.

అలానే మరో పది గ్రామాల్లో జరిపిన దాడుల్లో లక్షల రూపాయల విలువచేసే గంజాయిని ధ్వంసం చేయడం జరిగింది. ఈ వ్యాపారంలో ముఖ్య నేరస్థులను ఈ ప్రాంతం నుండి వెళ్లగొట్టడం జరిగింది. వివరాలు క్రింది పట్టికలో ఇస్తున్నాం.

| గ్రామం | నష్టపరచిన గంజాయి వివరాలు | పాల్గొన్న ప్రజలు |
|---|---|---|
| కొడ్డెలేర్ | 15 కిలో విత్తనాలు అలికినవి | 115మంది |
| గట్టకల్ | 20 " | 15 " |
| కాన్నార్ | 500 మొక్కలు | 53 " |
| మొహందీ | 20 " | 3ముగ్గురు |
| రాణిబేడ | 15కిలోల విత్తనాలు అలికినవి | 550మంది |
| పెవేర్ | 1ఎకరం పెందలో అలికినవి | 9మంది |
| కోస్తాడి | 25మొక్కలు | 6మంది |
| దుమ్‌నార్ | 50 " | 38మంది |
| బట్‌నార్ | 500 " | 30 " |
| వెల్వేర్ | | |

## సమాజ సాంప్రదాయాలను వ్యతిరేకిస్తూ గ్రామ పెత్తందార్ల ఆటలను కట్టించిన ప్రజానీకం : కురుబాట రాజు విశ్వంబర్ నుండి దండగ వాపస్

నేటి సమాజంలో వినడానికి ఇలాంటి ఘటనలు కొత్తవి కాకపోయినా నేడు ప్రజల్లో వస్తున్న మార్పుతో పెద్దమనుషులుగా చలామణి అవుతున్న వాళ్ల ఆగడాలకు అడ్డుకట్టలు మాత్రం పడుతున్నాయి. భూస్వామ్య భావజాలంతో నిండివున్న ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో గ్రామీణ పెత్తందార్లు కాలం చెల్లిన రీతి రివాజులు, పంచాయితీల పేరిట విపరీతంగా దండుగలు వసూలు చేయడం పరిపాటే. అయితే విప్లవ ప్రభావం గల గ్రామాల్లో ఇది రోజు రోజుకు తగ్గుతున్నప్పటికీ ఉద్యమం వ్యాపించని చోట్ల ఇప్పటికీ కొనసాగుతోంది. ఇలాంటి చోట్ల ప్రజానీకం పార్టీ కొరకు ఎదురు చూస్తున్నారు.

రాజ్‌నంద్‌గాంవ్ జిల్లా ఖారగడ్ తాలూకాకు చెందిన భారత్ పూర్ గ్రామంలో దాదాపు 70-80 ఇండ్లు వుంటాయి. అధికంగా ఆదివాసీ కుటుంబాలే. వీరితోపాటు కొందరు మహర్(దళితులు)లు కూడా వుంటారు. అయితే మహర్‌కు చెందిన ఆయనతో ఏదో చిన్న తగాదా సందర్భంగా హరి బహదుర్ అనే ఆదివాసీ యువకుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినాడని సమాజపు ముఖ్యుడు (డిహివర్) కాశీరాం గ్రామంలో పంచాయితీ జరిపి రెండు సంవత్సరాల వరకు సమాజపు బహిష్కరణ తీర్పు ఇచ్చాడు. అయితే, వీరికి సమాజపు బహిష్కరణను తొలగించుకోవాలంటే చుట్టు పక్క గ్రామాలకు ఒక రాజు వుంటాడు. ఆయన ద్వారా అందరిని పిలిచి వారికి తిండి ఖర్చు, అలాగే వారు విధించే దండుగకు ఒప్పుకోవాలి. అప్పుడే సమాజంలో తిరిగి చేర్చుకుంటారు.

ప్రక్క గ్రామమైన కుర్‌బాటలో వీరి సమాజపు రాజు విశ్వంబర్ అనేవాడు వుంటాడు. వీడికి కబురు చేయగా 20 గ్రామాల ప్రజలను దాదాపు 450 మందిని పోగుచేసి పంచాయితీ ఏర్పాటు చేశాడు. వీరి తిండి ఖర్చు నిమిత్తం అయిదు కుడీలు (25కిలోలు) బియ్యం వంట చేయించారు. ఈ రాజు, వీడి తైనాతీలు కలిపి ఇచ్చిన తీర్పును ఎవరైనా వ్యతిరేకించితే వారికి దండుగలు వేస్తారు. ఆ రాజుగా చెలామణి అయ్యేవాడు. తీర్పు చెప్పినాడు - సమాజంలో కలుపుకోవాలి అంటే హరి బహదుర్ 2000 రూపాయల దండుగ ఇవ్వాలి. అలాగే దీనిని వ్యతిరేకిస్తూ విప్లవోద్యమం తరపున మాట్లాడిన సిడ్‌పాని గ్రామంకు చెందిన నారద్‌కు 2000 రూపాయలు దండుగ వేశారు. ఎవరూ నోరు విప్పలేదు. భుజారికి చెందిన యువకుడు ఈ తీర్పును వ్యతిరేకిస్తూ "ఇది అన్యాయం పంచాయితీలో ఇంత మంది పెద్దమనుషులు వున్నారు. ఎవరు అన్యాయం అనరేంది? మీరంతా ఆయనకి అణిగి మణిగి వుంటారు" అన్నందుకే ఆయనకు వెయ్యి రూపాయలు దండుగ వేశారు. సమాజపు కట్టడి కాబట్టి బ్రతిమిలాడి భంగపడి 50 రూపాయలకు ఒప్పుకున్నాడు.

ఈ గ్రామంపై మనం పోకున్నా మన ప్రభావం వుంటుంది. ఈ వార్త దళంకు తెలియగానే మే 25 నాడు వెళ్లి ప్రజాపంచాయితి జరిపి చర్చించి అసలు సమాజంలో దండుగలు అనేది ఎందుకు తీసుకుంటున్నారు, వీటి ఉద్దేశ్యం ఏమిటి అనేది వివరంగా చెప్పడమైనది. దీనితో గ్రామ పెద్దలు ప్రజాపంచాయితీలో దండుగగా వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇస్తాం అని ఒప్పుకున్నారు. అయితే రాజు విశ్వంబర్ కురు బాటలో వుంటాడు కావున మరుసటి రోజు వాడు 20 గ్రామాల పెద్దలను పిలిచి దండుగ డబ్బులు తిరిగి ఇద్దామని నిర్ణయించుకొని అయిదు కుడీలా బియ్యం, దండుగగా వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇచ్చారు.

ఈ వార్త చుట్టుపక్క గ్రామాలకు పాకి చాలా ప్రభావం పడింది. నవ యువకులంతా పార్టీకోసం ఎదురు చూస్తున్నారు. అన్యాయాలు జరిగితే సహించడానికి జనం సిద్ధంగా లేరు. తగిన మార్గదర్శకత్వం దొరికితే ఈ పీడను వొదిలించుకోవడానికి సిద్ధంగా వున్నారని పై ఘటన తెలియజెబుతోంది.

## ఇంద్రావతి దళ ఏరియా - ప్రజా సమస్యలు

ఇంద్రావతి దళం, ఏరియా అంతటా అటవీ సంరక్షణ గురించి గత రెండేళ్లుగా తీవ్ర ప్రచారం సాగిస్తోంది. గ్రామ పెద్ద మనుషులు, పెత్తందారులు, ధనికరైతులు గెరిల్లాలు సాగిస్తోన్న ప్రచారాన్ని లెక్క చేయకుండా అడవిని నరుకుతూ సమస్యలు సృష్టిస్తున్నారు.

అంగ్‌మెట్ట గ్రామానికి సంబందించినది. ఇక్కడ గైతాల్ మాడ్ వాసియే. సన్ను అనే అతను దంతెవాడ నుండి వలస వచ్చి బ్రతుకుతున్నాడు. స్థానికులను బెదిరించి సన్నూ అడవి చాలా నరికాడు. గత జూన్ మాసంలో దళం ఆ గ్రామం వెళ్లినప్పుడు ప్రజల సమక్షంలోనే అలా నరకవద్దని సన్నూని హెచ్చరించింది. అలాగే నరికిన భూమిలో కూడా విత్తనాలు వేయవద్దని చెప్పింది. అయినా వినకుండా విత్తనాలు అలికి పంట తీశాడు. దళం తిరిగి నవంబర్‌లో అక్కడకు వెళ్లినప్పుడు సన్నూ సమస్య ముందుకు వచ్చింది. సంగ సమావేశంలో చర్చ జరిగింది. పంటను స్వాధీనపర్చుకోవాలని నిర్ణయించడం జరిగింది. ఆ గ్రామం, ప్రక్క గ్రామం వారిని సమావేశపరచి సమస్యను చర్చించి సంగ అభిప్రాయాన్ని వివరించింది. వారంతా దాన్ని ఆమోదించడంతో నవంబర్ 12 జనం అంతా కలిసి పంటకోసి స్వాధీనపరచుకున్నారు. దాని నుండి వచ్చిన ధాన్యం మొత్తాన్ని సహకారసంగంలో జమ చేసుకున్నారు.

తాడిభల్ల కూడ ఈ ప్రాంతంలో గ్రామమే. ఇక్కడ పాగు - పాగు పేర్లతో గల ఇద్దరికి భూమి వుంది. వీరిద్దరూ వాస్తవంలో అంగ్‌మెట్ట వాస్తవ్యులు. అయినా కీస్‌కల్ గ్రామానికి పోయి బ్రతుకుతుండడంతో తాడిభల్లలోని వీరి భూమి పండావుగా వుండింది. అయితే వారిద్దరు తాడిభల్లకు చెందిన వురాల్ నుండి తిండికి లేక రెండు - రెండు కండీలు వడ్డీకి తీసుకున్నారు. అయితే వాడు వడ్డీకిగానూ ఆ పడావు భూమిని దున్నుకొని పంట మొత్తాన్ని తింటున్నాడు. ఇది 3 సంవత్సరాలుగా సాగుతోంది. దీనిపై సంగంలో

*(కొరవ 47వ పేజీలో .....)*

# గొప్ప వెనుకతట్టు ప్రాంతంలోని, శత్రు ఆక్రమిత ప్రాంతాలలోని రహస్యపార్టీ నిర్మాణాలను పటిష్టపరచండి!

*[ఇది చైనాలో జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధ కాలంలో స్థానిక పార్టీ రహస్య నిర్మాణాలను శత్రువుకు అభేధ్యమైన పకడ్బందీ నిర్మాణాలుగా రూపొందించే కృషిని వివరిస్తూ కామ్రేడ్ యే చెన్-యున్ రాసిన వ్యాసం. ఈ వ్యాసాన్ని మొదట చైనా కమ్యూనిస్టు పార్టీ ఆంతరంగిక పత్రికయైన* **'కమ్యూనిస్టు'** *లో* **"పార్టీ రహస్య నిర్మాణాల పటిష్టీకరణ విషయంలో కొన్ని సమస్యలు"** *అనే శీర్షిక క్రింద ప్రచురించారు. ఇందులో గొప్ప వెనుకతట్టు ప్రాంతం అంటే, ఆనాడు కొమింగ్‌టాంగ్ పాలన క్రింద వున్న ప్రాంతం]*

కేంద్ర కమిటీ పార్టీని పటిష్ట పర్చడంపై తన నిర్ణయాన్ని ప్రకటించి -1939, ఆగస్టు 25- ఇప్పటికి 13 నెలలు గడిచాయి. గొప్ప వెనుకతట్టు ప్రాంతంలోనూ, శత్రు ఆక్రమిత ప్రాంతాలలోనూ మన నిర్మాణాలను పటిష్ట పరచుకోవడంలో మనం కొంత పురోగతిని సాధించాం. పలుతావులలో ఇప్పటికే ఎక్స్‌పోజ్ అయిన క్యాడర్లను వెంటనే ఉపసంహరించుకున్నాం, పార్టీ సభ్యులు ప్రజలలో కలగలిసిపోనారంభించారు, మనం అవాంఛనీయ ఘటాలను ఏరిపారవేస్తూ పార్టీ శాఖల ప్రాథమిక పునఃసంఘటితీకరణను నిర్వహించాం, పార్టీ ఎడ్యుకేషన్‌ను మెరుగుపర్చుకున్నాం. అపుడు మన వెనుకతట్టులోని, శత్రు ఆక్రమిత ప్రాంతాలలోని పార్టీ నిర్మాణాలను పటిష్ట పర్చబడ్డాయని మనం చెప్పుకోగలమా? ఎంత మాత్రం చెప్పలేం. కొన్ని రాష్ట్ర కమిటీల పనిని పరిశీలించిన పిదప, రహస్య నిర్మాణాలను పటిష్టపరచే కృషి యింకా చాలా మిగిలే వుందని కేంద్ర కమిటీ భావిస్తోంది. పార్టీని పటిష్ట పరచడానికై నెరవేర్చవలసి వున్న కీలక కర్తవ్యాల గురించి వాటిలో అనేకానికి ఇప్పటికీ అవగతం కాలేదు. ఆ కీలక కర్తవ్యాలు ఏమిటి? మన పార్టీని పటిష్టపర్చుకోవడానికి మనం తప్పనిసరిగా చేయాల్సి వున్నది ఏది?

## దాగొని వున్న విద్రోహుల పట్ల అప్రమత్తంగా వుండడం, వారిని నిర్మూలించడం :

మన శ్రేణులలో దాగివున్న ద్రోహుల పీడను వదిలించుకోవడం, అటువంటివారు ఇంకెవరూ పార్టీలో చేరకుండా ఖాయం చేసుకోవడం అతి ముఖ్య విషయం. పార్టీలో దాగొని వుండి, మన నిర్మాణాలను చిన్నాభిన్నం చేసి తుడిచిపెట్టేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తూ వుండే ద్రోహులను వారి వైపుకు తిప్పుకోవడం లేదా ఏజంట్లను పంపడం అన్నదే పార్టీకి వ్యతిరేకంగా జపాను సామ్రాజ్యవాదులు, చీని దేశద్రోహులు, కమ్యూనిస్టు వ్యతిరేక కొమింగ్‌టాంగ్ మొండి ఘటాలు వాడుతూవస్తున్న ప్రధాన పద్ధతి. అది వారి ప్రామాణిక ఎత్తుగడల్లో ఒకటి. స్థానిక పార్టీ నిర్మాణాలలో నేడు దాక్కొని వున్న విద్రోహులు అనేకానేకులు చడీ చప్పుడు లేకుండా పొంచి వున్నారని నేను ఖచ్చితంగా నమ్ముతున్నాను. మన కామ్రేడ్లలో అనేకులు అప్రమత్తంగా లేరు. రహస్య పార్టీ నిర్మాణాలను పటిష్టపర్చడానికిగానూ, దాగొని వున్న ద్రోహుల గురించి అప్రమత్తంగా వుండి. వారిని నిర్మూలించడం ఎంత కీలకమైన విషయమో వారు గ్రహించడంలేదు. ఈ పరిస్థితులలో పటిష్టీకరణ అసాధ్యమవుతుంది. మీ రహస్య కృషి ఎంత బాగా వున్నప్పటికీ, మీ **'కవరు'** ఎంత భద్రమైనదైనప్పటికీ, ఐక్య సంఘటన కృషిని, ప్రజలలో కృషిని మీరు ఎంత బాగా నిర్వర్తించినప్పటికీ మీరు ఎంత మార్క్సిజం-లెనినిజాన్ని వంటపట్టించుకున్నప్పటికీ మీ కార్యాలయాల్లో కూచొని వున్న రహస్య ద్రోహులు తమ పాచిక వేయగానే మీరు మీ విజయాలన్నిటిని పోగొట్టుకుంటారు, మీ నిర్మాణం కుప్పకూలుతుంది. అంతర్యుద్ధ కాలంలో షాంఘైలోని యితర రాష్ట్రాలలోని పార్టీ రహస్య నిర్మాణాలకు సరిగా ఈ గతే పట్టింది. అది చాలా బాధాకరమైన అనుభవం. అందుచేత, మనం మన రహస్య నిర్మాణాలను పటిష్టపర్చదలిస్తే, ఇపుడు ఇక ముందు కూడా దాక్కొని వున్న ద్రోహుల పట్ల అప్రమత్తంగా వుండి వారిని నిర్మూలించడానికి మనం అత్యున్నత ప్రాధాన్యత నివ్వాల్సి వుంటుంది.

## నాయకత్వ అంగాల భద్రతను ఖాయం చేసుకోవడం :

నాయకత్వ అంగాల భద్రతను ఖాయం చేసుకోవడం అన్నది మన పార్టీ రహస్య నిర్మాణాలను పటిష్టపర్చుకోవడానికి చేయవలసివున్న మరో ముఖ్య అంశం. కారణాలు ఏమంటే:

మన రహస్య నిర్మాణాలలో రెండు బృందాలుంటాయి. ప్రజలలో కలగలిసిపోయి వారిలో పనిచేసే సాధారణ పార్టీ సభ్యులు మొదట బృందం. ఇక రెండవ బృందం అన్ని స్థాయిలలో నాయకత్వ అంగాల బాధ్యతలను చూసే, పార్టీ పనిలో సిద్ధహస్తులైన క్యాడర్లతో కూడి వుంటుంది. రెండూ అమూల్యమైనవే. అయినప్పటికీ, క్యాడర్ల, నాయకత్వ అంగాల పని విజయవంతంగా సాగడానికి వారి, భద్రతను ఖాయం చేసుకోవడం అన్నది నిర్ణయాత్మక ప్రాముఖ్యతగల అంశం. చాలాసార్లు, ఒక నాయకత్వ అంగం నాశనం చేయబడిన పిమ్మట, మిగిలివున్న సాధారణ సభ్యులు అంతకు ముందుకన్నా తక్కువ సమర్థతతో పనిచేశారు లేదా అసలు కార్యకలాపాలన్నిటికి స్వస్తి చెప్పవలసిన స్థితికి నెట్టబడ్డారు, తద్వారా పార్టీ నిర్మాణం పూర్తిగా కుప్పకూలిపోయింది. ఇటువంటి వ్యవహారాలు కోకొల్లలుగా జరిగాయి. 10 ఏళ్ళ అంతర్యుద్ధం చివరికి షాంఘై పారిశ్రామిక సంస్థల్లోని, తెల్ల ప్రాంతంలోని అనేక రాష్ట్రాలలోని పార్టీ నిర్మాణాలకు ఏ గతి పట్టిందో ఓసారి గుర్తు చేసుకోండి. దీనికి విరుద్ధంగా, అనుకూల పరిస్థితులలో పార్టీ క్యాడర్లు కొద్దిమందే, కొద్ది మంది పార్టీ సభ్యుల సాయంతోనూ, సాయంలేనప్పుడు కూడా, వారి నాయకత్వ పద్ధతులు పకడ్బందీగా వున్నప్పుడు తేలికగానే పార్టీ నిర్మాణాలను నిర్మించారు, విస్తరించారు. అటువంటి సందర్భాలూ వున్నాయి. ఉదాహరణకు,

1935, డిసెంబర్ 9 ఉద్యమానికి ముందు పెకింగ్ - టిన్‌స్టిన్ ప్రాంతంలో 20 నుండి 30 మంది పార్టీ సభ్యులే వుండేవారు. గ్రామీణ ప్రాంతాలలోని పార్టీ సభ్యులు వారి నిర్మాణాలతో సంబంధాలు కోల్పోయారు. కాని, ఉత్తర చైనాలోని పార్టీ నాయకత్వం అంగమైన హోపె రాష్ట్రకమిటీ - అది చెక్కు చెదరలేదు- పరిస్థితి మెరుగుపడిన వెనువెంటనే డిసెంబర్ 9 ఉద్యమాన్ని ఆరంభించడంలో జయప్రదమైంది. ఆ రాష్ట్రంలో పార్టీ చాలా వేగంగా వృద్ధి చెందింది, చివరకు ప్రతిఘటనా యుద్ధం ఆరంభమవడానికి ముందు కొమింగ్‌టాంగ్ ప్రాంతాలలోకెల్లా అతి పెద్ద నిర్మాణంగా పెరిగింది. అందుచేత పార్టీ భద్రతను ఖాయం చేసుకోవడానికై మనం మొట్ట మొదట నాయకత్వ అంగాల భద్రతను ఖాయం చేసుకు తీరాలి.

మన వర్గశత్రువులు పార్టీని నాశనం చేయాలనే వారి పన్నాగంలో, అన్నిటికన్నా ముందర, కమ్యూనిస్టు క్యాడర్లను హత్యచేసి, పార్టీ నాయకత్వ అంగాలను దెబ్బతీయనెత్నిస్తారు. ఆదేశం ఇవ్వగానే కింది నుండి పైదాకా వున్న మన స్థానిక నిర్మాణాలనన్నింటిని ఒక దెబ్బతో తుడిచి పెట్టేయడానికి అనువుగా వారు, మన పార్టీ నాయకుల మీద నిఘావేసి వుంచడానికీ, పార్టీ నాయకత్వ అంగాలలో చొరబడడానికి తమ ఏజంట్లను పంపుతారు, లేదా రహస్యంగా దాగొనివున్న ద్రోహుల్ని వాడుకుంటారు. అందుచేత, అన్నింటికన్నా ముందుగా పార్టీ నాయకత్వ అంగాలు ఆకస్మిక దాడులకు వ్యతిరేకంగా తమ జాగరూకతను తప్పనిసరిగా పెంపొందించుకోవాలి.

## మన నాయకత్వ అంగాల భద్రతను మనం ఎలా ఖాయం చేసుకోగలం?

మొదటిది, దాగొన్న ద్రోహుల పీడ వదిలించుకోవడానికి అలాంటి కొత్తవారు పార్టీలోనికి ప్రవేశించకుండా నిరోధించుకోవడానికి దర్యాప్తులు జరపడం పరమ ఆవశ్యకం. ఒక నాయకత్వ అంగంలోని నాయకుల నుండి, వంటవారిదాకా ప్రతి ఒక్కరూ సమగ్రమైన పరీక్షకు లోనుగావాలి, అలా అయితే మనం, నమ్మజాలనివాడు లేదా అనుమానించదగ్గ నేపథ్యంమ కలవాడు ఒక్కడంటే ఒక్కడు కూడా మిగిలి వుండకుండా ఖాయం చేసుకోగలం. అటువంటి పరీక్ష ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలి, దాన్ని స్వీకరించడానికి సిద్ధంగా వుండాలి.

మనం రహస్య కృషిని మంచిగా నిర్వహించాలి, అదే సమయంలో సమాజంలో ఒక ***'సేఫ్ కవర్'*** సంపాదించుకోవాలి. కేంద్ర కమిటీ, రాష్ట్రకమిటీలు నిర్దేశించిన రహస్యపని నియమాలను మనం తు.చ. తప్పకుండా పాటించాలి. మనం కమ్యూనిస్టులమని తెలిసిపోయేటట్లు చేయడం ద్వారా ప్రజల మన్నన చూరగొనే యత్నం చేయకూడదు లేదా మనం ఎవరో తెలిసి పోయేటటువంటి ఏ పద్ధతిలోనూ నడుచుకోకూడదు. సమాజంలో ***'కవర్'*** విషయానికి వస్తే, మనం తప్పనిసరిగా రెగ్యులర్ ఉద్యోగాలను సంపాదించుకోవాలి. ఎంతకాలం వీలైతే అంతకాలం వాటిని నిలబెట్టుకోవడానికి యత్నించాలి. పార్టీ రహస్యనిర్మాణాలలోని క్యాడర్లు నిజంగానే ఆధారపడగల `కవర్'వుంటే తప్ప, వారు దీర్ఘకాలం మనగల్గడానికి ఏ గ్యారంటీ వుండదు. దీని దృష్ట్యా, ఒక రెగ్యులర్ ఉద్యోగాన్ని సంపాదించి, నిలబెట్టుకోవడానికి, విప్లవకృషికి ఎంత ప్రాధాన్యత వుందో అంత ప్రాధాన్యత వుంది.

నాయకత్వ అంగాల భద్రత గురించి నొక్కి చెబుతున్నామంటే వాటికింది అంగాల భద్రతను నిర్లక్ష్యం చేయడం మన ఉద్దేశ్యం కాదు. క్రింది స్థాయి నిర్మాణాలు నాశనం చేయబడితే, అది కూడా నాయకత్వ అంగాల భద్రతను దెబ్బతీయగలదు.

## పార్టీ సభ్యుల రాసి(క్వాంటిటి)కి కాక వాసికి (క్వాలిటి)కి ప్రాధాన్యతనివ్వడం :

**ఈ సమస్యను శ్రద్ధగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఏమిటి?**

మొదటిది శత్రు ఆక్రమిత ప్రాంతాలలోనూ, గొప్ప వెనుకతట్టు ప్రాంతంలోనూ పార్టీ నిర్మాణాలు తప్పనిసరిగా రహస్యంగానే వుండాలి కాబట్టి. జపాన్ సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష పాలన కింద వున్న లేదా భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాల పాలనక్రిందవున్న తావులలో పని చేస్తూండడం మూలంగా, అవి ఒకవంక, సాయుధ అణచివేత రాజకీయ ప్రలోభం, శత్రు ఏజంట్ల విధ్వంసం, ఆకస్మికదాడుల ప్రమాదాలకు నిరంతరాయంగా ఎరవుతుంటాయి. మరోవంక, శత్రు బలగాలకు వ్యతిరేక పోరాటంలో వారికి, ఎయిత్ రూట్ ఆర్మీ, న్యూఫోర్త్ ఆర్మీలు సంరక్షిస్తున్న ప్రాంతాలలో పనిచేస్తున్న కామ్రేడ్లకులా ఆధారపడదగ్గ ఏ సాయుధ సేనలూ లేవు. పార్టీ సభ్యుల దృఢ విప్లవ సంకల్పం, సన్నిహితంగా పెనవేయబడిన నిర్మాణం, వారికి ప్రజలతో గల సంబంధాలు మినహా వారికి ఆధారపడగల్గేది ఏదీ లేదు., అటువంటి పరిస్థితులలో, పార్టీ సభ్యుల, రాజకీయ వాసి (క్వాలిటి) హీనస్థాయిలో వుంటే, పార్టీలోకి గూఢచారులు చొరబడితే, ఈ నిర్మాణాలు శత్రువుకు వ్యతిరేకంగా పట్టువదలని పోరాటాన్ని సాగించలేవు. సభ్యుల రాసికంటే సభ్యుల వాసికే అధికప్రాధాన్యత నివ్వాలని మనం పార్టీ మొత్తానికి పిలుపునిచ్చాం. ప్రత్యేకించి, శత్రువు ఆక్రమిత ప్రాంతాలలోనూ, గొప్పవెనుకతట్టు ప్రాంతంలోనూ ఈ విధానాన్ని మనం తప్పనిసరిగా అనుసరించాలి.

రెండవది, గొప్ప వెనుకతట్టు ప్రాంతంలో మనకు ఇప్పటికే గణనీయమైన సంఖ్యలోనే పార్టీ సభ్యులున్నారు. కాబట్టి, మనం వాసి గురించి నొక్కి చెబుతున్నాం. అక్కడే మన ధ్యేయం యింకా ఎక్కువగా సభ్యులను రిక్రూటు చేసుకోవడం కాదు. వున్న నిర్మాణాలను పటిష్టపరచుకోవడం.

మూడవది, గొప్ప వెనుకతట్టు ప్రాంతంలో సర్వసాధారణంగా పార్టీ నిర్మాణాలు తగినంతగా పటిష్టపర్చబడలేదు, అనేక తావులలో పార్టీ సభ్యుల వాసి ప్రమాణానికి తగ్గట్టు లేదు. అందుకనే మనం దాన్ని గురించి నొక్కి చెబుతాం. జపాను వ్యతిరేక పోరాటంలోనూ, కమ్యూనిజం కోసం పోరాటంలోనూ, దృఢంగానూ, వీరోచితంగానూ నిలబడే సభ్యులనేకులు శత్రు ఆక్రమిత ప్రాంతాలలో వున్నప్పటికీ, అలా లేని వారుకూడా చాలా మందే వున్నారు. గొప్ప వెనుకతట్టు ప్రాంతంలోని సభ్యులలో అత్యధికులు జపాను వ్యతిరేక యుద్ధ తొలిదినాల్లో పార్టీలో చేరారు. వారిలో కొందరు రాజకీయ పరిస్థితి

విషమించినా, లేదా కొన్ని ప్రలోభాలు వారి ముందు పెట్టబడినా వూగిసలాడే అవకాశం వుంది. యుద్ధ ఆరంభంలో మన కామ్రేడ్లలో కొందరికి రాజకీయ అనుభవమూలేదు, పార్టీ సభ్యులను రిక్రూటు చేసుకోవడంలో అనుభవమూ లేదు కాబట్టి విప్లవోద్యమంలో ఇది అనివార్యమే. అయితే, మన నాయకత్వ అంగాలు ఈ విషయంపై శ్రద్ధ పెట్టడంలో విఫలమయ్యాయి అనేది మరో ముఖ్య కారణమని మనం వొప్పుకుని తీరాలి.

పార్టీ సభ్యుల వాసిని పెంపొందింపచేయడానికి ప్రాధాన్యత నిస్తున్నాం అంటే, గొప్ప వెనుకతట్టు ప్రాంతంలో పార్టీ నిర్మాణాల విస్తరణకు స్వస్తి చెప్పడం మన ఉద్దేశ్యం కాదు. అక్కడ కొన్ని నిర్మాణాలలో చాలా ఎక్కువ మంది సభ్యులుంటే ఇతరాల్లో అతి కొద్దిమంది సభ్యులె వున్నారు. కొన్ని తావులలో ఒకే గ్రామంలో డజన్లకొద్ది పార్టీ సభ్యులున్నారు - బహుశా వందమందిదాకా - వారిలో అనేకులు పార్టీపని ఏదీ చేయరు. ఏ సమావేశాలలోనూ పాల్గొనరు. అటువంటి ఉబ్బిపోయిన నిర్మాణాలను రహస్యంగా వుంచడం కష్టం, అంతేకాక అవి సమర్ధవంతమైనవి కావు. అవి తమ సభ్యత్వాన్ని కత్తిరించుకోవాలి. పనిచేయ నిష్టపడనివారు, లేదా సమావేశాలకు హాజరు కానివారిని, పార్టీ నుండి వైదొలగమని కోరకూడదు, లేదా బహిష్కరించకూడదు. ఇక పై వారిని పార్టీ సానుభూతిపరులుగానే చూడాలి. సభ్యులుగా మిగిలివున్నవారు మరింత మేలైన వాసి కలవారై వుంటారు, రహస్యపనిని మరింత మంచిగా చేస్తారు. నాయకత్వ క్యాడర్లు మరింత ప్రాముఖ్యతగల విషయాలపై కేంద్రీకరించగల్గుతారు. సమాజంలో తేలికగా షెల్టరు పొందగలిగే చిన్నదే అయినా, సమర్ధవంతమైనది అయిన నిర్మాణాన్ని నిలబెట్టుకోవడం అనే విధానానికి ఇది అనుగుణ్యంగా వుంటుంది. పార్టీ సభ్యులు అతి కొద్ది మందే వున్న, లేదా అసలే లేని, ఇతోధికంగా రిక్రూటు చేసుకోవాల్సివున్న తావులలో మనం వాసికే ప్రాధాన్యతనివ్వాలి, గతంలోని తప్పులను నివారించుకోవాలి. గొప్ప వెనుకతట్టు ప్రాంతంలోని ప్రతి గ్రామంలోనూ ఒక పార్టీశాఖను నెలకొల్పాల్సిన అవసరం ఏదీ లేదు. అయితే, ప్రతి ***'సంయుక్త పావో'*** (కొన్ని గ్రామాలను కలిపి పావో అంటారు) ఒకటి లేదా రెండు పార్టీ శాఖ లుండాలి. ఒక శాఖలో మరీ ఎక్కువ మంది వుండకూడదు. అయిదు నుండి పది మందిదాకా వుంటే చాలు. ఒక స్థానిక పార్టీ నిర్మాణం, పనికి అవసరం ఏర్పడ్డప్పుడు మాత్రమే మరింత మంది సభ్యులను రిక్రూటు చేసుకోవచ్చు. దానికప్పటికే పెద్ద సభ్యత్వం వుంటే, అర్హతగల రైతులున్నప్పటికీ, అది నింపాదిగా ఆ పని చేయవచ్చు. వీరు పార్టీ సానుభూతిపరులుగా పనిచేయగలరు. పరిస్థితిలో మార్పు వచ్చి, పార్టీకి ఇతోధికంగా సభ్యులు కావాల్సి వచ్చినప్పుడు ఈ సానుభూతిపరులను ఎప్పుడైనా చేర్చుకోవచ్చు.

వాసిని మెరుగుపర్చడానికి, వెనుకబడిన శక్తులను పార్టీ నుండి క్షాళన చేయడమొక్కటేకాదు, ఎడ్యుకేషన్‌ను ముమ్మర పర్చడం కూడా అవసరమవుతుంది. అందరు పార్టీ క్యాడర్లు, అందరు అట్టడుగు స్థాయి సభ్యులు తమల్ని తామే ఎడ్యుకేట్ చేసుకోవడాన్ని కొనసాగించుకోవడానికై పార్టీ పుస్తకాలను, వార్తాపత్రికలను, తదితర పురోగామి ప్రచురణలను చదవాలి. ఈ విధంగా వారు వారి రాజకీయ స్థాయిని పెంచుకుంటూ పోగలరు. నిరక్ష్యరాసులైన కమ్యూనిస్టులు ఒక విప్లవబాధ్యతగానే చదవడం, రాయడం నేర్చుకోవాలి. గొప్ప వెనుకతట్టు ప్రాంతంలోని, శత్రు ఆక్రమిత ప్రాంతంలోని ప్రతి ఒక్క పార్టీ సభ్యుడు ఈ విధంగా దీర్ఘకాలిక పథకంతో అధ్యయనం చేస్తే, కొద్ది సంవత్సరాల కాలంలోనే మనకు రాజకీయ సామర్థ్యం గల వేనవేల క్యాడర్లుంటారు. ఇది సభ్యత్వాన్ని పెంచనప్పటికీ, వాసిలో మెరుగుదల, సంఖ్యలో పెరుగుదలకంటే ఎంతో ముఖ్యమైనది. ఇటువంటి క్యాడర్లను వేల, వేల సంఖ్యలో తర్ఫీదు చేసుకొని, సంరక్షించుకోగల్గితే, వారు విప్లవంలో అతి కీలకఘట్టాలలో అజేయమైన శక్తిగా రూపొందుతారు.

## పార్టీ పటిష్టీకరణను, ప్రజలలో కృషితో అనుసంధానించడం :

పార్టీ నిర్మాణాలను పటిష్టపరచుకోవడంలో, వాటిని కట్టుదిట్టం చేసుకోవడం ఒక పార్శ్వం మాత్రమే. పార్టీకి వెలుపల ప్రజలలో కృషి చేయడం కూడా తప్పనిసరిగా చేపట్టవలసిన చర్యే, ప్రజలతో సంబంధాలులేని, సముదాయాలనుండి విడివడి ఒంటరిదైన ఒక పార్టీ నిర్మాణం ఖచ్చితంగానే, ఒక గట్టి యూనిట్ కాబోదు. సమాజంలోని పై, క్రింది అంతర్వులు రెండింటిలోనూ ప్రజలలో కృషి చేయకపోతే, రహస్య సంస్థల భద్రతను ఖాయం చేసుకోవడం సాధ్యమవదు. పది ఏళ్ల అంతర్యుద్ధకాలంలో తెల్ల ప్రాంతాలలోని పార్టీ నిర్మాణాలు ఎంతో మూల్యాన్ని చెల్లించి ఈ గుణపాఠాన్ని నేర్చుకున్నాయి. రహస్య, బహిరంగ పనుల మధ్య సంబంధాన్ని, తేడాను అవి సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాయి. అందువల్ల చేయగలిగిన మేరలో ప్రజాకృషిని నిర్వచించలేక పోయాయి, తాము నెలకొల్పిన విస్తృత ప్రజాసంబంధాలను అత్యుత్తమంగా వినియోగ పెట్టుకోలేక పోయాయి. అందువల్ల పలుతావుల్లోని ప్రజలలో కృషి మొత్తంగా విఫలమైంది. దాని అనివార్య పర్యవసానంగానే రహస్య నిర్మాణాలు బహిర్గతమయ్యాయి. శత్రుదాడులకు గురయ్యాయి. నేటి రహస్య సంస్థలు ఆ బాధామయ అనుభవం నుండి గుణపాఠాలు నేర్వాలి. అందువల్లనే కేంద్రకమిటీ, పార్టీ నిర్మాణాలను పటిష్టపర్చుకోవడం, ప్రజారాశులతో సంబంధాలను విస్తృతపర్చుకోవడం అనేవి, పార్టీని బలోపేతం చేసుకోవడంలో రెండు విడదీయరాని పార్శ్వాలు అని పదే పదే చెప్పింది. రహస్య పార్టీ నిర్మాణాలు సోమరిగా కాలాన్ని వృధా చేయకూడదు. చడీచప్పుడు లేకుండా గట్టి కృషిలో మునిగిపోవాలి.

సమాజం మొత్తంలోనూ, ప్రజలలో కృషిని మెరుగుపర్చుకోవడం అంటే, అంతర్యుద్ధకాలంలో తెల్ల ప్రాంతాలలోని పార్టీ నిర్మాణాలు చేసినట్టుగా అనునిత్యం ఫ్యాక్టరీలలోనూ, స్కూళ్లలోనూ, గ్రామాలలోనూ ***'పోరాటం'*** కోసం వెంపర్లాడ మనడం మా ఉద్దేశ్యంకాదు. ప్రజలకు  అక్కరలేని, జయించే అవకాశంలేని అటువంటి రకం పోరాటం అప్పుడు నిర్వహించ వలసిన పోరాటం కాదు, ఇపుడూ నిర్వహించ కూడదు. ప్రజా బాహుళ్యంతో నిజమైన సంబంధాలు నెలకొల్పు కోవడంలో అటువంటి పద్ధతులు మనకు తోడ్పడవని అనుభవం తెలియ జెప్పింది. పార్టీ నిర్మాణాలు రహస్యంగా పనిచేస్తున్నప్పుడు, వాటికి ప్రజలకు నడుమ బంధం, నడిపిన పోరాటాల సంఖ్యపైకానీ, ఏర్పరచిన ప్రజాసంఘాల సంఖ్యపైగానీ,

వాటికోసం రిక్రూట్ చేసుకున్న సభ్యుల సంఖ్యపైగానీ, ఆధారపడి వుండదు. (దాదాపుగా అన్ని పెద్ద ప్రజాసంఘాలు ఇప్పుడు రద్దు చేయబడ్డాయి) ప్రజా సంక్షేమం కొరకు పార్టీ సభ్యులు ఎంతమేరలో కృషిచేశారు అన్నదానిపై అది ఆధారపడి వుంటుంది. మనం ఎక్కడైనా సరే, ప్రజల ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సంక్షేమం కొరకు పనిచేయగలం, వారి అండదండలను పొందగలం. ప్రజలలోని అత్యుత్తమ స్త్రీలు, పురుషులే కమ్యూనిస్టులు, వారు సముదాయ ప్రయోజనం కోసం పనిచేస్తే వారికి అలాంటి గుర్తింపు లభిస్తుంది. నిరంతరాయంగా ప్రజల ప్రయోజనాలకోసం పనిచేస్తూ వారు, కేవలం శ్రమజీవుల మద్దత్తునేకాక, సమాజంలోని మధ్యస్త, పై అంతర్వులలోని రుజువర్తనుల సానుభూతిని కూడా పొందుతారు, తద్వారా తమను వ్యతిరేకించడం కమ్యూనిస్టు వ్యతిరేకులకు క్లిష్టమయ్యేలా చేయగల్గుతారు. ప్రజలతో ఆ బంధాలను నిలబెట్టుకోవడానికి వారు పలు సంవత్సరాలు కష్టపడి పనిచేస్తే, వారు ప్రజలపై మంచి ప్రభావాన్ని కలగచేసి, ప్రజలలో బలంగా వేళ్లూనుకోగల్గడంలో సఫలులవుతారు.

ఒకానొక తావులోని ప్రజలు అవినీతికి బలవంతంగా డబ్బు వసూలుచేయడానికి వ్యతిరేకంగా తిరగబడితే, మనం ఉత్తగా నిలబడి చూస్తుండిపోవాలా? కానేకాదు, కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను సంరక్షించాలి. అయితే వారు ఏ ప్రజాపోరాటాన్నైనాసరే, జాగ్రత్తగా విశ్లేషించాలి. వారు రెండు ప్రత్యర్థి పక్షాల బలాబలాలను అంచనా వేయడంలో ప్రజారాశులకు సాయపడాలి, ప్రజాసానుభూతి ఏ మేరలో వుందో బేరీజు వేయాలి, పోరాట పర్యవసానాన్ని గురించి ముందుగానే అంచనావేసి చెప్పాలి. ప్రజలలో అత్యధిక సంఖ్యాకుల మద్దత్తును కూడగట్టడంలో విఫలమయ్యి, విజయం గురించి ఏ ఆశాలేకుండా ఒంటరిగా పోరాడవలసి వచ్చే ఏ పోరాటాన్ని సృష్టించకూడదు, లేదా ప్రారంభించయత్నించకూడదు. ***'పోరాటం'*** గురించి మన అవగాహన అతిపరిమితమైనదని మనం వొప్పుకోవాలి, ఆ సంకుచిత భావన నుండి మనల్ని విముక్తం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజాసంక్షేమం కోసం పనిచేసి, మధ్యస్త శక్తులతోసహా ప్రజారాశుల మద్దత్తును సంపాదించుకోవడం వాస్తవానికి అభివృద్ధి నిరోధకులను ఏకాకుల్ని చేయడానికి సాగే ఒక రకం పోరాటమని మనం గ్రహించాలి.

ఇక చివరగా, ప్రజలలో కృషిని సజావుగా నిర్వర్తించాలంటే మనం ఒక సూత్రాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజలలో కృషి, ఐక్యసంఘటన పరస్పరం ఆవశ్యకమైనవి. ఉదాహరణకు, ఒకానొక గ్రామంలో పార్టీ సభ్యులు ఒక పాఠశాలను ఆరంభించడానికై అడ్డంకుల నధిగమించడానికిగాను, రుజువర్తనులైన స్థానిక పెద్దలతో కలిసి పనిచేశారు. ఈ అవగాహన, ఐక్యసంఘటనా కృషి (రుజు వర్తనులైన పెద్దమనుషులతో కలిసి పనిచేయడం) ప్రజా కృషి (ప్రజారాశులకు ఉపయోగపడే బడిని నెలకొల్పి, తద్వారా వారి విశ్వాసాన్ని చూరగొనడం) వీటి సమ్మేళనం, ఒక పోరాటం (అడ్డంకులనధిగమించే క్రమంలో అడ్డంకులు కల్పించేవారిని ఏకాకుల్ని చేయడం). పార్టీ సభ్యులు స్థానిక పెద్దమనుషుల సహకారాన్ని స్వీకరించి వుండకపోతే బడిని ఏర్పాటు చేయడం కష్టమై వుండేది. ఈ బడి పథకం లేకపోయివుంటే, ఐక్యసంఘటనా కృషికి కేంద్ర అంశం ఏదీ వుండేది కాదు. ఐక్యసంఘనా కృషి, ప్రజాకృషి భిన్నమైనవే అయినప్పటికీ వాటి మధ్య సంబంధం వుంది. క్లుప్తంగా, పార్టీ వెలుపల మన కార్యకలాపాల్లో, మనం సమాజంలోని ఒక్క అంతరువులోనేకాక, పై అంతరువు, క్రింది అంతరువు రెంటిలోనూ సమర్ధవంతంగా పనిచేయడానికి కృషిచేయాలి. ఎక్కడైనా, ఎప్పుడైనా పై అంతర్వునుండి ప్రేరణ క్రింది అంతర్వులో పనిచేయడానికి ఉపకరిస్తుంది.

మనకు స్వతంత్రంగా పనిచేయగల, మెరుగైన అర్హతలుగల సభ్యులతో కూడిన, చిన్నవి, పకడ్బందీగా వుండేవీ సమర్థవంతమైనవి, బాగా మెరుగుపర్చబడినవి అయిన రహస్య నిర్మాణాలు వుంటే, అపుడు మన నాయకత్వ క్యాడర్లు అంతరంగిక విద్రోహాలకు వ్యతిరేకంగా రక్షణ చర్యలు తీసుకోవడంపై తమ శక్తియుక్తులు వినియోగించే అవసరం ఇకపై వుండదు. వారికి పార్టీ సమావేశాల కోసం ప్రతిరోజూ అక్కడికి ఇక్కడికి పరుగులెత్తే అవసరం వుండదు. ఒక పార్టీ నిర్మాణం అంతర్గతంగా బలంగా వుండి, ప్రతి సభ్యుడికి ఒక రెగ్యులర్ ఉద్యోగం వుంటే, ప్రతి ఒక్కరిని ఒక మంచి వ్యక్తిగా గుర్తిస్తూ వుంటే, అప్పుడు ఆ నిర్మాణాన్ని పటిష్టపర్చబడ్డ నిర్మాణంగా పరిగణించవచ్చు, కేవలం అటువంటి నిర్మాణం మాత్రమే కేంద్రకమిటీ ఇచ్చిన బాధ్యతను నెరవేర్చగలదు. దీర్ఘకాలంపాటు రహస్యంగా పని చేసి, సమయం ఆసన్నమైనప్పుడు వాడుకోగల శక్తిని సంతరింపజేసుకోగలదు.

# ఉత్తర తెలంగాణాలో నిర్బంధకాండ : ప్రజాప్రతిఘటన

చంద్రబాబు తెలుగుదేశం ప్రభుత్వమూ, కేంద్రంలోని భా.జ.పా. కూటమి ప్రభుత్వమూ ఉత్తర తెలంగాణాలో గత ఆరు నెలలుగా విప్లవ రైతాంగాన్ని, కార్మికులను, స్త్రీలను, యువజనులను హత్యచేస్తూ, మూకుమ్మడి అరెస్టులకు పాల్పడుతూ, మూకుమ్మడి చిత్రహింసలు పెడుతూ తమ అణచివేత క్యాంపెయిన్‌ను ఉధృతం చేశాయి.

ఉత్తర తెలంగాణా గెరిల్లా జోన్‌లో 2000 జనవరి-మే నెలల కాలంలో కనీసం 120 మందిని చంపివేశారు. ఈ పాశవిక హత్యలేకాక, వేలాది మంది యువజనులను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి, దొంగకేసులు బనాయించి జైళ్లలో కుక్కారు. మన పార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నట్టుగా వారి నుండి బలవంతంగా ప్రకటనలు తీసుకుంటూ నక్సలైట్లు పెద్ద ఎత్తున సరెండర్ అవుతున్నారని ప్రచారం చేస్తున్నారు. ఉదాహరణకు వరంగల్ జిల్లాలోని పరకాల, చిట్యాల ప్రాంతాలలో పోలీసులు ఒక పెద్ద ఎత్తు భీభత్సకాండను అమలు జరిపి, విప్లవ రైతు కూలీ సంఘం, విప్లవ మహిళా సంఘం, గ్రామ రాజ్యకమిటీ,, విప్లవ బాల సంఘాలకు చెందిన 300 మందిని ఒక్క మే నెలలోనే అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిపై తుపాకులు ఎక్కుపెట్టి పీపుల్స్‌వార్ పార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నట్టు, ఆ పార్టీని మా గ్రామంలోకి అడుగు పెట్టనీయం అంటూ పత్రికా ప్రకటనలను ఇచ్చేట్టు చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి ప్రాంతంలో సిరిచెలమ, సిరికొండ, గోదుమల్ల, నారాయణపూర్, కుంటాల, గుండాల, జెండగూడా తుమ్మలపాడు, సోన్‌పల్లి, డాబా, తేజ్‌పూర్, శాంతపూర్, ధర్మాసాగర్, బుగ్గారం, నాగమల్లె మొదలైన గ్రామాలలోని విప్లవ ప్రజా సంగాల కార్యకర్తల ఇళ్లపై రెయిడ్‌లు జరిగాయి; అనేకుల్ని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు.

కరీంనగర్ జిల్లాలోని కోనరావుపేట మండలంలో నక్సలైట్లతో సంబంధాలున్న వాళ్లుగా అనుమానించబడిన వారి ఇళ్లపై పోలీసులు రెయిడ్‌లుచేసి వందలాది మంది యువకుల్ని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు.

ఆదిలాబాద్ జిల్లాలోని తాళ్లమడుగు మండలంలోని 15 గ్రామాల ప్రజలపై దొంగకేసులు బనాయించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిపోర్టు చేయాలనే షరతు విధించారు. నక్సలైట్లకు అన్నం పెడితే, మీ అంతు చూస్తామని ప్రజలను బెదిరిస్తున్నారు.

వరంగల్ జిల్లా, రేగొండ మండలంలోని గోరకొత్తపల్లిలో పోలీసులు పసిపిల్లల్ని కూడా వదలకుండా, పలువురిని అరెస్టుచేసి చిత్రహింసలు పెట్టారు.

ఖమ్మం జిల్లాలోని మణుగూరు, కొత్తగూడెం, గుండల తదితర మండలలాలోని పలుగ్రామాలలో ప్రజలను అరెస్టు చేసి, మన పార్టీకి వ్యతిరేకంగా బలవంతపు ప్రకటనలనిప్పించారు.

## పెరుగుతోన్న ప్రజాప్రతిఘటన :

రాజ్యం ఉత్తర తెలంగాణాపై అమలుజరుపుతున్న నిర్బంధకాండకు ప్రజలు పెద్ద ఎత్తున ప్రతిఘటన ద్వారా జవాబు చెబుతున్నారు. పోలీసులు అరెస్టులకు పాల్పడిన సందర్భాలలో ప్రజలు పెద్ద ఎత్తున కదులుతున్నారు. పోలీసుల్ని నిలదీస్తున్నారు. ప్రజల బహిరంగ ధిక్కారానికి సంబంధించిన కొన్ని ఘటనలను ఈ క్రింద ఇస్తున్నాం.

సింగాపూర్ గ్రామంలోకి వచ్చిన పోలీసులు ఒక యువకుడిని అరెస్టు చేయబోగా, మొత్తం గ్రామమంతా కదిలి వారిని అడ్డుకొంది. ఇక గత్యంతరం లేక పోలీసులు ఆ యువకుడిని వదిలి పెట్టారు.

ఇంద్రవెల్లి మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఉట్నూరు పోలీసులు విప్లవ రైతుకూలీ సంఘ కార్యకర్తల్ని కొందర్ని అరెస్టుచేసి, పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఆ చుట్టు పక్కల వున్న 20 గ్రామాల ప్రజలు పోలీస్ స్టేషన్ ముందు ప్రదర్శనలు జరిపారు, ఆ యువకుడిని విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తూ మూడురోజుల పాటు ధర్నా చేశారు. ఆ పోలీస్ స్టేషన్‌కు స్వంత పనిమీద వచ్చిన మాజీ మంత్రి రామచంద్రారెడ్డి జీపును అడ్డగించారు. ప్రజలు మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ముందు కూడా ప్రదర్శనలు జరిపి, చివరకు తమ సంఘటిత బలంతో ఆ యువకుడిని విడిపించుకున్నారు.

వరంగల్ పోలీసులు మే నెల చివరి వారంలో రేగొండ మండలం, గోరికొత్తపల్లి సర్పంచ్‌ని, నక్సలైట్లతో సంబంధాలున్నాయన్న నెపంతో అరెస్టు చేయగా, ఆ గ్రామ ప్రజలు ఆ చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సర్పంచిని పోలీసులు పెట్టిన చిత్రహింసలకు ఆగ్రహించిన ప్రజానీకం, పరకాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ముందు ప్రదర్శన జరిపి, రహదారిపై రాకపోకలను స్తంభింపజేశారు.

**ఆదిలాబాద్ పోలీస్‌లు విధించిన అప్రకటిత కర్ఫ్యూను ధిక్కరిస్తూ ఇంద్రవెల్లి ప్రజలు ఏప్రిల్ 20, 26ల మధ్య ఇంద్రవెల్లి స్మారక సప్తాహాన్ని నిర్వహించుకున్నారు.** ఇంద్రవెల్లిలో జరగనున్న సభను భగ్నంచేయడానికై పోలీసులు ఏప్రిల్ 19 నాడే గుడిహత్నూర్ నుండి ఉట్నూరుకు వెళ్లే 3 కిలోమీటర్ల రోడ్డును దిగ్బంధించారు. అయితే పోలీసుల ఎత్తును చిత్తు చేస్తూ ప్రజలు ఆ సమీపాన్నే గల ఇచ్చోడ గ్రామంలో అమరవీరుల స్మృతిలో ఒక తాత్కాలిక స్థూపాన్ని నిర్మించి, పెద్ద బహిరంగ సభను నిర్వహించుకున్నారు. అంతేకాక, ఆదిలాబాద్ అడవుల్లోని పలు గ్రామాల్లో కూడా స్మారక సభలు జరిగాయి.

## "మాకు తాగునీరు కావాలి, జన్మభూమి ప్రహసనం కాదు!"

నక్కజిత్తుల చంద్రబాబు నాయుడు 12వ రౌండు 'జన్మభూమి' ప్రహసనాన్ని 'నీరు మీరు' అనే నినాదంతో ప్రారంభించాడు. గత సంవత్సరం (2000) వేసవిలో ఆంధ్రరాష్ట్రంలోని ఇంచుమించుగా 60 శాతం ప్రాంతంలో అనావృష్టి విలయతాండవం చేసింది. రాష్ట్రంలోని మొత్తం 1104 మండలాల్లో దాదాపు 688 మండలాలు అనావృష్టి వాతకు గురయ్యాయి; ప్రజలు దాహంతో అలమటిస్తూ, కుండనీటిని రూపాయలు చెల్లించి కొనుక్కోవలసిన స్థితికి నెట్టబడ్డారు. ఎప్పటికప్పుడు నినాదాలు, పథకాలతో ప్రజలను మోసం చేయడంలో ఆరితేరిన చంద్రబాబు నాయుడు ఈసారి పై నినాదంతో ముందుకు వచ్చాడు.

అయితే ప్రజలను కొంతకాలం పాటు మోసగించగలడేగాని ఎల్లకాలం మోసగించలేడని ఈ గజమోసగాడికి తెలియవచ్చేలా, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ప్రజానీకం ఈ రౌండు జన్మభూమి సందర్భంగా తమ నిరసన ప్రదర్శనలు, పోరాటాల ద్వారా గుణపాఠం గరిపారు. ఈ రౌండు జన్మభూమిలో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటూ, తెలుగుదేశంపై తమకు ఏ భ్రమలు లేవని నిరూపించారు. ఖాళీ కుండలతో మహిళలు ప్రదర్శనే ఈసారి జన్మభూమి ప్రహసనంలో సర్వత్రా కానవచ్చిన దృశ్యం.

ఆదిలాబాద్ జిల్లాలోని తాళ్లమడుగు మండలంలోని ప్రజలు గత 11 రౌండ్ల జన్మభూమి కార్యక్రమాల్లో తమ డిమాండ్లలో ఏ ఒక్కటి కూడా పరిష్కారమైన పాపాన పోలేదంటూ, 12వ రౌండ్‌ను బహిష్కరించారు. బెల్లంపల్లి మండలం, అనకాపల్లి గ్రామప్రజలు జన్మభూమిని బహిష్కరించడమేకాక, మే 6నాడు అధికారులు ఆ గ్రామానికి వచ్చినప్పుడు వారిని ఘెరావ్‌చేసి, ఒక ఇంజనీరును కొట్టబోయారు. పోలీసులు జోక్యం చేసుకొని ఒక యువకుడిని అరెస్టు చేయగా ప్రజలు పోలీసులకు వ్యతిరేకంగా, అధికారుల, రాజకీయ నాయకుల అవినీతికి వ్యతిరేకంగా నినాదాలనిచ్చారు. ఇచ్చోడ మండలంలో ఒక జన్మభూమి జీపును తగులబెట్టారు.

కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండల కేంద్రంలో ప్రజలు జన్మభూమిని బహిష్కరించారు. గ్రామసభ నిర్వహించబోయిన అధికారులపై ప్రజలు దాడిచేయగా వారు పారిపోయారు. జగిత్యాల

మండలంలో అనేక గ్రామాల ప్రజలు జన్మభూమిని బహిష్కరించారు. హుస్నాబాద్ పట్టణ ప్రజలు జన్మభూమిని బహిష్కరించారు. తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాలలోని మహిళలు తలలపై ఖాళీ కుండలతో నిరసన ప్రదర్శనలు జరిపారు. మొగిలిగూడెంలో ప్రజలు అధికారులను గదిలో పెట్టి తాళం వేయగా, పోలీసులు వచ్చి విడిపించుకున్నారు. వెలగటూర్ మండలం, షకాపూర్ గ్రామంలోని మహిళలు తక్షణమే తాగునీటి వసతి ఏర్పాటు చేయకపోతే వచ్చిన దారినే పొమ్మని అధికారులను తరిమేశారు. జమ్మికుంట మండలం, మెడిపల్లి గ్రామ మహిళలు, మే 6 నాడు కార్యక్రమ నిర్వహణకు వచ్చిన అధికారులను గదిలో పెట్టి తాళం వేశారు. చిగురు మామిడి మండలం, లంబాడిపల్లె గ్రామస్థులు తాగునీటి వసతి కోసం డిమాండ్ చేస్తూ అధికారులను ఘెరావ్ చేయగా మహిళలు ఖాళీ కుండలతో ప్రదర్శన జరిపారు. కోహెడ మండలం, బస్వాపూర్ గ్రామ మహిళలు పెద్ద ఎత్తున కదిలి ఖాళీ కుండలతో రోడ్డును దిగ్బంధించి, 4 గంటలపాటు రాక పోకలను అడ్డుకొన్నారు.

నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామంలో మే 3 నాడు స్వయంగా చంద్రబాబునాయుడు పాల్గొన్న సభలోనే, మహిళలు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసించారు. మహిళల ఉద్ధరణకై తాను పాటుపడుతున్నానని చంద్రబాబు నాయుడు ప్రగల్భాలు పల్కసాగగా, అతడి మాటలన్నీ కట్టుకథలే నంటూ అక్కడ గుమికూడిన మహిళలు కిలో 2 రూపాయల బియ్యం ధరను 5 రూపాయలకు పెంచిన సంగతిని, సారా నిషేధాన్ని ఎత్తివేసిన సంగతిని, నిత్యావసర వస్తువుల ధరల్లో పెంపుదల విషయాన్ని అక్కడికక్కడే ఎత్తి చూపి వాడిని సవాలు చేశారు. దాంతో చంద్రబాబుకు గొంతు పెగలలేదు; ఇక ఆగ్రహంతో అక్కడి నుండి హడావుడిగా నిష్క్రమించాడు.

ఇదే జిల్లాలోని దోమకొండ మండల జన్మభూమి నోడల్ టీం ఆగస్టు 5నాడు, సంగమేశ్వర గ్రామంలో, ఈ జన్మభూమి ప్రహసనంలో భాగంగా ఒక గ్రామ సభను నిర్వహించడానికై జీపుల్లో తరలివెళ్లింది. జీపులు గ్రామంలో ప్రవేశించి గ్రామ పంచాయితీ కార్యాలయానికి చేరుకోగానే, ప్రజలు పెద్ద ఎత్తున జమ అయి, వాహనాలను నిలిపివేసి, గత గ్రామ సభల్లో తాము లేవనెత్తిన సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని అధికారులను నిలదీశారు. నోడల్ అధికారి జన్మభూమి కార్యక్రమాన్ని ఆకాశానికెత్తుతూ వాగసాగాడు. దాంతో రెచ్చిపోయిన ప్రజానీకం నినాదాలు చేస్తూ, ఈ అధికారులను జీపుల నుండి దిగనివ్వలేదు. వాహనాలపై పేడను చల్లుతూ, నోడల్ బృందానికి చీపుళ్లతో స్వాగతం పల్కారు. నానాటికి అధికమవుతున్న విద్యుత్ కోతలు, విపరీతంగా పెంచబడిన విద్యుత్ ఛార్జిలు, ఆ గ్రామం ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు వ్యతిరేకంగా తమ నిరసనలను తెలియజేశారు. వారు నోడల్ టీమును ఘెరావ్ చేశారు. గ్రామసభ జరపాలనే ఆ టీము అభ్యర్థనను తోసిపుచ్చారు. అయితే నోడల్ టీము గ్రామసభ జరిపి తీరుతామనే బెదిరింపులకు దిగింది.

ఇక దాంతో కోపగించిన ప్రజలు, నోడల్ అధికారిని జీపులోంచి బయటకు లాగడానికి ప్రయత్నించారు; ఈ పెనుగులాటలో అధికారులకు పిడిగుద్దులు పడ్డాయి. అక్కడనే వున్న దోమకొండ ఎస్ఐ, అధికారుల రక్షణకై ఉరికాడు, ప్రజలు వాడిని కిందపడేసి చితకబాదారు; వాడి మొహాన పేడను కూడా పులిమారు. గ్రామ సభను బహిష్కరిస్తున్నామని తక్షణమే వాపసు వెళ్లిపొమని ప్రజలు నోడల్ టీమును హెచ్చరించారు. కంగుతిన్న నోడల్ అధికారులు మండల కార్యాలయానికి తిరిగి వెళ్లి, పోలీసు కంప్లైంటు ఇచ్చారు. ఆ మరుసటి రోజున పోలీసులు ఆ గ్రామంపైబడి, 16 మందిని అరెస్టు చేసి దోమకొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే, 200 మందికి మించిన సంగమేశ్వర్ గ్రామప్రజలు దోమకొండ మండల కార్యాలయం ఎదుట రాస్తారోకోను నిర్వహించి, అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. ప్రజా ప్రతిఘటనకు భయపడిన పోలీసులు, అరెస్టు చేసిన వారందర్నీ కోర్టులో హాజరుపరిచారు.

వరంగల్ జిల్లాలోని పోతరాజుపల్లి, ఇస్పిపేట, తిమ్మాపురమ్, గోవిందపురమ్, శనిగారమ్ తదితర అనేక గ్రామాల ప్రజలు 'జన్మభూమి' కార్యక్రమాన్ని బహిష్కరించారు. జన్మభూమి అధికారులను తన్ని తరిమేశారు. వరంగల్ పట్టణంలో కూడా, 47వ డివిజన్ ప్రజలు 'జన్మభూమి'ని బహిష్కరించారు, అధికారులను ఘెరావ్ చేసారు. ఈ ఘెరావ్‌లో 200 మంది మహిళలు ఖాళీ కుండలతో పాల్గొన్నారు. కడవెండి, దేవరుప్పల మండలాల్లోని ప్రజలు, నోడల్ అధికారుల చేత కలుషిత నీటిని తాగించారు - ఈ నీరు ప్రభుత్వం తాగునీటి పథకం కింద సరఫరా చేస్తున్న నీరే.

ఖమ్మం జిల్లాలోని గుబ్బగుర్తి గ్రామంలో మహిళలు ఖాళీ కుండలతో రోడ్డును దిగ్బందించి, అధికారులను తమ గ్రామంలోకి అడుగుపెట్టనివ్వలేదు. అలానే జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు జన్మభూమిని బహిష్కరించారు.

# ఆంధ్ర

## అనంతపూర్ జిల్లాలో భూ పోరాటం!

ఆంధ్రలోని అనంతపూర్ జిల్లా, పాలకవర్గాల మధ్య నిర్దాక్షిణ్యంగా సాగే ముఠా కక్షల రాజకీయాలకు ఆలవాలమైన రాయలసీమ ప్రాంత జిల్లాలో ఒకటి. విప్లవోద్యమం బలపడే కొద్దీ ప్రజలు ఈ ముఠా కక్షల రాజకీయాల నుండి క్రమంగా బయటపడుతూ విప్లవోద్యమంలో చేరుతున్నారు. దీంతో ప్రభుత్వం ప్రజలపై నిర్బంధకాండను తీవ్రతరం చేసింది. ప్రజలను ముఠా కక్షల రాజకీయాలకే అంటిపెట్టుకొని వుండేటట్టు చేయడమే పాలకవర్గాల ధ్యేయం. అయితే ప్రజలు క్రమక్రమంగా ఈ విషయాన్ని గ్రహిస్తూ, భూస్వామ్య గూండా గ్యాంగులను, పోలీసులను ప్రతిఘటిస్తూ, భూఆక్రమణ పోరాటాలతో ముందుకు సాగుతున్నారు.

పెన్నహోబిలం దళం ఏరియా, ఆముదాల గ్రామస్థులు, విప్లవరైతు కూలీ సంఘం, విప్లవ మహిళా సంఘాల ఆధ్వర్యంలో

ఒక భూపోరాట కమిటీని ఏర్పాటు చేసుకొని భూస్వాముల పట్టాభూముల్ని ఆక్రమించుకున్నారు. ఎర్రజండాలు, బ్యానర్లు చేబూనిన 120 మంది మహిళలు, 140 మంది పురుషులు ఊరేగింపుగా తరలివెళ్లి టి. సి. సుబ్బరాయుడు అనే భూస్వామికి చెందిన 50 ఎకరాల మాగాణి (తరి) భూమిని, వేలూరు చిన్న రామన్నకు చెందిన 30 ఎకరాల మెట్ట (కుష్కి) భూమిని సిరిడిపల్లి నర్సయ్యకు చెందిన 30 ఎకరాల మెట్టభూమిని ఆక్రమించుకున్నారు. ఈ ఆక్రమణ కార్యక్రమం తర్వాత ఆ 300 మంది38 నాగళ్లతో ఆ పొలాలను దున్ని 120 ఎకరాలలో సమిష్టిగా రాగిపంటను వేశారు.

1998లో రాకెట్ల, కౌకుంట, గ్రామ ప్రజలు విప్లవ రైతుకూలీ సంగం నాయకత్వాన కదిలి, అప్పటి తెలుగుదేశం ఎంఎల్ఏ, భూస్వామి పయ్యావుల కేశవకు చెందిన పట్టాభూముల్ని ఆక్రమించు కున్నారు. అయితే వాడు తన పలుకుబడిని అధికారాన్ని వినియోగించుకొని ఆ భూమిని ఎస్‌సి కార్పోరేషన్ వారిచే కొనిపించాడు. ప్రజల మధ్య చిచ్చులు పెట్టి, వారిని ముఠా కక్షల రాజకీయాల్లోకి లాగాలని చూశాడు. ప్రజల మధ్య తగాదాలు సృష్టించేయత్నంలో భాగంగా ఎస్‌సి కార్పోరేషన్ కొంత భూమిని ప్రజలలో ఒక సెక్షన్‌కు కెటాయించింది. అయితే విప్లవ రైతు కూలీ సంఘం ఈ ప్రభుత్వ కుట్రకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, భూపోరాట కమిటీని ఏర్పరచింది. ఆ కమిటీ నాయకత్వం క్రింద కదిలిన ప్రజలు, ఆ భూముల్ని గతంలో ఆక్రమించుకున్న పోరాటంలో పాల్గొన్న పేదలకే ఆ భూముల్ని కెటాయించాలని డిమాండ్ చేశారు. రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో ఊరేగింపులు తీసి బహిరంగ సభ జరిపారు. భూస్వామ్య కుట్రను గ్రహించిన దళితులు, ఎస్‌సి కార్పోరేషన్ తమకు కెటాయించిన భూమిని స్వీకరించ తిరస్కరించారు.

కుడేరు మండలం కలగల్లు గ్రామ ప్రజలు భూస్వామి నారాయణ రెడ్డికి చెందిన 25 ఎకరాల పట్టా భూమిని ఆక్రమించుకున్నారు. భూస్వామి పోలీసులను పిలిపించి, అరెస్టులు చేయించాడు. పోలీసులు రైతుల్ని చిత్రహింసలు పెట్టి వారిపై దొంగకేసులు బనాయించారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు ఆ భూస్వామి ఇంటిని, ఎలక్ట్రిక్ మోటార్లను, ధ్వంసం చేశారు. వాడి భూముల్ని దున్నడం బందు పెట్టారు. ప్రజలను బెదిరించి లొంగదీసుకోవాలనే తన ప్రయత్నాలు విఫలమవ్వడంతో ఆ భూస్వామి తన మకాంను అనంతపురం పట్టణానికి మార్చాడు. అన్ని ప్రయత్నాలు విఫలమవగా చివరికిప్పుడు ప్రజలకు లొంగివచ్చి, వారి డిమాండ్లకు వొప్పుకున్నాడు. ప్రజలను అరెస్టు చేయించి, కేసులు పెట్టించినందుకు నష్టపరిహారం చెల్లించాడు. ఆక్రమించుకున్న భూమిలో 25 ఎకరాలను రైతుకూలీలకు అప్పజెప్పాడు. ప్రజల ముందు బహిరంగ క్షమాపణలు చెప్పాడు.

ఉరవకొండ మండలంలోని పలుగ్రామాలలోని బడా భూస్వాములు, తమ భూముల్ని పేదరైతులకు కౌలుకిచ్చి, కౌలుకింద పంటలో పెద్దభాగాన్ని కాజేస్తున్నారు. జీవనోపాధికి వేరే గత్యంతరం ఏమీ లేని పేదరైతులు ఈ విపరీతమైన కౌలు చెల్లిస్తూ భూస్వాముల పొలాలను సాగుచేసుకుంటున్నారు. ఈ తీవ్రదోపిడీ భారాన్ని మోయడం సాధ్యమవదని వారు విప్లవరైతుకూలీ సంగం ఆధ్వర్యంలో కౌలు రేట్ల తగ్గింపు కమిటీని ఏర్పరచుకున్నారు. భూస్వాములు ఈ పేదరైతుల డిమాండ్లను తిరస్కరించారు. దానితో ప్రజలు భూస్వాముల పొలాలలో సాగును బంద్‌పెట్టారు. పొలాన్ని సాగుచేయ యత్నించిన ఒక భూస్వామిని, వాడి భరతం పడతామని హెచ్చరించారు. 12 రోజుల పోరాటం తర్వాత, భూస్వాములు లొంగివచ్చారు, కౌలు రేట్లను తగ్గించడానికి అంగీకరించారు.

పోరుపథంలో ....... ఝార్ఖండ్

## "మాయదారి రాజ్యం మంటగలిసిపోనీ!"

## పలామూ ప్రజలు స్వయంకృషితో నిర్మించిన ఆనకట్ట

# "ప్రజాస్వామిక" ఝార్ఖండ్ నిర్మాణ దిశలో ప్రజారాశులు వేసిన మరో ముందడుగు!!

నిరంతరాయంగా కరువుకాటకాల కోరల్లో చిక్కి విలవిలలాడు తుండిన ఝార్కండ్‌లోని పలాము ప్రాంతపు ప్రజానీకం "మాయదారి రాజ్యాన్ని మంటగలిసిపోని", "మా బతుకుల్ని మేమే బాగు చేసుకుంటాం" అంటూ గఢ్వా జిల్లాలో బెల్‌డహ దగ్గర ఒక ఆనకట్టను స్వయంకృషితో నిర్మించుకున్నారు. వందలాది మంది స్త్రీ, పురుషులు, బాలలు, వృద్ధులు సైతం రెండేళ్లపాటు రాత్రనక పగలనగా, పలుగు పారలు చేతబట్టి నెత్తిన మట్టిని, బండరాళ్లనూ మోస్తూ ప్రకృతితో పోరాడుతూ ప్రభుత్వ దమనకాండను ఎదిరిస్తూ, తమ జీవితాల్లో కొత్త వెలుగుల్ని నింపగల ఈ ఆనకట్టను నిర్మించుకున్నారు.

వారి ఈ కఠోర కృషి నల్లేరు మీద బండిలా సాగలేదు. ప్రభుత్వ యంత్రాగమూ, కిరాయి పోలీసు బలగాలు, వారికి అడుగడుగునా అడ్డుతగిలి, వేధించి, వారి ఈ కృషిని భగ్నంచేయడానికి విశ్వప్రయత్నాలు చేశాయి. అయినప్పటికీ, ఈ నిర్బంధకాండను సరకు చేయకుండానే గఢ్వా ప్రజానీకం పట్టిన పట్టు విడవకుండా తమ కృషిని కొనసాగించి పూర్తి చేశారు.

ఈ ఆనకట్ట (చెక్‌డ్యామ్) నిర్మాణం వెనక సారధులెవరు?

దాన్ని ఎలా నిర్మించగలిగారు? ఈ ప్రశ్నలకు జవాబుల కోసం ప్రభుత్వ యంత్రాంగం తలలు బాదుకుంటోంది. నక్సలైట్లు (మన పార్టీ) దీని వెనుక వున్నారని వారి సంశయం. అయితే ఇక్కడి ప్రతి నోటా వినవచ్చేది ఒకటేమాట. 'ప్రజలే చేయి చేయి కలిపి దీన్ని నిర్మించుకున్నారు' అని. ఏది ఏమైనా ఈ ఆనకట్ట కోసం ఇంచుమించుగా 15 గ్రామాలలో ఉద్యమాన్ని నడిపి, చందాలు సేకరించి, శ్రమదానాన్ని సంఘటితం చేసి ఈ ఆనకట్టను నిర్మించిన ఘనత ఈ ప్రాంతపు 'సించాయ్ సంఘర్ష్ సమితి' (ఇరిగేషన్ పోరాట కమిటీ)కే చెందుతుంది.

ఈ ఆనకట్ట మంఝైల్ బ్లాక్‌కు చెందిన నాలుగు పంచాయితీల క్రిందకు వచ్చే 17 గ్రామాలకు ప్రయోజనం కల్పిస్తుంది. ఇప్పటిదాకా బీడు పడిపోయివున్న విస్తారమైన మెట్ట భూములకు అది సాగునీటిని అందించగల్గుతుంది. బిష్ణుపురా నుండి ఆనకట్ట వరకు కచ్చా రోడ్డు కిరువైపులా దీనికి సంబంధించిన దాఖలాలు ఇప్పటికే కనిస్తున్నాయి. బంజహరి, అడర్, సెమ్రి గ్రామాలలోని పొలాలు నీటితో తడిసి మెరుస్తున్నాయి, వరి నాట్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

తమ ఆనకట్ట నిర్మాణ కథనాన్ని వినిపించడానికై ఇక్కడి గ్రామస్థులు ఎంతో కుతూహలపడుతున్నారు. భారత దేశంలోని వివిధ ప్రాంతాలలో కట్టడాల నిర్మాణంలో అనుభవాన్ని సంతరించుకుని తద్వారా ఇటువంటి నిర్మాణాలకు రూపకల్పన చేసి, నిర్మించగల సిద్ధహస్తులైన మేస్త్రీలు తమ మధ్యలో వున్నారని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఆనకట్ట నిర్మాణం వెనుక వున్న ఇంజనీరింగ్ కౌశల్యాన్ని చూసి గఢ్‌వా ఎస్‌పియే చకితుడయ్యాడు. ప్రత్యేకించి వరదనీరు భద్రంగా వెళ్లిపోవడానికి చేయబడిన ఏర్పాట్లు ఆయనకు ఆశ్చర్యాన్ని కలుగజేశాయి. స్వచ్ఛంద శ్రమతో కూడా కలుపుకొని ఈ ఆనకట్ట నిర్మాణానికి ఇంచుమించుగా 20 లక్షల రూపాయలు వ్యయం అయివుటుందని అంచనా వేయబడింది. ఈ ఆనకట్ట ద్వారా ప్రయోజనం పొందే అన్ని గ్రామాలలోని యుక్తవయస్కులలో ప్రతి ఒక్కరూ 20 రోజులపాటు శ్రమదానం చేయవలసి వుండింది. దీన్నిమించి చేసిన శ్రమకు ప్రతి ఒక్కరికి న్యాయమైన వేతనం చెల్లించబడింది. ఒక్కొక్క కుటుంబానికి గల భూమి ప్రాతిపదికన, ప్రతి కుటుంబం నుండి చందాలు వసూలు చేయడం జరిగింది.

ఈ ఆనకట్ట నిర్మాణం పూర్తవడానికి ముందు అది రెండేళ్లపాటు పురుటి నొప్పులననుభవించింది. ప్రజలకు పని అంతా సాఫీగా సాగలేదు. ప్రభుత్వయంత్రాంగం, దాని కిరాయి పోలీసు బలగాలు అడుగడుగునా సైంధవుడిలా అడ్డుతగులుతూ ప్రజలను వేధించుకుతిన్నాయి. జిల్లా అధికారులు పోలీసులు పదే పదే గుచ్చి గుచ్చి ప్రశ్నలడిగి, పనులను ఆపుచేయమని బెదిరించేవారు. పోలీసుల మాటల్ని పాటించినట్టు కనబడడానికై ప్రజలు కొన్ని రోజులపాటు పనిని నిల్పుచేసి మళ్లీ మొదలెట్టేవారు. పోలీసుల కళ్లుగప్పడానికై వారు రాత్రివేళల్లో సైతం పనిని కొనసాగించారు. ఈ ఆనకట్ట నిర్మాణం వెనుక వున్నది మన పార్టీయేనన్న విషయం జిల్లా యంత్రాంగాన్ని ఎంతగానో కలవరపరచింది. ఝార్కండ్ మజ్దూర్ కిసాన్ సంగ్రామ పరిషత్ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలోనే ఈ బెల్‌డ్‌హ ఆనకట్ట నిర్మాణం ఒక పెను ఉద్యమంలా సాగింది.

ఆనకట్ట నిర్మాణం పనులు పూర్తయిన తర్వాత కూడా, ప్రభుత్వ/పోలీసు యంత్రాంగం తన వేధింపులను, బెదిరింపులను ఆపలేదు.

బీడులుగా మారిపోయిన తమ విస్తారమైన భూముల్ని సస్యశ్యామలం చేయగల ఈ ఆనకట్టను జులై 5నాడు ప్రారంభించాలని అక్కడి ప్రజలు నిర్ణయించుకున్నారు. మరోవంక ప్రజల ఈ సంఘటిత నిర్మాణ కృషిని చూసి బెంబేలెత్తిన పోయిన ప్రభుత్వం, ఈ ప్రారంభోత్సవాన్ని ఎలాగైనా అడ్డుకొని తీరాలనే ప్రయత్నంలో భాగంగా, ఆ జిల్లాలోకి వేలాది మంది పోలీసుల్ని తరలించి, జిల్లా మొత్తాన్ని పోలీసు దిగ్బంధనంలో ఇరికించింది. ప్రజల ఈ కృషిని అడ్డుకోబోమని ప్రారంభోత్సవానికి మూడునాళ్ల ముందర ప్రకటించిన జిల్లా ప్రభుత యంత్రాంగం, ఆ మరుసటి రోజునే హుటాహుటిన పై ప్రయత్నాలను చేపట్టింది.

"ఈ ఆనకట్టను నక్సలైట్లు నిర్మించారు. దాన్ని ఆరంభించడాన్ని మేము ఎన్నటికీ అనుమతించం" అంటూ జిల్లా అధికారులు పిచ్చి కుక్కల్లా మొరిగారు. ఆనకట్టకు చేరుకొనే అన్నిబాటలను రహదారులను దిగ్బంధించారు, ప్రతి వాహనాన్ని సోదాచేశారు. పీపుల్స్‌వార్ పార్టీవారు, వారి సానుభూతిపరులు అక్కడికి చేరుకోకుండా అడ్డుకోవడమే తమ ధ్యేయం అన్నారు. ప్రభుత్వమే చేపట్టవలసి వున్న అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి నక్సలైట్లను అనుమతించడమా? ఎంతటి అవమానం? అంటూ గఢ్‌వా జిల్లా పోలీసు సూపరిండెంట్ సుధాంశు కుమారు చిందులు తొక్కాడు. వెనువెంటనే పోలీసుల్ని రంగంలోకి దించాడు. దాడిచేసి 4గురిని అరెస్టు చేశారు.

ఇక ప్రారంభోత్సవం దినమైన జులై 5నాడు పరిస్థితి చాలా ఉద్రిక్తంగా మారింది. ఒకపక్క ప్రజానీకం ప్రారంభోత్సవానికి సన్నాహాలను పూర్తి చేస్తుండగా మరో పక్క పోలీసులు ఆనకట్ట స్థలాన్ని చుట్టుముట్టి, పెద్ద యుద్ధరంగంలోలా పొజిషన్లు తీసుకున్నారు. ఈ పోలీసు పటాటోపాన్ని చూసి కొంత కంగారుకు గురైన వేలాది ప్రజానీకం కొండలపైకి ఎక్కగా, మరికొందరు ఇళ్లల్లో దూరి తలుపులు బిగించుకున్నారు. ఏమవనున్నదా అని అందరూ ఉత్కంఠతో ఎదురు చూడసాగారు. ఇక మునిమాపువేళకు తాము ప్రారంభోత్సవాన్ని భగ్నం చేయగల్గామనే విర్రవీగుడుతో పోలీసులు, స్టేజిని ధ్వంసంచేసి, బ్యానర్లు, జండాలను చించివేసి, అందిన వస్తువుల్ని లూటిచేసి తిరుగుముఖం పట్టడానికి సన్నద్ధమవుతుండగా వారు కలలో కూడా ఊహించని సంఘటన జరిగింది.

అప్పటిదాకా సద్దుమణిగి వున్న ప్రజానీకం తమ అసలు సత్తాను ప్రదర్శించారు. ఒక కొండ కొమ్మునుండి ఎవరిదో ఒక గొంతు ధిక్కార స్వరంతో పోలీసు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నినాదమివ్వగానే, మరుక్షణమే వేలాది మంది ఆ నినాదంతో తమ గొంతుల్ని కలిపారు. చుట్టువున్న మూడు కొండలపైకి చేరిన సుమారు రెండువేల మంది ప్రజలు ముక్తకంఠంతో ఇచ్చిన సమరశీల నినాదాలు కొండచరియల్ని తాకి పోలీసుల గుండెల్లో ప్రతిధ్వనించాయి. దాంతో పోలీసులకు వొణుకు పుట్టింది. అసలే ఇది 'భయంకరమైన

నక్సలైట్లకు' ఊతపట్టులాంటి ప్రాంతం, ఇటువంటి ప్రాంతంలో, పోరాటానికి జబ్బలు చరిచి ముందుకొస్తున్న ప్రజల నడుమ రాత్రి గడపడం తమకు క్షేమంకాదన్న విషయం వారికి తెలియందికాదు. దాంతో వారు గుండెలరిచేతిలో పట్టుకుని, లూటిచేసిన వస్తువుల్ని జారవిడుస్తూ కాలికి బుద్ధిచెప్పారు.

తమ సంఘటిత బలానికి దడిసి పారిపోతున్న పోలీసులను చూసి జనం తమ బలాన్ని గ్రహించి కొండలు దిగివచ్చి ప్రారంభోత్సవాన్ని కొనసాగించడానికి సిద్ధమయ్యారు. `సమితి' సభ్యుడైన హరఖు సింహ్ కర్వార్ ఆనకట్టను లాఛనంగా ప్రారంభించాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించారు. అక్కడ గుమికూడిన వేలాది మంది హర్షధ్వానాలతో చప్పట్లు కొడుతుండగా ఆయన రిబ్బను కత్తిరించి, ఆనకట్టను ప్రారంభించారు. తర్వాత జనం మిఠాయిలను పంచుకొన్నారు. నీరు పొంగిపొర్లసాగింది. ప్రజలు ఆనంద పారవశ్యంతో నృత్యాలు చేశారు.

గఢ్‌వా జిల్లా ప్రజానీకం, ప్రభుత్వ నిర్బంధకాండను సరకు చేయకుండా, స్వశక్తిపై ఆధారపడుతూ ఆనకట్టను నిర్మించుకొని, తమ పొలాలకు ఇరిగేషన్ సదుపాయాలను కల్పించుకోవడంలో సాధించిన ఈ ఘనవిజయం, ఝార్కండ్‌లోని యితర తావుల్లోని ప్రజానీకంపైన కూడా ప్రభావాన్ని చూపింది.

అదే గఢ్‌వా జిల్లాలోని బావ్‌నాధ్‌పూర్ బ్లాక్‌కు చెందిన కన్హర్ గ్రామం వద్దగల పండానదిపై ఒక ప్రజా ఆనకట్టను నిర్మించుకోవడానికై స్థానిక ప్రజానీకం ఒక ఇరిగేషన్ పోరాట కమిటీని ఏర్పరచుకున్నారు. అఖిలభారత ప్రజా ప్రతిఘటనా వేదిక (ఏఐపిఆర్ఎఫ్) ఆగస్టు 6నాడు బీహారులోని డాల్టన్‌గంజ్‌లో `ప్రభుత్వ ఆధ్వర్యంలోని అభివృద్ధి -ప్రజల చొరవతో అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఈ బ్లాకుకు చెందిన ప్రజానీకం ఆ రోజే పై కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో 10 మంది ఒక జీపులో తిరిగి వస్తుండగా జిల్లా ఎస్‌పి నాయకత్వంలో ఒక పోలీసు బృందం వారిపై దాడిచేసింది, ఇద్దరు తప్పించుకోగా, 8 మందిని అరెస్టుచేసి వారిచేతుల్లో ఆయుధాలు పెట్టి దొంగ కేసులు పెట్టారు. నక్సలైట్ల మీటింగ్‌కు హాజరవుతారా? అంటూ చితకబాదారు. అయితే, ఈ దౌర్జన్యం ఆ కమిటీపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయింది. 'మేము పోలీసు దౌర్జన్యాలను ఎదుర్కోవడానికి సిద్ధంగానే వున్నాం. ఆరు నూరైనా సరే ఆనకట్టను నిర్మించి తీరుతాం!'అని ఆ కమిటీ అధ్యక్షుడు భానుప్రతాప్ అన్నారు.

బెల్‌డహా, గఢ్‌వా-పలాము ప్రాంతంలోని కరువు వాతపడిన అనేకానేక గ్రామాల ప్రజల మనసుల్లో రూపుదిద్దుకొంటున్న పలు ఆనకట్టల్లో మొట్టమొదటిది "ఇపుడు మా అభివృద్ధి కార్యక్రమాలను మేమే చేపట్టాల్సి వుంది" అని అక్కడి ప్రజలు అంటున్నారు. జవహర్ రోజ్‌గార్ యోజన క్రింద ప్రభుత్వం ఎక్కడైతే ఆనకట్టలు నిర్మించిందో, అవన్నీ విఫలమయ్యాయని ప్రజలకు తెలుసు. దాంతో ప్రజలకు ఈ మాయదారి ప్రభుత్వంపై నమ్మకం నశించింది.

తమ ముందు సుదీర్ఘపోరాటం వుందని తెలిసి కూడా కొనహార్ గ్రామంలో పండానదిపై ఆనకట్ట నిర్మాణానికి నడుం బిగించిన కమిటీ సభ్యులు తమ కొత్త ఆనకట్ట పథకాన్ని గురించి ఎంతో ఉత్సాహంతో మాట్లాడుతున్నారు. `కొనహార్ బైర్ పథకం'అనబడేది 70లలోని జయప్రకాష్ నారాయణ ఉద్యమ కాలం నుండి పెండింగ్‌లో వుంటున్న ప్రాజెక్టు, దానికై ప్రభుత్వ సర్వే ముగిసి ఏళ్లుగడిచాయని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ, ఎక్కడేసిన గొంగడి అక్కడే వుంది. అందువల్ల ఇపుడు మేమే ఈ నిర్మాణ పనిని అక్కడి స్వయంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నాం అని అక్కడి ప్రజలు అంటున్నారు. నిర్మాణానికై మొత్తం 2 కోట్ల రూపాయలు ఖర్చు కాగలదని వారు అంచనా వేశారు. ఇది 30 గ్రామాలలోని 50 వేల ఎకరాల భూమికి నీరు అందించగలదు.

అయితే ఈ రెండుకోట్ల రూపాయలు ఎలా సేకరించగలరు? 80 లక్షలు చందాలుగా పోగుచేయగలమని, ప్రతి గ్రామం శ్రమదానాన్ని అందించగలదని ఆశిస్తున్నాం అని ప్రజలు జవాబిస్తున్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలోనూ 5గురు సభ్యులతో కూడిన పై సమితీ శాఖలు ఏర్పడి పనిచేస్తున్నాయి.

అంతేకాదు, దోఖని నదిపై కవల్‌డాగ్ ఆనకట్టను, పుల్వార్ ఆనకట్టను నిర్మించుకోవాలని ప్రజలు నిర్దిష్ట ప్రణాళికలు వేసుకుంటున్నారు. సెనెరి, బీర్‌బంధా, సోనాదిహా గ్రామాల వద్ద ఆనకట్టలను నిర్మించడానికై స్థానిక ప్రజలు ముందుకొచ్చి, కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. ఎస్లిగంజ్‌లో పీరినదిపై ప్రభుత్వం నిర్మించిన భారీ ఆనకట్ట, కాలువ శిథిలావస్థకు చేరుకుని ఏళ్లు గడిచాయి. ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దాన్ని పునరుద్దరించడానకై కమిటీనేర్పరచుకున్నారు.

ప్రజల స్వీయవికాసానికి అనంతమైన అవకాశాలను కల్పించగల నిజమైన "ప్రజాస్వామిక" ఝార్కండ్ ఇపుడు ప్రజల మనస్సులో మెదలుతోంది. మా ఝార్ఖండ్‌లో అనతి కాలంలోనే ప్రజలు స్వయంకృషితో నిర్మించుకొన్న బడులు, దవాఖానాలు వంటి ప్రజా సౌకర్య కేంద్రాలు దర్శనమివ్వనున్నాయి అని అక్కడి ప్రజలు ధీమాగా చెబుతున్నారు. "*మాయదారి దోపిడీ రాజ్యపు దివాళాకోరు పథకాలు మాకొద్దు! మా వికాసానికి బాటల్ని మేమే నిర్మించుకుంటాం*" అని వారంటున్నారు. ప్రజల ఈ విశ్వాసం, నిజమైన ప్రజల ప్రజాస్వామిక ఝార్కండ్ నిర్మాణ దిశలో ఒక పెద్ద ముందడుగే!


వెలువడ్డాయి !

**నిరంతరం అధ్యయనం చేయవలసిన**
**మావో మూడు వ్యాసాలు**

**(తెలుగు-హిందీ)**

**మహిళా అమరుల జీవిత చరిత్రలు**

**(హిందీ)**

# పశ్చిమ బెంగాలు ప్రజలపై సిపిఎం, భాజపా, తృణమూల్ కాంగ్రెస్‌లు సాగిస్తోన్న ఫాసిస్టు దాడులను వోడించడానికై ఉధృతమవుతున్న ప్రజాప్రతిఘటన!

పశ్చిమ బెంగాలులోని మేధినీపూర్ జిల్లాలోని గర్‌బెటా, కేష్‌పూర్ బ్లాకుల్లో ప్రజల రక్తం ఏరుల్లా ప్రవహిస్తోంది. రక్తానికి రక్తం ప్రతీకారం తీర్చుకోమని అధికారంకోసం అర్రులు చాస్తోన్న మమతాబెనర్జి పెడబొబ్బలు ఒకవైపు, పశ్చిమబెంగాలులో శాంతి మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోందనే ముఖ్యమంత్రి దబాయింపు మరోవైపు - ఈ నేపథ్యంలో అక్కడి వాస్తవస్థితి ఎలావుంది?

గర్‌బెటా, కేష్‌పూర్‌లు ఆలుగడ్డల వంటి వ్యాపార పంటలను ఉత్పత్తి చేయగల సారవంతమైన భూములున్న ప్రాంతాలు. ఈ ప్రాంతాలు, ఇపుడు భా.జ.పా./తృణమూల్ కాంగ్రెస్ కూటమికి సిపిఎం కూటమికి, ఆధిపత్యం కోసం సాగుతోన్న రక్తసిక్త సమరానికి రంగాలుగా మారాయి. ఈ ఫాసిస్టు రాజకీయ గ్యాంగులకు వ్యతిరేకంగా భా.క.పా.(మా-లె)(పీపుల్స్‌వార్) చేపట్టిన ప్రజా ఎదురుదాడి గురించి బూర్జువా ప్రచారమాధ్యమాలు మౌనం వహిస్తున్నాయి.

పశ్చిమబెంగాలు రాజకీయ చరిత్ర అనేక వైరుధ్యాలు, వైవిధ్యపూరిత ఘటనల పుట్ట. సిపిఎం నాయకత్వంలోని ఐక్య సంఘటనా ప్రభుత్వం 1967నాటి మహత్తర నక్సల్బరీ తిరుగుబాటును అణచివేయ నెత్నించింది. 1967-72 కాలంలో సిపిఎం, కాంగ్రెస్‌లకు చెందిన లంపెన్లు భాకపా(మా-లె) క్యాడర్లను పెద్ద ఎత్తున నిర్మూలించారు. ఇపుడు కాంగ్రెసు, దాని నుండి చిరిగిన తుంపు అయిన తృణమూల్ కాంగ్రెసు, దాని జోడిదారు భాజపా ల కూటమికి, ఆ రాష్ట్రాన్ని 23 ఏళ్లుగా పాలిస్తూన్న, నానాటికి క్షీణించిపోతూ, అంతర్గత ముఠా కొట్లాటలతో సతమతమవుతోన్న సిపిఐ(ఎం) కూటమికి మధ్య పరమ హేయమైన ఆధిపత్యంకోసపు పోటి పశ్చిమ బెంగాలను రక్తసిక్తం చేస్తోంది. ఈ పార్టీల హంతక గ్యాంగులు, ఒక గ్రామం తర్వాత మరో గ్రామంపై దాడులు చేస్తూ, ఇళ్లను తగులబెట్టి, లూటీలకు పాల్పడి, ప్రజలను హత్యచేస్తూ, అనేక చోట్ల లైంగిక అత్యాచారాలకు కూడా పాల్పడుతున్నాయి. గర్‌బేటా, కేష్‌పూర్ ప్రాంతాలకు ఇది ప్రత్యేకించి వర్తించే సత్యం.

## ఈ ప్రాంతంలో మన పార్టీ కార్యకలాపాల ఆరంభం :

80 దశకం చివరినాళ్లలో, మెధినిపూర్, బంకురా జిల్లాలలోని గర్‌బెటా, గోయల్‌టోర్, రామగఢ్, తదితర తావుల్లో ఒక చిన్న విప్లవ గ్రూపు ప్రజలను సంఘటితం చేయనారంభించింది. సోషల్ ఫాసిస్టులు [సిపిఐ(ఎం)] 1989లో బంకురాలోని జయ్‌రామ్ బటిలోనూ అటు తర్వాత 1993లో గర్‌బెటాకు చెందిన నల్పా-కస్తగురా గ్రామాలలోనూ విచ్చలవిడిగా దాడులు చేశారు. ఈ దాడుల్లో కామ్రేడ్ భజన్ చక్రవర్తి అమరుడవగా అనేకులు వికలాంగులయ్యారు. ఇళ్లు కూల్చబడ్డాయి, ఇతరులు పలువురు ఆ ప్రాంతం నుండి పారిపోయారు. ఇక పై విప్లవ గ్రూపు అంతిమాన 1995లో మన పార్టీలో సంలీనమైంది. ఆనాటి నుండి పీడకులకు వ్యతిరేకంగా ప్రతిఘటనకు సమాయత్తమవమని ప్రజలను సంఘటితం చేయసాగింది. అయితే సాయుధ ప్రతిఘటనపై తీవ్ర కృషి 1999 నుండే ప్రారంభమయింది.

1998లో జరగనున్న పంచాయితి, పార్లమెంట్ ఎన్నికలపై కన్నువేసిన భాజపా, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు 1997లోనే సిపిఐ(ఎం) పెత్తనం కింద వున్న గ్రామాలపై దాడుల పరంపరకు పూనుకున్నాయి. గర్‌బెటా అనతికాలంలోనే, ఈ రెండు ఫాసిస్టు ముఠాల మధ్య అధికారం కోసం పోరాటానికి కేంద్రం అయింది. సిపిఐ(ఎం) అపుడు దెబ్బకాచుకునే స్థితిలో వుండింది. భాజపా-తృణమూల్ కూటమి బందిపోట్లు, సంఘవ్యతిరేక శక్తులతో కూడిన పెద్ద బృందాలను సమీకరించి పెద్ద ఎత్తున లూటీల, గృహదహనాలు, మహిళలపై లైంగిక అత్యాచారాలు వంటి వాటికి పాల్పడింది, ప్రజలను ఊచకోతకోసింది, ఒక గ్రామం తర్వాత మరో గ్రామాన్ని కాల్చి బూడిద చేసింది.

ఈ గ్రామాలలో అత్యధికమైనవి, స్వైరవిహారం చేస్తున్న ఈ హంతక ముఠాలనెదుర్కోలేక, వాటికి లొంగిపోయాయి, కాగా సిపిఐ(ఎం) నాయకులు పట్టణాలకు పారిపోయారు. అయితే, సిపిఐ(ఎం)లోని అసంతృప్తి చెందిన నాయకులలో ఒక సెక్షను భాజపా-తృణమూల్ కాంగ్రెస్ హంతకముఠాలను ఈ ప్రాంతంలోకి కొని తేవడంలో ప్రధాన భూమిక నిర్వహించిందన్నది గమనించాల్సిన అంశం. గతంలో సిపిఐ(ఎం) నీడలో వుండిన గూండాలలోని ఒక సెక్షన్ కూడా ఈ ముఠాతో చేతులు కలిపింది. ఈ ముఠాకు పన్నులు చెల్లిస్తూ, ఆస్తుల్ని కోల్పోతూ, తమ స్త్రీల మానాల్ని కూడా కొన్ని సందర్భాలలో కోల్పోతూ సామాన్య ప్రజానీకమే ఈ స్పర్ధలకు ఎక్కువగా బలయ్యారు. ఇంకా సిపిఐ(ఎం) పెత్తనం కిందే వుండిపోయిన గ్రామాలపై దాడులు చేస్తోన్న భాజపా-తృణమూల్ కాంగ్రెస్ హంతక ముఠాలతో చేతులు కలపవలసి వచ్చిన పరిస్థితికి కూడా వారు నెట్టబడ్డారు - తుపాకుల వొత్తిడికి తలవాల్చాల్సి రావడం. దీంతో సిపిఐ(ఎం) ప్రభావం క్రింద వున్న గ్రామస్థుల నైతిక స్థైర్యం దెబ్బతినిపోయింది.

గర్‌బెటాకు చెందిన సంపన్నులు, ప్రధానంగా భూస్వాములు, ధనికరైతులు, బడావ్యాపారులకు చెందిన ఒక సెక్షన్ కొత్తగా వచ్చిన భా.జ.పా. - తృణమూల్ కాంగ్రెస్ కూటమిని చేరదీసి, ధనరాసుల్ని అందించసాగారు, కాగా పోలీసులు వీరి కార్యకలాపాలపై శీతకన్ను వేశారు. గర్‌బెటాకు చెందిన రామ్‌తివారి అనే ఏ నీతినియమాలు లేని వ్యాపారి, స్మగ్లరు భాజపా ముఠాకు ముఖ్యనాయకుడయ్యాడు, ఆ ముఠా సాగించిన పలు ఫాసిస్టు దాడులకు స్వయంగా నాయకత్వం

వహించాడు; వీడు అంతకు ముందు సిపిఐ(ఎం)లో వుండేవాడు. ఇప్పుడు వీడు మెధినీపూర్ జిల్లా భా.జ.పా. అధ్యక్షపీఠాన్ని అధిష్టించాడు. సిపిఐ(ఎం) సైతం కొన్ని బందిపోటు బలగాలను కూడగట్టింది కాని బాగా సాయుధులై వున్న వారి ప్రత్యర్థుల ముందు వారు నిలబడలేకపోయారు.

ఈ నేపథ్యంలో, మన పార్టీ మేధినీపూర్ డివిజనల్ కమిటీ 1998 చివర్లో గర్‌బెటాకు ఒక ఆర్గనైజర్‌ను పంపింది. 1999లో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటూ, ఆలుగడ్డలకు గిట్టుబాటు ధరలను డిమాండ్ చేస్తూ గర్‌బెటా పట్టణంలో ఒక బహిరంగ సదస్సు నిర్వహించబడింది; ఈ సదస్సులో పాల్గొన్న మహిళా కార్యకర్తలను భాజపా గ్యాంగు అవమానపర్చింది. సాయుధ దళాలను నిర్మించాల్సిన అవసరం ముందుకు రావడంతో మన పార్టీ ముగ్గురు సభ్యులుగల సాయుధ దళాన్ని ఏర్పాటు చేసింది. ఎర్రజండాను సమర్థించే గర్‌బెటాకు చెందిన గ్రామీణ పేదలు దీన్ని ఆహ్వానించగా, అది భాజపా-తృణమూల్ కాంగ్రెస్ శిబిరంలో గుబులు పుట్టించింది. ఇక పరిస్థితి మారసాగింది. పోలీసులు కూడా ఇపుడు రంగంలోకి దిగారు. ఒక ఘటనలో, భాజపా-తృణమూల్ కాంగ్రెస్ కూటమివారు అందజేసిన సమాచారంతో పోలీసులు అరెస్టు చేసిన ఒక దళసభ్యుడిని గ్రామ మహిళలు విడిపించుకున్నారు. ఈ ఘటన ప్రజల నైతిక స్థైర్యాన్ని ఇనుమడింపజేసింది. ఈ ఘటనకు కొద్ది కాలం తర్వాత లూటరు, రేపిస్టు, భాజపా- ఆర్ఎస్ఎస్ నాయకుడు అయిన స్వరూప్ సర్కారును 1999 సెప్టెంబర్ 9 నాడు గెరిల్లాలు శిక్షించారు. దాంతో భాజపా-తృణమూల్ కాంగ్రెస్ కూటమి రామ్ తివారి ప్రత్యేక నాయకత్వం క్రింద తమ చేతుల్లో వున్న హంతకులందరిని సమీకరించి, మన పార్టీ సానుభూతిపరుడైన కామ్రేడ్ అనాధ్ సర్కార్‌ను హత్యచేయించింది. ఆ మరుసటిరోజే, అమరుడు కామ్రేడ్ అనాధ్ అంత్యక్రియల్లో పాల్గొనడానికై హుగ్లి నుండి వచ్చిన అతడి బంధువులిద్దరిని క్రూరంగా హత్యచేయడమేకాక, మరొకరి తలపై పదే పదే కాల్పులు జరిపి, అతడి కళ్లను పోగొట్టారు. కామ్రేడ్ అనాద్ మేనల్లుడైన 10 ఏళ్లబాలుడిని సైతం వారు హత్యచేశారు. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగింది.

ఈ ఘటన తర్వాత, మన దళం ప్రతికార చర్యలకు పాల్పడకుండా నిరోధించడానికై పోలీసు, పారామిలిటరీ బలగాలు పెద్ద ఎత్తున రంగంలోకి దిగాయి, కాగా భాజపా-తృణమూల్ కాంగ్రెస్ ముఠా నాయకులు మెధినీపూర్-హుగ్లి-బంకురా జిల్లాల సరిహద్దుల్లో వున్న కొత్త ప్రాంతాలపై పాశవిక దాడులకు పూనుకోసాగారు.

## ప్రజలలో పోలరైజేషన్ :

షీలాబతి నది గర్‌బెటా బ్లాకును రెండుగా విభజిస్తుంది. 7 పంచాయితీ ప్రాంతాలు ఒక వొడ్డునుండగా, 5 పంచాయితీ బ్లాకులు అవతలి వొడ్డుకుంటాయి. మన పార్టీ మొదట్లో రెండవ నంబరు పంచాయితీలో కృషిని ఆరంభించి, 2, 3, 4 పంచాయితీలకు విస్తరించనెత్నించింది. అయితే, ఈ ప్రాంతంపై భాజపా-తృణమూల్ కాంగ్రెస్ కూటమికి వున్న అదుపు, దాని గట్టి ప్రతిఘటనా మరియు ముమ్మరం చేయబడిన పోలీసు పెట్రోలింగ్ కారణంగా, కొత్త ప్రాంతాలకు విస్తరణ నెమ్మదిగా సాగింది. కాగా, షీలాబతి నది ఆవలి వొడ్డున మన దళం తిరుగుతున్నప్పుడు, అంటే 10, 12 పంచాయితీ ఏరియాల్లో తిరుగుతున్నప్పుడు, ఈ ప్రాంతంపై చాలా కాలం నుండే సోషల్ ఫాసిస్టుల పెత్తనం కొనసాగుతున్నందున మన దళానికి సిపిఎం బెదిరింపులు, దాడులను ఎదుర్కోవాల్సి వచ్చేది. ఆ విధంగా, షీలాబతి నది రెండు వొడ్డుల ప్రాంతాలు రెండు ఫాసిస్టు శక్తుల చేతులకింద వుండినాయి; ఈ రెండింటికి వాటి వాటి స్వంతహంతక ముఠాలున్నాయి, రెండు మన దళానికి తిండి పెట్టవద్దని, ఆశ్రయం ఇవ్వవద్దని ప్రజల్ని బెదిరిస్తుండినాయి. అయితే, తీవ్రపరిణామాల నెదుర్కోవాల్సి వుంటుందనే ఈ ముఠాల బెదిరింపులను లెక్కచేయకుండా ప్రజలు రహస్యంగా మన పార్టీ మార్గదర్శకత్వం క్రింద పని చేయడానికి సిద్ధమయ్యారు. మన దళం, ఈ ఫాసిస్టు భీభత్సాన్ని ధిక్కరిస్తూ ఈ ప్రాంతమంతా తిరగసాగింది, అవకాశం దొరికినప్పుడు శత్రువుపై దెబ్బతీయడానికి గెరిల్లా ఎత్తుగడలను చేపట్టింది. శతృవుల నైతిక స్థైర్యం నానాటికి దిగజారుతుండగా, ప్రజలకు మన దళంపై విశ్వాసం రోజు రోజుకు పెరగసాగింది. మన దళానికి త్రిముఖ దాడిని ఎదుర్కోవలసి వచ్చింది - సిపిఎం కూటమి, భాజపా-తృణమూల్ కాంగ్రెస్ కూటమి మరియు పోలీసు బలగాలు. మనపై దాడులు జరిగిన ప్రతి సందర్భంలోనూ ప్రజలు ముందుకొచ్చి, సహకరించి, మన దళాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అలా మన దళం అక్కడి రెండు హంతక ముఠాలకు, కంట్లో రాయిగా నిలిచింది.

ప్రజలకు రెండు రకాల సాయుధ కార్యకలాపాలు స్పష్టంగా కానవచ్చాయి. సిపిఎం, భాజపా-తృణమూల్ కాంగ్రెస్ సాయుధ గ్యాంగులు మొత్తానికి మొత్తంగానే పాశవికమైన ప్రజావ్యతిరేక స్వభావం కలిగివుండి, యదేచ్ఛగా లూటీలు, హత్యలు, రేపులు, గృహదహనాలకు పాల్పడుతుండగా, మన దళం ప్రజలతో సత్సంబంధాలను నెలకొల్పుకుంది, ప్రతి ఘటనకు వారిని సంఘటితం చేయసాగింది, మన దళ సభ్యులు, ప్రజలను ఫాసిస్టు దాడుల నుండి రక్షించడానికై తమ ప్రాణాలకు రానున్న ముప్పును కూడా లక్ష్యపెట్టకుండా విప్లవ రాజకీయాలతో ప్రజలను ఎడ్యుకేట్ చేయసాగారు. ఫాసిస్టు పార్టీలు సదా సామాన్య ప్రజానీకంపైనే దాడులు సాగిస్తుండగా, మన దళం ఈ ఫాసిస్టు పార్టీలలోని నాయకులు, అనుచరుల మధ్య స్పష్టమైన తేడాను చూసి, సదా నాయకులనే, ముఖ్య నేరస్థులనే, ముఖ్యులైన ప్రజావ్యతిరేక శక్తులనే టార్గెట్లుగా ఎంచుకొని వారిపై దాడులను సంఘటితం చేసింది. పాలకవర్గ పార్టీలు ప్రజలను తమ పక్షంలో వుంచుకోవడానికై భీభత్సకాండనే ఆయుధంగా వాడుతుండగా, మన పార్టీ ప్రజలను మన వైపు తిప్పుకోవడానికి రాజకీయాలను, విప్లవ రాజకీయాలనే వినియోగించింది. పర్యవసానంగా ప్రజలు ఫాసిస్టులకు, విప్లవకారులకు మధ్య వున్న తేడాను స్పష్టంగా చూడగల్గారు; ఇటువంటి ఘోరాతిఘోరమైన ఫాసిస్టు భీభత్సకాండ నడుమనే క్రమ క్రమంగా సంఘటితపడనారంభించారు.

1999 చివరికి, భాజపా 10 నంబర్ పంచాయితికి చెందిన కొన్ని గ్రామాలపై దాడిచేయనెత్నించింది, ఇక సిపిఎం నాయకులకు కాళ్లు వణకసాగాయి. ఆ తరుణంలో మన దళం ప్రజలను ముందుకు నడిపించి, ఒక పెద్ద భాజపా హంతక మందపై ప్రతిఘటనను విజయ వంతంగా నిర్వహించింది. ఈ ప్రతిఘటనలో శత్రు పక్షంలో ఇద్దరు చావగా పలువురు గాయపడ్డారు. ఈ ప్రతిఘటన వార్త ఆ ప్రాంతమంతటా కార్చిచ్చులా వ్యాపించింది. ప్రజల మనోవిశ్వాసం ఇనుమడించి, వారు విప్లవ రాజకీయాల చుట్టూ సమీకృతులవ

సాగారు. అయితే స్వైరవిహారం చేస్తున్న హంతక ముఠాలనుండి తమ ప్రాణాలను, ఆస్థులను కాపాడుకోవడం అన్నదే వారి తక్షణ సమస్య. అదేవారి తక్షణ అవసరం. ఈ సమస్యపైనే పోలరైజేషన్ కొనసాగింది. ఫాసిస్టు శక్తులను ప్రతిఘటించే క్రమంలో పీడిత ప్రజలకు వర్గ చైతన్యాన్ని కలగచేసి, రాజకీయంగా సంఘటితంచేసే కృషే అతి ముఖ్య కర్తవ్యం అయింది. ప్రజలు తమ స్వీయ అనుభవం ద్వారానే ప్రధానంగా విషయాలను తెలుసుకుంటారు. విప్లవ రాజకీయాలకు, నానా రకాల అభివృద్ధి నిరోధక రాజకీయాలకు మధ్య తేడాను ఆచరణాత్మకంగా అర్థం చేసుకోవడానికి గర్‌బెటాలోని పరిణామాలు ప్రజలకు తోడ్పడ్డాయి. మన పార్టీ ఆచరణ, మన రాజకీయాల మూలంగా ప్రజలు ఇతోధికంగా పరిణతి చెంది, మరింతగా చైతన్యాన్ని సంతరించుకున్నారని ఖచ్చితంగా చెప్పుకోవచ్చు.

## మన పార్టీ నాయకత్వాన ప్రజా ప్రతిఘటన :

అలా ప్రజల తోడ్పాటుతో మన దళం షీలాబతి నదికి రెండు పక్కలా తన కార్యకలాపాలను కొనసాగించింది, అయితే అది ప్రధానంగా ఆ నది ఉత్తరం ఒడ్డువైపున అంటే, మేధినిపూర్ హుగ్లి-బంకురా జిల్లా సరిహద్దు ప్రాంతాలపైనే కేంద్రీకరించింది. భోలా మల్లిక్ అనే పేరుమోసిన భాజపా నాయకుల వంటివారిని శిక్షించే యత్నాలు జరిగాయి- వీడు గతంలో 1998లో భాజపా చంపిన సిపిఎం నాయకుడు ముకుంద పాత్రకు కుడిభుజంగా పనిచేసేవాడు. సిపిఎం నాయకుడిని హత్యచేసినతర్వాత భాజపా ఆప్రాంతంపై పైచేయి సాధించింది. సిపిఎంను ఆ ప్రాంతం నుండి తరిమివేసి తన 'జాగీరు'ను విస్తరించుకోల్గింది. అయితే ఒకప్పుడు సిపిఎం నాయకుల కిరాయి గూండాలుగా పనిచేసిన భోలా లాంటి వ్యక్తులు, ఇపుడు భాజపా/తృణమూల్ కూటమి కిరాయి గూండాలయ్యారు.

అయితే భోలా వెంట్రుకవాసిలో తప్పించుకోగల్గాడు. కాని ఈ దాడి భాజపా నాయకుల వెన్నులో చలిని పుట్టించింది. భోలా ఆ వెనువెంటనే రాజకీయ రంగంనుండి తప్పుకున్నాడు, ఇతర భాజపా నాయకులు ఆ ప్రాంతం విడిచిపారిపోయారు. అయితే భాజపా అప్పటికి క్షీణించిపోయే శక్తిగాలేదు, పైగా అది, మన పార్టీపైనా, తనకు అప్పటి వరకు లొంగిరాని గ్రామాలపైనా అంతిమ దాడికి పూనుకోవడానికై అన్ని చోట్లనుండి కరడుగట్టిన హంతకులను కూడగట్టసాగింది. వేరు వేరు గ్రామాల ప్రజలు నానాటికి అధికమవుతున్న సంఖ్యలో మన దళంతో సంబంధాలు పెట్టుకుంటున్నారన్న విషయం వారికి తెలిసిరాగానే మన దళాన్ని ఎదుర్కోవడానికి వారికి గుండెదమ్ములు చాలలేదు. మన దళం భాజపా పెత్తనం చెలాయిస్తోన్న అనేక గ్రామాలలో తిరుగుతూ, ప్రజలను సంఘటితం చేస్తోంది. అందువల్ల తాము ఏ కొత్త దాడికి పూనుకున్నా మన పార్టీ నాయకత్వం క్రింద ప్రజలు ప్రతిఘటించి తీరుతారని ఈ ఫాసిస్టులకు అర్థమైంది.

2000, ఏప్రిల్ నెలనాటికి భాజపా/తృణమూల్ కాంగ్రెస్ కూటమి వేరు వేరు జిల్లాల నుండి పెద్ద సంఖ్యలోనే నేరస్థుల గ్యాంగును కూడగట్టింది, వందలాది ఆయుధాలను సమకూర్చుకొంది. బంకురాలోని కొట్లాపూర్‌కు చెందిన కిరాయి హంతకుడు, పేరుమోసిన బందిపోటు అయిన మనును, మరో 500-1000 మందిని గర్‌బెటాకు కొనితెచ్చింది తమ అదుపు క్రిందకు రాకుండా, తమ జాగీరు విస్తరణకు ప్రతిఘటనాకేంద్రాలుగా నిలచిన కొన్ని విడివిడి గ్రామాలపై దాడికై పై కిరాయి మనుషుల్ని, 250-300 తుపాకుల్ని హుగ్లి- మేధినిపూర్ సరిహద్దులో సమీకరించింది. అంతేకాదు, ఈ ఫాసిస్టు కూటమి, నంబరు ప్లేటు లేని మోటారు సైకిళ్లను తెచ్చి, ఒక మోటారు సైకిల్ సేనను ఏర్పాటు చేసింది; ఈ సేన హఠాత్తుగా గ్రామాలపై కాల్పులతో విరుచుకుపడుతూ, పెడబొబ్బలు పెడుతూ తాము కనబడీ కనబడగానే గ్రామస్థులల్లో భీభత్సం కలిగేలా స్వైరవిహారం చేయసాగింది. ఈ ప్రాంతం నుండి ఎదురయ్యే ఎటువంటి ప్రతిఘటననైనా మచ్చుకైనా లేకుండా కాలరాచి వేయడానికై అంతిమదాడి కోసమే వారు ఇంత పేయమైన సన్నాహాలు చేశారు. అయితే ఈ ముఠా ఆశలు అడియాసలే అయ్యాయి. ప్రజా ప్రతిఘటన వారికి ఎదురవ్వడంతో, దాని నాయకులు ప్రాణభీతితో పారిపోయారు. ఇక మిగిలిన గూండాలు తిరిగి సిపిఎం పంచన చేరారు.

అంతిమ సమరం మెధినీపూర్ జిల్లా సరిహద్దులలోని హుగ్లి జిల్లా గ్రామాల్లో మొదలైంది. సంధీపూర్‌లో తాము ఎలాగైతే సర్కార్ కుటుంబాన్ని అంతమొందించామో అదే తీరులోనే భాకపా(మా-లె)(పీపుల్స్‌వార్)ను ఈ ప్రాంతంలో మొత్తానికి మొత్తంగానే తుడిచిపెట్టేస్తామని భా.జ.పా. నాయకులు బీరాలు పోయారు. మే 7నాడు మనిక్‌బంధి గ్రామం వారి చేతుల్లో పడడంతో వారికి తొలుత విజయం లభించింది

మనిక్ బంధి గ్రామంలో ప్రజలు గాభరాతో చెల్లా చెదరయిన కారణంగా సమర్థవంతమైన ప్రతిఘటనకు అవకాశం లేకపోయింది. అయినప్పటికీ అక్కడ జరిగిన పోరులో ఫాసిస్టు ముఠాకు చెందిన ఒక సభ్యుడు చచ్చాడు, గ్రామస్థుడొకరు కూడా మరణించారు. మనిక్‌బంధీలోని ఈ నకారాత్మక అనుభవం నుండి గుణపాఠాలు తీసుకుంటూ దానిపక్కనే వున్న సెలమ్‌పూర్, ఖేయుబెై గ్రామాల ప్రజలు, మన దళమూ, యావన్మంది ప్రజానీకాన్ని ఫాసిస్టు మూకల దాడికి ప్రతిఘటన నిమిత్తం సంఘటితం చేశారు. దృఢప్రతిఘటన నివ్వడానికిగాను ఆ గ్రామ యువజనులకు గెరిల్లా పోరాటంలో శిక్షణ గరపబడింది. 2000 మే, జూన్ నెలల్లో ఈ గ్రామాలపైకి ఫాసిస్టుల దాడులు ఒక పరంపరలాగా సాగాయి. అయితే ఈ హంతక ముఠాలు ఈ గ్రామాలలోకి ఒక్క అంగుళం మేరలోనైనా అడుగు పెట్టలేకపోయాయి. మీదుమిక్కిలి, దీర్ఘకాలంగా సాగిన ఈ పోరులో వారు పలు నష్టాలను చవిచూశారు, ఇంచుమించుగా 10-12 మంది చచ్చారు. వారిలో స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నాయకుడైన సేనాపతి కూడా వున్నాడు. వీడిచావుకై వీడి కుటుంబానికి సంతాపం తెలపడానికి మమతా బెనర్జి కలకత్తా నుండి దిగబడిందికూడా!

ఈ దీర్ఘపోరు ఫాసిస్టు గ్యాంగుల నైతిక బలాన్ని క్రమక్రమంగా దిగజార్చివేసింది. బయట నుండి వచ్చిన కిరాయి గూండాలు క్రమంగా తెరమరుగవసాగారు. అంతిమాన అందరూ పారిపోయారు. ఈ ఫాసిస్టు హంతక ముఠాకు అంతిమ గుణపాఠం నేర్పిన ప్రజా ప్రతిఘటనకు చెందిన మరో ఘటనను కూడా ప్రత్యేకించి పేర్కొనాల్సిన అవసరం వుంది.

## రామ తివారిపై దాడి

## ప్రజలకు విజయం -ఫాసిస్టులకు చావు దెబ్బ :

రామ తివారి, మేధినీపూర్ జిల్లా భాజపా అధ్యక్షుడని, ఫాసిస్టు సేనకు తొలిదశనుండి ప్రధాన ఆర్గనైజరు అని ముందే చెప్పుకున్నాం. వాడు పశ్చిమాన్నుండి వచ్చిన ఒక వ్యాపారి, కొత్త జమిందారుగా అవుదామని కలలు గంటున్న వీడు ఒక దళారి కుటుంబం నుండి వచ్చాడు. రామ మొదట సిపిఎంలో చేరాడు, సిపిఎం వాడిని చాలాకాలంపాటు ఆదరించి అక్కున చేర్చుకుంది. ఇక భాజపా రంగం మీదికి రాగానే వీడు దానిలోకి దూకాడు. వాడు సంధిపూర్ మారణకాండకు పాల్పడిన ఫాసిస్టు గ్యాంగుకు స్వయాన నాయకత్వం వహించాడు. భాజపాపై బురదజల్లడానికై సిపిఎం ఈ ఘటనకు తన రాష్ట్ర కమిటీ బాకా అయిన `గణశక్తి' పత్రిక ద్వారా విశేష ప్రచారాన్ని ఇచ్చింది. అయినాగానీ, వాడు చేసిన దారుణ హత్యలకు వాడిమీద ఒక్క కేసు కూడా ఈ పాలక పార్టీ ఫైలు చేయలేదు సరికదా, వాడిని కస్టడీలోకి తీసుకున్న పాపానైనాపోలేదు. కాబట్టి, వాడిని శిక్షించే కర్తవ్యం ప్రజలది, విప్లవకారులది అయింది. మీదు మిక్కిలి, మన దళాన్ని పట్టుకోవడానికై వీడు పదే పదే పోలీసుల్ని ఉసిగొల్పాడు. అందుచేత వాడు అటు ప్రజలకు, ఇటు విప్లవకారులకు కూడా ప్రథమ టార్గెట్‌గా తేలాడు.

గర్‌బెటాలోని బన్‌స్డ అనే గ్రామం చిరకాలం నుండి కమ్యూనిస్టు ఉద్యమానికి పెట్టని కోటలా వుంటూ వస్తోంది. 1949లో సాగిన మహత్తర తెభాగ ఉద్యమంలో ఈ గ్రామానికి చెందిన ముగ్గురు, పోలీసులతో జరిగిన పోరాటంలో అమరులయ్యారు. నేటికీ ఆ గ్రామం సమస్త పీడకులకు వ్యతిరేకంగా దృఢంగా నిలబడే కమ్యూనిస్టు సాంప్రదాయాన్ని పట్టుదలతో కొనసాగిస్తూనే వుంది. ఈ గ్రామం సిపిఐ పక్షాన వుండేది. `77 తర్వాత అది సిపిఎంకు ఒక కోటలా అయింది. అయితే అంతిమాన అది భాకపా (మా-లె) (పీపుల్స్‌వార్) రాజకీయాలతో దృఢంగా ఏకమయిన గ్రామాల్లో ఒకటిగా నిలిచింది, విప్లవకారులకు ఊత పట్టులా మారింది.

రామ తివారి ఈ కమ్యూనిస్టు కంచుకోటను నాశనం చేయాలని జూన్ నెల చివరి వారంలో పథకం వేశాడు. దీనికోసం వాడు ఒక వంక, గ్రామానికి ఒక దిక్కున పెద్ద హంతకముఠాను మోహరించాడు,మరో వంక పెద్ద పోలీసు బలగాన్ని గ్రామంలోకి తీసుకొచ్చాడు - గ్రామంలో మన దళాన్ని పట్టుకోవడం, అటుతర్వాత తన గ్యాంగు ద్వారా గ్రామంపై దాడి చేసి, దాన్ని లూటి చేయడం వాడి లక్ష్యం.

అయితే వీడి పథకాన్ని ముందుగానే అంచనా కట్టిన మన దళం గ్రామంలోని మహిళలను పెద్ద సంఖ్యలో సమీకరించింది; ఆ మహిళలు పోలీసు బృందాన్ని గ్రామ ముఖద్వారం వద్దనే ఘెరావ్ చేశారు. ఒక పక్క గ్రామ మహిళలు పోలీసుల్ని చీపుర్లతో సత్కరిస్తుండగా, రామగాడు, తన రక్షణకై వచ్చిన పోలీసుల్ని, తన గ్యాంగును వదిలిపెట్టి తన కారులో పారిపోతూ ఏకాకి అయ్యాడు. ఇదే అవకాశంగా తీసుకొని మన దళం వాడి కారుపై దాడి చేసింది. కారు ధ్వంసమైంది, కాని వాడు, వాడి గ్యాంగంతా వెంట్రుకవాసిలో తప్పించుకోగల్గారు. అయితే ఈ ఘటన భాజపా/తృణమూల్ కాంగ్రెస్ కూటమిలో పెద్ద భయోత్పాతాన్ని సృష్టించింది; ఇక ఆ ఫాసిస్టు నాయకుడు గర్‌బెటా గ్రామాల్లో అడుగు పెట్టడానికి మరెన్నడూ సాహసించలేదు. అయితే బూర్జువా వార్తా పత్రికలన్నీ కూడా పైన ఉదహరించబడిన ఘటనలన్నింటిని భాజపా/తృణమూల్ కాంగ్రెస్ కూటమికి, సిపిఎం కూటమికి మధ్య జరిగిన ఘర్షణలంటూ ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిన కథనాలతో, మన పార్టీ పాత్రను, ప్రజానీకం పాత్రను తెరమరుగుచేయనెత్నించాయి.

ఈ దాడి, దీనికితోడు సెలామ్‌పూర్ పోరులోని ఓటమి, నష్టాలు, ఇవి ఫాసిస్టు గ్యాంగుల నైతిక బలాన్ని పూర్తిగా దెబ్బతీశాయి. వారు మతులు పోగొట్టుకొని, ఆ ప్రాంతాన్ని ఖాళీచేసి పారిపోయారు.

## తాజా పరిస్థితి - సిపిఎం బెదిరింపులు లెక్కచేయకుండా ముందుకొస్తున్న ప్రజారాశులు:

మన పార్టీ సంఘటితపర్చిన ప్రజా ప్రతిఘటన కారణంగా గర్‌బెటా, దాని పక్కనున్న గోఘాట్ గ్రామాలలో భాజపా/తృణమూల్ కాంగ్రెస్ పెత్తనం కూలిన తర్వాత, ఇంతవరదాకా ఎక్కడికో పారిపోయి దాక్కొనివున్న సిపిఎం నాయకులు తిరిగివచ్చి ఇప్పుడు పారిపోతున్న భాజపా/తృణమూల్ కాంగ్రెస్ శక్తులను వెంట తరిమి, ఆ ప్రాంతాలపై తమ పట్టును నెలకొల్పుకోవడానికై మరోసారి తమ స్వంత గ్యాంగులను ఆర్గనైజ్ చేయసాగారు. గర్‌బెటాలో భాజపా/తృణమూల్ కాంగ్రెస్ ఓటమి కారణంగా ఆ శిబిరం నైతిక బలం మొత్తంగా దెబ్బతినిపోగా, సిపిఎం శిబిరం సడలిపోతున్న తన నైతిక బలాన్ని కొంచెం కూడదీసుకోగల్గింది. నక్కజిత్తుల సిపిఎం, ఈ పరిస్థితిని బాగా వాడుకుంటూ, మొదట హుగ్లిలోని గోఘాట్‌లోనూ ఆ పిమ్మట మేధినీపూర్‌లోని కేష్‌పూర్‌లోనూ, అటు తర్వాత బంకురా జిల్లాలోని సిహార్-గోపినాథ్‌పూర్ ప్రాంతాలలోనూ నైతిక బలాన్ని కోల్పోయివున్న భాజపా/తృణమూల్ కాంగ్రెస్ శక్తులపై ఒక దాని తర్వాత మరోటిగా దాడులు సాగించింది. సరిగ్గా భాజపా/తృణమూల్ కాంగ్రెస్ హంతక గ్యాంగుల తీరులోనే సిపిఎం కూడా, నేరస్థులను, సంఘవ్యతిరేక శక్తులను, ప్రజలలోని ఒక చిన్న సెక్షన్‌ను సమీకరించి, 1000-1500 మందితో కూడి వుండే సాయుధ గ్యాంగులను ఏర్పరచింది. ఇవి గృహదహనాలకు, లూటీలకు పాల్పడుతూ, హత్యలు చేస్తూ, ప్రజల్ని చితకబాదుతూ, స్వంతపన్నులు వసూలుచేస్తూ భాజపా/తృణమూల్ కాంగ్రెస్ పెత్తనం కింద వుండిన గ్రామాలపై దాడులు సాగించాయి. కేవలం మన దళం పనిచేస్తున్న ప్రాంతంలో మాత్రమే ఈ సిపిఎం యొక్క హంతక ముఠాల నేర చర్యలను ప్రజాప్రతిఘటన ద్వారా పెద్దమేరలోనే నిరోధించడం జరిగింది.

ఒకపక్క భాజపా/తృణమూల్ కాంగ్రెస్ కూటమి తన పెత్తనం కింద వున్న అన్ని ప్రాంతాలను కనీస ప్రతిఘటననైనా లేకుండా ఖాళీచేస్తుండగా, మరో పక్క ఇంత విశాల ప్రాంతాన్నంతటిని చూడగల పార్టీ నిర్మాణంగానీ, స్వీయాత్మక శక్తులుగాని మన పార్టీకి లేవు. ఈ పరిస్థితిని వాడుకొంటూ సిపిఎం త్వరితంగానే ఈ ప్రాంతాన్ని తిరిగి తన పట్టుకిందకు తెచ్చుకుంది. పాలకవర్గాలు తిమ్మినిబొమ్మిని చేస్తూ తప్పుడు కథనాలతో ప్రచారాన్ని పెద్ద ఎత్తున సాగించినప్పటికీ (మనపార్టీ పాత్రను మరుగుపరుస్తూ) గర్‌బెటా, గోఘాట్, కేష్‌పూర్, షలబోని తదితర బ్లాకులతో కూడిన విశాల ప్రాంతంలోని ప్రజానీకానికి గర్‌బెటా-గోఘాట్ ఫాసిస్టు వ్యతిరేక పోరాటపు వాస్తవ చిత్రం తెలుసు,

వారికి విప్లవ రాజకీయాలపై విశ్వాసం ఇనుమడించింది. అందుచేతనే, తమతమ తావులలో నిర్మాణాలకు పూనుకోమని ఆ ప్రాంతంలోని పలుగ్రామాల పీడిత ప్రజలు మన పార్టీని కోరుతున్నారు.

ఇలాంటి నేపథ్యంలో, మన పార్టీ పనిచేస్తున్న గర్‌బెటా ప్రాంతంలోని పరిస్థితులెలా వున్నాయి? ఇక్కడ మన పార్టీకి, పోలీసుల దన్నుతో మన పార్టీని నిర్మూలించాలని కలలుగంటున్న సిపిఎం నుండి తిరిగి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవాల్సి వుంటుంది. కనుక మనపార్టీకి అక్కడ ఇప్పుడు మరో రౌండు పోరాటానికి సిద్ధం కావాల్సి వుంటుంది. - అయితే ఈసారి జిత్తులమారితనంలో నక్కల్నే ఓడించగల సోషల్ ఫాసిస్టులతో పోరాడాల్సి వుంటుంది. ఇక్కడ ఇప్పటిదాకా భాజపా/తృణమూల్ కాంగ్రెస్ పంచన వుండిన సంపన్నులు, భూస్వాములలో అత్యధికులు, ఇపుడు రంగుమార్చి సిపిఎం పంచనచేరారు. అలానే నిన్నటిదాకా భాజపా/తృణమూల్ కాంగ్రెస్ జండా క్రింద పనిచేస్తూ వచ్చిన హంతక గ్యాంగులలోని అనేకులు, ఇపుడు సిపిఎం వారికి కామ్రేడులు అయ్యారు. సిపిఎం చేతుల్లో పావుల్లా వాడుకోబడుతున్నారు. సిపిఎం కూడా ఈ ప్రాంతంలోని సామాన్య ప్రజానీకంలో భయోత్పాతాన్ని సృష్టించడానికై ఒక మోటార్ సైకిల్ గ్యాంగ్‌ను నిర్మించింది. ప్రత్యేకించి మన పార్టీకిగానీ, మన కార్యక్రమాలకుగానీ తోడ్పాటునందించవద్దని ప్రజలను బెదిరిస్తోంది. అలా, ఈ సోషల్ ఫాసిస్ట్‌లకు వున్నదని చెప్పబడుతున్న ప్రజా అనుకూల ప్రతిష్ట అసలు రూపం ప్రజల ముందు పటాపంచలైపోతోంది. ప్రజలు వారి అసలు ముఖస్వరూపాన్ని చూడగల్గుతున్నారు, పాలకవర్గపార్టీలన్నీ ఫాసిస్టుపార్టీలేనని, వాటివి ప్రజావ్యతిరేక స్వభావమేనని, వాటి నడవడికలో ఏ మాత్రం తేడా కూడా లేదని తమ చేదు అనుభవాల ద్వారా గ్రహించగల్గుతున్నారు.

## ప్రజా సమీకరణా కార్యక్రమాలు:

గత జూన్ నెలదాకా తమ సమస్యలపై స్వేచ్ఛగా సంఘటిపడగల్గే ప్రజాస్వామ్యం ప్రజలకు లేకపోయినందువల్ల, ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించడానికి అవకాశమే లేకపోయింది. భాజపా/తృణమూల్ కాంగ్రెస్ భీభత్సకాండను వోడించడం ద్వారా శాంతిని పునరుద్ధరించడమే ఏకైక సమస్య అయింది. ఇపుడు ఆ కూటమి పతనమవడంతో, ప్రజలు కొంత ఊపిరి పీల్చుకోగల్గుతున్నారు, కార్యక్రమాలను చేపట్టడానికి ముందుకొస్తున్నారు.

గత మే నెలలో జిల్లా రైతాంగ మహాసభను నిర్వహించడంతో ఇక్కడి కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ సభను, సిపిఎం పెత్తనం క్రింద వుండే 10 నంబర్ పంచాయితీ ఏరియాలో నిర్వహించడం జరిగింది. ఈ సభను భగ్నం చేయడానికి సోషల్ ఫాసిస్టులు శాయశక్తులా ప్రయత్నించారు; ఈ సభను పోలీసులు నిషేధించారు, సభకు హాజరైనవారిని అరెస్టు చేస్తారని పుకార్లు పుట్టించారు. అయితే ఈ సిపిఎం బెదిరింపుల్ని ధిక్కరిస్తూనే రైతాంగం సభను విజయవంతం చేశారు. దాని దరిమిలా ఇంచుమించుగా 20 గ్రామాలలో రైతు సంఘాలు ఏర్పడ్డాయి, మజ్దూర్ కిసాన్ సంగ్రామ్ సమితికి చెందిన ఒక ఏరియా కమిటీ కూడా ఏర్పడి పనిచేస్తుంది.

జులై 12 నాడు `మహత్తర తెభాగా పోరాట' అమరవీరులు కామ్రేడ్స్ కామ్రేడ్స్ బాబా తరన్, సుధీర్, ప్రబాతిల స్మృతికి నివాళులర్పించడానికై బండ్నా, దాని సమీప గ్రామాల ప్రజలను సమీకరించడం జరిగింది. ఈ సంస్మరణ సభలో వేయిమందికిపైగా ప్రజలు పాల్గొన్నారు. అయితే సిపిఎం, మన సభకు పోటీగా మరో సభను నడిపింది, దానికి బండ్నా గ్రామం నుండి (అమరుల గ్రామం) ఒక్కరంటే ఒక్కరు హాజరవ్వలేదు. సిపిఎంకు మేధినిపూర్, హుగ్లి, బంకురా జిల్లాల్లోని యితర తావుల నుండి జనాన్ని పెద్ద ఎత్తున పోగేసి ఈ సభను జరుపుకోవాల్సి వచ్చింది. ఒకప్పుడు తమకు బలమైన కోటగా వున్న ఈ ప్రాంతంలో ఇపుడు సోషల్ ఫాసిస్టులు ఘోరంగా ఏకాకులయ్యారు.

జులై28 నుండి ఆగస్టు 3 దాకా గర్‌బెటా ప్రాంతంలోని పలుగ్రామాలలో అమరవీరుల సప్తాహకార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. సంధిపూర్ గ్రామంలో ఒక సంవత్సరం క్రితం కామ్రేడ్ అనాద్ పాశవికంగా హత్యకు గురైన, హైస్కూలు గ్రౌండ్ ఆవరణలో జరిగిన సభలో 2000 మంది పాల్గొన్నారు. పోలీసులు విప్లవోద్యమంపట్ల సానుభూతిగల పలుగ్రామాలపై రెయిడ్‌లు చేసి, గ్రామ ఎమ్‌కెఎస్ఎస్ యూనిటి సభ్యుల పేర్లు బయటపెట్టమని గ్రామస్తులను బెదిరిస్తూ తద్వారా ఈ సభను భగ్నం చేయనెత్నించారు. ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టించడానికి ఉద్దేశించబడిన ఈ పోలీసు కార్యక్రమం 27, 28 జులైదాకా సాగింది. అయినప్పటికీ రైఖా, సితానగర్, సెలమ్‌పూర్, బండ్నా, బెహాటె మొదలైన గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో ఊరేగింపులను నిర్వహించారు. రైకా, బండ్నా గ్రామాలలో అమరుల సప్తాహ సందర్భంగా రెండు విడివిడి ర్యాలీలు జరిగాయి.

నాట్ల సమయంలో కూలిరేట్ల పోరాటం జరిగింది, కూలి రోజుకు 40 రూపాయలు + 1న్నర కిలోల బియ్యం నుండి 45 రూపాయలు + 1న్నర కిలోల బియ్యానికి పెరిగింది. ఈ కూలిపెంపుదల పోరాటం బండ్నా గ్రామంలో మొదలై, మొత్తం గర్‌బెటా బ్లాకు అంతటికి వ్యాపించింది. ఇంచుమించుగా అన్ని గ్రామాలలోనూ ఈ కొత్త రేటు అమలులోకి వచ్చింది.

### ఐక్య మజూర్ కృషక్ సంగ్రామ సమితి ఏర్పాటు

పశ్చిమ బెంగాలులో తిరిగి వూపందుకున్న విప్లవ రైతాంగ ఉద్యమాన్ని పురోగమింపజేసే కృషిలో భాగంగా, ఇప్పటి వరకు విడివిడి రైతు సంఘాలుగా పనిచేస్తూండిన విప్లవ కృషక్ మజూర్ సమితి మరియు కృషక్ సంగ్రామ సమితి, నాడియాలో జూన్ 2 నుండి 4 దాకా జరుపుకున్న సభలో ఏకమయ్యి, మజ్దూర్ కృషక్ సంగ్రామ్ సమితి అనే ఐక్య సంస్థగా అవతరించాయి. చిరకాలం నుండి ఈ రెండు సంస్థలు, నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా రైతాంగాన్ని సంఘటితంగా చేస్తూ వస్తున్నాయి. విప్లవ కృషక్ మజూర్ సమితి బంకురా, మేధినీపూర్ జిల్లాలోని రైతాంగాన్ని సంఘటితపరుస్తూ వస్తుండగా, కృషక్ సంగ్రామ సమితి నాడియా, ముల్దా, ముర్షిదాబాద్ జిల్లాలలోని రైతాంగాన్ని సంఘటితపరుస్తూ వస్తోంది. ఈ ఐక్య సంఘం మహత్తర నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు వారసత్వాన్ని స్వీకరిస్తూ, పశ్చిమ బెంగాలులోని రైతాంగాన్ని విప్లవోద్యమంలోకి సంఘటితం చేసే కర్తవ్యాన్ని తీసుకొంది.

## అంతిమ తీర్పు పీడిత ప్రజలదే!

ముర్షిదాబాద్ జిల్లా, కరింపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముక్తాపూర్‌లో మన సాయుధ దళం కాంగ్రెసు పెంచి పోషిస్తున్న పేరుమోసిన బందిపోటు సర్దార్ కోఖన్ మండల్‌నూ, అతడి ముఖ్య అనుచరుడు ఒమర్ షేక్‌ను హతమార్చింది. ముక్తరామ్‌పూర్ గ్రామంగుండా ప్రవహించే జలంగినది రెండు వొడ్డులా, నది ప్రవాహానికి కొట్టుకు వచ్చిన వొండ్రుమట్టి మేట వేస్తుంది. ఇది చాలా సారవంతమైన నేల. ఈ నేల మంచిపంటలనివ్వగలదు. ఈ భూముల్ని 'చార్ జమీన్' భూములంటారు. కాంగ్రెస్, సిపిఎంలకు చెందిన భూస్వాములు ఈ భూముల్ని అక్రమంగా ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నారు. ఈ ప్రాంతానికి చేరువలోనున్న ఫగ్లినగర్ ప్రాంతంలో సాగుతోన్న రైతాంగ సాయుధ ప్రతిఘటనోద్యమంలో ప్రభావితులైన స్థానిక భూమిలేని, పేద రైతులు మన పార్టీతో సంబంధాలు నెలకొల్పుకొని, మన పార్టీ నాయకత్వం కింద తిండి, జీవనోపాధి, ఆత్మగౌరవాల కోసం సంఘటితమయ్యారు. చార్ జమిన్ భూములను ఆక్రమించుకోమని పార్టీ వారికి పిలుపునిచ్చింది. వారిని భూస్వాములకు వ్యతిరేకంగా సంఘటిత పర్చింది. ప్రజల సంఘటిత శక్తికి బెదిరిన భూస్వాములు, హత్యలు, బందిపోటు దొంగతనాలు, కిడ్నాపులు వగైరాలతో ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టించడంలో పేరుమోసిన కిరాయి హంతకులు కోఖన్ మండల్, ఒమర్ షేక్ గ్యాంగును పిలిపించుకున్నారు. ఈ గ్యాంగు ఆరుగురు విప్లవ రైతాంగ కార్యకర్తలను పాశవికంగా హత్య చేసింది. ఈ హంతకముఠాలోని సభ్యులల్లో కొందరు పేద కుటుంబాల నుండి వచ్చినవారే. జీవన సమరంలో గత్యంతరం లేక వీరు భూస్వాములకు గూండాలుగా ఉపయోగపడుతున్నారు. ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టించి తమ పట్టును నిలుపుకోవడానికై పశ్చిమ బెంగాలులో దాదాపుగా అన్ని తావులలోనూ, భూస్వాములు, పాలకవర్గ పార్టీలు ఇటువంటి హంతక ముఠాలను పెంచి పోషిస్తున్నాయి. మన పార్టీ ఈ హంతక ముఠాలోని నాయకులకు, అనుచరులకు మధ్య తేడాను చూస్తూ, పై ఇద్దరు నాయకులను హతమార్చింది.

మోహనాపూర్ గ్రామానికి చెంది జయంత ఘోష్ ఒక భూస్వామి, భాజపా పెద్ద. ప్రజాగెరిల్లాలు వాడి ఇంటిపై దాడిచేసి, వాడి నుండి లెవిని వసూలు చేశారు, ఒక డిబిబిఎల్ తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. దాంతో భయపడి ఈ భూస్వామి ఆ గ్రామం నుండి పారిపోయాడు.

బెచువా గ్రామంలో కూడా ఒక భూస్వామి పియుష్ ఘోష్ నుండి గెరిల్లాలు ఒక డిబిబిఎల్ తుపాకిని చేజిక్కించుకున్నారు. ఫాసిస్టు శక్తులు భవిష్యత్తులో చేయబోయే దాడులను తిప్పికొట్టడానికై మన పార్టీ కొన్ని గ్రామాలలో గ్రామరక్షణ దళాలను సంఘటితం చేసింది. ప్రజాప్రతిఘటనకు పుష్టిచేకూర్చడానికి ఇంకా అనేక గ్రామాలలో జిఆర్‌డిల ఏర్పాటు కృషి జరుగుతోంది. అలానే ప్రజల విప్లవ సామర్థ్యాలకు పూర్తి వికాసం కల్పించి వారిని విప్లవ రాజకీయాలలో తీర్చిదిద్దడానికై ఇతోధికంగా ప్రజాసంఘాల నిర్మాణానికై కృషి సాగుతోంది. మనపార్టీ తన శక్తులను పటిష్టపర్చుకొని, వర్గపోరాటాన్ని విస్తృతస్థాయికి తీసుకెళ్లే కృషిలో నిమగ్నమై వుంది.

గర్‌బెటా పోరాటం ప్రజలకూ, విప్లవకారులకు మంచి గుణపాఠాన్నందించింది. మొదటిది, ఫాసిస్టు శక్తులన్ని ఒట్టి కాగితం పులులే అన్న విషయం రుజువు చేయబడింది. వారి సంఖ్యాబలం ఎంతవున్నా, ఎంత పెద్ద ఎత్తున ఆయుధాలను కలిగివున్నా, వారిని ఎదుర్కోవడానికి ప్రజలు సిద్ధమైతే, వారిని ప్రతిఘటించడానికి ప్రజాబలగాలను నిర్మించుకుంటె, ఈ ఫాసిస్టు శక్తుల కోట పేకమేడలాకుప్పకూలిపోగలదు. ◆

## బస్తర్ ముక్తి సంగ్రామం : 8

## 'మహాన్ భుంకాల్' కొనసాగించిన తీరు - ప్రజారాజ్యం ఏర్పాటు

ఫిబ్రవరి 1 నుండి మూడు మాసాలు బస్తర్ వీర ప్రజలు బ్రిటీష్ గుండెల్లో బల్లాలై నిలిచారు. 1825 నుండి ప్రారంభమై జరిగిన అనేక తిరుగుబాట్లకు భిన్నంగా ఈ భుంకాల్ లోతులోనూ - విస్తృతిలోనూ గొప్పదైనది. బస్తర్‌లో ఈశాన్యాన వున్న నేతనార్‌లో (కాంగేర్ కొండల ప్రాంతం) 'పరజా' ఆదివాసీ తెగవారు ఎగురేసిన 'భుంకాల్' (తిరుగుబాటు బావుటా) క్రమంగా నైరుతి దిశలోని సుక్‌మా - బీజాపూర్‌లను ఆవహించింది. ప్రజలు తమకు వీలైన పద్ధతుల్లో, తమ సాంప్రదాయ రీతిలో శత్రువు యొక్క కళ్లుకప్పుతూ అతి రహస్యంగా తమ పోరాట సందేశాలను గ్రామ గ్రామానికి చేరవేసుకున్నారు. మామిడికాయ టెంకలు, పిడికెడు మట్టి, ఎండు మిరపకాయలు, విల్లంబులు, గొడ్డలి, బరిసె లాంటి వాటిని సైతం పోరాటసంకేతాలుగా అత్యంత బాధ్యతాయుతంగా ఒక తావు నుండి మరో తావుకు చేరవేసుకున్నారు. ఒక ఊరికి పోరాట సంకేతం చేరిందంటే, దాన్ని వెన్వెంటనే పక్క ఊరికి చేరవేసే బాధ్యత ఆ ఊరి ప్రజలదే. ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయం. ఇది ఆచరించబడింది. (నేటికీ ఇది కొనసాగుతున్నది. ఇప్పటికీ ఒక ఊరికి పోలీసులు చేరుకున్నారంటే, ఆ వెంటనే పోలీసుల కళ్లుగప్పి ఊరి దూతలు పరుగు పరుగున పక్కూరు చేరి కబురందిస్తారు. అన్ని ఊర్లు 'అలర్ట్' అయిపోతాయి. నేటి గెరిల్లాలు కూడా ప్రజలచేత ఈ విధంగా కంటికి రెప్పలా కాపాడబడుతున్నారు.) ఆనాటి పోరాట సందేశాలను తమదైన సంకేతంతో బాధ్యతాయుతంగా చేరవేయడంలో ఊరిపెద్దలు - మాంజీలు ఎంతో చతురతతో వ్యవహరించే వారు - వారిపైనే ఆ ప్రధాన బాధ్యత వుండేది.

బస్తర్ రాజు ఆగ్రహానికి గురై పదవీచ్యుతుడైన లాల్ కాలేంద్రసింగ్ సంతకంగల సందేశం, కత్తి, కోటు నేతనార్‌లో బయలుదేరి నిర్విఘ్నంగా ఊరూరు తిరిగి - వందల వేల కిలోమీటర్లు సాగి సుక్‌మా చేరింది. సుక్‌మా (బ్రిటీష్ ఏజంట్ సంస్థానరాజు)

వలసవాదులు విదిలించిన నెత్తుటి మెతుకుల కక్కుర్తితో పోరాట సందేశాన్ని స్వాధీనపరచుకున్నాడు. రాజు జానకయ్య ప్రజాద్రోహిగా మారి బ్రిటీష్ పక్షాన చేరడంతో పోరాట సందేశం నడక ఆగిపోయింది. కానీ, అది కొనసాగిన ఊర్లన్నీ భగ్గుమన్నాయి. ఆ పోరుమంటల్లో విదేశీయులు - దోపిడీదారులు శలభాల్లా మాడిపోయారు.

ఫిబ్రవరి 1నాడు జగ్దల్‌పూర్‌లోనే దివాన్ పండా బైజనాథ్ (ప్రధాన మంత్రి)ను పట్టుకొని అంతమొందించాలనే పథకం తయారైంది. బ్రిటీష్ అధికారి (డిబ్రేట్)తో కలిసి బస్తర్ పర్యటనకు వచ్చిన దివాన్ ఆ అధికారిని చంద్రపూర్‌కు సాగనంపి (31-1-1910) ఆ మరుసటిరోజు జగ్దల్‌పూర్ వెళ్లాల్సి వుండింది. కానీ, వేలాది మంది వీర ఆదివాసీ ప్రజానీకం జగ్దల్‌పూర్‌లో మోహరించబడివున్న విషయాన్ని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వచ్చిన ఒక దూత గేదం చేరి దివాన్ పండా బైజ్‌నాథ్ చెవిలో ఊదాడు. దివాన్ పండా అదిరిపోయాడు.ప్రాణాలరచేతిలో పెట్టుకొని తన ప్రయాణాన్ని బీజాపూర్‌కు మళ్లించాడు. ప్రజల కంటబడకుండా బిక్కు బిక్కు మంటూ ఆ అడవిలో తలదాచుకున్నాడు. జగ్దల్‌పూర్‌లో దివాన్ దొరకకపోవడంతో కోపంతో బుసలుకొడుతున్న వందలాది జనం వాడి సైన్యాలను మట్టుబెట్టారు. నివాసాలను బుగ్గిపాలు చేశారు. ఇతర అన్ని శాఖల ప్రభుత్వాధికారులను గడగడలాడించారు. విదేశీయులను తన్ని తరిమారు. వారి ఆస్తులను ధ్వంసంచేశారు. ఆ వీర జనాలు "జగ్దల్‌పూర్ మాదే"నన్నారు. రోడ్లన్నీ దిగ్బందించారు. బయటి ప్రపంచంతో అన్ని రకాల సంబంధాలను (కమ్యూనికేషన్ వ్యవస్థ) ధ్వంసం చేశారు.

కాంగేర్ ప్రాంతం నుండి తిరుగుబాటుదారులు భిన్న దిశల్లో విస్తరించారు. ఫిబ్రవరి 2నాడు పూస్‌పాల్, చింగ్‌పాల్‌లు చేరుకున్నవారు అక్కడి బజార్లను తమ వశం చేసుకున్నారు.

తిరుగుబాటుదార్లు, ఫిబ్రవరి 3నాడు జగ్దల్‌పూర్‌కు ఆగ్నేయాన వున్న చింగ్‌పాల్‌లో సమావేశమయ్యారు. బ్రిటీష్ అధికార్లపై దాడి చేయాలనీ, వారిని తన్ని తరిమాలని ప్రజానాయకుడు లాల్ కాలేంద్రసింగ్ ఆదేశాలు జారీ చేశాడని వారు ఉద్బోధించారు. వారికి ఆ సమయంలో అతడో దేవుడయ్యాడు. *"బ్రిటీష్ వాడి తుపాకి గొట్టాల్లోనుండి దూసుకువచ్చే ఫిరంగి గుళ్లు-తూటాలు అతడి మహిమతో నీళ్లయిపోతాయని"* కూడా ఆ జనాలు విశ్వసించారు. పంట కోతలు-నూర్పిళ్లు జనవరి నాటికే పూర్తి చేసుకున్న జనాలు ఉత్సాహోద్రేకాలతో జంగ్‌లో దూకడానికి పూర్తిగా నిశ్చయించు కున్నారు. సిద్ధమయ్యారు. చింగ్‌పాల్‌లో పోరాట జండా ఎగిరింది.

ఫిబ్రవరి 4నాడు పోరు దళాలు (జన సమూహం) కోకనార్ చేరుకున్నవి. ప్రజాశక్తిని అడ్డగించే శక్తే లేకుండా పోయింది. దోపిడి ప్రభుత్వ అధికారులు తోకలు ముడిచారు. పరుగులు తీశారు. మిగిలిన వారు ప్రజల చేత చిక్కి కుక్కచావు చచ్చారు. కూకనార్ సంతలో 500 మంది 'భుంకాల్‌కారుల' (తిరుగుబాటు దారులు) చేతిలో బందీ అయిన నర్సబ్‌ఖాన్ అనే దోపిడి వ్యాపారి చావు దెబ్బలు తిని శ్వాసవదిలాడు. ఆ భుంకాల్‌కారులు కోకవాడ, సూత్‌నార్. చితుల్‌నార్, లేడా, మడ్వాల నుండి వచ్చారనీ, వారికి కోకవార బంతుపర్జా, మడ్వాకు చెందిన శ్యాంనాథ్ దాకడ్‌లు నాయకత్వం వహించారని కూకనార్ జనాలు చెప్పుకొంటుంటారు.

ఇంతేకాదు, వారి విల్లంబులనలంకరించిన పుష్పాలు దండయాత్రకు బయలుదేరిన సేనను పోలి వుండేవని కూడా గొప్పగా చెప్పుకుంటారు. ఇలా సాగుతున్న సైన్యం కూకనార్‌ను కూడా వశపర్చుకున్నది.

పోరుదండు ఫిబ్రవరి 5నాడు కరంజి సంతపై పడింది. బస్తర్ రాజుకు బంధువైన బహద్దూర్ సింగ్ ఇక్కడ అధికారంలో వుండె. ఇతగాడు బ్రిటీష్ వారికి ప్రియబంటు. కానీ, ప్రజాదండు ముందు ఇతడి పప్పులేమీ ఉడకలేదు. ఆనాటి జ్ఞాపకాలను ఇతడు 2 దశాబ్దాల కిందటివరకు కూడా నెమరు వేసేవాడు. ప్రజల చేతుల్లోకి కరంజి వచ్చాక, మారెంగ, తోకపాల్‌లు కూడా ప్రజల వశమైనాయి. అక్కడి ప్రభుత్వ భవనాలు - పాఠశాలలు అగ్గిపాలయ్యాయి.

ఫిబ్రవరి 6నాడు రాణి సుబరన్ కంవర్ తన అనుయాయులకు ఒక ఫర్మానా జారిచేసింది. ఈమె బస్తర్ రాజుకు పినతల్లి. కుటుంబ కలహాలతో అధికారానికి దూరమై కుతకుతలాడిపోతోంది. దివాన్‌పై మండిపడుతోంది. దివాన్ పండా ఎక్కడున్నా బంధించి, వాడి రెండుచేతులూ నరికి తన ముందు హాజరు పరచాలని కోరింది. బీజాపూర్ అడవుల్లో తలదాచుకుంటున్న పండా మృత్యువాత పడకుండా అనేక విధాల జాగ్రత్తపడసాగాడు. కానీ, ఆగ్రహోదగ్రులైన వున్న జనం మాత్రం దారులన్నీ దిగ్బంధనం చేశారు. ఇంద్రావతి దాటి మహారాష్ట్రలోకి వెళ్లగలడని వూహించి జనాలు రేవులపై నిఘా పెట్టారు. రాణి ఆజ్ఞలతో జనం పండాకై వేట తీవ్రతరం చేశారు. ముఖ్యంగా మర్దపాల్ మాంజీ బోందియాను పిలిచి రాణి ఈ ప్రత్యేక బాధ్యతను అప్పగించింది.

**ఫిబ్రవరి 7. చరిత్రలో అపూర్వమైన దినం, సుదినం.** భుంకాల్‌కారుల (తిరుగుబాటు) నాయకులందరూ గీదంలో రహస్యంగా సమావేశమయ్యారు. వాతావరణం ఎంతో ఉద్రిక్తంగా వుంది. నిజానికి ఇంకా ఆ సమావేశ వివరాలు అప్పటికింకా జనాలకు అనుకున్నంత మేరలో చేరనేలేదు. పండా గీదంలో వున్నాడన్న వార్త విన్న జనాలకు కాలాగడంలేదు. ఆ సభలో డిండా, రోండాపేడా, కొరియా మాంజి, ధనీరాం, సుకురు, బోడియా, మహదేవ్, హున్నాం, కురాతిసోమలతో కూడిన 9 మంది ప్రజానాయకులతోపాటు గూండాదూర్ కూడా పాల్గొన్నాడు. పండా గీదంలో దొరకకపోవడంతో కట్టలు తెంచుకున్న కోపావేశంలో ప్రజలు ఆ నీచుడు ఆ ఊళ్లో విడిది చేసినప్పుడు తన ఏనుగును కట్టేసిన చెట్టును వాడికి ప్రతీకగా చూస్తూ దానిపై ఉమ్మారు. దానిపైకి గురిచూసి విల్లంబులు వదిలారు. చివరకు గొడ్డళ్లతో తెగనరికారు. ప్రజల్లో మిన్నంటుతున్న బ్రిటీష్ వ్యతిరేక పోరాట జ్వాలలకు సరైన దిశ చూపడానికి నాయకత్వం ఆ అవకాశాన్ని వినియోగించుకున్నది. ఆరోజే రాణి సుబరన్ కువర్ ఈ క్రింది ప్రకటన చేసింది.

*"బస్తర్‌లో నేటితో బ్రిటీష్ రాజ్యం అంతమైంది. ఈ రోజు మనమంతా తిరిగి మన రాజ్యాన్ని ఏర్పరచుకోవడానికి ప్రతిన బూనుదాం"*

*(ఫారిన్ సీక్రెట్ ఇంటర్నల్. భారత జాతీయ పురాతన గ్రంథాలయం; ఆగస్టు 1911)*

పై ప్రకటన విశాల బస్తర్ వ్యాప్తంగా ప్రతిధ్వనించింది. విదేశీయులపై దోపిడీదారులపై వరుసగా జరుగుతున్న దాడులు ఇంకా ఊపందుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు చివరకు దోపిడీ కేంద్రాలైన సంతలు -దుకాణాలు

సైతం దాడులకు లక్ష్యాలైనాయి. పై ప్రకటన వెలువడిన వెంటనే తిరుగుబాటుదారుల చేతిలోకి వచ్చిన తొలికేంద్రం గీదం. ఇకపై విశాల బస్తర్‌లోని ఇలాంటి కేంద్రాలన్నింటిపై తమ అధికారాన్నే నిలపాలని ఆ ప్రకటనకు జోడించారు.

పై ప్రకటన "మురియా రాజ్" బస్తర్ రాజు గుండెలను చీల్చింది. ఆ ప్రకటన భరించలేని రాజు ఫిబ్రవరి 7, 1910నాడే బ్రిటిష్ చీఫ్ కమిషనర్ (రాయపూర్)కు తంతిపంపాడు. పరిస్థితి చేయిదాటి పోయిందనీ, ప్రజలు వీధుల్లోకి వచ్చారనీ, ప్రభుత్వం వెంటనే సైన్యాలను తరలించాలని ప్రాధేయపడ్డారు.

## బార్సూర్‌పై ప్రజల ఆధిపత్యం

గీదంకు దగ్గర్లో (15 కి.మీ.) వున్న బార్సూర్ ఇంద్రావతి ఒడ్డున నెలకొన్న వూరు. [బార్సూర్‌ను పర్యాటక కేంద్రం చేయాలని ఇప్పటి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నది]. దీన్నే చారిత్రాత్మక పట్టణంగా చెప్పొచ్చు. ఈ పట్టణంలోని నేగి బంధు భుంకాల్‌కారులకు విరోధి అయ్యాడు. ఇతడు ఊరూరు తిరుగుతూ వస్తున్న పోరు సందేశాన్ని బార్సూర్ నుండి ముందుకు సాగనీయకుండా మూడుసార్లు అడ్డుకున్నాడు. పోరాటకారులను అడ్డగించే ప్రయత్నాలు చేశాడు. ప్రజాశక్తిని అడ్డుకోచూసిన ఇతడిపై 'ప్రజాసైన్యం' విరుచుకుపడింది. కొరియా మాంజీ, జక్రాపెద్దా నాయకత్వంలో సాగిన యుద్ధం నేగి బంధు తలతెంచింది. (కళ్లు పీకేసి శాశ్వత అంధున్ని చేశారన్న ప్రచారం కూడా వుంది) బార్సూర్ ప్రజలవశమైంది.

ఫిబ్రవరి 8నాడు 'కుట్రు'పై ప్రజల ఆధిపత్యం నెలకొన్నది. తొలినుండి కూడా ఇక్కడ కొద్దిమంది భుంకాల్ నేతలు కేంద్రీకరించారు. ఇదొక సంస్థానకేంద్రం కావడంతో కొంత ప్రాచుర్యాన్ని - ప్రాముఖ్యతను కలిగి వున్నది. ఇక్కడ భుంకాల్‌కారుల కార్యకలాపాల ఊపందుకొని చివరకు ఈ పట్టణం కూడా ప్రజల వశమైంది. ఇంద్రావతి ఒడ్డున్నే వున్న ఈ పట్టణం కూడా ప్రజల చేతిలోకి రావడంతో 'భుంకాల్' కొత్త మలుపు తిరిగింది. ఇంద్రావతి నది వెంటసాగిన ప్రజల జైత్రయాత్ర నూతన విజయాలతో దంతెవాడకు మళ్లింది. వ్యూహాత్మక కీలకస్థానమైన కుట్రు వారం రోజుల దిగ్బంధనం చేయబడి స్వాధీనం చేసుకోబడిందంటే 'ప్రజాసైన్యం' యొక్క శక్తి ఎంతగానో విస్తరించిందని కూడా గమనించాలి. కుట్రు పై ప్రజాధిపత్యం ఏర్పడిందని గ్రహించిన వెంటనే అక్కడి 'రాజు' సర్దార్ బహద్దూర్ నిజాం షా భుంకాల్ నేతలతో ఒప్పందం కుదుర్చుకొని తన రాజ్యాన్ని వారికి అప్పగించారు.

ఫిబ్రవరి 9 నాడు భుంకాల్ అకస్మాత్తుగా దంతెవాడపై పడింది. కుట్రు నుండి దంతెవాడకు తూర్పు మార్గాన్నెంచుకున్న జనం దారిలో గల గ్రామాలు - పట్టణాలు స్వాధీనం చేసుకున్నారు. నగరాన్ని నలువైపులా చుట్టుముట్టారు. కానీ, దంతెవాడలో నెలకొన్న దంతేశ్వరి గుడి పూజారి తిరుగుబాటుదార్లను అడ్డుకున్నాడు. పూజారి బల్రాయ్ జియా తన సైన్య బలగాలతో భీషణ యుద్ధానికి దిగాడు. ఆ యుద్ధంలో ఓటమి చవిచూసిన భుంకాల్‌కారులు ఉత్తరానికి మళ్లారు. ఉత్తరంవైపు కువ్వకొండనానుకొని వున్న గ్రామాల ఆక్రమణకు చేసిన ప్రయత్నాలు కూడా సఫలం కాలేదు. చివరకు దంతెవాడను వదిలి కువ్వకొండవైపు తమ యుద్ధయాత్ర సాగించారు.

ఫిబ్రవరి 9నాడు భుంకాల్‌కారులు కువ్వకొండపై పిడుగులా పడ్డారు. ఇక్కడ వారు ముగ్గురు పోలీసులను హతమార్చారు. దంతెవాడను ఆక్రమించుకోవాలన్న తమ పథకం తమ జాతివాడే శత్రుపక్షాన నిలిచినందున విఫలమైందని వారు గుర్తించారు.

ప్రజలు వీరోచితంగా పోరాడుతూ అనేక గ్రామాలు, జమీందారీలు, పట్టణాలు స్వాధీనం చేసుకొంటూ తమ యుద్ధ యాత్రను సాగిస్తుండగా బీజాపూర్ అడవుల్లో తలదాచుకొంటున్న దివాన్ పండా అడవులనుండి బయట పడాలని ఎన్నెన్నో ప్రయత్నాలు చేయసాగాడు. పొరుగున వున్న అహిరి మహరాజు జమీందారీలో వుండిన బ్రిటిష్ మేనేజర్ తన బలగాలతో బీజాపూర్ చేరుకున్నాడు. మేనేజర్ మైక్‌గిల్ నాయకత్వంలో ఆ బలగాలు సాగాయి. అయితే, ఈ బలగాలకు, అలాగే బ్రిటిష్ అధికారులకు మాత్రం ఐరి ప్రాంత ఆదివాసులెక్కడ పొరుగున బస్తర్‌లో పోరాడుతున్న తమ సహోదరులతో భుజం భుజం కలుపుతారోనన్న ఆందోళన అడుగడుగునా వెంటాడింది. మైక్ గిల్‌తోపాటు లాంగ్‌హోం అనే అధికారి కూడా తన బలగాలతో కలిసిపోయాడు. ఇద్దరు అధికారులు తమ బలగాలతో మద్దేడ్ ప్రాంతంలో దివాన్ పండా ఆనుపానాలు పసిగట్టి, అతడిని రక్షించడంలో సఫలమయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పండా బ్రిటిష్ అధికారుల సహాయంతో ఫిబ్రవరి 13 నాడు రాయపూర్‌కు పయనమయ్యాడు. ఫిబ్రవరి15కు అతడు రాయపూర్ చేరుకున్నాడు. దివాన్ పండా ప్రాణాలతో బయటపడిన వార్త రాణి మనసును కలిచివేసింది. మరొక్కసారి భుంకాల్ జ్వాలలు మరింత తీవ్రమైనాయి.

తిరుగుబాటుదారుల చేత చిక్కకుండా బయటపడగలిగిన దివాన్ పండాపై ద్వేషంతో ప్రజలు భోపాలపట్నంపై దాడిచేశారు. కానీ, అక్కడి జమీందార్ ప్రతిఘటించడంతో ప్రజాసేనలు జెగురుగొండవైపు మళ్లాయి. ప్రజాసైన్యం జెగురుగొండ మళ్లిందన్న వార్త విన్న జమీందార్ పరుగుతీశాడు. దీనితో ఇక్కడ భుంకాల్‌కారులు తమ ఆధిపత్యాన్ని నిలుపుకున్నారు.

భోపాల్‌పట్నం నుండి 40 మైళ్ల దూరంలో వున్న ఊసూర్‌లో ఒక పోలీసు అధికారి మరియు అతడి భార్య తిరుగుబాటుదారుల చేతుల్లో ఖతంకాగా, అక్కడున్న విదేశీయుల ఆస్తులన్నీ ధ్వంసంమైనాయి. విదేశీయులు పరుగులు తీశారు.

భుంకాల్ క్రమంగా వాయవ్యానికి మళ్లింది. మాడ్ కొండల్లో భుంకాల్ బద్దలైంది. మాడ్ ప్రజల గుండెల్లో బ్రిటీష్ వలసవాదులపట్ల గూడు కట్టుకున్న తీవ్ర వ్యతిరేకత ఒక్కసారి కట్టలు తెంచుకొని విరుచుకుపడింది. ప్రజలు తమ తరతరాల పోరాట జ్ఞాపకాలతో, సంప్రదాయ ఆయుధాలతో జీవన్మరణ సమరంలోకి దూకారు - మాడ్ కొండల్లో ప్రజ్వరిల్లిన ప్రజాపోరాటాలకు చోటాడోంగర్ ఒక ముఖ్య కేంద్రమైంది. 1857, మరియు 1876 నాటి తిరుగుబాట్లకన్నా 'భుంకాల్' చోటాడోంగర్‌ను అనేక రెట్లు ఎక్కువగా కదిలించింది. ప్రజలు మరొక్కసారి 1825 నాటి పరాల్‌కోట తిరుగుబాటు నాటి రోజుల్ని గుర్తుచేసుకున్నారు.

చోటాడోంగర్ ప్రాంత తిరుగుబాటు నాయకుడు అయతు మహర. 13వ తేదీనాటికే బ్రిటిష్ సైన్యాలు బస్తర్‌లో ప్రవేశించగలిగినా అవి ఇంకా చోటా డోంగర్ చేరలేదు. అంతేకాకుండా తాడోకి ప్రాంతంలో లాల్ కాలేంద్రసింగ్ తన బలగాలతో మోహరించి వుండడం కూడా అయతు మహరా బలగాలకు ఎంతో తోడ్పడింది. చోటా డోంగర్ ప్రాంతంలో పోలీసు- అటవీశాఖాధికారులు ప్రజల చేత చిక్కి చావు దెబ్బలు తిన్నారు. అయతు మహరా ప్రభావం అంతాగడ్ ప్రాంతంలో కూడా ఎంతో క్రియాశీలంగా వుండింది.

## దాచేస్తే దాగని సత్యం ... పాఠకుని లేఖ

సంపాదకమండలి కామ్రేడ్స్‌కు!

### నిరువుగప్పిన నిప్పులా నిలిచిన భుంకాల్ జ్ఞాపకాలు

ప్రభాత్‌లోనూ, అమరవీరుల బుక్‌లో రాసిన బస్తర్ ముక్తి సంగ్రామ్‌లోని కొన్ని భాగాల్ని, చరిత్రను ఇక్కడి కొన్ని గ్రామాల్లో ప్రజలకు చదివి వినిపించినప్పుడు ఆ ప్రజలు చరిత్రకు సంబంధించిన వివరాలు ఎన్నో చెప్తున్నారు. ఇలాగే చరిత్రలో మరుగున పడిన విషయాల్ని వెలికితియ్యాల్సిన అవసరం మనందరిమీదా వుంది.

చరిత్రకారుల అసమర్థతవల్ల, కుట్రల వల్ల వీరోచితమైన 1910నాటి భుంకాల్ పోరాట చరిత్రలోని ఎన్నో వాస్తవాలు వెలుగు చూడలేదు. అందులోని కొన్ని వాస్తవాలు మా దృష్టికి వచ్చినవి రాస్తున్నాను.

1910 భుంకాల్ పోరాటంలో పెద్ద ఎత్తున హత్యాకాండకు, హింసకు గురైన గ్రామం నేల్‌నార్. గుర్రాలపై వచ్చిన ఆంగ్లేయులు గ్రామాన్ని చుట్టుముట్టి చాలామందిని కాల్చి చంపారు., అప్పుడు ఇక్కడి ప్రజలు పొడవైన ఇండ్లు కట్టి అందులోనే నాలుగైదు కుటుంబాలు గదులుగా చేసుకొని వుండేవారట. ఇక్కడ గర్భవతుల్ని పొట్టలు కోసి చంపారట, అలాగే పసిపిల్లల్ని ఎలుకల్ని కొయ్యలకు గుచ్చి కాల్చినట్టు కాల్చారని ఇక్కడి ప్రజలు బాధగా చెప్తున్నారు. ఈ గ్రామం పక్కన గుహలో దాగిన ప్రజలను సజీవంగా కాల్చి చంపారు. రక్తం మడుగులు కట్టిన గ్రామంలో ఇంగ్లీషువాళ్లు ఒక మర్రి మొక్కను నాటి ఈ చెట్టు మొలవకుంటా చచ్చిపోతే పోరాటం కూడా పూర్తిగా నాశనం అవుద్దని చెప్పారట. కానీ, **అప్పటి పోరాట వీరుల రక్తంలో మొలిచిన మొక్క వారి త్యాగాలకు సాక్షిగా, భవిష్యత్ విజయాలకు హామీగా, సాక్షిగా ఇప్పటికీ నిలిచే వుంది ఆ మర్రిచెట్టు.**

పర్పకుమారి, దుర్వేడ (కొర్రామి) గ్రామాల్లో కూడా ఆంగ్లేయులతో పెద్ద పోరాటం జరిగింది. ఈ పోరాటంలో పాల్గొనడానికి తమ కుటుంబీకులను చివరిసారిగా చూసి వీడ్కోలు తీసుకొని చద్ది మూటలు కట్టుకొని సాంప్రదాయిక ఆయుధాలు పట్టుకొని ఇర్కుబట్టి, కోహ్‌కమెట్ట గ్రామాల నుండి కూడా చాలా మంది తరలివెళ్లారు. తర్వాత పర్పకుమారి, దుర్వేడ గ్రామాలలో కూడా నేల్‌నార్ గ్రామంలో జరిగిన విధంగానే హత్యాకాండ జరిగింది. ఇండ్లు కాల్చేశారు.

ఈ భుంకాల్ పోరాటంలో చోటాడోంగర్ ప్రజలు కూడా వీరోచితంగా పోరాడారు. తర్వాత పోరాటాన్ని అణచివేసి ఈ గ్రామాన్ని కూడా పూర్తిగా కాల్చేశారు. అందుకే ఈ గ్రామాన్ని 'కర్వేగడ్' (కాలిన గుట్ట) అనేవారు, తర్వాత చోటా డోంగర్ అంటున్నారు.

చోటాడోంగర్, దుర్వేడ, పర్పకుమారి, నేల్‌నార్ గ్రామాలతో పాటు మాడ్‌పైన హత్యాకాండ, హింసకు గురైన గ్రామాలు ఇంకా వున్నాయి. అవి కోసాడి, ఒయింగేర్, బట్టువేడ, రాయ్‌నార్, ఆస్‌నార్, జార, వెడ్మ, ఇరుంగై. ఈ గ్రామాల ప్రజలు ఆంగ్లేయుల్ని గుట్టలపైకి రానివ్వకూడదని చోటాడోంగర్ నుండి ఓర్చకు వచ్చే రోడ్డుపై మూడు కిలోమీటర్లు - ఒక వైపు మాడ్ నది ఇంకోవైపు గుట్ట వుంది. ఆ గుట్టను తొలిచి రోడ్డువేశారు - ఆ గుట్టలపైనుండి బండలు దొర్లించి అడ్డుకున్నారు. కానీ పెద్ద ఎత్తున వచ్చిన వాడి ఫోర్స్ దాటికి తట్టుకోలేకపోయారు. నేలకొరగగా మిగిలినవారు చెల్లాచెదరై వెనక్కు తగ్గారు.

భుంకాల్ పోరాటంలో అమరులైన ప్రముఖుల్లోని గుండా దుర్వ, ఉంగా నేల్‌నార్ గ్రామం వారే అంటున్నారు ఇక్కడి ప్రజలు.

భుంకాల్ పోరాటానికి ముందు మాడ్ గుట్టలపైకి వచ్చిన బయటివారు, వీరిని పడియోర్ అంటున్నారు. వీరు కూడా ఇక్కడ పెద్ద హత్యాకాండ జరిపారట. వీరి ఆత్మరక్షణకొరకు చుట్టూ రాళ్లతో కట్టులాగా కుప్పలు పేర్చుకుని వుండేవారట. అలాగే గుహల్లో కూడా వుండేవారట. ఇప్పటికీ కొన్ని గ్రామాల పరిసరాల్లో రాళ్లతో పేర్చిన కట్టలు గుండ్రనివి, నాలుగు మూలలవి తారసపడతాయి. ఈ చరిత్రనంతా ఇంకా అధ్యయనం చేసి రికార్డ్ చేయాల్సే వుంది.

**విప్లవాభివందనాలు**
**మీ**
**పాండు, మాడ్ డివిజన్**

*ఈ ప్రాంతమంతటా ఫిబ్రవరి 1 నుండి ఫిబ్రవరి 12 వరకు అక్షరాలా ప్రజల అధికారమే చోటుచేసుకుంది.*

మాడ్ కొండల్లో రగులుకొన్న పోరాట నిప్పురవ్వ ఆర్పడానికి డూరీ అనే ఆంగ్ల అధికారి నియమితుడైనాడు. పోరాటాన్ని అణచివేయడంలో ఘోరంగా విఫలమైన డూరీ ఎంతోమంది తన సైనికులను కూడా నష్టపోయి తిరుగుముఖం పట్టాడు. మిగిలిన 18 మంది సైనికులతో తన డేరాలవైపు దారితీసిన డూరీపై తిరుగుబాటుదార్లు రెండుసార్లు చోటాడోంగర్ వద్ద విఫల దాడులు చేశారు. 12వ తేదీ వరకు గేయర్ గుర్రపు బలగాలతో తన సాయానికి చేరకపోవడంతో డూరీకి దిక్కు తోచలేదు. ఆ తర్వాత మాడ్ కొండల్లోకి చేరిన గేయర్ అశ్వికదళం మిన్ను విరిగి మీదపడిన చందంగా ప్రజలపై విరుచుకుపడింది. నిజానికి అప్పటివరకు బ్రిటీష్‌వారికి ఎదురైన దాడులన్నింటిలోకి మాడ్ ప్రజల దాడులే అత్యంత శక్తివంతంగా సాగాయని బ్రిటీష్ అధికారులే ఒప్పుకోసాగారు. మాడ్ ప్రజలపై అమలైన నిర్బంధం కూడా అత్యంత పాశవికంగానే సాగింది. అయినప్పటికీ ఆ మాడ్ కొండల ప్రజలు వీరోచితంగా బ్రిటీష్ సైన్యాలను ఎదుర్కొన్నారు. ఆ వీర ప్రజలకు వినమ్రంగా తలవంచి వారి పోరాట ఆదర్శాలను స్వీకరిద్దాం.

### కుతుల్‌పై దాడి

చోటా డోంగర్ తర్వాత ప్రజాతిరుగుబాటుకు మరో కేంద్రంగా మాడ్ కొండల్లో కుతుల్ ప్రాంతం ముందుకొచ్చింది. ఆ ప్రాంత ప్రజలు సాహసానికి మారుపేరు. బ్రిటీష్ వలసాధిపతుల గుండెల్లో మాడ్ ప్రజలు నిద్రించారు. ఆనాటికే కుతుల్‌లో నెలకొల్పిన పోలీస్ స్టేషన్‌కు ప్రజలు నిప్పంటించారు. అందులోని పోలీసులందరిని తుదముట్టించారు. భారత దేశంలోనే అత్యంత వెనుకబడిన కొన్ని ప్రాంతాల్లో ఆదివాసీ విశాల బస్తర్ ఒకటి. ఇందులో మళ్లీ ఎలాంటి

(*కొరవ 41వ పేజీలో .....*)

# ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ సంస్థాపక ఛైర్మన్ కామ్రేడ్ జోస్ మారియా సిజాన్‌తో ఇంటర్వ్యూ

**ప్ర : మీరు విప్లవ రాజకీయాల్లోకి ఎలా వచ్చారు?**

జ : పన్నెండేళ్ల వయస్సు వరకు నేను మా స్వంత పట్టణమైన ఉత్తర లుజోన్‌లో రైతుల దుర్భర జీవితాలను గమనించిన. నేను వాళ్ల నుండి కమ్యూనిస్టుల గురించీ, సెంట్రల్ లుజోన్ (మా అమ్మమ్మ వాళ్లుండేది) ప్రాంతంలో పనిచేసే రైతుల సైన్యమైన హుక్స్ గురించీ మంచి కథలు విన్నాను. ఆ కథలు నన్ను ప్రభావితం చేసినయి. సాయుధ రైతాంగ ఉద్యమం పట్ల నాలో సానుభూతిని రేకెత్తించినయి.

సెకండరీ స్కూలు చదువు కోసం నేను మనీలా వచ్చినప్పుడు, ఒక మంగలి నాకు హుక్స్ గురించి మరెన్నో కథలు చెప్పిండు. నేనుండే ప్రాంతానికి దగ్గర్లో వున్న మురికివాడల్లోని కార్మికుల జీవితాలను గమనించిన. కార్మికుల వారపత్రికనొకదాన్ని అమ్మేటందుకు ప్రయత్నించి నప్పుడు నన్ను అడ్డగించిండ్రు. మతగురువులైన నా ఉపాధ్యాయులు ప్రతిభావంతుడైన సామ్రాజ్యవాదవ్యతిరేకి సెనెటర్ రెక్టోను ఒక పిచ్చి కమ్యూనిస్టు అంటే నేను ఒప్పుకోలే. దీనితో కమ్యూనిస్టు సాహిత్యాన్ని వెదకడం మీదకు నా దృష్టి మళ్లింది. క్రైస్తవ తత్వచింతన మీద రాసిన ఒకే ఒక్క కమ్యూనిస్టు పుస్తకం నాకు దొరికింది. దాన్నిండా మార్క్స్, ఏంగెల్స్‌ల కొటేషన్లు వుండె. రచయిత విమర్శకన్నా ఈ కొటేషన్లే నాకు చాలా అర్థవంతంగా తోచినయి.

1956 నుండి 1959 వరకు నేను బిఏ చదివేటప్పుడు నాకు మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోల రచనలు దొరికినయి. వాటిని నేను చాలా ఆసక్తిగా చదివిన. నేను 1959లో బయటికి ఫిలిప్పినీ విప్లవాన్ని అధ్యయనం చేసేటందుకు, రహస్యంగా మార్క్సిజం-లెనినిజాన్ని అధ్యయనం చేసేటందుకు ఫిలిప్పీన్స్ విశ్వ విద్యాలయం విద్యార్థుల కల్చరల్ అసోషియేషన్ (స్కావ్)ను ఆర్గనైజ్ చేసిన. ఈ అసోషియేషన్ గుడ్లు పొదిగే యంత్రం తీరులో పనిచేసి జాతీయ విముక్తి ఉద్యమం కోసం విద్యార్థి కార్యకర్తలను తయారు చేసింది. అదే విధంగా, మార్క్సిజం-లెనినిజాన్ని లోతుగా అధ్యయనం చేసినటువంటి పురోగామి శక్తులను కూడా అందజేసింది. మేం 1961 నుండి కార్మికులతోనూ, రైతులతోనూ సమైక్యమై విద్యార్థుల నిరసన పోరాటాలు నిర్వహించినం.

**ప్ర : అప్పటి ఫిలిప్పీన్స్‌లోని రాజకీయ వాతావరణం గురించి కొంత చెప్పగలరా?**

జ : కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదం చాలా హెచ్చుగా వుండె. విశ్వవిద్యాలయంలోని మత సంస్థలూ, వాటి ఏజంట్లూ మెకార్థీ వాదాన్ని తలకెత్తుకొని వుండె. అమెరికన్ సామ్రాజ్యవాదులు, కథోలిక్ చర్చ్, అభివృద్ధి నిరోధకులైన రాజకీయనాయకులు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా గొంతు చించుకొని అరిచేటోళ్ల తిరుగుబాటు వ్యతిరేక చట్టం కమ్యూనిస్టుల, కమ్యూనిస్టులమని చెప్పుకునేటోళ్ల బహిరంగ సంఘాలను నిషేధించింది. వాటి నాయకులకు మరణశిక్ష

---

*(40వ పేజీ తరువాయి)*

అభివృద్ధికి నోచుకోకుండా పిడిపిడీలుగా తమదైన జీవన విధానంలో మగ్గుతున్న ప్రజలు మాడ్ వాసులు. నేటికీ పోడు వ్యవసాయమే వారి ప్రధానాంశం. కోహ్ల-కోసిరి లాంటి చిరుధాన్యాలే వారికి ప్రధానాహారం. వారు అత్యాచారాలను సహించరు. వారు నిజంగానే తమ శత్రువు అని బలంగా నమ్మినవాన్ని తుదముట్టించడానికి ఎలాంటి వెనకాముందు లేకుండా పోడు నరికే గొడ్డళ్లనే పగవాడి గుండెలపై పదునుబెడతారు. పంటకోసం పోడు నరికి నిప్పంటించే ఆ అమాయక జనాలే పోలీసులకూ నిప్పంటించగలరనీ కుతుల్‌పై ప్రజాదాడి నేటికీ సజీవ సాక్ష్యంగా చరిత్రలో నిలిచివుంది. డూరీ లాంటి కెప్టెన్‌లు చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా సుప్రీం కమాండర్ గేయర్ తన బలగాలతో వచ్చేవరకు ప్రాణాలు నిలబెట్టుకోవడం చూస్తే మాడ్ ప్రజల వీరపరాక్రమం తేలికగానే బోధపడుతోంది. **మాడ్ ప్రజలు 40 రోజులు తమ అధికారాన్ని నిలబెట్టుకోవడం వారి పరాక్రమానికి నిదర్శనం. విదేశీ దోపిడీవర్గాలపై వారి కసికి, తమ రాజ్యంపట్ల తమ అకుంఠిత దీక్షా పట్టుదలలకు ప్రతీక.**

మాడ్ కొండల్లో రగిలిన పోరాట జ్వాలలను, పోరాట ఫలితంగా నెలకొన్న ప్రజారాజ్యాన్ని నామరూపాలు లేకుండా చేయడానికి బ్రిటీష్ దోపిడీదొంగలు పెద్దెత్తున నిర్బంధానికి పూనుకున్నారు. 'భుంకాల్' జ్వాలలను, దాని ప్రభావాన్ని మచ్చుకైనా కూడా లేకుండా చేయడానికి పోలీసు బలగాలు మాడ్ కొండల్లో దూరదూరంగా నెలకొన్న పూరి గుడిసెల గూడాలకు నిప్పంటించారు. స్త్రీలను బంధించి అత్యాచారాలు జరిపారు. స్త్రీ-పురుష బేధం లేకుండా హతమార్చారు. దాదాపు వందేళ్ల క్రితమే ఆ పోరాట మంటలను ఆర్పడానికి బ్రిటీష్‌వారు పంజాబ్ బెటాలియన్‌ను, మద్రాస్ బెటాలియన్‌ను దించారు. నిప్పులు చెరిగే ఆ నిర్బంధం తాత్కాలికంగా మాత్రమే ప్రజలను భీతావహులను చేయగలిగిందని ఈనాడు నక్సల్బరీ రాజకీయాలతో ఉబికివస్తున్న మాడ్ కొండల్లో ప్రజారాజ్యాధికారం నిరూపిస్తోంది.

*('బస్తర్ కా ముక్తి సంగ్రామ్' హీరాలాల్ సుక్లా పుస్తకం మరియు సబ్ ఆల్టర్న్స్ అండ్ సవరిన్స్ - నందిని సుందర్ పుస్తకం ఆధారంగా)*

**(వచ్చే సంచికలో 'భుంకాల్‌పై బ్రిటీష్ సైన్యాల దాడి - భుంకాల్ వెనుకడుగు')**

విధించింది. 1950ల మొదట్లో కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీల పాత మెర్జర్ పార్టీ నాయకత్వంలో జరిగిన సాయుధ విప్లవం ఓడిపోయిన తర్వాత, సామ్రాజ్యవాదులూ, అభివృద్ధి నిరోధకులూ కమ్యూనిస్టు ఉద్యమపు అవశేషాలను సైతం అణచివేయాలని అనుకున్నరు.

1959 నుండి 1961దాకా, మేం 'స్కాప్'కు చెందిన విద్యార్థి కార్యకర్తలం, ఊపిరాడనివ్వని కమ్యూనిస్టు వ్యతిరేక వాతావరణాన్ని బద్దలు కొట్టే ప్రయత్నం చేసినం. మా ప్రయత్నం మంచి ఫలితాలనిచ్చింది. ఫిలిప్పైన్స్ వ్యతిరేక కార్యకలాపాలపై ఏర్పడ్డ కమిటీ (కాఫా)గా పిలవబడే కాంగ్రెషనల్ కమిటీ ఒకటి ఏర్పడింది. ఇది ప్రగతిశీలురైన ఉపాధ్యాయులూ, విద్యార్థులకు వ్యతిరేకంగా, వారిని వెదికి వెదికి నిర్మూలించే క్యాంపెయిన్‌ను చేపట్టింది. ఆ కమిటీకి వ్యతిరేకంగా మేం 1961లో 5000 మంది విద్యార్థులతో ఒక నిరసన ప్రదర్శనను నిర్వహించగలిగినం. వాళ్లు నాతోసహా మారుపేర్లతో ప్రగతిశీలమైన, విప్లవకరమైన వ్యాసాలు రాసే రచయితలను వెదకాలని ప్రయత్నించిండ్రు. ఆ నిరసన ప్రదర్శన దేశమంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమం తిరిగి తలెత్తడాన్ని సూచింపజేసింది.

**ప్ర : మీరు మీ కార్యక్రమాలను ఎప్పుడు, ఎట్లా మొదలు పెట్టారు?**

జ : మేం సమకాలీన విషయాలపైనా, ఫిలిప్పినీ విప్లవంపైనా అధ్యయన బృందాలను ఏర్పాటు చేసినం. మేం రచయితలూ, స్కాలర్లూ, క్యాంపస్‌లోని వివిధ సంఘాల నాయకులూ అయిన విద్యార్థులను ఒక తాటిమీదకు తెచ్చినం. మేం విద్యార్థుల పత్రికలను మా అదుపులోకి తెచ్చేటందుకు రచయితలను భర్తీ చేసుకున్నం. క్యాంపస్ ఎన్నికలలో ఎక్కువ ప్రభావం నెరపే అభ్యర్థులు కాగలిగిన స్కాలర్లను రిక్రూట్ చేసుకున్నం. విద్యార్థి నాయకులను మాలో చేర్చుకొని వీలైనంత త్వరగా ఒక విశాలమైన వేదికనూ, ఒక సంఘటితమైన యంత్రాంగాన్నీ ఏర్పరచుకొనేటందుకు కృషిచేసినం.

మేం విద్యార్థుల్లో బౌద్ధికమైన, రాజకీయమైన ఉత్తేజాన్ని సృష్టించినం. ఆధిక్యతలో వున్న సామ్రాజ్యవాద అనుకూల, మతతత్వవాద సంగాలకు వ్యతిరేకంగా మేం లౌకిక, దేశభక్తియుత, ప్రగతిశీల వైఖరిని చేపట్టినం. మాలో ఎక్కువ మంది మార్క్సిజం-లెనినిజం అధ్యయనం చేసినోళ్లే అయినందున అతివాద, మితవాదాల మధ్య పోరాటాన్ని మేం ముందుకు తెచ్చినం. ఫిలిప్పినీ విప్లవం యింకా పూర్తవలేదనే, అది కార్మికవర్గ విప్లవకర నాయకత్వంలోనే పూర్తవగలదనే, నూతన ప్రజాస్వామిక విప్లవం సోషలిస్టు విప్లవంవైపు ముందుకు సాగగలదనే పంథాను మేం ప్రచారం చేసినం.

1961లో నేను గ్యాడ్యుయేట్ విద్యార్థినే కాకుండా ఫిలిప్పిన్స్ విశ్వ విద్యాలయంలో ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా పనిచేసేటోన్ని. మేం 'కాఫా'కు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించగా అది ఉధృతరూపందాల్చి ఫిలిప్పిన్ వ్యతిరేక కార్యకలాపాలని చెప్పబడే వాటిపైన సాగుతున్న కాంగ్రెషనల్ విచారణను అక్షరాలా చిన్నాభిన్నం చేసింది. ఈ నిరసన ప్రదర్శన ఫలితంగా నా టీచర్ ఉద్యోగం ఊడింది. కానీ, నాకు ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో పని చేయడానికీ, విద్యార్థి ఉద్యమాన్ని కార్మికోద్యమంతో జతకలపడానికీ సమయం చిక్కింది.

**ప్ర : పాత మెర్జర్ పార్టీ నుండి ప్రస్తుత ఫిలిప్పిన్స్ కమ్యూనిస్టు పార్టీ ఎదిగిన క్రమం గురించి చెప్పండి?**

జ : నేను 1962 డిసెంబర్‌లో పాత మెర్జర్ పార్టీలో చేరిన. అది పూర్తిగా అంతరించిపోయే స్థితిలో వుండే. ఒక్క పార్టీశాఖయినా ఉనికిలో లేకుండే. ఎందుకంటే ప్రధాన కార్యదర్శి జీసస్‌లావా 1957లో పార్టీని లిక్విడేట్ చేసిండు. 1962లో అతడు పార్టీకి బయట స్వతంత్రంగా ఎదిగిన కార్మిక-యువజనోద్యమంపై పైచేయి సాధించగలనని అనుకున్నడు. అందుకే అతను ఒక మధ్యవర్తి ద్వారా నన్ను పాత మెర్జర్ పార్టీలో చేరమని ఆహ్వానించిండు.

23 యేళ్ల వయస్సులో ప్రధాన కార్యదర్శి నన్ను ఐదుగురు సభ్యులున్న కార్యవర్గంలోకి సభ్యుడిగా చేర్చుకొని పాత మెర్జర్ పార్టీని పునరుద్ధరించే బాధ్యత అప్పజెప్పిండు. నన్ను యువజనోద్యమానికి బాధ్యున్ని చేసిండ్రు. అట్లనే, జైళ్లొంచి విడుదలయి విప్లవకర ప్రజాఉద్యమాన్ని పునరుద్ధరించాలని ఆశించే సీనియర్ కార్మిక, రైతు క్యాడర్ల కోసం పునశ్చరణ కోర్సు తయారు చేసే బాధ్యత కూడా యిచ్చిండ్రు.

1965 వరకల్లా, మేం కార్మికవర్గ క్యాడర్లం 1962 నాటికి పార్టీ మరియు విప్లవోద్యమపు వినాశనానికి దారితీసిన తప్పులను సమీక్షించాలనీ, విమర్శ చేయాలనీ, దిద్దుబాటు జరగాలనీ డిమాండ్ చేయడంలో, పాత మెర్జర్ పార్టీలో ఒక పదునైన సైద్ధాంతిక పోరాటం మొదలైంది.

1967 ఏప్రిల్‌కల్లా మార్క్సిస్టు - లెనినిస్టులకూ, లావా రివిజనిస్టు విప్లవ విద్రోహులకూ మధ్యన మౌలికమైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ సమస్యలపైన స్పష్టమైన విభజన ఏర్పడ్డది. కార్మికవర్గ విప్లవకారులు రివిజనిస్టులను పక్కకుతోసి ఫిలిప్పిన్స్ కమ్యూనిస్టు పార్టీని తిరిగి స్థాపించ డానికై దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టిండ్రు.

**ప్ర : పార్టీని ఎప్పుడు, ఎట్లా తిరిగి స్థాపించిండ్రు?**

జ : దిద్దుబాటు ఉద్యమానికి నాయకత్వం వహించేందుకై, కాంగ్రెస్ ఏర్పాట్లు జరిపేందుకై 1967 ఏప్రిల్‌లో వృత్తి విప్లవకారుల, తాత్కాలిక పొలిట్ బ్యూరో ఒకటి ఏర్పాటయింది. 1969 డిసెంబర్ 26న పార్టీని తిరిగి స్థాపించే కాంగ్రెస్ జరిగింది. మార్క్సిజం - లెనినిజం - మావో సేటుంగ్ ఆలోచనను

ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శక సిద్ధాంతంగా స్వీకరించింది. దిద్దుబాటు డాక్యుమెంట్, పార్టీ కార్యక్రమం-నిబంధనావళిలను ఆమోదించింది. మొట్టమొదటి కేంద్ర కమిటీని ఎన్నుకొంది. నన్ను కేంద్రకమిటీకి చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

**ప్ర : మంచిది ! పార్టీ తిరిగి స్థాపించింద్రు. దాని అభివృద్ధిని గురించి క్లుప్తంగా వివరిస్తారా?**

జ : స్థూలంగా, పార్టీ అభివృద్ధిని మూడు దశలుగా విభజించొచ్చు: మొదటిది,1968 నుండి 1979 దాకా, రెండవది 1980 నుండి 1991వరకూ, మూడవది 1992 నుండి యిప్పటిదాకా.

మొదటి దశలో సైద్ధాంతికంగా, రాజకీయంగా, ఆర్గనైజేషనల్‌గా పార్టీకి పునాదిని వేయడం జరిగింది. 1972లో అమెరికా-మార్కోస్ ప్రభుత్వం ఫాసిస్టు నియంతృత్వాన్ని నెలకొల్పేలోగా, పట్టణ ప్రాంతంలోనూ, గ్రామీణ ప్రాంతంలోనూ ప్రజాసంఘాలు చాలా వేగంగా అభివృద్ధి చెందినయి. 1969 మార్చి 29న, పార్టీని తిరిగి స్థాపించినంక మూడు నెలలకు, నూతన ప్రజాసైన్యం (ఎన్‌పిఎ) స్థాపించబడ్డది. దేశంలోని చాలా ప్రాంతాల్లోని వ్యూహాత్మక కేంద్రాల్లో క్యాడర్లను పద్ధతి ప్రకారం మోహరించినం. 65 మంది సభ్యులతో, 35 తుపాకులతో (తొమ్మిది ఎం- 16 రైఫిళ్లు, మిగతావి చిన్నపాటి ఆయుధాలు)తో ఒకే ఒక్క గెరిల్లా ఫ్రంట్‌తో మొదలైన ఎన్‌పిఎ (నూతన ప్రజాసైన్యం) ఆటోమేటిక్ రైఫిళ్లతో (సింగిల్ షాట్ రైఫిళ్లు, తపంచాలు కాకుండానే) సాయుధులైన దాదాపు 1500 మంది యోధులతో కూడినదిగా ఎదిగింది. ప్రజాపునాది లక్షనుండి 10 లక్షలకు పైగా పెరిగింది. ఎన్‌పిఎ పనిచేసిన చోటల్లా రాజ్యాధికారపు అంగాలు ఏర్పాటు చేయబడ్డవి. 1968లో కొన్ని డజన్లుగా వున్న పార్టీ సభ్యత్వం 1979కల్లా కనీసం 5000కు పెరిగింది. 1973 నుండి ఫాసిస్టు నియంతృత్వానికి వ్యతిరేకంగా 'జాతీయ ప్రజాస్వామిక వేదిక' అజ్ఞాత ఐక్యసంఘటనా సంస్థగా పనిచేయసాగింది.

1980 నుండి 1991 దాకా సాగిన రెండవ దశలో, 1987 నాటికి పార్టీ అత్యున్నతంగా ఎదిగి 35,000 సంఖ్యకు చేరుకున్నది. 1986 నాటికి పట్టణ, గ్రామీణ ప్రజాపునాది కోటికి పెరిగింది. అప్పటి మొత్తం 74 రాష్ట్రాలకు గానూ, 63 రాష్ట్రాలను కలుపుతూ వుండిన 65 గెరిల్లా ఫ్రంట్‌లలో ఎన్‌పిఎ విస్తరించింది. మంచి పునాది, కార్మికవర్గ విప్లవకారులు నిరంతరాయంగా చేసిన కఠిన శ్రమ, పోరాటాలు, విప్లవోద్యమం నిర్ణయాత్మక పాత్రను పోషించి 1986లో మార్కోస్ నియంతృత్వాన్ని కూలదోసేందుకు దారితీసిన పాలకవ్యవస్థ తాలూకు అతివేగంగా, అధ్వాన్నంగా దిగజారిన సంక్షోభం - ఇవీ ఈ పురోగతికి కారణాలు. కానీ, అతివాద, మితవాద, అవకాశవాదపు తీవ్రమైన తప్పులు విభిన్న ప్రాంతాలలో, వేరు వేరు సమయాల్లో పార్టీకి, విప్లవోద్యమానికి ఎనలేని నష్టం కలిగించినయి. 1980ల మలి భాగంలో మితవాద అవకాశవాదపు అతి చెడ్డరూపాలు చోటుచేసుకున్నవి. ప్రజాపునాది చాలా వేగంగా నశించి పోసాగింది. 1991కల్లా అది 60 శాతం పడిపోయింది. ఒక దిద్దుబాటు ఉద్యమం తక్షణావసరంగా ముందుకొచ్చింది. పార్టీశ్రేణులు అందుకై డిమాండ్ చేయసాగినయి.

మూడవ దశలో రెండవ గొప్ప దిద్దుబాటు ఉద్యమం విప్లవకర బలగాల పునర్నిర్మాణం, ప్రజాపునాది పటిష్టీకరణలు చోటుచేసుకున్నాయి.

**ప్ర : మధ్యలో అడ్డొస్తున్నందుకు మన్నించండి. దిద్దుబాటు ఉద్యమం గురించి మరి కొంచెం చెప్పే ముందర మీ అరెస్టు, జైలు జీవితం గురించి ఓసారి వివరించగలరా?**

జ : 1977 నవంబర్ 10 నాడు నేను ఒక ప్రాంతం నుండి మరోప్రాంతానికి ప్రయాణంలో భాగంగా మార్గ మధ్యంలో ఒక ఇంట్లో వున్నప్పుడు శత్రువు నన్ను పట్టుకున్నడు. శత్రువు ఇన్‌ఫార్మర్లు హైవేపై ఒక మోటార్‌సైకిల్‌పై వెంబడిస్తూ నా ఉనికిని గమనించగలిగింద్రు. అప్పటినుండి మార్కోస్ పతనం తర్వాత దాకా నేను అత్యధిక సెక్యూరిటీ గల నిర్బంధంలో వున్న. 1986 మార్చి నేను విడుదలైన.

మిలిటరీ నిర్బంధంలో వుండగా, నన్ను పలురకాల శారీరక, మానసిక చిత్రహింసలకు గురిచేసింద్రు. శారీరకంగా పెట్టిన హింసల్లో ముఖ్యంగా పిడికిళ్లతో గుద్దడం, నాసికా రంధ్రాల్లోకి నీళ్లు చిమ్మించడం, నా నిర్బంధపు మొదటి వారంలో జరిగిన ఇంటరాగేషన్ సందర్భంగా చేసింద్రు. నన్ను ఎక్కువకాలం వరకు పెట్టిన చిత్రహింసల్లోకెల్లా చాలా ఘోరమైనది మానసిక హింసే. నన్ను చిన్న సెల్‌లో ఓ మంచానికి గొలుసుతో కట్టేసి ఎప్పుడు తొలగిస్తరో తెల్వకుండ వుంచింద్రు. 18 నెలలకు పైగా నన్ను గొలుసులతో కట్టేసి వుంచింద్రు. మొత్తం ఐదేళ్లకు పైగా నన్ను ఒంటరి కారావాసంలో వుంచింద్రు.

**ప్ర : పార్టీ తాత్కాలిక ఓటమికి గురవడానికీ, దిద్దుబాటు ఉద్యమం అవసరపడడానికి దారి తీసిన తప్పులేంటియి?**

జ : పార్టీకి విప్లవోద్యమానికీ తీవ్రమయిన నష్టం కలుగజేసిన అతివాద అవకాశవాదపు, మితవాద అవకాశవాదపు తప్పులకు, ఒకే మూలం ఫిలిప్పినీ ఆర్థిక వ్యవస్థ అర్ధ భూస్వామ్య స్వభావాన్ని, స్వీయాత్మవాదంతో తిరస్కరించడంలో వుంది. రెండు తరహాల అవకాశవాదులూ, దీర్ఘకాల ప్రజాయుద్ధపు వ్యూహాత్మక పంథాకు వ్యతిరేకంగా నడిచింద్రు. రైతులే జనాభాలో మెజారిటీ అన్న విషయాన్నీ, విప్లవంలో ప్రధాన బలగం అన్న విషయాన్నీ తిరస్కరించడానికి ప్రయత్నించింద్రు.

అతివాద అవకాశవాదం రెండు రకాలుగా వుండె. మొదటి రకం, మాట వరసకు దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని

ఒప్పుకున్నప్పటికీ, వ్యూహాత్మక ఎదురుదాడి స్థితికి చేరుకోవాలనే ఆతృతలో దాన్ని కేవలం వ్యూహాత్మక ఆత్మరక్షణలోని ఒక ఉపదశగా తగ్గించివేసింది. రెండవరకం, దీర్ఘకాల ప్రజాయుద్ధపు వ్యూహాత్మక పంథాను సిగ్గులేకుండా వ్యతిరేకించింది. ప్రజలు యాదృచ్ఛికంగా చేసే పట్టణ తిరుగుబాటును ముఖ్యమైన రాజకీయ సైనిక కారకంగా భావించింది. ప్రజాసైన్యాన్ని పట్టణ తిరుగుబాటుకు శుద్ధ మిలిటరీ సహాయకుడిగా లెక్కగట్టింది.

రెండు రకాల వాళ్లు తొందరపాటు స్వభావాన్నే కలిగివుండి, అనవసరమైన బ్యూరాక్రటిక్ దొంతర్లను సృష్టించింద్రు. తగిన సమయం రాకుండానే పెద్ద సైనిక యూనిట్లను నిర్మించడాన్ని ప్రోత్సహించి, యుద్ధానికి అన్నివేళలా సన్నద్ధంగా వుండాలనే పేరుతో ఆ యూనిట్లను మాస్ వర్క్ నుండి పూర్తిగా విడగొట్టింద్రు. అతి చెడ్డ కేసుల్లో, 75 శాతం యోధులను పూర్తిగా కొన్ని కేంద్రాలలో గుదిగుచ్చి వుంచింద్రు. 25 శాతం యోధులను అపరిపక్వంగా ఏర్పర్చిన ఈ పెద్ద యూనిట్లకోసం కేవలం సేవక యూనిట్లుగా పనిచేయించింద్రు. అందరూ జనానికి దూరమయింద్రు. పట్టణ తిరుగుబాటువాదులమని చెప్పుకునేటోళ్లు పట్టణాల్లోని రహస్య క్యాడర్లను ప్రజా ఉద్యమంలో నిలబెట్టడం ద్వారా నిర్లక్ష్యంగా ఎక్స్‌పోజ్ చేసింద్రు.

మితవాద అవకాశవాద పార్టీ, కార్మికవర్గ నాయకత్వాన్ని నిర్వీర్యపర్చి ఐక్యసంఘటనను నిర్మించాలనే వాదనను ముందుకు తెచ్చింది. ఐక్యసంఘటనను తప్పుగా ఉదహరిస్తూ, దాన్ని ప్రత్యేకించి, ప్రధానంగా సంస్కరణల కోసం సాగే చట్టబద్ధమైన పోరాటంగా పేర్కొంది. మితవాద అవకాశవాదులు సంస్కరణవాద పంథాకు కట్టుబడి వుంటూ, మార్కోస్ తర్వాతి ప్రభుత్వాలకు పార్టీ విధేయంగా వుండాలని కోరుకుంద్రు. 1980ల చివర్లో వాళ్లు గోర్బచేవ్ భాషను మాట్లాడుడు మొదలు బెట్టింద్రు.

1980 చివర్లో, అతివాద అవకాశవాదులు గొంతు మార్చి ముందునుండే కొనసాగుతున్న మితవాద అవకాశవాదులలో చేరిపోయింద్రు. వాళ్లు జమిలిగా నగ్నమైన రివిజనిజాన్నీ, లిక్విడేషనిజాన్ని ముందుకు తెచ్చి యితర దేశాల్లోని రివిజనిస్టు పార్టీలను అనుకరించ జూసింద్రు. ఈ విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టులు పిడికెడు మందిగానే వున్నప్పటికీ, 1980లలో చాలా పార్టీ శాఖలలో సైద్ధాంతిక కృషి లోపించిన లేదా అరకొరగా జరిగిన ఫలితంగా వీళ్లు ఉన్నత స్థానాల్లోకి ఎగబాకింద్రు. సైద్ధాంతిక కృషిలో చేసిన నిర్లక్ష్యం స్పష్టంగా అగుపడే రాజకీయపరమైన, నిర్మాణ పరమైన విజయాలను వమ్ముచేసింది.

పార్టీ కేంద్రకమిటీ పార్టీ తాలూకు మౌలికమైన విప్లవ సూత్రాలను గట్టిగా అంటిపెట్టుకొని వుంటూ 1980 నుండి 1991 వరకు సాధించిన విప్లవానుభవాన్ని మదింపుచేసింది. ప్రధానమైన తప్పులను గుర్తించి, వాటిని విమర్శించి ఖండించి, సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపరమైన కర్తవ్యాలను ముందుంచింది.

పార్టీ కేంద్రకమిటీ క్రింది స్థాయి పార్టీ అంగాల, సంస్థల, రిపోర్టులపైనా, సిఫారసులపైనా ఆధారపడింది. నూతన ప్రజాసైన్యం (ఎన్‌పిఎ) తాలూకు అపరిపక్వంగా పెద్దగా నిర్మించిన యూనిట్లలో పెరుగుతుండిన నిష్క్రియాపరత్వం, వేరుపడిపోయే ధోరణులనూ, పార్టీ సభ్యత్వం, పట్టణ గ్రామీణ ప్రజాపునాది దిగజారిపోవడాన్ని అరికట్ట డానికై దిద్దుబాటు ఉద్యమం మొదలుపెట్టాలంటూ పార్టీ శ్రేణులన్నీ పెద్ద పెట్టున డిమాండ్ చేసినయి. 1988లో మొదలైన యివన్నీ ఏయేటి కాయేటికీ మరింతగా కళ్లకు కొట్టొచ్చినట్టుగా కన్పించసాగినయి.

కార్మికవర్గ విప్లవకారులు ఎంతకూ సుదరాయించని పిడికెడు రివిజనిస్టు, అవకాశవాద విద్రోహకులకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడ్డరు. వాళ్లు మార్క్సిజం - లెనినిజం - మావోయిజాన్ని సైద్ధాంతిక పంథాగానూ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవమనే సాధారణ రాజకీయ పంథానూ, కేంద్రీకృత ప్రజాస్వామ్యపు నిర్మాణ సూత్రాన్నీ దృఢంగా ఎత్తిపట్టింద్రు.

సైద్ధాంతిక, రాజకీయ అధ్యయనం చాలా బలంగా కొనసాగింది. ప్రజాపంథాను అంటిపెట్టుకొని వుండేలా, మాస్‌వర్క్‌ను శ్రద్ధగా నిర్వహించేలా పార్టీ సభ్యులను ప్రోత్సహించడం జరిగింది. పార్టీకోర్‌తోపాటుగా ప్రజా సంఘాలను కూడా విస్తరింపజేసి, సంఘటితం చేయడం జరిగింది. మాస్ వర్క్‌కోసం నిరంతరాయంగా విశాల మవుతూ, లోతవుతూ వుండే ప్రజాపునాదిపై ఆధారపడి గెరిల్లా యుద్ధాన్ని విస్తృతిలోనూ, తీవ్రతలోనూ అభివృద్ధి చేయడం కోసం ఎన్‌పిఏను మరోసారి దిశానిర్దేశనం చేసి సంఘటితం చేసి, మోహరించడం జరిగింది.

ప్ర : **ఐక్య సంఘటనకు సంబంధించి మీ విధానం చాలా శక్తివంతంగా వున్నట్టు అర్థమవుతుంది. దీని గురించి కొంత చెబుతారా?**

జ : ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ యొక్క విప్లవకరమైన వర్గ పంథానుసరించే ఐక్యసంఘటనా విధానం వుంది. ఇందులో గమనించాల్సినవి 6 అంశాలున్నాయి.

1. పార్టీ రూపంలో కార్మికవర్గ నాయకత్వం వుంటేనే ఒక విప్లవకర ఐక్యసంఘటన మనగల్గుతుంది.
2. కార్మికవర్గం, రైతాంగం యొక్క ఐక్యతే ఐక్యసంఘటనకు పునాది
3. కార్మిక - కర్షక పీడిత ప్రజారాశులు పట్టణ పెటీబూర్జువా వర్గంతో కలవడం ద్వారా ప్రగతిశీల శక్తుల ఐక్యవేదికను ఏర్పరుస్తారు.

4. ప్రగతిశీల శక్తులు దేశభక్త శక్తుల ఐక్యవేదికను ఏర్పర్చడం కోసమై తప్పనిసరిగా మధ్యస్త బూర్జువాలతో కలవాలి.

5. అభివృద్ధి నిరోధకుల్లోని అంతర్గత వైరుధ్యాలను వుపయోగించుకొంటూ లేదా విదేశీ దురాక్రమణదారును ఎదుర్కోవడం కోసమై అభివృద్ధి నిరోధకులలోని అస్థిరమైన, అపనమ్మకమైన మిత్రులను కూడా కల్గి వుండొచ్చు.

6. పరమ అభివృద్ధి నిరోధక శత్రు బలగాలను లేదా ఒకవేళ అమెరికన్ సామ్రాజ్యవాదం యుద్ధాన్నిగానీ, దురాక్రమణను గానీ ప్రారంభిస్తే గనుక విదేశీ దురాక్రమణదారు బలగాలను ఒంటరి చేసి, నాశనం చెయ్యడానికై విశాలమైన పరిధిగల్గిన ఐక్యసంఘటననూ, నిచ్చెన మెట్ల వంటి ఐక్య వేదికలను నిర్మించాలి.

1968లో పార్టీని తిరిగి స్థాపించిన తర్వాత, పార్టీ, నూతన ప్రజాసైన్యం, రైతాంగ ఉద్యమం, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు చేసిన కృషి వల్లనే కార్మిక-కర్షక సంఘటన అభివృద్ధి చెందింది. ఫిలిప్పీన్స్ జాతీయ ప్రజాస్వామిక ఫ్రంట్ సాయుధ విప్లవ పోరాటానికి ప్రగతిశీల శక్తుల సంఘటనను అభివృద్ధిపర్చే కృషి చేస్తోంది. అది దేశభక్త మిత్రులనూ, అభివృద్ధి నిరోధకులలోని అపనమ్మకమైన, అస్థిరమైన మిత్రులనూ కూడా కలిగి వుంటుంది.

**ప్ర : మీ గెరిల్లా పోరాట రంగాల గురించి కొంచెం చెబుతారా?**

జ : మా గెరిల్లా పోరాట రంగాలు గెరిల్లా స్థావరాలుగానూ, గెరిల్లా జోన్లుగానూ వున్నాయి. గెరిల్లా స్థావరాలు రాజకీయంగా ఎక్కువ సంఘటితం చెందినవి. వీటిల్లో సాధారణంగా, సాపేక్షికంగా కేంద్రీకృతమైన ప్లటూన్లు ప్రధాన గెరిల్లా యూనిట్లుగా వుంటాయి. గెరిల్లా జోన్లు తక్కువ సంఘటితం చెందినవీ, చాలా విస్తారమైనవీ కూడా. వీటిల్లో ఆరు లేదా అంతకన్నా ఎక్కువ దళాలుంటాయి. ఇవి ముగ్గురి నుండి ఐదుగురు గెరిల్లా యోధులతో కూడిన ప్రచార టీములు పెద్ద ఎత్తున మాస్ వర్క్ చేయడానికై విడిపోయేలా నిర్మించబడి వుంటాయి.

విస్తరణ వల్ల సంబంధాలు నెలకొల్పుకొనే పని, సామాజిక పరిశీలన, గ్రామాల్లో రాజకీయాధికారపు తాత్కాలిక అంగమైన గ్రామ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను నియమించడం, రైతుల, మహిళల, యువజనుల, పిల్లల, సాంస్కృతిక కార్యకర్తల సంగాలను నిర్మించేందుకోసం ఆర్గనైజింగ్ గ్రూపులను ఏర్పాటు చేసే పని తప్పనిసరిగా జరుగుతున్నాయి.

సంఘటితం గావడమంటే, అర్థం ప్రజాసంఘాలు సాధ్యమయినంత వున్నత స్థాయికి ఎదగడం; ప్రజాసంఘాల ప్రతినిధులు లేదా గ్రామంలోని ప్రజలందరూ రాజకీయాధికారపు రెగ్యులర్ అంగమైన గ్రామ విప్లవ కమిటీని ఎన్నుకోవడం, స్థానిక పార్టీ శాఖ ఏర్పడడం.

తొలి సంవత్సరాలలో, గెరిల్లా జోన్లు ముందుగా దేశంలో వ్యూహాత్మక కేంద్రాలుగా ముందుకొచ్చినయి. సాధారణంగా అవి అంతర్ రాష్ట్రీయ, అంతర్ ప్రాదేశిక సరిహద్దు ప్రాంతాలుగా వుండి గెరిల్లా యుద్ధ తంత్రానికి అనుకూలమైన టెర్రయిన్ కలిగివుండేవి. తర్వాత, బాగా సంఘటిత పడిన గెరిల్లాజోన్లకు, కొత్త గెరిల్లాజోన్లకు మధ్య తేడా వచ్చింది. తర్వాత బాగా సంఘటితపడిన గెరిల్లాజోన్లు గెరిల్లా స్థావరాలుగా ఎదిగాయి. వీటికీ, గెరిల్లాజోన్లకు తేడా గమనించవచ్చు. తత్ఫలితంగా గెరిల్లా పోరాట రంగాలు గెరిల్లా స్థావరాల, గెరిల్లా జోన్ల కలయికగా ముందుకొచ్చినయి.

పార్టీ మరిన్ని గెరిల్లా పోరాట రంగాలు ఏర్పాటు చేసి ప్రస్తుతం ఉనికిలో వున్న వాటిని జోడించడానికి ఇంకా కృషి చేస్తున్నది. గెరిల్లా పోరాట రంగాలను ఒకదానితో మరొకటి కలుపుతూ నిలకడైన స్థావర ప్రాంతాలను, తర్వాత విముక్తి ప్రాంతాలను సృష్టిస్తూ మొత్తం దేశాన్ని విముక్తి చేయాలని పార్టీ ఆశిస్తోంది.

**ప్ర : చివరగా ఒక ప్రశ్న. ఫిలిప్పీన్స్ విప్లవం భవిష్యత్ ఎలా వుండగలదని మీరు భావిస్తున్నారు?**

జ : ఫిలిప్పీన్స్ విప్లవం భవిష్యత్ చాలా ఉజ్వలంగా వుంది. ఫిలిప్పీనీ ప్రజలు, విప్లవ బలగాలు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి, ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదం ఓడిపోయేంతవరకూ, కమ్యూనిజం సాధ్యమయ్యేంతవరకూ సోషలిజాన్ని నిర్మిస్తూ ముందుకు సాగుతారు.

సామ్రాజ్యవాదులు, స్థానిక దళారీ, భూస్వామ్య పీడకవర్గాలు చావుకు దగ్గరయింద్రు. అత్యున్నతమైన టెక్నాలజీ బందిపోటు దొంగల గుత్తపెట్టుబడి. అమిత లాభాపేక్ష పరిస్థితుల్లో స్వేచ్ఛావాణిజ్యమని నమ్మబలుకుతూ, సామ్రాజ్యవాద దేశాల్లో పెట్టుబడి కేంద్రీకరణను వేగవంతం చేశారు. ఇది ఉత్పత్తి శక్తుల వినాశనానికీ, ఫిలిప్పీన్స్, భారత దేశం వంటి దేశాల్లో దోపిడీ, పీడనలు తీవ్రతర మవడానికీ దారి తీస్తున్నది.

నిజానికి సామ్రాజ్యవాదులు స్థానిక అభివృద్ధి నిరోధక పాలక వ్యవస్థను ఆర్థికంగా, ద్రవ్యపరంగా బలహీన పరుస్తుంద్రు. విశాల ప్రజా సముదాయాలకు వ్యతిరేకంగా క్రూరంగా దాడి చేయిస్తుంద్రు. తీవ్రమవుతున్న దోపిడీ, అణచివేతలు సామాజిక సంక్షోభాన్ని పెంచుతయి. ప్రజలను ఆయుధాలు పట్టేలా ప్రేరేపిస్తయి.

దేశీయ పాలక వ్యవస్థ, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మునుపెన్నటికన్నా ఘోరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కారణంగా, ఫిలిప్పీనీ కమ్యూనిస్టులు, ప్రజలు విప్లవం గెలుస్తుందన్న గట్టి నమ్మకంతో వున్నరు. వాళ్లు ఫిలిప్పీనీ విప్లవాన్ని ప్రపంచ కార్మికవర్గ విప్లవంలో భాగంగా గుర్తిస్తుంద్రు. రానున్న సంవత్సరాలలో, దశాబ్దాలలో అన్ని ఖండాల్లోనూ విప్లవ పోరాటాలు వూహించరానంతటి హెచ్చు స్థాయిలో విస్తరిస్తాయనీ, తీవ్రతరమవుతాయనీ వారు ఆశిస్తుంద్రు.

# ప్రత్యేక బస్తర్ రాష్ట్ర సాధనకై కదిలిన ప్రజలు

బ్రిటీష్ వలస పాలనకు ముందు నుండి కూడా బస్తర్ ఏ రాజ్యంలోనూ భాగంగా లేదంటూ, బస్తర్ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించ నిరాకరిస్తూ, ప్రజల ఆకాంక్షలను కాలరాస్తూ పాలకులు బలవంతంగా బస్తర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కలిపివేయడాన్ని వ్యతిరేకిస్తూ మన పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ నవంబర్ 1న బస్తర్ బంద్‌కు పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా పార్టీ దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ అక్టోబర్ 25న పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి అధికారులకు డిమాండ్ల పత్రాలను సమర్పించాల్సిందిగా కోరుతూ, ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపుకు ప్రజలు అపూర్వస్థాయిలో ప్రతిస్పందించారు. వేలాదిగా తరలివెళ్లి ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ బలవంతపు విలీనానికి వ్యతిరేకంగా, ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.

భోపాల్ పట్నం బ్లాక్‌లోని మూడు పంచాయితీల్లోని 29 గ్రామాలకు చెందిన 400 మంది ప్రజలు 23నాడు చద్దిమూటలు పట్టుకొని బయలుదేరి 25నాడు పెద్దర్యాలీని నిర్వహించారు. ఈ

*(కొరవ 7వ పేజీలో......)*

## ప్రజాస్వామ్య బస్తర్ సాధనకై నడుం బిగించి వేలాదిగా తరలి వచ్చిన ప్రజానీకానికి మా విప్లవ జేజేలు!!

2000 నవంబర్ 1నాడు నూతన రాష్ట్ర ఛత్తీస్‌గఢ్ ఏర్పడింది. ఛత్తీస్‌గఢ్ 16 జిల్లాలతో కూడుకున్న ప్రాంతంగా ప్రకటించారు. ఇది ఒక కుట్రపూరితమైన ప్రకటనగా మా పార్టీ తొలినుండి స్పష్టం చేస్తూ వస్తున్నది. ఛత్తీస్‌గఢ్‌లో కేవలం 13 జిల్లాలనే చేర్చాలని మేం డిమాండ్ చేస్తూ విశాల బస్తర్ ప్రజల ఆకాంక్షలను ఎత్తిపడుతున్న విషయం జగమెరిగిందే. విశాల బస్తర్ ప్రజల ఆకాంక్షలను వమ్ము చేస్తూ, ఆ ప్రాంతాన్ని ఛత్తీస్‌గఢ్‌లో బలవంతంగా విలీనం చేస్తూ నూతన రాష్ట్రాన్ని ఏర్పర్చడాన్ని వ్యతిరేకించాలనీ, ప్రజాస్వామ్య బస్తర్ సాధనకై మరో 'భుంకాల్'కైనా సిద్ధమవుదామని మా పార్టీ ప్రజలకు - ప్రజాస్వామ్య వాదులకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేసింది, చేస్తున్నది.

మా పార్టీ విజ్ఞప్తిని మన్నించి, తమ ఆకాంక్షల సాధనకై వివిధ రూపాల్లో పోరాటానికి నడుం బిగించిన వీర ప్రజానీకానికి మా పార్టీ సహృదయంతో విప్లవజేజేలు తెలియజేస్తున్నది. ప్రజలు పోరాట కమిటీల నాయకత్వంలో అత్యంత క్రమశిక్షణాయుత సైనికులుగా వీధుల్లోకి తరలివచ్చి, అధికారుల ముందు తమ ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్ డిమాండ్‌నుంచారు. పెద్ద ఎత్తున కరపత్రాలు - వాల్‌పోస్టర్ల ద్వారా తమ న్యాయమైన డిమాండ్లను ప్రపంచం ముందుంచారు. ప్రజార్యాలీల సందర్భంగా, బలవంతపు విలీనానికి నిరసనగా తలపెట్టిన నవంబర్ 1 నాటి బంద్ సందర్భంగా అడవిదారుల్లో, రోడ్లపై, గ్రామాల కూడలుల వద్ద వేలాడదీసిన బ్యానర్లపై తమ డిమాండ్లను రాసి విస్తృత ప్రచారం చేశారు. నవంబర్ 1 నాటి బంద్‌ని అపూర్వ స్థాయిలో జయప్రదం చేశారు.

ప్రత్యేక బస్తర్ కోసం అక్టోబర్ 23 నుండి దక్షిణ బస్తర్‌లోని తాలూకా కేంద్రాలన్నింటా వేలాది మంది స్త్రీ-పురుషులు `ప్రజార్యాలీ'లు జరిపారు. కేంద్ర ప్రభుత్వ అణచివేత విధానాల్లో భాగంగా బస్తర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో బలవంత విలీనానికి నిరసనగా నవంబర్ 1నాడు 'బంద్' పాటించాలని మా పార్టీ ఇచ్చిన పిలుపుతో 'బస్తర్ రాష్ట్రమంతటా' రోడ్లు మూగబోయాయి. జన సంచారం నిలిచిపోయింది. ఎక్కడికక్కడే ప్రభుత్వ-ప్రైవేట్ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అడవిలో, రోడ్లపై, పట్టణాల్లో, పల్లెల్లో వేలాది ఖాకీలు తమ భుజాలకు ఆధునిక ఆయుధాలను వేలాడదీసుకొని ఇనుపబూట్ల పదఘట్టనలతో సంచరించినా, తమ రాష్ట్రంకోసం బస్తర్ ప్రజలు అత్యంత ప్రజాస్వామ్యయుతంగా తలపెట్టిన నిరసన పోరాటం ముందు శత్రుభీభత్సం తలవంచింది. ప్రజాబంద్ 'ప్రత్యేక బస్తర్'లో జయప్రదమైంది.

బంద్‌లో, నిరసన కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా న్యాయమైన ప్రజాడిమాండ్‌పై కదలివచ్చిన ప్రతి ఒక్కరికి మా పార్టీ వినమ్రంగా విప్లవాభినందనలు తెలియజేస్తుంది.

దక్షిణ బస్తర్‌లాగే ఉత్తర బస్తర్ ప్రజలు కూడా 2001 జనవరి నెలలో నిరసన ర్యాలీలు నిర్వహించబూనుకున్నాం. ర్యాలీలు తలపెట్టారు. ఇప్పటికీ 18 ర్యాలీలు జయప్రదమైన వార్తలు అందాయి. త్వరలో భారీ ప్రజాసమూహంతో గొప్ప ర్యాలీ జరగనుంది కూడా. ఇలా ప్రజలు తమ న్యాయమైన డిమాండ్‌పై వీరోచితంగా వీధుల్లోకి రావడం వారి ఆకాంక్షల తీవ్రతను తెలియజేస్తుంది. ఈ ప్రజల వెంట మేముంటాం - ఈ పోరాటం ర్యాలీలకే పరిమితం కాకూడదు. మన ఈ పోరాటాన్ని మన డిమాండ్ సాధించేవరకు కొనసాగిద్దాం, తీవ్రంచేద్దాం. దోపిడీ పాలక వర్గాలకు 'ప్రజాశక్తి'ని నిరూపిద్దాం

భూపతి
కార్యదర్శి
స్పెషల్‌జోనల్ కమిటీ
భా.క.పా.(మా-లె)[పీపుల్స్‌వార్]
దండకారణ్యం

(22వ పేజీ తరువాయి)

చర్చ జరిగింది. తర్వాత గ్రామ ప్రజల ముందు కూడా చర్చ జరిగింది. ఇప్పటికే 3 సంవత్సరాలు అయింది ఆ మొత్తం పంట పురాల్ తిన్నాడు. కనుక వారివ్వాల్సిన వడ్డీనేగాక 2-2 కండీలది అసలు కూడా రద్దు చేయాలని నిర్ణయించారు. అలాగే పురాల్ నుండి ఇద్దరు పాగూలకు 5-5 కండీలు అదనంగా ఇప్పించాలని నిర్ణయించారు. ఇది నవంబర్ 12నాడు జరిగింది.

పై 'పురాల్' తాడిభల్ల గ్రామంపై ఆధిపత్యం సాధించి వార్డ్ పంచ్‌గా ఎన్నికైనాడు. స్థానికులైన మాడ్ వాసులకు తినిపించి, త్రాగించి మంచి మంచి పడావ్ భూములను ఆక్రమించుకునేవాడు.

అలాగే డబ్బులేక ధాన్యం అప్పుగా తీసుకున్న వాళ్ల భూములను కబ్జా చేసుకొని మూడేసి సంవత్సరాలు (వారు తిరిగి ఆ అప్పు తీర్చేదాకా) దున్నుకొని పంటననుభవించేవాడు. ఇవేగాక అడవిని కూడ చిత్తం వచ్చినట్లు నరుకుతూ భూమిని పెంచుకోసాగాడు. ఇలా గతంలో భూమి నరికినప్పుడు దళం వద్దని వారించినా వినక నరికాడు. నరికిన దానిలో వద్దన్నా పంటపండించాడు. దానితో డిసెంబర్ 10 నాటి దళం జరిపిన ప్రజాసదస్సులో ఆ మొత్తం పంటను స్వాధీనపరచుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం అమలు చేశారు కూడా. దండుగగా 3 కండీలు వసూలు చేసి ఆ మొత్తం ధాన్యం సహకార సంగంలో జమచేశారు.

ఇలాంటిదే మరో రూపంలో రేంగవాయి గ్రామంలో సంభవించింది. కములు అనేవాడు కీస్‌కల్ గ్రామం నుండి వచ్చి కోల్‌నార్, మర్ధంపాల్ పొరుగున పడావు పడిన మంచి మంచి భూములను ఆక్రమించుకొని రేంగవాయి అనే ఊరును కూర్చోబెట్టాడు. దీనితో గైతాల్‌గా తానే వ్యవహరించసాగాడు. వీడితోపాటు కీస్‌కల్‌వారు సుక్కు, లచ్చులు కూడా అలానే వచ్చి భూములు ఆక్రమించి స్థానికులను రానీయకుండా పెరిగారు. నిజానికి వీరికి బ్రతకడానికి కావలసిన భూమి కీస్‌కల్ గ్రామంలో వుండగానే ఇలా వచ్చి దురాక్రమించారు. దీనిపై కోల్‌నార్, మర్ధింపాల్ రెండు గ్రామాలలో వారితో ప్రజాపంచాయితీ జరిగి దాన్ని చర్చించి వారి భూముల నుండి తీసిన పంటను స్వాధీనపరచుకోవాలని నిర్ణయించారు. గతంలో పంచాయితీ నిర్ణయం ప్రకారం వాళ్లను వెళ్లగొట్టగా తిరిగి పంట తీసినందుకు శిక్షగా అలా స్వాధీనపరచుకొన్న పంట సుమారు 30 బస్తాలు కోల్‌నార్ సహకార సంగంలో వుంచడం జరిగింది. ఆ భూమిని కూడ తర్వాత సమావేశంలో నిర్దిష్టంగా పంచాలని కూడ నిర్ణయించుకున్నారు.

ఇలా భూముల అక్రమ స్వాధీనానికి అటవీ భూముల ఆక్రమణకు పాల్పడిన వారి పంటలను స్వాధీన పరచుకొని తమ ఉనికినీ, అటవీ పర్యావరణాన్ని కాపాడుకోవడంలో స్థానిక ప్రజలు ఉత్సాహంగానూ, ఉత్తేజంతోనూ కదలి పోరాటంలో సంఘటిత పడుతున్నారు. పెత్తందార్లను, అక్రమణదార్లను లొంగదీసు కుంటున్నారు. r

(చివరి పేజీ తరువాయి..... )

కనుక ఈ వ్యవస్థ ప్రజల్నే హంతకులుగా తమ న్యాయవ్యవస్థ ద్వారా ప్రకటించడం సాధారణమైన విషయమే. మంగేరుఝరి సంఘటనపై సుప్రీంకోర్టు తీర్పు నిజమైన ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని అక్షరాల ఖూనీ చేసింది. కేశోరి ప్రజలకు ఈ వ్యవస్థలో జరిగే 'న్యాయం' తెలవనిది కాదు. ఈ వ్యవస్థలోని కోర్టులపై పీడిత ప్రజలకు నమ్మకం లేనేలేదు. ప్రశ్నించే ప్రజలను పోలీసులు తుపాకులతో హతమారిస్తే ఆ తుపాకులనే ప్రజలు అందుకుంటారనీ, పోలీసుల దుర్మార్గం ఎల్లకాలం సాగదనీ హెచ్చరిస్తూ పోరాడే ప్రజల పక్షం మేం వుంటామనీ, ప్రజలను ఉన్నత పోరాటాలకు సిద్ధంచేసి ఈ వ్యవస్థ అంతానికి మా ప్రజా యుద్ధాన్ని తీవ్రం చేస్తామనీ మా పార్టీ, మా ప్రజా గెరిల్లా సైన్యం ప్రతిజ్ఞ చేస్తున్నాయి.

*భూపతి*
*కార్యదర్శి*
*సిపిఐ(ఎం-ఎల్)(పీపుల్స్‌వార్)*
*దండకారణ్యం*

**18,19-1-01**

| మరణించిన గ్రామస్థులు | | |
|---|---|---|
| క్ర.సం. | పేరు | వయస్సు |
| 1. | సంపత్ కుమార్ 40 | |
| 2. | సమీర్ మెహతాబ్‌ఖాన్ పఠాన్ | 25 |
| 3. | విశ్వనాథ్ మడావి | 42 |
| 4. | కాశీనాథ్ షేండె | 32 |
| 5. | ధర్మా షేండె | 50 |
| అందరూ కేశోరి గ్రామస్థులే | | |
| గాయపడ్డవారు | | |
| 1. | జలీల్ ఖాన్ పఠాన్ | 28 |
| 2. | పండరీ కాశీవార్ | 33 |
| 3. | కిశోర్ మడావి | 13 |
| 4. | శ్యామ్ సమరీత్ | 17 |
| 5. | భోజరాజ్ ఉయికే | 22 |
| 6. | ఏకనాథ్ మడావి, | 16 |
| 7. | దీపక్ గహనే | 16 |
| 8. | దేవనాథ్ సమరీత్ | 24 |
| 9. | భూపేంద్ర మెశ్రామ్ | 22 |
| 10. | ముకుంద్ సమరీత్ | 28 |
| 11. | రామా సమరీత్ | 25 |
| పైన పేర్కొన్న పది మంది భండారా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చబడినారు. మరొక్కరిని నవెగాంవ్ బాంధ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు | | |
| 12. | ఖుశాల్ నాకాడె | 38 |
| 13. | అనిత సమరీత్ | 16 |
| పై యిద్దరిని నాగపూర్ మెడికల్ కాలేజీలో చేర్చారు. | | |

## పత్రికా ప్రకటన

# కేశోరి ప్రజలపై పోలీసు కాల్పులను ముక్తకంఠంతో ఖండించండి!

# అమాయక కేశోరి గ్రామవాసులు ఐదుగురిని హతమార్చి 13 మందిని గాయపర్చిన పోలీసులను కఠినంగా శిక్షించాలి!

# పోలీసు కాల్పుల్లో మృతిచెందిన వీర ప్రజలకు విప్లవ జేజేలు!!

మహారాష్ట్రలోని గోందియా జిల్లాకు చెందిన అర్జున్ మోర్‌గాం సమీపాన కేశోరి గ్రామం వుంది. విశాల దండకారణ్యానికి చెందిన బాలాఘాట్- గోందియా సంయుక్త డివిజన్‌లో భాగమిది. ఈ ప్రాంతంలో గత 12 సంవత్సరాలుగా మా పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతోంది. ఈ ప్రాంతంలోని ప్రజలు తమ జీవన సమస్యలన్నింటిపై ఆయా సమయాల్లో పోరాటాలు జరిపిన వీర చరిత్రను కలిగి యున్నారు. విప్లవ రాజకీయాలతో సంఘటితపడిన జనం ఇక్కడి వారు.

ఇక్కడి ప్రజల వీరోచిత పోరాటాలతో ఖంగుతున్న మహారాష్ట్ర ప్రభుత్వం 1991-94 మధ్య కాలంలో అంతకు ముందెన్నడూ ఎరుగని విధంగా ప్రజలపై తీవ్ర అణచివేతను కొనసాగించింది. ప్రజలను ఊచకోతకు గురిచేసింది. పోలీసులు పీడిత రైతాంగాన్ని అరెస్టు చేయడం నుండి మాయం చేయడం అలాగే బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చడం వంటి మధ్యయుగాలను మరపించే పాశవిక చర్యలతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించారు. ఇంతేగాదు, పోలీసులు సాగించిన, మహిళలపై లైంగిక అత్యాచారాలు జరపడం వారిని మాయం చేయడం, హత మార్చడం వంటి కిరాతక చర్యలను ఈనాటికీ ప్రజలు మరచిపోలేదు. పోలీసులు సృష్టించిన ఆ భీతావహపు ఛాయలు ప్రజలను ఇంకా వెంటాడుతూనే వున్నాయి. పోలీసులు ఆనాటి హత్యాకాండకు మంగేఝరి హత్యలు పరాకాష్టకాగా, వాటి కొనసాగింపుగానే ఈనాడు కేశోరిని పేర్కొనాలి. పోలీసుల పాశవిక హత్యాకాండను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. అమాయక ప్రజలను హతమార్చిన పోలీసు క్రూరచర్యలకు బదులు తీర్చుకుంటామని శపథం చేస్తున్నాం. ప్రజాయుద్ధం తీవ్రతరం గావించి హంతక పోలీసు వ్యవస్థను తుదముట్టిస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ సందర్భంగా, పోలీసుల విచ్చలవిడి కాల్పులకు ఉన్మాదానికి, దుర్మార్గానికి బలైన మృతవీరులకు మా విప్లవ జోహార్లు తెలియజేస్తూ, పోలీసులు సాగించిన అత్యాచారకృత్యాలని సవాలు చేసి వారి తుపాకి తూటాలవల్ల గాయపర్చబడిన రైతాంగానికి, వారి కుటుంబాలకు బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

కేశోరి ప్రధానంగా ఆదివాసీ గ్రామం. ఆదివాసీ పల్లెలన్నింటిలాగే పల్లెటూరు. గత ఐదేళ్లుగా మహారాష్ట్ర ఎస్ఆర్‌పి బలగాలకు చెందిన 40 మంది అక్కడ నక్సలైట్లను హతమార్చే పేరుతో తిష్టవేశారు. దేవురి తాలుకా ప్రజలతోపాటుగా, అర్జున్ మోర్‌గాం తాలుకా ప్రజలు కూడా మహారాష్ట్ర పోలీసుల అరాచకాలకు గత దశాబ్దంపై కాలంగా బలవుతున్నారు. ఈ తాలూకాలోని కేశోరి గ్రామస్థులు 18-12-2000 నాడు (సోమవారం) ఆ ఊళ్లో జరిగిన సంతలో యదావిధిగా రోజువారి సరుకులు కొనుగోళ్లు చేసుకొని సాయంకాలం ఇళ్లకు వెళుతుండగా పోలీసుల తూటాలు వారిని బలిగొన్నాయి.

సంతలో సరుకులు కొనుగోలు చేసి తిరిగి వస్తున్న ఆ ఊరి ఆడపడుచులపై క్యాంపు పోలీసుల కన్నుపడింది. గత ఐదేళ్లుగా పోలీసుల వేధింపులతో విసిగి వేసారిపోయిన గ్రామస్థులకు ఊళ్లో పోలీసు క్యాంపు ఒక పీడగానే మారింది. తమ మహిళల పట్ల పోలీసు వేధింపులను సహించలేని ఒక యువకుడు చివరకు ధైర్యంచేసి పోలీసు దుశ్చర్యలను సవాలు చేశాడు. ప్రజల్లో పెంపొందుతున్న తిరుగుబాటు స్వభావాన్ని సహించలేకపోయిన ఆ ట్రిగ్గర్ హేపీ (ప్రాణాలు తీయడమే ధ్యేయంగా పెట్టుకున్న) పోలీసులు ఆ యువకుని ఒళ్లు హూనం చేశారు. పోలీసు క్యాంపుల్లో చిత్రహింసలను అనుభవిస్తూ మృత్యు ముఖంలో కొట్టుమిట్టాడుతున్న ఆ యువకున్ని చూసిన గ్రామస్థుల హృదయాలు విలవిల్లాడాయి. దానితో గ్రామస్థులంతా తమ ఊరివాన్ని బతికించుకోవాలన్న తపనతో ధైర్యంచేసి ఒక్కుమ్మడిగా ముందుకొచ్చి పోలీసు చిత్రహింసలను ప్రశ్నించారు. పోలీసుల దృష్టిలో అదే మహాపరాధమై ప్రజల ప్రాణాలను బలితీసుకొంది.

ప్రజలు 1993 నాటి మంగేఝరిని మరచిపోతున్నారనీ, తిరిగి వారిలో ప్రశ్నించే చైతన్యం పెంపొందుతుందనీ, దీనిని మొగ్గలోనే అంతమొందించకుంటే తమ ప్రాణాలకు, తమ వ్యవస్థకే ముప్పు కాగలదని తలపోసిన పోలీసులు పరమ దుర్మార్గంగా అమాయక ప్రజలపై గుళ్లవర్షం కురిపించారు. ఐదుగురి ప్రాణాలు తీసి 13 మందిని గాయపర్చారు. గతంలో మంగేఝరిలో 13 మందిని పొట్టనపెట్టుకున్న పోలీసులను "భారత న్యాయవ్యవస్థ" 1998లో నిర్దోషులుగా ప్రకటించి, తన వర్గ స్వభావాన్ని నిర్లజ్జగా చాటుకుంది. ఈ దోపిడీ వ్యవస్థలో తిరగబడే ప్రజలే దోషులు,

*(కొరవ 47 పేజీలో......)*